ఈనాడు

గుంటూరు 1-5-2026 శుక్రవారం సిటీ సంపుటి 31 సంచిక 25
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్స్

ఐపీఎల్‌లో ఈనాడు

రాజస్థాన్ × దిల్లీ

వేదిక: జైపుర్, రా. 7.30



గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసును ఆసక్తికరంగా మారుస్తూ అయిదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. స్వల్ప స్కోర్ల పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును మట్టికరిపించింది. అర్షద్ ఖాన్, హోల్డర్, రషీద్‌ల సూపర్ బౌలింగ్‌తో ఆర్సీబీని తక్కువకే పరిమితం చేసిన టైటాన్స్.. గిల్, బట్లర్ మెరుపులతో 25 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. 9 మ్యాచ్‌ల్లో బెంగళూరుకిది మూడో ఓటమి.



టైటాన్స్ తడాఖా

బెంగళూరుపై విజయం ● రాణించిన అర్షద్, గిల్

అహ్మదాబాద్

గుజరాత్ టైటాన్స్ సత్తా చాటింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో బెంగళూరుపై విజయం సాధించింది. గుజరాత్ బౌలర్లు సూపర్‌గా బౌలింగ్ చేయడంతో మొదట బెంగళూరు 19.2 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌటైంది. దేవ్‌దత్ పడిక్కల్ (40; 24 బంతుల్లో 5×4, 2×6) టాప్ స్కోరర్. అర్షద్ ఖాన్ (3/22), రషీద్ ఖాన్ (2/19), జేసన్ హోల్డర్ (2/29) ఆర్సీబీని దెబ్బతీశారు. శుభ్‌మన్ గిల్ (43; 18 బంతుల్లో 4×4, 3×6), బట్లర్ (39; 19 బంతుల్లో 2×4, 4×6), తెవాతియా (27 నాటౌట్; 17 బంతుల్లో 4×4) మెరవడంతో లక్ష్యాన్ని గుజరాత్ 15.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భువనేశ్వర్ (3/28) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. హేజిల్‌వుడ్ (0/56) తేలిపోయాడు.

గిల్ ధనాధన్: స్వల్ప ఛేదనలో గుజరాత్‌కు అదిరే ఆరంభం లభించింది. 2.5 ఓవర్లలో స్కోరు 42. సాయి సుదర్శన్ (6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన గిల్.. రెచ్చిపోయి ఆడాడు. మొదటి ఓవర్లో భువనేశ్వర్ బౌలింగ్‌లో వరుసగా 4, 6 బాదిన అతడు.. ఆ తర్వాత హేజిల్‌వుడ్ ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఏకంగా 24 పరుగులు రాబట్టాడు. కానీ భువి వరుస ఓవర్లలో సుదర్శన్, గిల్‌ను ఔట్ చేసి ఆర్సీబీని పోటీలోకి తెచ్చాడు. అయితే బట్లర్ ధాటైన బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును నడిపించాడు. సుందర్ (12) ధాటిగా ఆడలేకపోయినా.. అతడికి అండగా నిలవడంతో జీటీ 82/2తో లక్ష్యం దిశగా సాగింది. కానీ అంతా సాఫీగా సాగుతున్న దశలో ఇన్నింగ్స్ తడబాటుకు గురైంది. 19 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టిన ఆర్సీబీ.. మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. జోరుమీదున్న బట్లర్‌ను భువి బౌల్డ్ చేయగా.. షెపర్డ్ ఒకే ఓవర్లో షారుఖ్ (8), సుందర్‌ను పెవిలియన్ చేర్చాడు. 11వ ఓవర్లో సుందర్ నిష్క్రమించినప్పటికి గుజరాత్ స్కోరు 111. సాధించాల్సిన రన్‌రేట్ చాలా తక్కువే ఉన్నా, చకచకా వికెట్లు పడటంతో ఆ జట్టు కాస్త ఒత్తిడికి గురైంది. కానీ రాహుల్ తెవాతియా, హోల్డర్ (12) ఆ ఒత్తిడిని పెరగనివ్వలేదు. టైటాన్స్‌ను విజయం దిశగా నడిపించారు. ఆరో వికెట్‌కు 36 పరుగులు జోడించిన హోల్డర్.. 14వ ఓవర్లో, జట్టు స్కోరు 141 వద్ద ఔటైనా.. రషీద్ ఖాన్ (7 నాటౌట్)తో కలిసి తెవాతియా పని పూర్తి చేశాడు.

ఆర్సీబీకి కళ్లెం: ఈ సీజన్‌లో మంచి ఫామ్‌లో ఉన్న ఆర్సీబీ మొదట బ్యాటుతో తడబడింది. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టుకు కళ్లెం వేశారు. పడిక్కల్ కాస్త పోరాడడంతో బెంగళూరు గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించింది. కోహ్లి (28; 13 బంతుల్లో 5×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో 2.3 ఓవర్లలోనే 34 పరుగులు చేసింది. రబాడ ఓవర్లో కోహ్లి వరుసగా అయిదు ఫోర్లు కొట్టడం విశేషం. కానీ వరుస ఓవర్లలో బెతెల్ (5), కోహ్లిని ఔట్ చేయడం ద్వారా సిరాజ్, రబాడ ఆ జట్టును దెబ్బతీశారు. అయినా కెప్టెన్ పాటీదార్ తోడుగా పడిక్కల్ నిలవడం.. పడిక్కల్ బ్యాట్ ఝుళిపించడంతో ఇన్నింగ్స్ సాఫీగానే సాగింది. సిరాజ్ ఓవర్లో పడిక్కల్ సిక్స్, రెండు ఫోర్లు బాదేశాడు. పాటీదార్ ధాటిగా ఆడలేకపోయినా 8వ ఓవర్లో 79/2తో బెంగళూరు మెరుగ్గానే కనిపించింది. కానీ అనూహ్యంగా తడబడింది. 17 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు చేజార్చుకుని చిక్కుల్లో పడింది. వరుస ఓవర్లలో పాటీదార్ (19), జితేశ్ శర్మ (1), టిమ్ డేవిడ్ (9), కృనాల్ పాండ్య (4) పెవిలియన్ బాట పట్టారు. పాటీదార్, కృనాల్‌ను ఎడమచేతి వాటం పేసర్ అర్షద్ ఔట్ చేయగా.. జితేశ్‌ను హోల్డర్, డేవిడ్‌ను రషీద్ ఖాన్ పెవిలియన్ చేర్చారు. 96కే ఆరు వికెట్లు కోల్పోయిన జట్టును పడిక్కల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. షెపర్డ్ (17)తో ఏడో వికెట్‌కు 30 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కానీ ఇన్నింగ్స్ చివర్లో పుంజుకున్న గుజరాత్ బౌలర్లు 19 పరుగుల వ్యవధిలో ఆఖరి నాలుగు వికెట్లు పడగొట్టి ఆర్సీబీ ఇన్నింగ్స్‌కు తెరదించారు. పడిక్కల్‌ను రషీద్ ఖాన్ బౌల్డ్ చేయగా.. షెపర్డ్‌ను హోల్డర్ వెనక్కి పంపాడు.



పాటీదార్ ఔట్‌పై..

ఆర్సీబీ ఇన్నింగ్స్‌లో పాటీదార్ ఔటైన తీరుపై వివాదం చెలరేగింది. ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశలో పాటీదార్ వెనుదిరిగాడు. అతడి క్యాచ్‌ను అందుకునే క్రమంలో కింద పడ్డ హోల్డర్.. బంతిని కింద ఆనించినట్లు అనిపించింది. కానీ మూడో అంపైర్ మాత్రం పాటీదార్‌ను ఔటైనట్లు ప్రకటించాడు. దీంతో డగౌట్లో కోహ్లి తీవ్ర అసహనానికి గురయ్యాడు. మ్యాచ్ అధికారితో వాదిస్తూ కనిపించాడు.

బెంగళూరు ఇన్నింగ్స్: బెతెల్ (సి) రషీద్ ఖాన్ (బి) సిరాజ్ 5; కోహ్లి (సి) రషీద్ ఖాన్ (బి) రబాడ 28; పడిక్కల్ (బి) రషీద్ ఖాన్ 40; రజత్ పాటీదార్ (సి) హోల్డర్ (బి) అర్షద్ ఖాన్ 19; జితేశ్ శర్మ (సి) బట్లర్ (బి) హోల్డర్ 1; టిమ్ డేవిడ్ (సి) హోల్డర్ (బి) రషీద్ ఖాన్ 9; కృనాల్ పాండ్య (సి) హోల్డర్ (బి) అర్షద్ ఖాన్ 4; షెపర్డ్ (సి) సాయి సుదర్శన్ (బి) హోల్డర్ 17; భువనేశ్వర్ (సి) ... (బి) అర్షద్ ఖాన్ 12; సుయాశ్ శర్మ నాటౌట్ 0; హేజిల్‌వుడ్ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (19.2 ఓవర్లలో ఆలౌట్) **155**; **వికెట్ల పతనం:** 1-34, 2-35, 3-79, 4-80, 5-91, 6-96, 7-126, 8-126, 9-155; **బౌలింగ్:** సిరాజ్ 4-0-38-1; రబాడ 4-0-44-1; హోల్డర్ 4-0-29-2; అర్షద్ ఖాన్ 3.2-0-22-3; రషీద్ ఖాన్ 4-0-19-2

గుజరాత్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) సుయాశ్ (బి) భువనేశ్వర్ 6; శుభ్‌మన్ గిల్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 43; బట్లర్ (బి) భువనేశ్వర్ 39; సుందర్ ఎల్బీ (బి) షెపర్డ్ 12; షారుఖ్ ఖాన్ (సి) హేజిల్‌వుడ్ (బి) షెపర్డ్ 8; తెవాతియా నాటౌట్ 27; హోల్డర్ (సి) పడిక్కల్ (బి) సుయాశ్ శర్మ 12; రషీద్ ఖాన్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (15.5 ఓవర్లలో 6 వికెట్లకు) **158**; **వికెట్ల పతనం:** 1-42, 2-57, 3-92, 4-109, 5-111, 6-141; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-28-3; హేజిల్‌వుడ్ 4-0-56-0; సుయాశ్ శర్మ 3.5-0-44-1; షెపర్డ్ 4-0-30-2

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్థాన్	9	6	3	0	12	0.617
గుజరాత్	9	5	4	0	10	-0.192
చెన్నై	8	3	5	0	6	-0.121
దిల్లీ	8	3	5	0	6	-1.060
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబయి	8	2	6	0	4	-0.784
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

భారత్‌కు పరీక్ష

థామస్ కప్ క్వార్టర్స్‌లో చైనీస్ తైపీతో పోరు నేడు




హోర్సెన్స్ (డెన్మార్క్): ప్రతిష్ఠాత్మక థామస్ కప్ ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు కీలక సమరానికి సిద్ధమైంది. శుక్రవారం క్వార్టర్‌ఫైనల్లో పటిష్ఠమైన చైనీస్ తైపీతో భారత్ తలపడనుంది. గ్రూపు-ఎలో భారత్ రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్ చేరుకుంది. లీగ్ దశలో 4-1తో కెనడాపై, 5-0తో ఆస్ట్రేలియాపై ఘన విజయాలు సాధించింది. చైనాతో హోరాహోరీగా జరిగిన ఉత్కంఠ పోరులో 2-3తో పరాజయం చవిచూసింది. యువ ఆటగాడు ఆయుష్ శెట్టి అద్భుతమైన ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసొచ్చే అంశం. థామస్ కప్‌లో ఆడిన 3 మ్యాచ్‌ల్లోనూ ఆయుష్ గెలుపొందాడు. అతడితో పాటు లక్ష్యసేన్, హెచ్.ఎస్. ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ మూడో సింగిల్స్ బాధ్యతలను పంచుకుంటున్నారు. బుధవారం చైనా ఆటగాడు గువాంగ్ జుపై శ్రీకాంత్ సాధించిన అద్భుత విజయం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఆల్ ఇంగ్లాండ్ ఫైనలిస్ట్ లక్ష్యసేన్ గత రెండు మ్యాచ్‌ల్లో ఓడినా.. లయలోనే ఉన్నాడు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి జోడీ ఫామ్‌లోకి రావడం కలిసొచ్చేదే. గ్రూపు-సిలో అగ్రస్థానంలో నిలిచిన చైనీస్ తైపీ ఇప్పటి వరకు థామస్ కప్ టైటిల్ గెలవలేదు. భారత్ 2022లో థామస్ కప్ విజేతగా నిలిచింది.



ఒకప్పుడు బ్యాటర్ ఒక ఫోర్ కొడితే ఉత్సాహం.. సిక్సర్ బాదితే సంబరం.. ఒక జట్టు టీ20 మ్యాచ్‌లో 200 పైచిలుకు స్కోరు చేస్తే ఆశ్చర్యం.. 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదిస్తే అదొక అద్భుతం! కానీ ఇప్పుడు ఒకే ఓవర్లో ప్రతి బంతికీ ఫోర్లు కొట్టినా.. హ్యాట్రిక్ సిక్సర్లు బాదినా.. టీ20 మ్యాచ్‌లో ఒక జట్టు 300 వైపు దూసుకెళ్తున్నా.. 250కి అటు ఇటు లక్ష్యాలను కూడా ఛేదించి పడేస్తున్నా ఒకప్పటంత ఆనందం అభిమానుల్లో ఉండట్లేదు. ఇదిలాగే కొనసాగితే.. బ్యాటుకు, బంతికీ మధ్య సమతూకం పూర్తిగా దెబ్బ తిని ఆటకు నష్టం తప్పదు.

ఈ బాదుడు ఇలాగే కొనసాగితే..

ఈనాడు క్రీడావిభాగం



18 ఏళ్ల కిందట ఐపీఎల్ మొదలైనప్పుడు ఆ సీజన్లో నమోదైన 200 పైచిలుకు స్కోర్లు 11 మాత్రమే. కానీ ఈ ఐపీఎల్‌లో ఇప్పటిదాకా 42 మ్యాచ్‌లు జరిగితే.. అందులో 35 సార్లు 200+ స్కోర్లు ఉండడం గమనార్హం. దీన్ని బట్టి బ్యాటర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. గత వారం పంజాబ్‌తో మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ ఏకంగా 264 పరుగులు చేసింది. టీ20ల్లో ఇంత పెద్ద స్కోరు చేస్తే మ్యాచ్ ఫలితం ముందే తేలిపోవాలి! అవతలి జట్టు బ్యాటింగ్‌కు దిగకముందే ఓటమికి సిద్ధం అయిపోవాలి! కానీ పంజాబ్ ఆశలు కోల్పోలేదు. బ్యాటర్లు ఒకరితో పోటీ పడి షాట్లు ఆడడంతో అంత పెద్ద లక్ష్యాన్ని 7 బంతులు మిగిలుండగానే ఛేదించి పడేసింది. తాజాగా ముంబయి జట్టు 244 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏమాత్రం తడబడకుండా ఛేదనను పూర్తి చేసింది. అటు పంజాబ్, ఇటు హైదరాబాద్ ఇన్నింగ్స్‌లను గమనిస్తే.. ఆ జట్లు అనూహ్యంగా గెలిచేసినట్లు అనిపించదు. ప్రణాళిక ప్రకారం ఆడి గెలిచినట్లు అర్థమవుతుంది. ఇలాంటి మ్యాచ్‌ల అనుభవం తర్వాత ఐపీఎల్‌లో ఎంత స్కోరు చేసినా గ్యారెంటీ లేని పరిస్థితి. ముఖ్యంగా విధ్వంసక బ్యాటింగ్ లైనప్‌లతో కూడిన సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ లాంటి జట్లు బౌలర్లకు మరణ శాసనం రాస్తున్నాయి. పంజాబ్ ఐపీఎల్‌లో రికార్డు స్థాయిలో పదిసార్లకు పైనే 200+ లక్ష్యాలను ఛేదించగా.. ఈ సీజన్లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో ఏడుసార్లు హైదరాబాద్ 200 పైచిలుకు స్కోర్లు సాధించడం గమనార్హం. ఐపీఎల్ అత్యధిక ఛేదన రికార్డు పంజాబ్ (265)ది కాగా.. అత్యధిక స్కోరు (287) ఘనత సన్‌రైజర్స్ సొంతం.

టీ20 క్రికెట్‌లో మొదటి నుంచి బంతిపై బ్యాటుదే పైచేయి కానీ.. ఈ మధ్య బ్యాటర్ల ఆధిపత్యం మరీ పెరిగిపోతోంది. ఒక బ్యాటర్ ఎంత బలంగా బాదితే అంత డిమాండ్ అన్నట్లుగా పరిస్థితి తయారవడంతో యువ ఆటగాళ్లందరూ ఆ రకమైన ఆటకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో బ్యాటింగ్ శైలిలో, షాట్లలో కళాత్మకత కనుమరుగవుతోంది. టెక్నిక్ ఎంత బాగున్నా అదిప్పుడు పెద్ద విషయమే కాదు. యువ ఆటగాళ్లందరూ టీ20 అవసరాలకు తగ్గట్లు భారీ షాట్లు సాధన చేస్తున్నారు. కొంచెం అచితూచి ఆడే బ్యాటర్లు కూడా.. మారిన పరిస్థితుల్లో తమ ఆటతీరును మార్చుకోక తప్పట్లేదు. విధ్వంసకరంగా ఆడితే తప్ప మనుగడ కష్టమవుతోంది. ఐపీఎల్ కెరీర్ ఆరంభంలో అభిషేక్ శర్మ కొంచెం నెమ్మదిగానే ఆడేవాడు. తన బ్యాటింగ్‌లో టెక్నిక్ కనిపించేది. కానీ కొన్ని సీజన్ల ముందు అతడి ఆటతీరు మారిపోయింది. ఇప్పుడు ఐపీఎల్‌లోనే కాదు, ప్రపంచ క్రికెట్లోనే అత్యంత విధ్వంసకరంగా ఆడే బ్యాటర్లలో అతనొకడిగా మారాడు. ఇక 15 ఏళ్లకే ప్రకంపనలు రేపుతున్న వైభవ్ సూర్యవంశీ.. బంతిని ఎలా బాదేస్తున్నాడో చూస్తున్నాం. కొత్త తరానికి ఇలాంటి బ్యాటర్లే స్ఫూర్తిగా మారుతున్నారు. బాదడమే పనిగా పెట్టుకుంటున్న బ్యాటర్లకు ఏదీ అసాధ్యంగా అనిపించడం లేదు. భారీ షాట్లను బాగా ప్రాక్టీస్ చేసి బరిలోకి దిగుతున్న బ్యాటర్లకు.. పిచ్‌లు, పరిస్థితులు, పవర్ ప్లే నిబంధనలు బాగా కలిసి వస్తున్నాయి. ఇంతకుముందులా క్రీజులో కుదురుకునే వరకు అచితూచి ఆడడం.. మంచి బంతుల్ని గౌరవించడం, చెత్త బంతుల్నే శిక్షించడం.. ఇలాంటి లెక్కలేవీ ఇప్పుడు లేవు. తొలి బంతి నుంచి బాదడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఒక మేటి బౌలర్ వచ్చాడని జాగ్రత్త పడడం లాంటివేమీ ఉండట్లేదు. అందుకే బుమ్రా సైతం ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నాడు. వైభవ్ సూర్యవంశీ, సలీల్ అరోరా లాంటి కుర్రాళ్లు బుమ్రా బౌలింగ్‌లో ఎలా బాదేశారో చూశాం.

ఐపీఎల్‌లో బ్యాటర్ల దూకుడు మాటేమో కానీ.. బౌలర్ల పరిస్థితే దయనీయంగా మారుతోంది. బుమ్రా లాంటి బౌలర్‌నే లెక్క చేయడం లేదంటే.. మిగతా బౌలర్ల సంగతి అర్థం చేసుకోవచ్చు. ఒక మ్యాచ్‌లో ఏ బౌలరైనా 10 లోపు ఎకానమీ నమోదు చేస్తే గొప్పే. బ్యాటుకు, బంతికి మధ్య పోటీ లేకపోవడం.. ఐపీఎల్ బ్యాటర్ల టోర్నీగా మారిపోతుండడం ప్రేక్షకుల్లో అనాసక్తికి కారణమవుతోంది. అతి సర్వత్ర వర్జయేత్ అనే నానుడికి తగ్గట్లే ఉంది పరిస్థితి. బ్యాటర్లు ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదేస్తుండడంతో.. ఈ విధ్వంసాలు అభిమానులకు అంతగా కిక్కివ్వడం లేదు. ఎప్పుడో ఒక మ్యాచ్‌లో మినహాయిస్తే బౌలర్లకు అవకాశమే ఉండట్లేదు. గత వారం లఖ్‌నవూ, కోల్‌కతా మ్యాచ్‌లో తక్కువ స్కోర్లు నమోదవడం, ఆ పోరు టై అయి సూపర్‌ఓవర్‌కు దారి తీయడంతో అభిమానుల దృష్టి దాని వైపు మళ్లింది. 529 పరుగులు నమోదైన దిల్లీ-పంజాబ్ మ్యాచ్ కంటే తక్కువ స్కోర్లు నమోదైన ఈ పోరే ఆసక్తి రేకెత్తించిందంటే అతిశయోక్తి కాదు. చివరి ఓవర్లో 20 పైగా పరుగులు బాదేసి ఓ జట్టు గెలిచిన మ్యాచ్ కంటే 10 లోపు పరుగులను బౌలింగ్ జట్టు కాపాడుకునే పోరే ఇప్పుడు ఎక్కువ కిక్కిస్తోందంటే.. బ్యాటర్ల వీర బాదుడు మొహం మొత్తేలా చేస్తోందన దానికి సంకేతమే.



రోకో ద్వయానికి అదేం సమస్య కాదు..

దిల్లీ: అంతర్జాతీయ క్రికెట్లో ఒక్క ఫార్మాట్‌లోనే కొనసాగడం వల్ల ఆటగాళ్లు లయ కోల్పోయే అవకాశం ఉందని.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు మాత్రం అదేం సమస్య కాదని భారత సీనియర్ ఆటగాడు శిఖర్ ధావన్ అభిప్రాయపడ్డాడు. 2027 ప్రపంచకప్ వరకు ఎక్కువగా వన్డేలు షెడ్యూల్ అయి ఉండడం వారికి కలిసొస్తుందని చెప్పాడు. "అంతర్జాతీయ క్రికెట్లో ఒక్క ఫార్మాట్లోనే ఆడడం వల్ల ఆటగాళ్ల లయ దెబ్బ తింటుంది. కానీ రోహిత్, కోహ్లిల విషయానికి వస్తే అదేం పెద్ద సమస్య కాదు. సవాలే అయినప్పటికీ.. దాన్ని ఎలా అధిగమించాలో వారికి బాగా తెలుసు. విరాట్ ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతడు ఎప్పుడూ చురుకుగా ఉంటాడు. రోహిత్ కూడా ఎంతో శ్రమించాడు. పైగా రాబోయే వన్డే ప్రపంచకప్ వరకు వన్డే సిరీస్‌లు అధికంగా ఉండడంతో వారికి తగిన ప్రాక్టీస్ లభిస్తుంది" అని ధావన్ పేర్కొన్నాడు. అవకాశం వస్తే ఐపీఎల్‌లో కోచ్‌గా చేస్తానని ధావన్ చెప్పాడు.

స్లొవేకియాపై భారత్ గెలుపు

లండన్: ఐటీటీఎఫ్ ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్-7 పోరులో భారత్ 3-2తో స్లొవేకియాను ఓడించింది. గురువారం గ్రూప్-7 పోరు తొలి సింగిల్స్‌లో మనుష్ షా 8-11, 11-5, 11-8, 5-11, 6-11తో లుబోమిర్ చేతిలో ఓడగా.. రెండో సింగిల్స్‌లో మానవ్ థక్కర్ 11-6, 11-8, 11-6తో జాకబ్ జెలింకాపై నెగ్గడంతో భారత్ 1-1తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత హర్మీత్ దేశాయ్ 14-16, 5-11, 9-11తో వాంగ్ యంగ్‌కు తలొంచడంతో భారత్ మళ్లీ వెనుకబడింది. ఈ స్థితిలో మానవ్ థక్కర్ 11-3, 11-3, 11-3తో లుబోమిర్‌పై, మనుష్ షా 11-8, 11-8, 11-7తో జాకబ్‌పై నెగ్గి భారత్ విజయాన్ని అందించారు.

పరాగ్‌కు జరిమానా



దిల్లీ: రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై ఐపీఎల్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ (వేపింగ్) తాగుతూ కెమెరాలకు చిక్కిన పరాగ్‌పై జరిమానా విధించింది. క్రికెట్‌కు మచ్చ తెచ్చేలా ప్రవర్తించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ రిఫరీ అమిత్‌శర్మ నిర్ణయం తీసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే ఫీల్డ్ అంపైర్లు తన్మయ్ శ్రీవాస్తవ, నితిన్ మేనన్ ఈ విషయాన్ని రిఫరీకి నివేదించలేదు. అయితే ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దీన్ని ఐపీఎల్ ప్రవర్తన నియమావళిలోని లెవెల్-1 ఉల్లంఘనగా అమిత్ నిర్ధారించాడు. పరాగ్ తన తప్పును అంగీకరించడంతో విచారణ అవసరం లేకుండానే జరిమానా ఖరారైంది. కేవలం ఆటగాడిపైనే కాకుండా రాజస్థాన్ జట్టుపై కూడా బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉంది. "ఐపీఎల్ ప్రతిష్ఠను కాపాడేందుకు సదరు జట్లు, అధికారులు, ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఉన్న మార్గాలను బీసీసీఐ అన్వేషిస్తోంది" అని ఐపీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది. "ఆ ప్రకటనలో స్పష్టంగా చెప్పినట్లుగానే రాజస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాన్ని మేం పరిశీలిస్తున్నాం. దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపాడు.

ముగిసిన రగ్బీ లీగ్ వేలం


ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న రగ్బీ ప్రీమియర్ లీగ్‌కు ఫ్రాంచైజీలు బలమైన జట్లను తయారు చేసుకున్నాయి. రెండో సీజన్ కోసం గురువారం నిర్వహించిన క్రీడాకారుల వేలం పాట విజయవంతంగా ముగిసింది. తొలిసారి మహిళా ఫ్రాంచైజీలు వేలంలో పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుమిత్‌కుమార్ రాయ్‌ను రూ.3.75 లక్షలకు హైదరాబాద్ హీరోస్.. మహిళల్లో శిఖ యాదవ్‌ను రూ.2.40 లక్షలకు దిల్లీ రెడ్జ్ అత్యధిక ధరకు దక్కించుకున్నాయి. జూన్ 16 నుంచి 28 వరకు గచ్చిబౌలీ స్టేడియంలో రెండో సీజన్ జరగనుంది.

వైభవ్ అందుకే అలా..: బిషప్

బెంగళూరు: సాంకేతికంగానే కాక.. మానసికంగా బలంగా ఉండడం వల్లే వైభవ్ సూర్యవంశీ ప్రపంచ స్థాయి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించగలుగుతున్నాడని వెస్టిండీస్ మాజీ పేసర్ ఇయాన్ బిషప్ అన్నాడు. "వైభవ్ మానసికంగా బలంగా ఉన్నాడు. అందుకే బుమ్రా లాంటి ప్రపంచ ఉత్తమ బౌలర్లను ధాటిగా ఎదుర్కొంటున్నాడు. అతడి బ్యాటింగ్‌లో ప్రత్యేకమైన స్వింగ్ ఉంది. అది బేస్‌బాల్ బంతిని కొట్టే స్వింగ్ మాదిరిగా కనిపిస్తోంది. అయితే వైభవ్.. బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతులను ఎదుర్కోవడంలోనే కాస్త తడబడుతున్నాడు. కానీ ఈ బంతులను సరిగా వేయలేకపోతే కచ్చితంగా అతడు భారీ షాట్లు ఆడతాడు. వైభవ్‌ను ఔట్ చేసేందుకు యార్కర్లు వేసినా ప్రయోజనం ఉండదు" అని బిషప్ విశ్లేషించాడు.

స్పిన్నర్లు బంతిని తిప్పాలనుకోవట్లేదు

ముంబయి: ఐపీఎల్‌లో స్పిన్నర్లు బంతిని తిప్పడానికి ప్రయత్నించట్లేదని, బ్యాటర్లను కట్టడి చేయడంపైనే దృష్టి పెడుతున్నారని శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ అన్నాడు. "దేశవాళీలో కూడా స్పిన్నర్ల పరిస్థితి ఇలాగే ఉంది. మేము ఆడే రోజుల్లో స్పిన్నర్ అంటే.. తప్పక బంతిని తిప్పాలి. ఇప్పుడు అది అంత ముఖ్యం కాదు. ఎందుకంటే టెస్టు క్రికెట్ ఆడాలని ప్రతి ఒక్కరూ ఏమీ అనుకోవట్లేదు. వాళ్లు వన్డే క్రికెట్ ఆడాలనుకుంటున్నారు. చిన్న వయసులో కూడా స్పిన్నర్లు క్యారమ్, వైవిధ్యమైన బంతులు వేయాలనుకుంటున్నారే కానీ.. స్పిన్ చేయాలనుకోవట్లేదు. ఎందుకంటే బాల్యంలో వాళ్లు దాన్ని అలవర్చుకోలేదు. 18, 19 ఏళ్ల వయసులో కొత్తగా బంతిని స్పిన్ చేయడం రాదు" అని మురళి వివరించాడు. 10, 11 లేదా 12 ఏళ్ల వయసులోనే స్పిన్ చేయడం నేర్చుకోవాలని అన్నాడు.



మురళీధరన్

ఈనాడు



గుంటూరు 1-5-2026 శుక్రవారం సిటీ సంపుటి 31 సంచిక 25
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20
www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



నెల్లూరు జిల్లాలో మహానాడు

ఆదివారం నాటికి స్థలం ఖరారు

ఈనాడు, అమరావతి: తెదేపా మహానాడు వేదిక శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు మారింది. మే 27, 28, 29 తేదీల్లో అక్కడ మహానాడు జరుగుతుంది. ఈసారి మహానాడు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించాలని పార్టీ తొలుత నిర్ణయించింది. శ్రీకాకుళం పట్టణానికి సమీపంలో స్థలాన్ని కూడా గుర్తించారు. జూన్ నెలాఖరులో భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తున్న సందర్భంగా (మిగతా 8లో)

అదుపుతప్పి లోయలో పడిన ఆటో

పార్వతీపురం మన్యం జిల్లాలో నలుగురి దుర్మరణం

‘నీట్’గా రాసేయండి

అన్ని ఏర్పాట్లూ చేశామంటున్న అధికారులు

ఈ నెల 3న నీట్ యూజీ పరీక్షలు

లోపలి పేజీల్లో

శ్రీసత్యసాయి జిల్లాలో ఏరోస్పేస్ పరిశ్రమ

- ఉద్యోగ నియామకాలకు ఏఐ, ఐటీ పరిజ్ఞానం తప్పనిసరి చేయాలి
- నైపుణ్యం పెంచుకోకపోతే మంత్రులూ వెనకబడిపోతారు
- రాజధాని నిర్మాణ వ్యయంపై వైకాపా విష ప్రచారం
- సింగపూర్‌లోని ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేయాలి
- మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు


సచివాలయంలో నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తి సమీపంలో భారీ ఏరోస్పేస్ పరిశ్రమ వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బెంగళూరులో విస్తరణకు అవకాశం లేకపోవడంతో ఏరోస్పేస్ రంగం శ్రీసత్యసాయి జిల్లావైపు చూస్తోందని, అక్కడ డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తాయని తెలిపారు. ఈ రంగాల్లో సమీప భవిష్యత్తులో రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. అక్కడ ఏరోస్పేస్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన కంపెనీకి అనుమతులు, ఇతర ప్రక్రియలను వేగంగా పూర్తిచేసి, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏంటో చూపించారని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం అభినందించారు. గూగుల్ డేటాసెంటర్‌ను విశాఖకు తీసుకురావడం వెనుక జరిగిన కృషిని ఆయన వివరించారు. లోకేశ్ అమెరికాలో గూగుల్ ప్రతినిధులను కలిసి రాష్ట్రానికి వచ్చేందుకు ఒప్పించారని చెప్పారు. పన్నులకు సంబంధించి కేంద్రప్రభుత్వ విధానాలతో కొన్ని సమస్యలున్నాయని గూగుల్ ప్రతినిధులు చెబితే, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు తాను ఆ విషయం వివరించి, తగిన మార్పులు చేసేందుకు ఒప్పించి, మార్గం సుగమం చేసినట్లు తెలిపారు. ఇప్పుడు విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. (మిగతా 8లో)

రూ.1,208 కోట్లతో అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ట్విన్ టవర్లు 8లో

పుట్టపర్తిలో డీఆర్‌డీవోకు 600 ఎకరాలు: మంత్రివర్గ నిర్ణయాలు

ఇగోలకు పోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నాం 2లో

ఆత్మీయ విందులో సీఎం చంద్రబాబు

80 కి.మీ. దాటకూడదంతే



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల గరిష్ఠ వేగానికి కళ్లెం	వేగ నియంత్రణ పరికరం పనిచేసేలా ట్రాకింగ్	దారికొచ్చిన 1,660 బస్సులు

ఈనాడు - అమరావతి

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అతివేగంగా పరుగులు పెడుతూ ప్రమాదాలకు కారణమవుతుండటంతో వాటి నియంత్రణకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. ఏ బస్సు కూడా గరిష్ఠంగా గంటకు 80 కి.మీ. వేగానికి మించి వెళ్లకుండా చూస్తోంది. రాష్ట్రం మీదుగా ప్రయాణించే బస్సులన్నింటినీ ట్రాక్‌చేస్తూ, ఏ సమయంలో ఎంత వేగంతో వెళ్లాయనేది నిరంతరం పరిశీలిస్తోంది. పరిమితికి మించి వేగంగా వెళ్లినట్లు గుర్తిస్తే, వెంటనే చర్యలు తీసుకుంటోంది.

1,660 బస్సులపై నిఘా

- ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) కలిగిన మన రాష్ట్రానికి చెందిన ట్రావెల్స్ సంస్థల బస్సులు, ఏపీ మీదుగా ప్రయాణించే బస్సులు కలిపి మొత్తం 1,800 ఉన్నాయి.
- వీటిలో ఇప్పటివరకు 1,660 బస్సుల జీపీఎస్ ట్రాక్ చేయడం ఆరంభించారు.
- ప్రతి బస్సు ప్రయాణ (మిగతా 8లో)

వేగ నియంత్రణ పరికరం పనిచేయాల్సిందే..




- కేంద్ర మోటారు వాహన చట్టం నిబంధన 118 ప్రకారం బస్సులు గరిష్ఠంగా గంటకు 80 కి.మీ. వేగం దాటకూడదు. ఈ మేరకు అన్ని బస్సుల్లో వేగ నియంత్రణ పరికరం ఉంటుంది. అది గరిష్ఠంగా 80 కి.మీ.కి లాక్ చేసి ఉంటుంది.
- అత్యధిక ట్రావెల్స్ సంస్థలు.. తమ బస్సుల్లో ఆ డివైజ్ పనిచేయకుండా చేసి, గంటకు 120-130 కి.మీ. వేగంతో వెళ్లేవి.
- అధికారులు తనిఖీ చేసినప్పుడే పరిమిత వేగంతో వెళ్లి.. తర్వాత దూసుకెళ్లేవి.
- కర్నూలు, మార్కాపురం బస్సుప్రమాదాల నేపథ్యంలో.. బస్సుల వేగ నియంత్రణపై రవాణాశాఖ దృష్టిపెట్టింది.
- బస్సులోని వేగ నియంత్రణ పరికరం తప్పనిసరిగా పనిచేయాల్సిందేనని, ట్రావెల్స్ యాజమాన్యాలకు స్పష్టం చేసింది.
- ఆయా బస్సుల్లో జీపీఎస్‌ను రవాణాశాఖ ట్రాక్ చేయడం ఆరంభించింది.
- దీనికోసం రవాణాశాఖ కమిషనరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, ప్రతి బస్సును ట్రాక్ చేస్తున్నారు.


ప్రపంచంలో అత్యంత ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనపై పరుగులు తీస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్

చినాబ్ వంతెనపై వందేభారత్

- జమ్మూ-శ్రీనగర్ మార్గంలో ప్రారంభించిన రైల్వేమంత్రి

శ్రీనగర్: జమ్మూ- శ్రీనగర్ మార్గంలో రాకపోకలు సాగించనున్న మొట్టమొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ జెండా ఊపి గురువారం ప్రారంభించారు. పూంఛ్, రాజౌరి, ఉరీ వంటి మారుమూల ప్రాంతాలను దేశవ్యాప్తంగా ఇతర రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించడంపై దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. చినాబ్ వంతెనపై పరుగులు పెట్టనున్న ఈ రైలు శనివారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. దీని వల్ల జంట రాజధానుల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతో పాటు పర్యాటకానికీ ప్రోత్సాహం లభించనుంది.

పదిలో 85.25% పాస్

87.90% ఉత్తీర్ణతతో మెరిసిన బాలికలు.. బాలురు 82.68%

- ప్రథమ స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా
- రెండు, మూడు స్థానాల్లో అంబేడ్కర్ కోనసీమ, విజయనగరం
- అట్టడుగున అల్లూరి సీతారామరాజు జిల్లా
- ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్


600 మార్కులకు 599 సాధించిన విశాఖకు చెందిన జ్ఞానేశ్వరికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఈనాడు, అమరావతి: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 85.25% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 6,18,131 మంది పరీక్షలకు హాజరు కాగా.. 5,26,954 మంది పాసయ్యారు. బాలురు 82.68%, బాలికలు 87.90% మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు 5.22% ఎక్కువ ఉత్తీర్ణులయ్యారు. పరీక్షల ఫలితాలను విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ గురువారం ‘ఎక్స్’ వేదికగా విడుదల చేశారు. ఏపీకి తరలివస్తున్న భారీ పెట్టుబడులు, విప్లవాత్మక ప్రాజెక్టుల కంటే విద్యాశాఖ మంత్రిగా పదోతరగతి పరీక్షల ఫలితాల్లో కనిపిస్తున్న స్థిరమైన పురోగతి తనకు ఎక్కువ సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. ఫలితాలు విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయులు, కుటుంబాల మద్దతును ప్రతిబింబిస్తున్నాయని వెల్లడించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. అనుత్తీర్ణులైన వారు నిరాశ చెందకుండా కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం మద్దతుతో (మిగతా 13లో)

సముద్రంలో ముంచేస్తాం

- పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్లకు పనేంటి?
- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రశ్న
- అణు సామర్థ్యాలను జాతీయ సంపదలా కాపాడుకుంటామని ఉద్ఘాటన
- హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని స్పష్టీకరణ
- జలసంధిని తెరిచేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించిన డొనాల్డ్ ట్రంప్



దుబాయ్: అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. శాంతి చర్చలు దాదాపుగా అటకెక్కిన వేళ.. ఇరు దేశాల మధ్య విభేదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. అణ్వస్త్ర తయారీ ప్రణాళికలను వదులుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్‌ను టెహ్రాన్ ససేమిరా అంటోంది. తమ అణు, క్షిపణి సామర్థ్యాలను జాతీయ సంపద తరహాలో కాపాడుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తాజాగా ఉద్ఘాటించారు. హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని, అందుకోసం కొత్త నిబంధనలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌కు వచ్చే అమెరికన్లను సముద్రంలో ముంచేస్తామని హెచ్చరించారు. మరోవైపు, చమురు ధరలు భారీగా పెరుగుతుండటంతో ఒకింత ఒత్తిడి ఎదుర్కొంటున్న ట్రంప్.. హర్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దాని ప్రకారం- ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా కొనసాగిస్తుంది. అదే సమయంలో.. ఇంధన స్వేచ్ఛా ప్రవాహానికి విఘాతం కలిగించే ప్రయత్నాలకు టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేలా మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపడుతుంది. అమెరికా సీనియర్ అధికారి ఒకరు ఈ ప్రణాళిక గురించి తెలియజేశారు. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గురువారం ఏకంగా 128 డాలర్లకు ఎగబాకింది.

గల్ఫ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం

ఇరాన్‌లో పర్షియన్ గల్ఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొజ్తాబా ఖమేనీ రాతపూర్వక సందేశం విడుదల చేశారు. (మిగతా 8లో)

ఊబకాయం.. మహిళల్లోనే అధికం



రాష్ట్రంలో 96.5% ప్రసవాలు వైద్య నిపుణుల సమక్షంలోనే

మాతా, శిశు మరణాలు తగ్గాయి ● కేంద్ర గణాంకాల శాఖ తాజా నివేదికలో వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అధిక బరువు (ఒబెసిటీ) సమస్య పురుషుల కంటే మహిళలనే ఎక్కువగా వేధిస్తోంది. సాధారణ స్థితి కంటే తక్కువ బరువున్న (బీఎంఐ 18.5 కంటే తక్కువ) మహిళల సంఖ్య గతంలో కంటే తగ్గినా, ఊబకాయ సమస్య ఎక్కువమందిని వెంటాడుతోంది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ‘భారతదేశంలో మహిళలు, పురుషులు-2025’ నివేదిక ఈ విషయాల్ని స్పష్టం చేసింది. ఆ నివేదిక ప్రకారం.. 2015-16లో పురుషుల్లో ఒబెసిటీ 7.7% ఉంటే.. 2019-21 నాటికి 6.3%కి తగ్గింది. ఇదే కాలంలో మహిళల్లో 10.3% నుంచి 12%కి పెరిగింది. నేషనల్ ఫ్యామిలీహెల్త్ సర్వే-4 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-4)లో 17.6% మంది మహిళలు సాధారణం కంటే తక్కువ బరువు ఉన్నట్లు గుర్తిస్తే.. ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో ఆ సమస్య 14.8%కి తగ్గింది. అధిక బరువున్న మహిళలు గతంలో 33.2% ఉంటే.. ఇప్పుడు 36.3%కి పెరిగినట్లు గుర్తించారు.

- రాష్ట్రంలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) ప్రతి వెయ్యి జననాలకు 2008లో 53 ఉంటే.. 2023 నాటికి 25కి తగ్గాయి. బాలుర మరణాల రేటు 2008లో 52 ఉంటే.. 2023లో 26కి తగ్గింది. (మిగతా 8లో)

సగటు జీవిత కాలం 70 ఏళ్లు

రాష్ట్రంలో సగటు జీవిత కాలం 2016 నుంచి 2020 వరకు 70.6 ఏళ్లు ఉంటే.. 2019 నుంచి 2023 వరకు 70.7 ఏళ్లుగా గుర్తించారు.

రాష్ట్రంలో 15-49 ఏళ్ల వివాహిత మహిళల్లో ఆధునిక కుటుంబ నియంత్రణ పద్ధతులు అనుసరిస్తున్నవారు 2015-16లో 69.4% మంది ఉంటే.. 2019- 21లో 70.8%కి పెరిగారు.

శాశ్వత కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు 2019-21లో మహిళలు 69.6% మంది చేయించుకుంటే, పురుషుల్లో 0.4% మంది మాత్రమే ఉన్నారు.



వైజాగ్ స్టీల్‌కు మరో 8 వేల కోట్లు

సాయానికి కేంద్రం సిద్ధం

ఉక్కుశాఖ మంత్రి ఆమోదం

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన రూ.11వేల కోట్ల ఆర్థికప్యాకేజీతో గాడిలో పడిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్యకలాపాలను సుస్థిరంగా మార్చేందుకు మరో రూ.8,097 కోట్ల ఆర్థికసాయం చేయడానికి కేంద్రం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి క్లియర్‌చేసి ఆర్థికశాఖ ఆమోదం కోసం పంపినట్లు తెలిసింది. ఆర్థికశాఖ వ్యయవిభాగం పచ్చజెండా ఊపిన వెంటనే ఈ అంశం (మిగతా 8లో)

ఎండ దెబ్బకు ఎడారి మాదిరి


ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలను కలిపే జాతీయ రహదారి(నం. 165) ఇది. నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భానుడి భగభగలకు ఏలూరు జిల్లా మండవల్లిలో గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్మానుష్యంగా కనిపించింది. - ఈనాడు, మండవల్లి

గూడూరు గుభేల్

45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం

రాష్ట్రంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న వేడిమి 8లో



జంతువుల్లా..

ఇంతకుముందు యానిమల్ కార్డ్స్‌తో చాలా గేమ్స్ ఆడే ఉంటాం కదా.. ఇప్పుడు ఇంకాస్త కొత్తగా ఈ ఆట ఆడుదామా.. అదెలా అంటారా..

ముందుగా మన ఫ్లాట్లో, పక్కింట్లో, ఎదురింట్లో ఉన్న ఫ్రెండ్స్‌ను పిలిచి ఒక గ్రూప్ అవ్వండి. తర్వాత ఒక తెల్లని కాగితం తీసుకుని అందులో రకరకాల జంతువుల పేర్లు రాసి మడత పెట్టి చీటీలా చేసి ఒక బాక్స్‌లో వేయండి. తర్వాత ఒక్కొక్కరుగా వచ్చి ఒక్కో చీటీ తీయండి. అందులో ఏ జంతువు పేరు వస్తే దానిలా నటించాలి. అంటే మీకు కోతి పేరు వచ్చిందనుకోండి.. కోతి నవ్వితే ఎలా ఉంటుంది..? అది గెంతితే ఎలా ఉంటుంది? అలా చేసి చూపించాలి అన్నమాట.. మాట్లాడకుండా కేవలం సైగలే చేస్తే.. మిగతా వారు ఆ జంతువేంటో కనిపెట్టాలి.

ఇలా ఒక్కొక్కరుగా వచ్చి యాక్ట్ చేయాలి. ఎవరు ఎక్కువ జంతువులను సరిగ్గా నటించి చూపిస్తారో వాళ్లే విన్. బాగా నటించిన వారికి క్లాప్స్ కొట్టి ఎంకరేజ్ చేస్తారు కదా.. మరి వెంటనే మొదలుపెట్టేయండి!



సెలవుల్లో సరదాగా!

అమ్మమ్మ ఊరు.. నానమ్మ ఇల్లు.. సెలవులొచ్చాయంటే మనం వెళ్తాం కదా! ఈసారి పల్లెటూరు వెళ్లినప్పుడు ఆటల తోనే సరిపెట్టకుండా ఓ పనిచేద్దామా? ఆ ఊరి భాషలోని అందాన్ని, పల్లె యాసలోని చమత్కారాన్ని తెలుసుకుందామా? ఇంతకీ యాస అంటే ఏంటనేగా మీ డౌటు. మనం దరం తెలుగు మాట్లాడతాం కదా! కానీ, అందరం ఒకేలా మాట్లాడం. ఉదాహరణకు కొందరు అన్నం అంటే వేరే వారు బువ్వ అనొచ్చు. ఇలాంటి పదాలు ప్రతిచోటా బోలెడు ఉంటాయి.

★ ఏమిటి అనే పదమే ప్రాంతాన్ని బట్టి మారిపోతూ ఉంటుంది తెలుసా.. ఏంటి, ఏంది, ఏటి.. ఇలా ఒక్కో ఊరిలో ఒక్కోలా పలుకుతూ ఉంటారు. ఇలాగే మీరు వెళ్లిన చోట, భాషను ఎలా వాడుతున్నారో చూడండి.

★ దగ్గర్లో ఉన్న దుకాణానికి వెళ్లి.. వస్తువులు అడిగేటప్పుడు వారు మాట్లాడే మాటలను గమనించండి. అమ్మమ్మలు వాళ్ల చిన్నప్పుడు వాడిన పదాలేంటో కూడా అడిగి తెలుసుకోవచ్చు.



పదాలతో తమాషా

గవర్నర్ ఏడీసీ రామాంజనేయులు ఆకస్మిక బదిలీ

- పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశం
- మూడేళ్ల క్రితం ఆయన నియామకమూ చర్చనీయాంశమే

ఈనాడు, అమరావతి: గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఏడీసీగా వ్యవహరిస్తున్న ఏఎస్పీ ఎన్వీ రామాంజనేయులును ప్రభుత్వం బదిలీచేసింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. బదిలీ వెంటనే అమల్లోకి వస్తుందని, ఆయన డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలా హఠాత్తుగా బదిలీ చేయడమే కాకుండా ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం, మరోవైపు కొత్త ఏడీసీని నియమించకుండానే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఏడీసీని బదిలీ చేసేముందు కొత్త నియామక ప్రక్రియను పూర్తిచేస్తారు. పాత ఏడీసీ రిలీవ్ అయ్యే సమయానికి కొత్త వాళ్లు బాధ్యతలు చేపట్టేలా ముందస్తుగా చర్యలు తీసుకుంటారు. కానీ, ఇప్పుడు నూతన నియామక ప్రక్రియ ప్రారంభించకముందే హఠాత్తుగా ఆయన్ను బదిలీ చేయడం గమనార్హం. మూడేళ్ల క్రితం గవర్నర్ ఏడీసీగా రామాంజనేయులు నియమితులైన విధానం కూడా చర్చనీయాంశమే. అప్పట్లో వైకాపా ప్రభుత్వంలో కీలక సలహాదారుగా ఉన్న ఒక నేత మనిషిగా పేరున్న ఆయన ఈ పదవిలో నేరుగా చేరిపోయారనే ఆరోపణలున్నాయి. సాధారణంగా గవర్నర్‌కు ఏడీసీని నియమించేందుకు.. ముగ్గురు పోలీసు అధికారుల పేర్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం లోక్‌భవన్‌కు పంపుతుంది. జాబితాలోని ముగ్గురినీ గవర్నర్ కార్యదర్శి ఇంటర్వ్యూ చేస్తారు. వారికున్న అర్హత, సమర్థతలను బేరీజు వేసి ఆ సమాచారాన్ని గవర్నర్‌కు నివేదిస్తారు. గవర్నర్ ఆమోదం మేరకు ఎంపిక చేసిన ఒకరి పేరును ప్రభుత్వానికి పంపుతారు. అప్పుడు ప్రభుత్వం ఆ అధికారిని గవర్నర్ ఏడీసీగా నియమిస్తుంది. అప్పట్లో రామాంజనేయులును ఇలా నియమించినప్పుడు ఈ ప్రక్రియ సమగ్రంగా జరగలేదని లోక్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఆయన ఐపీఎస్ అర్హత పొందేందుకు పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు సెలవులో వెళ్లాలనుకుంటున్నారని, పైగా ఏడీసీగా మూడేళ్ల పదవీకాలం పూర్తయినందువల్ల ఆయన్ను బదిలీ చేశారని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఇగోలకు పోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నాం

- నేను, పవన్ కల్యాణ్ చేస్తున్నదిదే
- అధికారులు, ఉద్యోగులు కూడా అలానే చేయాలి
- నాకు అవార్డు దక్కడానికి టీం ఏపీ పనితీరే కారణం
- మంత్రులు, అధికారులు, ఉద్యోగులే రియల్ విన్నర్స్
- ఆత్మీయ విందులో సీఎం చంద్రబాబు



విందు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, సీఎస్ సాయిప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: రాజకీయంగా, పాలనాపరంగా తాను, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎలాంటి ఇగోలకు వెళ్లకుండా ప్రజల కోసం పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులూ విధుల నిర్వహణలో ఇదే తరహాలో రాష్ట్రం కోసం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇటీవల బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025 అవార్డు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి గురువారం మంత్రులు కార్యదర్శులు, హెచ్‌వోడీలకు ఆత్మీయవిందు ఇచ్చారు. వివిధ శాఖల్లో చక్కటి పనితీరు కనబరిచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులనూ విందుకు ఆహ్వానించారు. 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశ మందిరంలోకి సీఎంను చప్పట్లతో మంత్రులు, అధికారులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'నాకు అవార్డు రావడానికి టీం ఏపీ పనితీరే కారణం. ఇందులో మంత్రులు, అధికారులు, ఉద్యోగులే రియల్ విన్నర్స్. అందరూ సహకరించడం వల్లే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. సంక్షేమాన్ని పేదలకు అందిస్తున్నాం. రాజకీయాల్లో ఎన్నో విజయాలు చూశా. కానీ 2024 ఎన్నికల్లో వచ్చిన విజయం గతంలో ఎప్పుడూ చూడలేదు. 22 నెలల కిందట పాలన ప్రారంభించినప్పుడు వ్యవస్థల్ని సరిచేయడం సాధ్యం కాదేమో అనుకున్నా. కానీ టీం ఏపీ సహకారం వల్లే అన్నింటినీ గాడిలో పెట్టగలిగాం. దానికి నిదర్శనమే ఈ అవార్డు' అని సీఎం పేర్కొన్నారు. 'ఈ అవార్డు రాష్ట్రానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నా. మరిన్ని పెట్టుబడుల్ని తీసుకొచ్చేందుకు ఇది దోహదం చేస్తుంది. అధికారులు బాగా పనిచేస్తే ఎన్నికల్లో కలిసొస్తుంది. హుద్‌హుద్ తుపాను సమయంలో అప్పటి అధికారులు పడిన కష్టం మాకు కలిసొచ్చింది. 2019 ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినా విశాఖలో సీట్లను గెలుచుకోగలిగాం' అని వివరించారు.

17 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రాష్ట్రానికి రిలయన్స్

'పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం వెంటపడటం కాదు. ప్రభుత్వమే పారిశ్రామికవేత్తల వద్దకు వెళ్లి మాట్లాడే విధానం తెచ్చాం. ఫలితంగా అభివృద్ధి సాధించగలిగాం. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో చాలా మంది ప్రధానుల్ని చూశా. సరైన సమయంలో సరైన ప్రధానిగా మోదీ ఉన్నారు. గూగుల్ సంస్థ ఏపీకి వచ్చిందంటే దానికి ఆయనే కారణం. రాష్ట్రానికి ఆ సంస్థ వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. గూగుల్ పెట్టుబడులకు మించి రిలయన్స్ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చింది. ఆ సంస్థ 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో రాష్ట్రానికి వస్తోంది. ఆర్సెలార్ మిత్తల్ రాకకు ప్రధాని తీసుకున్న చొరవే కారణం' అని అన్నారు.



పెట్టుబడులు పెడుతూనే ఉండాలి

స్టాక్ మార్కెట్‌లో పరిస్థితులు చక్కబడతాయి.. లేదా కుప్పకూలిపోతాయి.. అప్పటి వరకూ వేచి చూద్దాం అని కూర్చుంటే అవకాశాలు చేజారిపోతాయి. చరిత్రలో యుద్ధాలు, మహమ్మారులు, ఉపద్రవాలు వస్తుంటాయి.. పోతుంటాయి. సమయానుకూలంగా మార్కెట్‌లో పెట్టుబడి కొనసాగిస్తూ ఉండటమే ఉత్తమం.

– బ్రెన్నాన్ ష్లాగ్‌బామ్, రచయిత

లక్ష్యాన్ని సాధించిన ప్రతిసారీ సీఎం కొత్త లక్ష్యాన్ని నిర్దేశిస్తారు

- విద్య, ఐటీశాఖల మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: పరిపాలనలో, రాజకీయాల్లో ఎలాంటి ఇగో (అహం) లేకుండా పనిచేసే వ్యక్తి సీఎం చంద్రబాబు అని విద్య, ఐటీశాఖల మంత్రి లోకేశ్ కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే పెట్టుబడులు తీసుకురావడంలో, పారిశ్రామికవేత్తలను కలిసే విషయంలో ఇగోను పక్కనపెట్టి బృందస్ఫూర్తితో పనిచేస్తున్నామని తెలిపారు. ఇటీవల బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు అందుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి గురువారం మంత్రులు, సీఎస్, డీజీపీ, కార్యదర్శులు, హెచ్‌వోడీలకు ఆత్మీయవిందు ఇచ్చారు. 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ తండ్రిగా చంద్రబాబును చూస్తా

'మనం ఎక్కువ సమయం తల్లితో గడుపుతాం. ఆమె ప్రేమను పొందుతాం. పెద్దయ్యాక కుటుంబాన్ని నిలబెట్టడానికి తండ్రి చేసిన త్యాగాలు అర్థమవుతాయి. అదేవిధంగా నేను మన ముఖ్యమంత్రిని ఆంధ్రప్రదేశ్ తండ్రిగా చూస్తా' అని తెలిపారు. 'నా వ్యక్తిగత లక్ష్యం ఒక్కటే. 1995-99 నాటి పాలన కంటే 2024-29 మధ్య ప్రభుత్వ పాలన గొప్పదని చంద్రబాబు స్వయంగా చెప్పాలి. ఎందుకంటే ఆయనెప్పుడూ 1995-99 పాలన గురించే చెబుతుంటారు' అని లోకేశ్ పేర్కొన్నారు. 'చంద్రబాబు 4.0 పాలనలో మంత్రులుగా భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నాం. కొత్త ఆలోచనలు, విధానాలు తీసుకొచ్చినప్పుడు ఆయన ఎప్పుడూ మాకు మద్దతునిచ్చారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయించాలనే ప్రతిపాదనను తీసుకొచ్చినప్పుడు ఆయన్ను ఒప్పించడానికి 30 నిమిషాలు పట్టింది. దాని తర్వాత గూగుల్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లాంటి కంపెనీలు రాష్ట్రానికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఆయనతో కలిసి పనిచేయడం అద్భుత అనుభవం' అని లోకేశ్ వెల్లడించారు.

మన్యం జిల్లాలో లోయలో పడిన ఆటో నలుగురి దుర్మరణం



న్యూస్‌టుడే-పాలకొండ గ్రామీణం, సీతంపేట: శుభకార్యానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డుప్రమాదం నలుగురి ప్రాణాలను తీసింది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం బొడ్డుమాసంగి గ్రామానికి చెందిన 11 మంది... సీతంపేట మండలం కొప్పాడలో ఓ శుభకార్యానికి వెళ్లారు. గురువారం సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పాలకొండ-సీతంపేట ఘాట్‌రోడ్డులో మలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పింది. డ్రైవర్ ఆటోను అదుపు చేయలేకపోవడంతో అది పక్కనే ఉన్న 30 అడుగుల లోయలో పడిపోయింది. ఆటోలో డ్రైవర్, ఐదుగురు చిన్నారులు సహా మొత్తం 11 మంది ప్రయాణిస్తున్నారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రికి తరలించిన క్షతగాత్రుల్లో మరొకరు మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. ప్రాణాలు కోల్పోయినవారిలో ఆటో డ్రైవర్ అక్కపల్లి రమణ(40), ఆరిక ఆదిలక్ష్మి(45), కొండగొర్రి శ్రావణి(34), ఉర్లక శాంతి(35) ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న మరో ఇద్దరిని శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రహం అనుగ్రహం

1-5-2026 శుక్రవారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, శుక్ల పక్షం

పూర్ణిమ: రా.9-28 తదుపరి బహుళ పక్ష పాడ్యమి
స్వాతి: తె. 3-26 తదుపరి విశాఖ
వర్జ్యం: ఉ. 7-37 నుంచి 9-21 వరకు
అమృత ఘడియలు: సా. 5-57 నుంచి 7-41 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-10 నుంచి 9-00 వరకు తిరిగి మ. 12-22 నుంచి 1-12 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.39; **సూర్యాస్తమయం:** సా.6.15

మే డే, కార్మికుల దినోత్సవం, కూర్మ జయంతి


Reliance
Growth is Life
SMART BAZAAR
స్మార్ట్ బజార్ సిద్ధాంతం ఒక్కటే ఎల్లప్పుడూ మీ డబ్బుకి పూర్తి విలువ!
లూజ్ హైదరాబాదీ బిర్యానీ బాస్మతి రైస్ 1 kg / కర్నూలు సోనా మసూరి రైస్ 26 kg
₹41.50 /kg
స్మార్ట్ ప్రైస్ ₹93/ ₹1079
మార్కెట్ ధర ₹100
ఎమ్ఆర్‌పి ₹1650
ఆదా చేసుకోండి ₹571
గుడ్ లైఫ్ జీరా 500 g / MRN నిరాని షుగర్ S30 5 kg
₹46.60 /kg
స్మార్ట్ ప్రైస్ ₹149/ ₹233
ఎమ్ఆర్‌పి ₹300 / ₹315
ఆదా చేసుకోండి ₹151 / ₹82
హీరా మోతీ హోల్ వీట్ ఆటా / ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹179/ ₹299
₹20 OFF
ఎమ్ఆర్‌పి ₹290 / ₹358
ఆదా చేసుకోండి ₹111 / ₹59
గుడ్ లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 820 g / సన్‌ప్యూర్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 2 L
ఉచితం
₹174.50 /L
స్మార్ట్ ప్రైస్ ₹149/ ₹349
ఎమ్ఆర్‌పి ₹185 / ₹399
ఆదా చేసుకోండి ₹36 / ₹50
ప్యాక్డ్ పల్సెస్ మొత్తం శ్రేణి
కనీసం 25% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹60 మొదలుకుని
బ్రాండెడ్ అండ్ క్లీన్ ట్రాలీ (ఎంపిక శ్రేణి)
ఫ్లాట్ 85% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹7999 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹1199 మొదలుకుని
బిస్కెట్స్ ప్యాక్ 225 g మొదలుకుని / లోట్టే చాకో పై 336 g (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹75 మొదలుకుని /యూనిట్
కోల్డ్ డ్రింక్ అండ్ జ్యూసెస్ 1.2 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹70 మొదలుకుని /యూనిట్
BUY ANY 2 GET ANY 1 FREE
సోప్ 125 g x 5 యూనిట్స్ (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹299 మొదలుకుని
కనీసం 33% తగ్గింపు
డిటర్జెంట్ 5 kg / 2 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹390 మొదలుకుని
తాజ్ మహల్ టీ 500 g
ఆదా చేసుకోండి ₹70
ఎమ్ఆర్‌పి ₹380 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹310 మొదలుకుని
హెరిటేజ్ ఆగ్‌మార్క్ ఘీ (గ్రేడ్ స్పెషల్) 1 L
స్మార్ట్ ప్రైస్ ₹619
ఎమ్ఆర్‌పి ₹740
ఆదా చేసుకోండి ₹121
మీ డబ్బుకు పూర్తి విలువ ఇచ్చే సేల్
29th APR-3rd MAY
టూత్‌పేస్ట్ 300 g (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 40% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹204 మొదలుకుని
Women's, Men's & Kids' Wear UP TO 70%* OFF
*Select Merchandise
Ulhaas HAPPY LIVING
Raymond myTRIDENT
90% తగ్గింపు
డబుల్ బెడ్ షీట్ సెట్ (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹120 మొదలుకుని
SMART BAZAAR
వద్ద కూడా లభ్యం
fresh Signature
SMART SUPERSTORE
10% INSTANT DISCOUNT*
SBI card
*Min. Trxn.: ₹3,500; Max. Discount: ₹500 per Trxn. per credit card; Validity: 29 Apr - 03 May 2026. T&C Apply.
BAJAJ FINANCE
Get ₹1500 gift voucher on shopping of ₹5000 or more with Bajaj Easy EMI.
Valid Once Per Customer from 29th April to 03rd May 2026


ఈనాడు

ప్రగతికి దూరంగా... పల్లె భారతం!

భారతావని అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే అరవై శాతానికి పైగా జనాభాకు నెలవులైన పల్లెలు కచ్చితంగా సుభిక్షం కావాలి. గ్రామీణుల జీవితాల్లోకి ప్రగతి వెలుగులు ప్రసరించాలి. దురదృష్టవశాత్తు, దేశీయంగా అందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం తాజాగా విడుదల చేసిన పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ నివేదిక ఇదే చేదు వాస్తవాన్ని మరోసారి తేటతెల్లం చేసింది. పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధి కల్పన, ఆరోగ్య సేవల లభ్యత, నీటి వసతి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అందుబాటు, సామాజిక న్యాయం, సుపరిపాలన తదితర ప్రమాణాల ఆధారంగా ఆ ఇండెక్స్‌లో పంచాయతీలకు గ్రేడ్లు కేటాయించారు. మొత్తం రెండున్నర లక్షలకు పైగా పంచాయతీల స్థితిగతులను విశ్లేషిస్తే, వాటిలో ఒక్కటీ 'ఏప్లస్' గ్రేడ్ సాధించలేకపోవడం- ప్రగతిబాటలో మన పల్లెల వెనకబాటుతనానికి అద్దం పడుతోంది. కేవలం 3635 పంచాయతీలే 'ఏ' గ్రేడ్ దక్కించుకున్నాయి. వాటిలో తెలంగాణ నుంచి 624, ఏపీవి 591 గ్రామాలున్నాయి. దేశవ్యాప్తంగా 1.23 లక్షల పంచాయతీలు 'సీ' గ్రేడుకు పరిమితమైతే- మరో 13వేలకు పైగా పల్లెలు ఇంకా అధ్వానంగా 'డీ' గ్రేడులో నిలిచాయి. అరకొర సదుపాయాలతో నీరసించిపోతున్న పల్లెలకు నూతన జవసత్వాలు కల్పించడంపై ప్రభుత్వాలు వెంటనే దృష్టిసారించాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వ సూచీ గుర్తుచేస్తోంది!

అధికారిక లెక్కల ప్రకారం, మొన్న మార్చి నాటికి గ్రామీణ భారతంలోని 19శాతం ఇళ్లు నల్లా నీటికి నోచుకోలేదు. పశ్చిమ బెంగాల్, కేరళ, ఝార్ఖండ్, రాజస్థాన్ వంటి చోట్ల అలాంటి వాటి సంఖ్య ఎక్కువగా ఉండటంతో తాగునీటికి కటకట తప్పడంలేదు. పైగా, చాలాచోట్ల కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ప్రాణాంతక వ్యాధులెన్నో ముమ్మరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా రోడ్ల విస్తరణ వేగంగా సాగుతున్నా, నేటికీ సుమారు 30శాతం పల్లెల్లో నాలుగు చినుకులు రాలితే కాలు బయటపెట్టలేని పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి. 30శాతం గ్రామాల్లో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ మృగ్యమైంది. అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం పల్లెపట్టుల్లో 36శాతం కుటుంబాలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు లేవు. కర్ణాటకలోని 13 గ్రామాల్లో ఇటీవలి సర్వేలో 50శాతం ఎస్సీ కుటుంబాలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదని తేలింది. సామాజిక ఆర్థిక అసమానతల ప్రజ్వలనానికి ఇది అద్దంపడుతోంది. పరిశీలనల మేరకు, 2022 నాటికి పది శాతం పంచాయతీల్లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. సీహెచ్‌సీల్లో 80శాతం స్పెషలిస్టు వైద్యుల కొరత వేధిస్తోంది. ఆరోగ్య భద్రతకు దిక్కులేని దుస్థితిలో గ్రామీణ భారతం తరచూ జబ్బుల పాలవుతోంది. వీటన్నింటికీ తోడు సాగు సంక్షోభం కారణంగా పట్టణాలకు వలసలు పెరిగి, గ్రామాలు కళావిహీనమవుతున్నాయి!

పల్లెల రూపురేఖలు మారాలంటే ప్రభుత్వాలు ఇతోధికంగా నిధులను సమకూర్చుతూ అభివృద్ధి పనులను జోరెత్తించాలి. కానీ, అరకొర విదిలింపులతో గ్రామసీమల్లో దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయి. జగన్ జమానాలో ఏపీలో ఆర్థిక సంఘం నిధులనూ దారిమళ్లించిన నయవంచనల మూలంగా బ్లీచింగ్ పౌడర్ చల్లడానికీ డబ్బులేక పంచాయతీలు విలవిల్లాడాయి. పల్లెల వికాసాన్ని విస్మరించిన వైకాపా పుణ్యమా అని ఎక్కడ చూసినా గతుకుల రోడ్లు ప్రజలకు నరకం చూపించాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాబోయే రెండేళ్లలో అన్ని పల్లెలకు రోడ్లు, మంచి నీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. గ్రామీణులకు మేలిమి వైద్యసేవలు అందించే ధ్యేయంతో తెలంగాణ సర్కారు సమీప ఆసుపత్రులను ఉన్నతీకరిస్తోంది. కొత్తవీ నిర్మిస్తోంది. వీటితోపాటు సమగ్ర గ్రామీణాభివృద్ధికి తోడ్పాటునందించడంలో తెలుగు రాష్ట్రాలు పోటీపడాలి. పంచాయతీలు సొంత ఆదాయాన్ని సమకూర్చుకునేలా చేయూతనందించాలి.



సక్సెస్‌ఫుల్ కంపెనీలకు నాలుగు ప్రధాన లక్షణాలు ఉంటాయి. తమ బిజినెస్‌లో తాము నంబర్ వన్‌గా ఉండాలనుకుంటారు. అంతర్జాతీయ స్థాయి సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. సృజనాత్మక ప్రయోగాలు చేస్తారు. ఆర్థిక లాభాలపై ఫోకస్ పెడతారు.

– ఆనంద్ మహీంద్ర

లోక బాంధవుడు

గౌతమ బుద్ధుడి జీవితంలో పౌర్ణమికి ఒక ప్రత్యేకత ఉంది. బుద్ధుడి జననం, జ్ఞానోదయం, మహాపరినిర్వాణం... అన్నీ ఆరోజునే జరిగాయి. [illegible]

కపిలవస్తు గణ రాజ్యాధిపతి శుద్ధోదనుడికి, మహామాయకూ క్రీ.పూ. 563లో సిద్ధార్థుడు జన్మించాడు. [illegible]



అంతర్యామి

[illegible]

– వి.సుగుణ

ఏడాదంతా మామిడి విందులు... ఇలా సాధ్యమే!

భారత్ మామిడికి పుట్టిల్లు. మన వ్యవసాయ రంగంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. నాలుగు వేల ఏళ్లకు పైనుంచే ఇక్కడ మామిడి సాగవుతోంది. ఏటా దాదాపు 2.2 కోట్ల టన్నుల దిగుబడితో ఇండియా ప్రపంచ మామిడి ఉత్పత్తిలో సగానికి పైగా వాటాను కలిగి ఉంది. ఇందులో సుమారు 40 లక్షల టన్నుల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్, 10-12 లక్షల టన్నుల ఉత్పత్తితో తెలంగాణ మామిడి నిలయాలుగా వెలుగుతున్నాయి. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల నుంచి రాయలసీమ, ఉత్తర తెలంగాణ తోటలదాకా తెలుగు రైతులు మామిడి సాగును చేపడుతున్నారు. వేసవిలో రైతులు, వ్యాపారులకు ఈ పండ్లే ప్రధాన ఆదాయ వనరుగా మారుతున్నాయి.

గణాంకాలు ఎంత ఘనంగా ఉన్నా, ప్రపంచ మామిడి వాణిజ్యంలో ఇండియా వాటా ఒకశాతం కన్నా తక్కువే. మన మామిడి ఎగుమతుల విలువ ఏటా సుమారు 5-7 కోట్ల డాలర్లకు మించడం లేదు. ఇక్కడి పండ్లన్నీ దాదాపు స్థానికంగానే వినియోగమవడం, ఎగుమతులపై శ్రద్ధ పెట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో ఎగుమతులకు అనువైన బంగినపల్లి, తోతాపురి నుంచి స్థానికంగానే వినియోగమయ్యే రసాలు, హిమాయత్ (ఇమాం పసంద్) వరకు అనేక రకాలు సాగవుతున్నాయి. వీటికి భౌగోళిక గుర్తింపు కల్పించి, ప్రామాణీకరణ సాధించి, స్థిరంగా ఎగుమతులు చేస్తే వాణిజ్యం వృద్ధి చెందుతుంది. అయితే మామిడి పండ్లకు త్వరగా పాడైపోయే లక్షణం ఉంది. అవి ఒక నిర్దిష్ట సీజనులోనే లభ్యమవుతాయి. గాలి, వానలకు పూత, పండ్లు రాలిపోతుంటాయి. ఇటీవలి



కాలంలో అకాల వర్షాలు, ఉష్ణోగ్రతల్లో మార్పులతో కొన్ని సీజన్లలో 20-30శాతం వరకు దిగుబడి తగ్గింది. ఇలాంటి కారణాలతో మామిడి ధరల్లో 30-50శాతం దాకా హెచ్చుతగ్గులు వస్తుంటాయి. ఈ సమస్యలను నివారించడానికి స్మార్ట్ వాతావరణ విధానాలు ఉపకరిస్తాయి. వాతావరణ ఆధారిత సలహాలు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటివి రైతులకు సాయపడతాయి. అటువంటి వ్యవస్థలను రైతులకు సత్వరం అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

శీతల గిడ్డంగులు అవసరం

ఏ వ్యవసాయ వ్యవస్థలోనైనా, ఉత్పత్తిని పెంచడంకన్నా నష్టాలను తగ్గిస్తే వేగంగా ఫలితాలు వస్తాయి. కోత తరవాత సుమారు 15-20 శాతం మామిడి పండ్లు పాడవుతున్నాయని అంచనా. ఏపీ వంటి రాష్ట్రంలో కోత తరవాత జరిగే నష్టాలను కనీసం 10 శాతం తగ్గించగలిగితే ఏటా సుమారు నాలుగు లక్షల టన్నుల పండ్లను కాపాడుకోవచ్చు. ఇది రైతులకు అదనపు ఆదాయమే. ఇందుకోసం అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా పండ్ల కోత తరవాత శీతల గిడ్డంగుల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. వివిధ మార్కెట్ మార్గాలనూ అందుబాటులో తీసుకురావాలి. సరఫరా, డిమాండ్లను సమన్వయం చేసే సమాచార వ్యవస్థలను ఏర్పరచాలి. ఫలితంగా రైతులకు స్థిరమైన ఆదాయాలు లభిస్తాయి. వాతావరణ మార్పులు, తెగుళ్లు, మార్కెట్ ఒడుదొడుకుల వంటి అనిశ్చిత పరిస్థితులను అధిగమించడానికి ఇటీవలి సంవత్సరాల్లో అందుబాటులోకి వచ్చిన డిజిటల్, ప్రిసిషన్ సాంకేతికతలను వినియోగించాలి. డ్రోన్ల ద్వారా తెగుళ్ల మందుల పిచికారీ, నేలలో తేమను కొలిచే సెన్సర్లు, ఏఐ ఆధారిత సలహా వ్యవస్థల సాయంతో నష్టాలను 15-20 శాతం వరకు తగ్గించవచ్చు. తోటలో మామిడి దిగుబడి సమాచారాన్ని, మార్కెట్ సంకేతాలను అనుసంధానించడం ద్వారా ఆదాయ పెంపునకు అదృష్టంపై ఆధారపడకుండా శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఈ నూతన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నకొద్దీ, డ్రోన్ ఆపరేషన్లు, సప్లయి చైన్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆదాయాలను స్థిరపరచడానికి ప్రాసెసింగ్ కీలకం. చిత్తూరులో ఇప్పటికే మామిడి గుజ్జు పరిశ్రమ బలంగా వేళ్లూనుకుంది. తదుపరి దశ వైవిధ్యీకరణ, సొంత బ్రాండును నిర్మించుకోవడంలో ఉంది. దీంతోపాటు మామిడి పానీయాలు, తాండ్ర వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల వైపు దృష్టి సారించాలి. తద్వారా నిల్వ కాలాన్ని పెంచి, ఏడాది పొడవునా డిమాండ్ సృష్టించవచ్చు. మామిడి రంగంలో ఎంఎస్ఎంఈలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడం ద్వారా సమర్థమైన ప్రాసెసింగ్ వ్యవస్థను సృష్టించవచ్చు.

దీర్ఘకాల ప్రగతికి బాట

మామిడి సాగులో కౌలు రైతుల పాత్ర కీలకం. మామిడి తోటలను సీజనల్ ఒప్పందాలపై యజమానుల నుంచి కౌలుదారులు తీసుకుని సాగు చేస్తారు. వారికి అధిక లీజు భారంగా మారుతుంటుంది. సంస్థాగత రుణం, బీమా సౌకర్యాలు భూయాజమాన్యంతో ముడిపడి ఉండటం వల్ల కౌలు రైతులు వాటిని పొందలేకపోతున్నారు. మామిడి తోటలను లీజుకిచ్చే ఒప్పంద కాలవ్యవధిలో అనిశ్చితి కూడా సమస్యగా మారుతోంది. దీనివల్ల నేల ఆరోగ్యం, మామిడి చెట్ల నిర్వహణ, నీటిపారుదల వ్యవస్థల మెరుగుదల కోసం దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కౌలు రైతులకు సంస్థాగత మద్దతు, రుణాలు, బీమా సౌకర్యాలు కల్పించడం ద్వారా భూమి ఉత్పాదకతను పెంచవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో మామిడి ఇకపై కేవలం సీజనల్ పంటగా మిగిలిపోకూడదు. ఉత్పత్తి నుంచి మార్కెట్ అనుసంధానం వరకు విలువ ఆధారిత వ్యవస్థలను నిర్మించడం ద్వారా మామిడి సాగు, వినియోగం, ఎగుమతులు ఏడాది పొడవునా నడిచే ఆర్థిక ఇంజిన్‌గా అభివృద్ధి చేయాలి. విధానాలు, సాంకేతికత, ప్రాసెసింగ్‌ల మేలుకలయికతో ప్రయోజనాలు సిద్ధిస్తాయి. దీనివల్ల రైతులు వ్యాపారులు ఇచ్చే ధరలతో సరిపెట్టుకునే స్థాయి నుంచి పక్కా సమాచారంతో తామే ధరలను, మార్కెట్‌ను నిర్ణయించే స్థాయికి చేరుకుంటారు. నాణ్యత, స్థిరత్వం ద్వారా ప్రపంచ మార్కెట్లలో మనం విశ్వసనీయ సరఫరాదారులుగా ఎదగవచ్చు. ఇది కేవలం వ్యవసాయ వృద్ధికి మాత్రమే కాకుండా, విస్తృత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, తెలుగు రాష్ట్రాల్లో మామిడి పండే ప్రాంతాల దీర్ఘకాలిక ప్రగతికి బాటలు వేస్తుంది.



డాక్టర్ షేక్ ఎన్.మీరా
డైరెక్టర్, ఐకార్-అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

అమూల్యం... ఆ ఆత్మగౌరవం

నడక తడబడుతున్నా, చేతులు వణుకుతున్నా, ఎండా వానలను లెక్కచేయకుండా కొందరు వృద్ధులు పనులు చేస్తుంటారు. పేదరికం వల్ల తప్పనిసరై, బిడ్డలకు భారం కాకుండా తామూ ఒక చేయి వేయాలని... కష్టం చేయడానికి వాళ్లు రోడ్డెక్కుతారు. ఏవైనా వస్తువులు అమ్మడం, హస్తకళా రూపాలు తయారుచేయడం, పాటతోనో, వాద్యంతోనో అలరించడం చేస్తుంటారు. ప్రతిఫలంగానే తప్ప ఉచితంగా డబ్బు తీసుకోరు. సిగ్నళ్ల దగ్గర, బస్టాండుల్లో, రైల్వే స్టేషన్లలో ఇలాంటివారెందరో కనిపిస్తారు. కాకపోతే చూసేవారే తక్కువ. ఫోను తెరని తప్ప మరి దేన్నీ అంతగా పరిశీలించి చూసే అలవాటు తప్పిన ఈ రోజుల్లో ఆ ఫోన్ల ద్వారానే ఆ వృద్ధులకు తమ వంతు సాయం చేస్తున్నారు కొందరు. రియల్ హీరోస్ అంటూ సామాజిక మాధ్యమాల్లో వారు పంచుకుంటున్న ఫొటోలు, రీల్స్... మన సమాజం గురించి ఎన్నో విషయాలు చెబుతున్నాయి.




'ఐ డోంట్ వాంట్ టు బెగ్ - ప్లీజ్ బై మై పెన్స్' అంటూ ప్లకార్డు పట్టుకున్న వృద్ధురాలి ఆత్మగౌరవానికి నెటిజన్లు ఫిదా అయ్యారు. పుణెలో 'పెన్ ఆంటీ'గా పేరొందిన రతన్ బామ్మ కొన్నాళ్ల క్రితం సోషల్ మీడియాలో సెన్సేషన్ అయ్యింది. పెన్ను పది రూపాయలే అంటూ బోసినోటితో నవ్వుతున్న ఆమె ముఖం చూసి కొనకుండా ఎవరైనా ఉండగలరా? నిజామాబాద్ పాత బస్టాండ్ దగ్గర ఎండలో పూలు అమ్ముతూ ఎదురైన వృద్ధురాలిని చూసి ఓ యువకుడు జాలిపడ్డాడు. జేబులోంచి నోటు తీసి ఇవ్వబోయాడు. 'పూలు తీసుకో బాబూ.. అప్పుడే ఈ డబ్బులు నావి అవుతాయి' అంటూ దండం పెట్టిందామె. కరోనా లాక్‌డౌన్‌తో గిరాకీ లేక కన్నీళ్లు పెట్టుకున్న దిల్లీలోని ఓ చిన్న హోటల్ దంపతుల గాథ ఎందరినో చలింపజేసింది. మా దగ్గర భోజనం చేయండి బాబు.. అంటూ వీడియోలో ప్రాధేయపడటంతో వాళ్ల 'బాబా కా ధాబా' ముందు జనాలు క్యూ కట్టారు. ముంబయి రైళ్లలో చాక్లెట్లు, బిస్కెట్లు అమ్ముతున్న తొంభై ఏళ్ల తాతయ్య, సెరెబ్రల్ పాల్సీతో బాధపడుతూ కూడా తన కాళ్లపై తాను నిలబడాలని కొంగర్లు తిరిగిన వేళ్లతోనే వీడియో ఎడిటింగ్ చేస్తున్న ఇరవై రెండేళ్ల యువకుడు... ఇలాంటి ఎందరో ఏ రీల్‌లోనో కనబడతారు. స్వావలంబన, నిజాయతీలకు నిదర్శనాలుగా నిలుస్తారు.


ఉరుకులు పరుగుల జీవితంలో అందరిలా తలవంచుకుని ఫోను చూసుకుంటూ పోకుండా తలెత్తి చుట్టూ చూసిన యువతరానికి కనపడిన సమాజ ప్రతిబింబాలు పైన చెప్పిన వాళ్లు. వాళ్లను చూసి ఒక్క క్షణం 'అయ్యో పాపం' అని జాలిపడి, స్క్రోల్ చేస్తూ మరుక్షణంలో మర్చిపోయేవారు ఎందరో. ఆత్మగౌరవంతో బతికే ప్రయత్నం చేస్తున్నందుకు అబ్బురపడి మరొకరికి షేర్ చేసేవారు కొందరు. ఇంకొందరుంటారు... వాళ్ల వివరాలు తెలుసుకుని చేతనైన ఆర్థిక సాయం చేసి, మౌనంగా తమ పని తాము చూసుకుంటారు. వాళ్లది ఆత్మగౌరవం. వీళ్లది మానవీయ హృదయం. ఇద్దరికీ జోహార్లు చెప్పడం మన కనీస కర్తవ్యం.

– గోపయ్య మాడుగుల

వాణిజ్య వృద్ధికి...

ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడానికి, స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించడానికి, అంతర్జాతీయంగా పరపతిని పెంచుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య భాగస్వామ్యాల విస్తరణకు ఇండియా ప్రాధాన్యమిస్తోంది. ఆ క్రమంలోనే గడచిన కొన్నేళ్లలో 38 సంపన్న దేశాలతో ముడిపడిన తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంది. తాజాగా న్యూజిలాండ్‌తోనూ ఎఫ్‌టీఏ ముడిపడింది. దీని కింద భారతీయ ఎగుమతులకు అక్కడ వందశాతం సుంకాల మినహాయింపు లభిస్తుంది. గడచిన పదేళ్లలో భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్య విలువ (కోట్ల డాలర్లలో)...





(ఆధారం: కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నివేదిక)

నిత్య సవాళ్లలో గిగ్ బతుకులు

వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల ద్వారా తాత్కాలిక ఉపాధి పొందుతున్న గిగ్ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వీరికి స్థిరమైన ఆదాయం, ఉద్యోగ భద్రత, ఇతర ప్రయోజనాలు లభించడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా చట్టాలు చేసినా పూర్తిస్థాయిలో ఫలితం కనిపించడం లేదు.

దేశవ్యాప్తంగా 2020-21లో 77 లక్షల మంది గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులు ఉన్నట్లు నీతిఆయోగ్ వెల్లడించింది. ఆ సంఖ్య 2026-27 నాటికి 1.62 కోట్లు, 2027-28కి 1.84, 2028-29కి 2.08, 2029-30 నాటికి 2.35 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఈ ఏడాది మార్చి నాటికి 8.89 లక్షల మంది ప్లాట్‌ఫాం వర్కర్లు వివరాలు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుడు సామాజిక భద్రత కోడ్-2020ను అమల్లోకి తీసుకొచ్చింది. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు మేలు జరిగేలా అందులో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఆధార్ అనుసంధానిత విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించడంతోపాటు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు పొందేలా వెసులుబాటు కల్పించింది. అగ్రిగేటర్లు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం సామాజిక భద్రత నిధికి కేటాయించాలని స్పష్టం చేసింది. ఆ నిధితో కార్మికులకు పని భద్రత కల్పించడంతోపాటు భవిష్య నిధి, ఈఎస్ఐ, ఆరోగ్య, ప్రమాద బీమా, వృద్ధాప్య రక్షణ ఇతర ప్రయోజనాలు అందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. దీంతో పాటు గిగ్ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం జాతీయ సామాజిక భద్రత బోర్డును ఏర్పాటు చేసేలా నియమావళి రూపొందించింది.

సంక్షేమం కరవై...

గిగ్ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం చేసిన తొలి రాష్ట్రం రాజస్థాన్. అయితే, 2023లో బిల్లును ఆమోదించినా ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. వర్కర్ల నమోదు ప్రక్రియను కొలిక్కి తెచ్చి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా నిధుల వినియోగం, అగ్రిగేటర్ల నుంచి వసూలు చేయాల్సిన సంక్షేమ ఫీజు(సెస్) విషయంలో స్పష్టత లేకపోవడం వంటి అంశాల్లో జాప్యం జరుగుతోంది. బిహార్‌లోనూ నిరుడు చట్టం చేసినా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. కర్ణాటకలో ప్రతి లావాదేవీపై 1-5శాతం సంక్షేమ రుసుముగా చెల్లించాలని, ఆ భారం మళ్లీ కార్మికులపై మోపకూడదని పేర్కొన్నారు. దీనివల్ల డెలివరీ ఛార్జీలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఝార్ఖండ్ ప్రభుత్వం వివరాల సేకరణ, ప్రయోజనాలు కల్పించే విషయంలో వేగంగా ముందుకు సాగుతున్నా, కార్మికులు పనిచేసే సమయం, దూరాన్ని బట్టి కనీస వేతనం నిర్ణయించే విషయంలో చిక్కులు ఎదురవుతున్నాయి. మరోవైపు, సెస్‌పై కొన్ని కంపెనీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.





తెలంగాణ ప్రభుత్వం ఇటీవల 'గిగ్‌వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమం' బిల్లును ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక చట్టం చేయకున్నా, గిగ్‌వర్కర్లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. దిల్లీ, మహారాష్ట్రల్లో ఈ ప్రక్రియ ముసాయిదా రూపొందించే దశకే పరిమితమైంది. మిగిలిన రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు తమకు అండగా నిలవాలని గిగ్ వర్కర్లు పోరాడుతున్నారు.

చిత్తశుద్ధితో కృషి చేస్తేనే...

గిగ్ కార్మికులకు అండగా నిలిచేలా చట్టాల రూపకల్పన, అమలుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ముందుగా వర్కర్ల వర్గీకరణ విషయంలో కొన్ని రాష్ట్రాలు ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. గిగ్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములయ్యే కార్మికులను సంస్థలు ఒప్పంద ప్రాతిపదికన నియమించుకుంటాయి. పీఎఫ్, ఈఎస్ఐ తదితర ప్రయోజనాలు కల్పించాల్సి ఉండటం వల్ల వారిని ఉద్యోగులుగా పరిగణించవు. మరోవైపు ప్రత్యేక చట్టాలు చేసిన చోట కార్యాచరణ ప్రణాళికలు, విధి విధానాలు సిద్ధం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. బోర్డులు ఏర్పాటు చేసినా, సంక్షేమ నిధికి డబ్బులు ఎలా తీసుకురావాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అగ్రిగేటర్లకు ఎక్కువగా సెస్ విధిస్తే వినియోగదారులపై భారం పడటంతో పాటు కంపెనీలు పెట్టుబడులు తగ్గించుకునే ప్రమాదం ఉందనే కోణంలో రాష్ట్రాలు ఆలోచిస్తున్నాయి. కొన్ని కంపెనీలు వారి దగ్గర పనిచేస్తున్న కార్మికుల వివరాలను ప్రభుత్వానికి ఇచ్చేందుకే సుముఖత వ్యక్తం చేయట్లేదు. ఇప్పటికీ సగానికిపైగా రాష్ట్రాల్లో ప్రాథమిక సమాచారమూ లేకపోవడం గమనార్హం. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప సవాళ్లను అధిగమించడం సాధ్యం కాదని నిపుణులు సూచిస్తున్నారు. సామాజిక భద్రత కోడ్-2020ను దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేయగలిగితే రాష్ట్రాలు ప్రత్యేకంగా చట్టాలు చేయాల్సిన అవసరం ఉండదని భావిస్తున్నారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తేనే గిగ్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతోపాటు, యువత కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది.

– ర్యాలి హేమంత్ కుమార్

కొత్త ఆవిష్కరణ

హాయ్! బుజ్జీ!!

శంతన రాజ్యాన్ని దేవేంద్రుడు పాలిస్తున్నాడు. రాజ్యాభివృద్ధికి కొత్త ఆవిష్కరణలను ఆహ్వానించాడు. దానికి సంబంధించిన ఆలోచనలు చెప్పడానికి ఆరు నెలల సమయం ఇచ్చాడు. విజేతగా నిలిచిన వారికి బహుమతులిస్తానని ప్రకటించాడు. చూస్తుండగానే అర్నెల్లు గడిచిపోయాయి. తమ ఆలోచనలు తెలపడానికి రాజ్యం నలుమూలల నుంచి చాలామంది వచ్చారు. భటులు ఒక్కొక్కరిని లోపలికి పంపిస్తున్నారు. దాదాపుగా అందరూ పెద్దపెద్ద ఆవిష్కరణలతో వచ్చారు. కానీ ఇద్దరు మాత్రం ఖాళీ చేతులతో వచ్చారు. వారిలో ఒక వ్యక్తిని రాజ మందిరంలోనికి పంపారు. అక్కడికి వెళ్లాక జేబులోంచి కొన్ని మూలికలు తీసి.. 'మహారాజా! వీటిని జలాశయంలో కలిపితే, నీరంతా విషపూరితం అవుతుంది. వాటిని తాగిన వాళ్లంతా బుద్ధిహీనులుగా మారతారు. దీన్ని పొరుగు రాజ్యాలపై ప్రయోగించవచ్చు. కారణాలను తెలుసుకునేలోపు మనం యుద్ధం చేసి, ఆ రాజ్యాన్ని సొంతం చేసుకోవచ్చు' అని చెప్పాడు. తరవాత రెండో వ్యక్తి కూడా.. 'మహారాజా! మా ముత్తాతల నాటి తాళపత్ర గ్రంథాలను పరిశోధించి కొండాకోనలు గాలించి, ఈ మూలికలు తయారుచేశాను. వీటిని చెరువులు, బావులు లాంటి నీటి వనరుల్లో వేస్తే, అందులోని మలినాలన్నీ పోతాయి. నీరంతా శుభ్రమవుతుంది. దాంతో కొంతవరకైనా ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారు' అన్నాడు. అదంతా విన్న మంత్రి.. 'మొదటి వ్యక్తి చెప్పిందేదో బాగుంది. పక్క రాజ్యం కూడా మనదైపోతే, అప్పుడు మనదే పెద్ద రాజ్యం అవుతుంది' అన్నాడు. 'ఈ స్థాయిలో ఉండి, అలాంటి దుర్మార్గపు ఆలోచనలు చేయడం తప్పు. పరిశోధనలన్నీ మంచి చేస్తాయని అనుకోవడానికి లేదని వీళ్లిద్దరినీ చూస్తే అర్థమవుతుంది. రెండో వ్యక్తి చెప్పింది ఆచరించండి. అలాగే మొదటి వ్యక్తిని కోటలోనే ఉంచి, పక్క రాజ్యాలకు వెళ్లి తన మూలికల గురించి చెప్పకుండా కనిపెడుతూ ఉండండి' అని ఆదేశించాడు మహారాజు.



– గుడిపూడి రాధికారాణి

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. ☐☐☐కు ☐☐☐ కల.
2. ఇంటి ☐☐కు ☐☐☐ భయం.
3. ☐☐ మీద ☐☐☐ వేసినట్లు.

[illegible]

జగన్ అయితే అల్‌ఖైదా వద్దకు పంపేవారు

- అభివృద్ధిపై అధ్యయనానికే మంత్రులను చంద్రబాబు సింగపూర్ పంపారు
- ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: అభివృద్ధిపై అధ్యయనం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను సింగపూర్ పంపించారని, మాజీ సీఎం జగన్ అయితే.. రాష్ట్రంలో విధ్వంసం కోసం అల్‌ఖైదా దగ్గరకు పంపేవారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. ఇంకా కాదంటే మెక్సికోకు పంపుతారని అన్నారు. చంద్రబాబు అభివృద్ధి అంటే, జగన్ విధ్వంసం అంటారని, వారిద్దరి మధ్య తేడా అదేనని కేశవ్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ అభివృద్ధి జరిగినా అక్కడికి వెళ్లి నేర్చుకునేందుకు మంత్రులను చంద్రబాబు పంపుతారని అన్నారు. మంత్రివర్గ సమావేశం అనంతరం గురువారం సచివాలయంలో మంత్రి కేశవ్ విలేకర్లతో మాట్లాడారు. 'ప్రతిపక్షం గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. వారి సొంత ప్రయోజనాలపై తప్పితే సమాజం, ప్రజల అభివృద్ధి, రాష్ట్రాభివృద్ధిపై వైకాపా మాట్లాడే పరిస్థితి లేదు. పరిశ్రమలను తరిమేస్తారు, అభివృద్ధిని అడ్డుకుంటారు' అని మంత్రి మండిపడ్డారు.

ఆటవిడుపు కోసం వెళ్లలేదు

'మంత్రులు రిలాక్స్ అవడానికి సింగపూర్ పర్యటనకు వెళ్లలేదు. వివిధ అంశాలపై అధ్యయనానికి వెళ్లారు. వెళ్లొచ్చిన మంత్రుల్లో ఒకరిద్దరు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. విడివిడిగా, అంతా కలిసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. సింగపూర్‌లో అడుగు పెట్టినప్పటి నుంచే అధ్యయనం మొదలైంది. రోజూ ఉదయం 6.40కి బయలుదేరి రాత్రి 9 గంటలకు హోటల్‌కు తిరిగి వచ్చేవారు. మొదటి ఐదురోజుల శిక్షణ, అధ్యయనం చాలా బాగా జరిగిందని చెబుతున్నారు. విదేశీ పర్యటనకు మంత్రులు వెళ్లారంటే దానివల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనం, కొత్తగా అంశాలపై కచ్చితంగా అధ్యయనం చేస్తారు. ఇలాంటి యాత్రలకు ఏ శాఖ మంత్రులైనా వెళ్లొచ్చు. అన్ని విషయాలూ నేర్చుకోవాలి కదా! సింగపూర్ పర్యటన ద్వారా రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను మనం త్వరలో చూస్తాం' అని కేశవ్ వివరించారు.

రాజధాని నిర్మాణానికి ఖర్చు తక్కువే

'దేశంలోని ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో చేస్తున్న నిర్మాణాలతో పోలిస్తే రాజధాని అమరావతి నిర్మాణ పనులకు రూపాయి తక్కువే ఖర్చు చేస్తున్నాం. ధర చెల్లింపు, పనుల్లో నాణ్యత విషయంలో అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం. ఇదే విషయాన్ని పురపాలకశాఖ మంత్రి నారాయణ అనేక సందర్భాల్లో చెప్పారు. అవసరమైతే మరోసారి వివరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో నిర్వహించే పనులకు బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకే మొదటి ప్రాధాన్య మిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయంపై ప్రధానమైన మూడు కాంట్రాక్టు సంఘాలు కృతజ్ఞతలు కూడా తెలిపాయి. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలన్నీ చెల్లించాం' అని మంత్రి కేశవ్ స్పష్టం చేశారు.

రాష్ట్రానికి రూ.1,399 కోట్ల నిధులు

- 'నరేగా', గ్రామీణ జీవనోపాధి మిషన్‌లలో విడుదల

ఈనాడు, దిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ.1,399 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో 2025-26 ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ బకాయిల కింద రూ.1,123 కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరం పరిపాలన ఖర్చుల కింద రూ.69 కోట్లు, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద రూ.207 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ విడుదల చేసింది. ఈ నిధులతో ఉపాధిహామీ పథకం మెటీరియల్, పరిపాలనా వ్యవహారాల బకాయిలు చెల్లించాలని రాష్ట్రానికి సూచించింది. మొదట పాత బకాయిల చెల్లింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించింది. కేంద్రం ఒకేసారి రాష్ట్రానికి పెద్దమొత్తంలో నిధులను విడుదల చేయడం పట్ల ఆ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

పదోన్నతులపై వెంటనే చర్యలు తీసుకోవాలి

- వాణిజ్య పన్నులశాఖ ప్రధానాధికారికి ప్రభుత్వం ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని అన్ని క్యాడర్ల పదోన్నతులకు సంబంధించి మే 4లోగా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ ఆదేశించారు. ఇది అత్యవసరంగా చేయాల్సిన పనిగా పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబుకు లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ పదోన్నతి కేసు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధానకార్యదర్శి దాఖలుచేసిన పిటిషన్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఆయన ఈ ఆదేశాలు జారీచేశారు. అన్ని ప్రభుత్వశాఖల్లోనూ మే 4 లోపు పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేయాలని ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ ఇచ్చిన ఆదేశాలనూ ఇందులో ప్రస్తావించారు. వాణిజ్యపన్నులశాఖ ప్రధాన కమిషనర్ అహ్మద్ బాబు వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆ శాఖ కార్యాలయాల్లో రెండో రోజు గురువారమూ ఆందోళనలు కొనసాగాయి.

72 మంది ఇంక్రిమెంట్ల కోత

2022లో వాణిజ్యపన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీస్ అసోసియేషన్ చేసిన ధర్నాలో పాల్గొన్న 72 మంది ఇంక్రిమెంట్‌లో కోత విధిస్తూ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ అధికారులు గురువారం ఆదేశాలు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారంటూ అప్పట్లో సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై విచారణ అధికారిని నియమించారు. ఆ అధికారి నివేదిక ఇవ్వనందుకు నిరసనగా ధర్నా చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న వారిపై విచారణ చేసి 72 మందిపై చర్యలు తీసుకోవాలని అధికారులు నివేదిక ఇచ్చారు. మరోవైపు 'ఈ సర్వీస్ అసోసియేషన్ గుర్తింపు రద్దు చేస్తామంటూ అప్పటి ప్రభుత్వం నోటీసు ఇచ్చింది. దీనిపై హైకోర్టులో సంఘం నాయకుడు సూర్యనారాయణ స్టే తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ నోటీసును ప్రభుత్వం ఉపసంహరించుకుంది. నోటీసును ప్రభుత్వం ఉపసంహరించుకున్నా ధర్నాలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకున్నారు' అని సర్వీసు అసోసియేషన్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గుంటూరు పోలీసుల అదుపులో పూడి శ్రీహరి

- కుప్పం కోర్టు ఆదేశాలతో బెయిల్
- వెంటనే అదుపులోకి తీసుకుని గుంటూరు తరలించిన పోలీసులు
- మార్ఫింగ్ ఫొటోలతో సీఎంపై దుష్ప్రచారం కేసు



శ్రీహరిని అదుపులోకి తీసుకుంటున్నట్లు పత్రాలపై సంతకం తీసుకుంటున్న పోలీసులు

ఈనాడు-చిత్తూరు, న్యూస్‌టుడే-కుప్పం పట్టణం: ముఖ్యమంత్రి చంద్రబాబు హత్యారాజకీయాలు చేస్తున్నారంటూ ఆయన ఫొటోను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసిన కేసులో వైకాపా మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి, జగన్ సీఎంగా ఉన్నప్పుడు సీపీఆర్వోగా పనిచేసిన పూడి శ్రీహరికి చిత్తూరు జిల్లా కుప్పం మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వరుణ్‌తేజ్ గురువారం బెయిల్ మంజూరుచేశారు. గురువారం ఉదయం శ్రీహరిని పోలీసులు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న అనంతరం మేజిస్ట్రేట్ శ్రీహరికి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని ఆదేశించారు.

దీంతో కుప్పం పోలీసులు ఆయన్ను అర్బన్ స్టేషన్‌కు తరలించి బీఎన్ఎస్ 35సీ(3) నోటీసులు ఇచ్చారు. అయితే ముఖ్యమంత్రిపై దుష్ప్రచారానికి పాల్పడ్డారంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన గుంటూరు కొత్తపేట పోలీసులు శ్రీహరిని అదుపులోకి తీసుకునేందుకు అప్పటికే కుప్పం చేరుకున్నారు. అలా అదుపులోకి తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమని శ్రీహరి తరఫు న్యాయవాదులు, వైకాపా నేతలు పోలీసులతో వాదించారు. తామే ఆయనను అప్పగిస్తామన్నారు. అలా కుదరదంటూ గుంటూరు పోలీసులు శ్రీహరిని అదుపులోకి తీసుకుని, రోడ్డు మార్గంలో గుంటూరుకు తరలించారు.

అంతటా ఉత్కంఠ

బుధవారం ఉదయం కుప్పం అర్బన్ పోలీసులు శ్రీహరిని అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి స్టేషన్ వద్దకు వైకాపా శ్రేణులు, న్యాయవాదులు చేరుకున్నారు. గురువారం ఉదయం వరకు అక్కడే ఉన్నారు. బెయిల్ వచ్చినా పోలీసులు అరెస్టు చేస్తారనే ప్రచారం జరగడంతో న్యాయస్థానం వద్దకూ వచ్చారు. దాంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి, కోర్టు ప్రాంగణం నుంచి వారిని పంపారు. ఇదే సమయంలో గుంటూరు, తిరుపతి జిల్లాలతోపాటు మరికొన్ని జిల్లాల పోలీసులూ అక్కడికి చేరుకున్నారు. ఈ పరిణామాలతో కుప్పంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

కేసులు కొట్టేయాలంటూ హైకోర్టులో శ్రీహరి పిటిషన్లు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేసిన వ్యవహారంలో గుంటూరు జిల్లా నల్లపాడు, గుంటూరు- కొత్తపేట పోలీసులు తనపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ పూడి శ్రీహరి గురువారం హైకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని అందులో పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ఆసక్తి

ఈనాడు, అమరావతి: నంద్యాల జిల్లాలో రక్షణ రంగానికి అవసరమైన పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటుతో పాటు కర్నూలు విమానాశ్రయంలో ఎంఆర్‌ఓ, సిమ్యులేషన్ సెంటర్ల ఏర్పాటుకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ గ్రూప్ ఆసక్తి వ్యక్తం చేసింది. ఆ సంస్థ ప్రతినిధులు మంత్రి టీజీ జనార్దన్‌రెడ్డిని సచివాలయంలో గురువారం కలిసి ప్రతిపాదనపై చర్చించారు. ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మైనింగ్, ట్రేడింగ్ లాంటి రంగాల్లో తమ అనుభవాన్ని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు.

వేసవి సెలవుల్లోపు 'స్థానిక' ఎన్నికలు నిర్వహించబోం

- హైకోర్టుకు నివేదించిన ఏజీ
- ప్రజాహిత వ్యాజ్యాలపై విచారణ జులైకి వాయిదా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకాన్ని పూర్తిచేశామని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో బీసీ సామాజిక స్థితిగతులపై జరుగుతున్న సర్వే పూర్తయ్యేందుకు మరో నెల పడుతుంది. సర్వే వివరాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఏకసభ్య కమిషన్ నిర్ణయిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొంత సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబోం' అని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రజాహిత వ్యాజ్యాల విచారణను జులై మొదటి వారానికి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. బీసీ జనగణన చేపట్టకుండా రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించబోతున్నారని, ఈ విషయంలో ముందుకెళ్లకుండా ప్రభుత్వాన్ని నిలువరించాలని కోరుతూ ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు 2025లో హైకోర్టులో పిల్ వేశారు. బీసీ జనాభాను లెక్కించి తదనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేసి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మరోవైపు న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేస్తూ 13,325 గ్రామపంచాయతీలకు, 123 పట్టణ స్థానిక సంస్థలకు పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కేశన శంకరరావు తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. బీసీ జనగణన, వారి స్థితిగతులపై ఏ సంస్థ సర్వే చేస్తోందో తమకు సమాచారం లేదన్నారు. బీసీ జనాభా లెక్కలు తేల్చకుండా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు యత్నిస్తోందన్నారు.

కవిత పార్టీ.. 'తెలంగాణ రక్షణ సేన'!

ఈనాడు, హైదరాబాద్: మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) పరిగణనలోకి తీసుకుంది. 'తెలంగాణ ప్రజా జాగృతి'.. 'తెలంగాణ జాగృతి'.. 'తెలంగాణ రక్షణ సేన'.. 'తెలంగాణ రాష్ట్ర జాగృతి'.. 'తెలంగాణ ప్రజాశక్తి'.. ఈ ఐదు పేర్లను తాను స్థాపించనున్న కొత్త పార్టీ కోసం కవిత.. ఈసీఐకి ప్రతిపాదించారు. దీనిపై ఎన్నికల సంఘం తాజాగా స్పందించింది. "మీరు ప్రతిపాదించిన ఐదు పేర్లలో 'తెలంగాణ రక్షణ సేన'ను పరిగణనలోకి తీసుకున్నాం. ఈ పేరుతో వార్తా పత్రికల్లో పబ్లిక్ నోటీసు ఇవ్వడానికి అనుమతిస్తున్నాం. 30 రోజుల్లోగా దీనిపై అభ్యంతరాలు, స్పందనలను స్వీకరిస్తాం. వాటన్నింటినీ పరిశీలించిన అనంతరం పార్టీ పేరుపై తుది నిర్ణయం వెల్లడిస్తాం" అని ఈసీఐ.. కవితకు పంపించిన తాజా లేఖలో పేర్కొంది.

రామాలయం నిర్మాణానికి రైట్ రైట్

- శంకుస్థాపన అడ్డుకోవాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలో రామాలయం శంకుస్థాపనను అడ్డుకోవాలన్న పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. రామాలయం నిర్మాణానికి అన్ని అనుమతులూ ఉన్నాయని, ఈ నేపథ్యంలో మే 3న తలపెట్టిన భూమిపూజ కార్యక్రమాన్ని కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాజ్యం ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అంగీకరిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులిచ్చారు. ఆకివీడు పెదపేటలోని సర్వే నంబరు 470/12లోని ప్రభుత్వ భూమిలో కొందరు రామాలయం నిర్మాణాన్ని చేపట్టబోతున్నారని, అడ్డుకునేలా అధికారులను ఆదేశించాలంటూ ఆకివీడు పెదపేటకు చెందిన వి.జ్యోష్నదేవి, లిఖిత, ప్రాంచన అనే మహిళలు ఇటీవల హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే.

ఈ నెల 4న లాసెట్

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో మే 4న ఏపీ లాసెట్-2026 నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ, సెట్ ఛైర్‌పర్సన్ ఆచార్య ఉమా వెన్నం గురువారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లోని వంద కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు గంటన్నర ముందే కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని చెప్పారు.

ఉద్యోగం రాదేమోనని ఆందోళన..
అమెరికాలో కర్నూలు యువకుడి ఆత్మహత్య


ఇరగనబోయిన వంశీ

ఈనాడు, కర్నూలు: ఉద్యోగం రాదేమోనన్న ఆందోళనతో రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు అమెరికాలో ఆత్మహత్య చేసుకున్నారు. కర్నూలుకు చెందిన ఇరగనబోయిన వంశీ (26).. పీజీ కోసం గోల్డెన్ డీపాల్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తిచేశారు. ప్రస్తుతం అమెరికాలో మారిన పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగం రాకపోవడం, కుటుంబ సభ్యులపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో ఆయన తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఏప్రిల్ 28న అపార్ట్‌మెంట్ గదిలో పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి తండ్రి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తండ్రి కష్టాన్ని చూసిన చందు.. బాగా చదువుకుని అమెరికాలో ఎంఎస్ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. యువకుడి ఆత్మహత్య విషయం తెలుసుకున్న తానా టీం స్క్వేర్ కోఆర్డినేటర్ చిరంజీవి గల్లా.. మృతదేహాన్ని కర్నూలు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏసీబీ జేడీ సుప్రజ ఆకస్మిక బదిలీ

ఈనాడు, అమరావతి: ఏసీబీ ప్రధాన కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి సుప్రజను రాష్ట్రప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. ఆమెను అనంతపురం పీటీసీ ప్రిన్సిపల్‌గా బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు.

అదానీకి దోచిపెడుతున్నారు: సీపీఎం

విజయవాడ (రామవరప్పాడు), కృష్ణలంక, న్యూస్‌టుడే: విశాఖలో గూగుల్ డేటాసెంటర్ పేరుతో అదానీకి ప్రభుత్వం రూ.వేల కోట్లు దోచిపెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఆయన విజయవాడలో మాట్లాడారు.

'నీట్'గా రాసేయండి

- ఈ నెల 3న నీట్ యూజీ పరీక్షలు
- అరగంట ముందే పరీక్ష కేంద్రాల గేట్లు మూసేస్తారు.. ఈలోగా చేరుకోవాల్సిందే
- రాష్ట్రం నుంచి పరీక్ష రాయనున్న 45 వేల మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల్లో అసౌకర్యాలపై తల్లిదండ్రుల్లో ఆందోళన
- అన్ని ఏర్పాట్లు చేశామంటున్న అధికారులు

ఈనాడు, అమరావతి: వైద్యవిద్యలో ప్రవేశానికి రాయాల్సిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు యంత్రాంగం సిద్ధమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 3న (ఆదివారం) జరగనున్న ఈ కీలక పరీక్షలకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసింది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు... గత అనుభవాల దృష్ట్యా సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కొరత విద్యార్థుల ఏకాగ్రతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని భయపడుతున్నారు. సంతకాల సేకరణ, ఫొటో ప్రదర్శన లాంటి ముందస్తు ప్రక్రియలను పరీక్ష 3 గంటల సమయంలోనే నిర్వహిస్తే... విద్యార్థులకు సమయం వృథాయై, ఏకాగ్రత దెబ్బతింటుందని వాపోతున్నారు. గదుల్లో గోడ గడియారాలు లేకపోతే సమయ పాలనలో ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. కీలకమైన ఈ పరీక్షను విద్యార్థులు ఏకాగ్రతతో ప్రశాంతంగా రాసేలా అధికారులు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



180 కేంద్రాలు..

దేశవ్యాప్తంగా గతేడాది 21 లక్షల మంది నీట్ రాస్తే.. ఈసారి 22.80 లక్షల మంది రాయనున్నారు. ఏపీలో 180 కేంద్రాల్లో 45వేల మంది వరకు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర కోఆర్డినేటర్లు, సిటీ కోఆర్డినేటర్లు, పరిశీలకులు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, బయోమెట్రిక్, సీసీ కెమెరాలు, తనిఖీ సిబ్బంది, సహాయకులు, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. వారికి శిక్షణలు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఇక ఆదివారం విద్యార్థులు పరీక్షలు రాయడమే మిగిలింది.

కేంద్రాల్లో జనరేటర్లు, గడియారాలు

✦ ప్రతి కేంద్రంలో జనరేటర్ సౌకర్యం.
✦ వేసవి దృష్ట్యా ఫ్యాన్లు, లైట్లు, చల్లని తాగునీరు, వైద్య సిబ్బంది, ఇతర వసతులు.
✦ ప్రతి గదిలో గోడ గడియారం, అభ్యర్థులను అప్రమత్తం చేసేలా అలారమ్ వ్యవస్థ.
✦ ప్రతి 12 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ పర్యవేక్షణ.

బయోమెట్రిక్ పేరుతో ఇబ్బంది పెట్టొద్దు: ఎన్టీఏ

✦ పరీక్ష రాసే మూడు గంటల సమయంలో బయోమెట్రిక్ కోసం అభ్యర్థులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని ఎన్టీఏ పరీక్షల డైరెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ✦ అభ్యర్థి పరీక్ష గదిలోకి ప్రవేశించడానికి ముందే తప్పనిసరిగా బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తిచేయాలి. ✦ ఒకవేళ పరికరాలు పనిచేయకపోయినా, సర్వర్ మొరాయించినా, ఇతర సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తికాకపోయినా అభ్యర్థిని పరీక్ష గదిలోకి అనుమతించాలి. ✦ అభ్యర్థుల నుంచి హామీపత్రం తీసుకోవాలి. ఈ హామీపత్రం నమూనా కూడా పరీక్ష కేంద్రాల వద్ద ఉంచాలి.

ప్రతి నిమిషమూ కీలకమే..

✦ నీట్ ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. ✦ పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో ఉదయం 11 నుంచి 1.30 గంటలలోపు చేరుకోవాలి. ✦ 1.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసేస్తారు. ఈలోగా కేంద్రానికి చేరుకోలేకపోతే పరీక్ష రాసే వీలుండదు. ✦ ఉదయం 11 నుంచి 1.40 గంట వరకు అడ్మిట్ కార్డు, గుర్తింపు కార్డు పరిశీలన. మధ్యాహ్నం 1.40 గంటలకు పరీక్ష గదుల్లోకి ప్రవేశం. ✦ 1.40 నుంచి 1.50 వరకు పరీక్ష గదిలో రెండోసారి ఇన్విజిలేటర్లు తనిఖీ. ✦ 1.50 గంటలకు పరీక్ష బుక్‌లెట్లు అభ్యర్థులకు అందజేత. ✦ 1.50 నుంచి 1.55 గంటల వరకు బుక్‌లెట్ కవర్ పేజీ, ఓఎంఆర్ షీట్‌పై అభ్యర్థుల వివరాలు రాసుకునే అవకాశం.

ఈశ్వర్‌కిరణ్‌తో వ్యాపార లావాదేవీలున్నాయి

- వాటికి, మద్యం రవాణా కాంట్రాక్టుకు సంబంధం లేదు
- సిట్ విచారణలో రాజ్ కెసిరెడ్డి బుకాయింపు
- ఏపీబీసీఎల్ అధికారులే కీలకం.. వారినే ప్రశ్నించాలంటూ ఎదురుదాడి

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టుల్లో రూ.200 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకూ దోచుకున్న వ్యవహారంలో నిందితుడైన టి.ఈశ్వర్‌కిరణ్‌కుమార్‌రెడ్డితో తనకు ఆర్థిక లావాదేవీలు, వ్యాపార సంబంధాలున్నాయని ఈ కేసులో కీలక నిందితుడైన రాజ్ కెసిరెడ్డి సిట్ విచారణలో అంగీకరించినట్లు సమాచారం. అయితే ఆ లావాదేవీలకు, మద్యం రవాణా కాంట్రాక్టుకు ఎలాంటి సంబంధమూ లేదని బుకాయించినట్లు తెలిసింది. అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ అధికారులే ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులని, వారినే ప్రశ్నించాలని సూచించినట్లు తెలిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు రాజ్ కెసిరెడ్డి.. గురువారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాదాపు 5 గంటలపాటు ఆయన్ను అధికారులు విచారించారు. 100కు పైగా ప్రశ్నలు అడిగినా వాటన్నింటికీ దాటవేత ధోరణిలోనే ఆయన సమాధానాలిచ్చారు.

✦ 'జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ద్వారా ఖరారయ్యే మద్యం రవాణా కాంట్రాక్టును రాష్ట్ర స్థాయిలో ఎందుకు కేంద్రీకృతం చేశారు' అని అడగ్గా ఆ నిర్ణయాలతో తనకేం సంబంధమని రాజ్ కెసిరెడ్డి ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం.

✦ మీ ఆదేశాలతోనే ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు మద్యం రవాణా కాంట్రాక్టును రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృతం చేశారు కదా! అని అడగ్గా.. తానేమీ అలాంటి ఆదేశాలివ్వలేదని చెప్పినట్లు తెలిసింది.

✦ రాష్ట్ర స్థాయిలో కాంట్రాక్టు దక్కించుకున్న సిగ్మా లాజిస్టిక్స్‌ను తెర వెనక నుంచి మీరే నడిపించారా అని అడగ్గా.. ఆ సంస్థ తనది కాదని జవాబిచ్చినట్లు తెలిసింది.

✦ ఒక్కో మద్యం కేసు రవాణా వ్యయాన్ని రూ.13 నుంచి రూ.34కు పెంచుతూ ఎందుకు కాంట్రాక్టు కట్టబెట్టారని అడగ్గా.. అవన్నీ ఏపీఎస్‌బీసీఎల్ అధికారులనే అడగాలని సమాధానమిచ్చినట్లు సమాచారం. ✦ ఈ నెల 4న మరోసారి విచారణకు రావాలంటూ సిట్ అధికారులు రాజ్ కెసిరెడ్డికి నోటీసులిచ్చారు.

విజయవాడ న్యాయాధికారి తప్పనిసరి పదవీ విరమణకు సిఫారసు

ఉత్తర్వులు జారీచేసిన న్యాయశాఖ

ఈనాడు, అమరావతి: హైకోర్టు నుంచి అందిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని విజయవాడ 14వ అదనపు డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి కమ్ కుటుంబ న్యాయస్థానం అదనపు జడ్జి షేక్ ఇంతియాజ్ అహ్మద్‌ను 2025 ఆగస్టు 31 నాటికి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో తప్పనిసరి పదవీ విరమణకు సిఫారసు చేస్తూ న్యాయశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆయన పూర్వ పనితీరును సమీక్షించిందని, సర్వీసులో కొనసాగించడానికి ఆయన సరిపోరని ఉత్తర్వుల్లో పేర్కొంది. న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

18 నెలల పాపను గోడకేసి కొట్టి.. హత్య

చిన్నారి ప్రాణాలను హరించిన వివాహేతర బంధం


చిన్నారి హర్షిత


నిందితుడు వంశీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమె ప్రేమవివాహం చేసుకుంది.. ఓ బాబు, పాపకు జన్మనిచ్చింది. తర్వాత భర్త స్నేహితుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త, అత్తమామలకు తెలియకుండా సహజీవనం చేసే స్థాయికి వెళ్లింది. ఈ వివాహేతర బంధమే తన పద్దెనిమిది నెలల పాపను బలితీసుకుంది. ఆమెతో మనస్పర్థలు రావడంతో వివాహేతర సంబంధంలో ఉన్న యువకుడు ఆ చిన్నారిని గోడకేసి బలంగా కొట్టడంతో ప్రాణాలు విడిచింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ వాంబే కాలనీకి చెందిన మహిళకు గన్నవరానికి చెందిన వ్యక్తితో ఐదేళ్ల కిందట ప్రేమవివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల బాబు, 18 నెలల పాప ఉన్నారు. ఈ క్రమంలో ఆమెకు భర్త స్నేహితుడైన వంశీతో వివాహేతర బంధం ఏర్పడింది. దీంతో పుట్టింటికి వెళ్తున్నాననే సాకుతో.. విజయవాడ గాంధీనగర్‌లో ఓ అద్దె ఇంట్లో వంశీతో కలిసి సహజీవనం చేసేది. ఈ క్రమంలో ఆమె తన కుమార్తె హర్షితతో కలిసి వంశీ వద్దకు వెళ్లింది. బుధవారం వారిమధ్య మనస్పర్థలు తలెత్తాయి. మాటామాటా పెరిగి కోపంతో చిన్నారిని వంశీ బలంగా గోడకేసి కొట్టాడు. దీంతో హర్షిత అక్కడికక్కడే మృతిచెందింది. భయాందోళనకు గురైన ఆ మహిళ అత్తమామలకు ఫోన్ చేసి హర్షిత నాడి కొట్టుకోవడం లేదని.. అనంతరం చనిపోయిందని చెప్పింది. అనుమానించిన అత్తింటివారు ఆమె గురించి ఆరాతీసి.. చివరికి వంశీతో సహా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివాహేతర సంబంధానికి చిన్నారి అడ్డొస్తుందనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు, కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. నిందితుడు వంశీ గతంలో పోక్సో కేసులో రెండు నెలలు జైలులో ఉన్నాడని, ఇతడిపై మరికొన్ని కేసులూ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇండ్ భారత్ కేసులో రఘురామ సహా ఐదుగురికి బెయిల్

ఈనాడు, దిల్లీ: ఇండ్ భారత్ కమొడిటీస్ లిమిటెడ్‌పై సీబీఐ నమోదు చేసిన కేసులో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు, జాలాది రవీంద్రనాథ్, బీఎస్ చక్రవర్తి, సంతోష్‌కుమార్ బాజ్‌పేయి, ఎస్వీ రెడ్డెప్పలకు ఇక్కడి రౌస్ అవెన్యూ సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు కావడం, దర్యాప్తు సమయంలో వీరెవ్వరినీ అరెస్టు చేయలేదని పేర్కొనడం వల్ల ప్రస్తుతం కోర్టు ముందు హాజరైన వీరందరికీ బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి నేహ మిత్తల్ గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిందితులకు ఇచ్చిన ఛార్జిషీట్ 15 వేల పేజీలు ఉన్నందున వాటిని పరిశీలించడానికి కనీసం 2నెలల సమయమైనా ఇవ్వాలని వారి తరఫు న్యాయవాది కోరడంతో న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను జులై ఆరుకు వాయిదా వేశారు.

వాసుదేవరెడ్డికి ఎదురుదెబ్బ

ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేసిన న్యాయస్థానం

ఈనాడు, అమరావతి: మద్యం రవాణా కాంట్రాక్టు కుంభకోణం కేసులో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని దాఖలుచేసిన పిటిషన్ విజయవాడలోని ఏడో ఏడీజే కోర్టు డిస్మిస్ చేసింది. గత వారం రెండువర్గాల వాదనలు పూర్తి కాగా.. గురువారం వాసుదేవరెడ్డి పిటిషన్‌ను తోసిపుచ్చుతూ న్యాయాధికారి తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఇటీవల వాసుదేవరెడ్డికి బెయిల్ వచ్చింది. ఈ నేపథ్యంలో అరెస్టు కాకుండా ఉండేందుకు పిటిషన్ వేశారు. డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరకు రవాణా చేసే కాంట్రాక్టును కేంద్రీకృతం చేసి.. వైకాపా నేతలకు అనుకూలంగా మార్చడంలో నాటి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించారని.. సిట్ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. దీనివల్ల రూ.200 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు రవాణా కాంట్రాక్టు ద్వారా కొల్లగొట్టారన్నారు. కేసు ఇంకా విచారణలో ఉండగా నిందితుడికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని కోరారు.

సోలోగానే ఉంటారట..!



అమ్మాయిలు బాగా చదువుకోవాలి... కానీ పెళ్లయ్యాక కెరియర్ మాట ఎత్తకూడదు. ఆర్థిక స్థిరత్వం ఉండాలి... కానీ సొంత ఖాతా ఉండకూడదు. పొదుపు, మదుపు విషయాల్లో నోరెత్తకూడదు. స్వతంత్ర భావాలుండాలి... కానీ నలుగురిలో నోరు తెరిచి తప్పొప్పులు చెప్పకూడదు. వృత్తిపరంగా ఉన్నత స్థానాల్ని అధిరోహించాలి... అదే సమయంలో కుటుంబానికి అవసరం ఉన్నప్పుడల్లా అందుబాటులో ఉండాలి. రోజులో పన్నెండు గంటలు పనిచేసి ఇంటికి వచ్చినా... పదమూడో గంట నుంచి ఇల్లు, పిల్లల బాధ్యతను తీసుకోవాలి. మొత్తానికి అమ్మాయిలంటే అభ్యుదయ, ఆదర్శ భావాలుండాలి. కానీ పెళ్లి చేసుకున్నాక తమకు, కుటుంబానికి తగినట్లు తనని తాను మార్చుకోవాలి. ఇదే భావన ఇప్పటి అబ్బాయిల్లో. సహచరుల్లో, స్నేహితుల్లో అభ్యుదయ భావాలున్న అమ్మాయిల్ని చూసి సంతోషపడతారు. గర్వంగా భావిస్తారు కానీ, భార్య మాత్రం తమకు అనుకూలంగానే ఉండాలి. ఈ కారణంవల్లే సింగిల్‌గా ఉండటానికే ప్రాధాన్యం ఇస్తున్నారట నేటితరం అమ్మాయిలు. యూనివర్సిటీ ఆఫ్ టొరంటో, మోర్గాన్ స్టాన్లీ ఇటీవల ప్రచురించిన అధ్యయనాల్లో వెల్లడైన విషయమిది. పైగా, ఇలా ఉంటున్న వాళ్లలో 32శాతం మంది అమ్మాయిలు సంతోషంగా, ఒత్తిడీ, ఆందోళనలకు దూరంగా ఉన్నట్లు చెబుతున్నారట. అంతేకాదు, 2035 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 50శాతం మంది అమ్మాయిలు సింగిల్‌గా ఉండటానికే ప్రాధాన్యం ఇస్తారని చెబుతున్నాయీ అధ్యయనాలు. ఇప్పటికైనా పాత పద్ధతులు, సంప్రదాయాలు, ఆడపిల్ల ఇలానే ఉండాలనే అంతరాలు చెరగకపోతే... దాంపత్య జీవనమే ప్రశ్నార్థకమవుతుందని గగ్గోలు పెడుతున్నారు నిపుణులు.

వెల్లుల్లి పొట్టు సులువుగా వచ్చేస్తుంది...



కూరల్లోకీ, అల్లం వెల్లుల్లి పేస్ట్ చేయడానికీ, ఆవకాయ వంటి పచ్చళ్లు పట్టేందుకు వెల్లుల్లి అవసరం. కానీ, వాటిని ఒలవడం మాత్రం చాలా కష్టం. మీదీ ఇదే పరిస్థితా? అయితే, మీకోసమే ఈ చిట్కాలు.

- **వేడి నీళ్లలో...** వెల్లుల్లి రెబ్బలను వేణ్నీళ్లలో వేసి 15 నిమిషాల పాటు నాననివ్వండి. ఇలా నీటిలో నానడం వల్ల వెల్లుల్లి పొట్టు మెత్తబడి సులువుగా ఊడిపోతుంది. ఆపై తడి లేకుండా ఆరనిచ్చి వాడుకోవచ్చు.
- **షేక్ చేసి...** ఓ డబ్బాలో చిన్న రాయిన్ వేసి అందులో వెల్లుల్లి రెబ్బలను వేసి వేగంగా ఊపండి. ఇలా చేయడం వల్ల కలిగే ఘర్షణకు పొట్టు దానంతట అదే విడిపోతుంది. ఇది పెద్ద మొత్తంలో వెల్లుల్లి ఒలవడానికి ఉత్తమ మార్గం.
- **ఎండలో పెడితే...** వెల్లుల్లి రెబ్బలకి నూనె రాయండి. వాటికి గుప్పెడు ఉప్పు కలిపి ఓ మూడు గంటలు ఎండనివ్వండి. ఆపై వాటిని మెత్తటి కాటన్ వస్త్రంలోకి తీసుకుని ముడివేసి... నెమ్మదిగా నేలకేసి కొడితే సరి. పొట్టు రాలిపోతుంది.
- **మైక్రోవేవ్‌లోనూ:** వెల్లుల్లి పాయలను మైక్రోవేవ్‌లో 15 నుండి 20 సెకన్ల పాటు వేడి చేయండి. లోపల ఉండే తేమ పోయి పొట్టు వదులైపోతుంది. బయటకు తీశాక రెబ్బలను నొక్కితే పొట్టు త్వరగా వచ్చేస్తుంది. ఇవి కాకుండా మార్కెట్లోకి వెల్లుల్లి పొట్టు తీసే పీలర్‌లూ వచ్చేశాయి. మీ అవసరానికి తగ్గట్లు చూసి ఎంచుకోవడమే తరువాయి.

చిత్రగుప్తుడు చిట్టా రాస్తాడు!



శిఖా గోయల్... పరిచయం అక్కర్లేని ఐపీఎస్ ఆఫీసర్. ఉగ్రవాదం, నక్సలిజం, ఫ్యాక్షనిజం... దేనికీ భయపడలేదు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, సహానుభూతులతో అన్నింటినీ తిప్పికొట్టారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీపీగా రాణించారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ బ్యూరో డైరెక్టర్, సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్... ఇలా పలు హోదాల్లో కొనసాగుతున్నారు. రాష్ట్రపతి విశిష్ట, ప్రశంసనీయ పోలీస్ పతకాలు ఆమె కర్తవ్య దీక్షకి ప్రతీకలు. తాజాగా తెలంగాణ హోంశాఖ తొలి మహిళా ముఖ్య కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా 'వసుంధర' ఆమెను పలకరించింది.

మాది దిల్లీ. మధ్యతరగతి కుటుంబం. కుటుంబసభ్యుల ప్రేమానురాగాల మధ్య సురక్షితంగా పెరిగాను. నాన్న వ్యవసాయ పరిశోధనా సంస్థలో సైంటిస్ట్. అమ్మ గృహిణి. మేం నలుగురం. ఇద్దరు అన్నలు, ఒక సోదరి. సినిమాటిక్ కష్టాలేమీ లేవు. ఇంట్రావర్ట్‌ని కావడంతో నన్ను నేను అర్థం చేసుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం... ఇవే అప్పట్లో నాకున్న అతిపెద్ద సవాళ్లు.

తొమ్మిదో తరగతి వరకూ సాధారణ విద్యార్థినే. పదో తరగతిలో శ్రద్ధగా చదివి, జాతీయస్థాయిలో టాప్ 100లో నిలిచా. అప్పుడే అర్థమైంది... కష్టపడితే ఏదైనా సాధ్యమేనని. నామీద అమ్మమ్మ ప్రభావం ఎక్కువ. ఆమెది సహారన్‌పుర్‌లోని సంప్రదాయ కుటుంబం. మాలో ఒకరైనా సివిల్ సర్వెంట్ కావాలన్నది ఆమె కోరిక. అన్నయ్య యూపీఎస్సీ సాధించడంతో నా అడుగులూ అటు పడ్డాయి. దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బోటనీలో ఎం.ఫిల్ చేశా. సివిల్స్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ రాసి రెండూ సాధించా. ముందు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరా కానీ లోపల ఏదో వెలితి. సాధించాల్సింది ఇది కాదనిపించి, ఐపీఎస్‌లో చేరాను. నిజానికి పోలీస్ అన్నది నా వ్యక్తిత్వానికి విరుద్ధం. కానీ ఛాలెంజింగ్‌గా జీవించాలన్న కోరికతోనే కంఫర్ట్‌జోన్ నుంచి బయటకు వచ్చా. పోలీస్ అయితే ప్రజలకు నేరుగా సేవ చేయొచ్చు, రాత్రికి రాత్రి వ్యవస్థల్ని మార్చాలని అనుకోలేదు కానీ వాళ్ల జీవితాల్లో చిన్న మార్పు తేవచ్చు అని నమ్మా. కష్టంలో ఉన్నప్పుడే కదా వాళ్లు పోలీసుల దగ్గరకు వచ్చేది... ముందు వాళ్లు చెప్పేది విని, సమస్య పరిష్కరిస్తే చాలు అనిపించింది. అందుకే ఈ వృత్తిని ఎంచుకున్నా. క్లిష్టమైన కేసుల్ని శోధించినప్పుడూ బాధితుల ముఖంలో ఆనందం కనిపించినప్పుడూ... ఆనాటి నా ఆలోచన సరైనదే అని చాలాసార్లు అనుకున్నా.

అదే... నాకు నచ్చేది!

ఏఎస్పీగా ఉన్న కొత్తలో ఒక పెద్ద ప్రమాదం జరిగింది. మృతదేహాలను బయటకు తీసి గుర్తించాల్సిన క్లిష్ట పరిస్థితి. ఆ దృశ్యం కలిచివేసింది. కానీ, ఇన్‌ఛార్జ్ ఆఫీసర్‌గా నేనే భయపడితే టీమ్ ఏం చేస్తుంది? అందుకే మనసు రాయి చేసుకుని ముందుండి పర్యవేక్షించాను. క్లిష్ట సమయాల్లో ధైర్యంగా నిలబడటమే నాయకత్వం అని ఆరోజు అర్థమైంది. నాలో నాకు నచ్చే గుణం ఇదే. అప్పటినుంచి దేనికీ వెనకాడలేదు. నిజానికి నా తొలి పోస్టింగ్ జమ్మూకశ్మీర్‌లో. అక్కడ ఎస్సై ర్యాంక్ ఆఫీసర్‌ని ఎస్పీ ర్యాంక్‌లో ఉన్న వ్యక్తి హత్య చేయించిన విషయాన్ని వెలికితీసి శిక్ష పడేలా చేయగలిగా. ఆ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఒత్తిడిని ఎలా?

వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అనేది ఓ మిథ్య ఈ వృత్తిలో అసలే సాధ్యం కాదు. నేనేమీ సూపర్ ఉమన్‌ని కాదు, అలా ఉండాలనీ అనుకోను. నాకూ ఒత్తిడి ఉంటుంది. అప్పుడు కాస్త విరామం తీసుకుంటా. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, పిల్లలతో సమయం గడపడం ద్వారా మళ్లీ మామూలు అవుతాను. మాకో అమ్మాయి, అబ్బాయి. రోజూ ఒక్కసారైనా వాళ్లను హగ్ చేసుకుంటా. ఆ కొద్ది సెకన్లతో ఒత్తిడి చాలా తగ్గుతుంది. ఇంట్లో చేసిన ఆహారమే ఇష్టం. కుటుంబసభ్యుల సహకారం వల్లే నేనీ స్థాయికి రాగలిగా. తీరిక దొరికితే ఓటీటీలో క్రైమ్ సిరీస్, బాలీవుడ్ మూవీస్‌నీ చూస్తా. 'ఆనంద్' సినిమాలో 'జీవితం గొప్పగా ఉండాలి కానీ సుదీర్ఘంగా ఉండాల్సిన అవసరం లేదు' అన్న రాజేష్‌ఖన్నా డైలాగ్‌ని బాగా గుర్తుపెట్టుకున్నా. అలాగే మనం చేసే తప్పుల్ని పైనున్న చిత్రగుప్తుడు చిట్టా రాస్తాడనీ విశ్వసిస్తా.



టీ-సేఫ్ పుట్టింది ఆ రాత్రి నుంచే...

నా కాలేజీ రోజుల్లో... ఓసారి రైలు ఆలస్యం కావడంతో తెల్లవారుజామున మూడు గంటలకు స్టేషన్‌లో దిగాల్సి వచ్చింది. ఎప్పుడూ నాన్న, అన్న... ఎవరో ఒకరు వస్తారు. ఆ రోజెందుకో కుదరలేదు. ఒంటరిగా ఆటోలో ప్రయాణించిన ఆ 55 నిమిషాల్ని అస్సలు మర్చిపోను. ఆ భయం, ఆందోళన మరే అమ్మాయి పడకూడదన్న ఆలోచనలోంచి వచ్చినదే టీ-సేఫ్. దీన్ని యాప్ అనీ అనలేం. అందరికీ స్మార్ట్‌ఫోనే ఉండదు కదా. మామూలు ఫోన్‌తోనూ ఉపయోగించేలా చేశాం. 100కి డయల్ చేసి 8 నొక్కితే చాలు... ఎక్కడికి వెళ్లేదీ ట్రాక్ చేయడంవల్ల సురక్షితంగా ప్రయాణిస్తారు.

మాది ప్రేమ వివాహం!

మా వారు విజయ్‌కుమార్, ఐపీఎస్. దిల్లీలో పరిచయం. ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. ఆయన ఏపీ క్యాడర్ కావడంతో తరవాత నేనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి మారా. రాజమండ్రిలో పోస్టింగ్... అక్కడ లిక్కర్ దందా నడిచేది. అస్సలు దొరికేవారు కాదు. దాన్ని చేదించగలిగా. తరవాత మెదక్‌లో నక్సలిజం, రాయలసీమలో ఫ్యాక్షనిజం తగ్గించేందుకు నా వంతుగా శ్రమించా. కర్నూలులో ఉన్నప్పుడు మహిళల్ని కలిసి ఈ గొడవల వల్ల జరిగే నష్టం పట్ల కొంత అవగాహన తీసుకొచ్చా. పోలీసులంటే సినిమాల్లో మాదిరి లాఠీలతో కొడతారు అనుకుంటారు. కానీ మేధస్సునే ఎక్కువగా వాడాలి. అప్పుడే నేరాల్ని అరికట్టగలం.

పురుషాధిక్య రంగంలో...

పోలీస్ రంగంలోనూ మహిళలకు సవాళ్లెన్నో. పైగా మహిళల సంఖ్య తక్కువ. అందుకే సమాజం, యంత్రాంగం వాళ్లను నిశితంగా గమనిస్తుంటాయి. రోజూ నిరూపించుకోవాలి. పనితోనే సమాధానం చెప్పాలని ముందే గ్రహించా. విశ్వసనీయత, గౌరవం అనేవి హోదా నుంచి కన్నా పనితీరు, జవాబుదారీతనం నుంచే వస్తాయి. విమెన్ సేఫ్టీ వింగ్‌లోని విమెన్ ఆన్ వీల్స్, షీ టీమ్స్, భరోసా కార్యక్రమాల ద్వారా మహిళలకు, పిల్లలకు రక్షణ కల్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తా. తర్వాత సైబర్ సెక్యూరిటీ విభాగంలో పౌరులను డిజిటల్ నేరాల నుంచి రక్షించే బాధ్యతల్లో నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నా.

పోలీసు కావాలనుకుంటే...

ముందు మీపై మీకు నమ్మకం ఉండాలి. సవాళ్లను స్వీకరించండి. కంఫర్ట్ జోన్ నుంచి బయటకొస్తేనే ఎదుగుదల. వర్తమానంపై దృష్టి పెట్టండి. సామర్థ్యాలను పెంచుకోండి. అవకాశాలు వచ్చినప్పుడు వదులుకోవద్దు. గుర్తింపు కోసం ఎదురుచూడొద్దు. పనికి తగ్గ గుర్తింపు రానప్పుడు మీకోసం మీరు మాట్లాడండి. నేర్చుకోవడం ఆపొద్దు. నేనూ అదే చేస్తా. ప్రతి ఒక్కరి నుంచీ నేర్చుకునేందుకు ప్రయత్నిస్తా. మరొకటి గుర్తుపెట్టుకోండి. మహిళా ఐపీఎస్ అన్నది మైండ్‌లోకి రానివ్వొద్దు. ఐపీఎస్ అంతే.

ముంజలతో మేలెంతో..!



తాటిముంజలు... వేసవిలో మాత్రమే దొరికే ఇవి దాదాపు తొంభైశాతం నీటితో నిండి ఉంటాయి. పిల్లలు, పెద్దలు ఏ వయసు వారికైనా మేలు చేస్తాయి. ఫైబర్, విటమిన్ ఎ, కె పుష్కలంగా ఉంటాయి. సహజ ఎలక్ట్రోలైట్స్‌గానూ పని చేస్తాయి. దాంతో డీహైడ్రేషన్ ఎదురుకాదు. ముంజల్లో పొటాషియం అధికంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకాదు, శరీరంలోని వ్యర్థాల్ని తొలగించడంలోనూ సాయపడతాయి. వీటిల్లోని పీచు పదార్థాలు జీవక్రియను మెరుగుపరుస్తాయి. మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. అజీర్తి, గ్యాస్ సమస్యలకు చెక్ పెడతాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు ఇమ్యూనిటీని పెంచుతాయి. తక్కువ కెలోరీలు ఉండటం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునేవాళ్లకి ఇవి చక్కని ఎంపిక. గర్భిణులకు అవసరమయ్యే విటమిన్లు, ఖనిజాలు దీనిలో ఎక్కువ. దీంతో ఈ సమయంలో వచ్చే ఒత్తిడి, అలసట, వికారం, వాంతుల్ని తగ్గించడంలోనూ ఇవి సాయపడతాయి. గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి మధుమేహులు వీటిని తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అంతేకాదు, వీటిని మెత్తని పేస్టులా చేసి ముఖానికి పట్టిస్తే చర్మానికి తేమ అంది కాంతిమంతంగా కనిపిస్తుంది. మొటిమల వల్ల వచ్చే మచ్చలూ, చెమటకాయల్ని దూరం చేస్తాయివి.

లుక్‌ని 'కట్టి' వేస్తున్నాయ్!



ఉత్తరాదిన 'టైమ్‌లెస్ ఫ్యాషన్ ఏది' అని అడిగి చూడండి... లెహెంగా అన్న మాట తప్పక వినపడుతుంది. అవును మరి... సంప్రదాయమైనా, ఆధునిక వేడుకైనా సందర్భానికి తగ్గట్టుగా లుక్‌ని మార్చుకుని సిద్ధమైపోతుందీ ఫ్యాషన్. కాబట్టే కదా... మన అమ్మాయిలూ అక్కున చేర్చుకున్నారు. వేసుకుని మురిసిపోతున్నారు. ఒకప్పుడు పెళ్లయినా, వేడుకైనా వధువు, ముఖ్యమైన వ్యక్తికే ఎక్కువ ఖర్చు. మరి ఇప్పుడు? ప్రధాన వేడుక చుట్టూ చిట్టి వేడుకలు చాలానే. వాటికి తగ్గట్టుగా మనమూ షాపింగ్ చేయాల్సిందే. భిన్నంగా కనిపించడం, ఒక్కో లుక్‌తో మెరిసిపోవడం వరకూ బాగానే ఉంటుంది. తరవాతే చిక్కు! ఆ డ్రెస్సుల్ని ఏం చేయాలి? ఒకసారి వేస్తే మరోదానికి వేయడానికి ఇష్టపడట్లేదు నేటి తరం అమ్మాయిలు. అంటే అవన్నీ వార్డ్‌రోబ్‌కే పరిమితం అన్నమాట. ఆ చిక్కు గమనించారో... వృథాని అరికట్టాలని అనుకున్నారో కానీ డిజైనర్లూ మల్టీపర్పస్ మీద దృష్టిపెడుతున్నారు. అలా వచ్చినవే ఈ లెహెంగాలు. సాదా లెహెంగాకి కోర్సెట్ లేదా బ్లౌజ్‌ని జత చేస్తున్నారు. దీన్ని తలమీదుగా తగిలించుకుని ఇరువైపులా దారాలతో కట్టేయడమే. ఇండో- వెస్ట్రన్ లుక్‌తో ఆకట్టుకోవడం ఖాయం. మెహందీ, సంగీత్‌లకి చక్కని ఎంపికలా లేదూ? కాస్త సంప్రదాయంగా కనిపించాలనుకోండి... కోట్‌ని తీసేసి చున్నీని జత చేసుకుంటే సరి. కాస్త లాంగ్ టాప్‌తో రోజువారీ దుస్తుల్లానూ పార్టీవేర్‌గానూ ప్రయత్నించొచ్చు. ఆలోచన బాగుంది కదూ! ఈసారి వేడుకకి ఈ తరహావి తెచ్చుకోండి మరి. లుక్‌తో ఆకట్టుకోవచ్చు. ఒక్కసారి వేసి పక్కన పెట్టామే అన్న గిల్టీనెస్ కూడా ఉండదు. ఏమంటారు?





బంగారం - వెండి



30న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,54,580	1,39,800	2,46,949
విజయవాడ	1,48,215	1,38,100	2,46,000
ప్రొద్దుటూరు	1,51,000	1,38,920	2,45,000
రాజమహేంద్రవరం	1,50,660	1,38,100	2,60,000
విశాఖపట్నం	1,60,190	1,40,000	2,44,000
తమిళనాడు	----	1,41,000	2,70,000

వసుంధర

vasundhara@eenadu.in

ఓర్పును నేర్పుదాం!

సెలవుల్లో ఇలా!



ఎండలు మండిపోతున్నాయి. స్కూల్ బెల్ ఆగిపోయింది, పుస్తకాల సంచీ మూలనపడింది. మరి ఈ రెండు నెలల సమయాన్ని కేవలం టీవీలకో, స్మార్ట్‌ఫోన్లకో అంకితం చేసేయొద్దు. ఈ వేసవిని పిల్లలకు 'లైఫ్ స్కిల్' వర్క్‌షాప్ సమయంగా మార్చేయండి.

పిల్లలకి వంటింట్లో చిన్న చిన్న పనులు అప్పగించండి. చిన్నపిల్లలు వాళ్లేం చేయగలరు అని కొట్టిపారేయకండి. మిగిలిన ఆహారాన్ని వేరే గిన్నెల్లోకి తీసిపెట్టడం, కూరగాయల్ని కడగడం, అవసరమైన సరకుల డబ్బాలు తెచ్చివ్వడం, పప్పులు, ధాన్యాల్లో పుచ్చులు ఏరడం వంటివన్నీ వాళ్లలో ఏకాగ్రతను పెంచుతాయి. పోషకాహారంపై అవగాహన పెరుగుతుంది. ఎంతో శ్రమిస్తేనే కానీ, నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లవనే విషయం అర్థమవుతుంది. ఆహారం విలువ తెలుస్తుంది. అంతేకాదు, వంటింటి వ్యర్థాలను ఎరువుగా ఎలా మార్చవచ్చో కూడా ప్రాక్టికల్‌గా వాళ్లతో చేయించండి. ఏదీ వృథా కాదనీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎంతో అవసరమనీ కూడా నేర్పిస్తుంది. పెరట్లో మొక్కలకు నీళ్లు పోయడం, మట్టిని తవ్వడం వంటి పనులు పిల్లల్లో ప్రకృతి పట్ల ప్రేమని పెంచుతాయి. ఒక విత్తనం నాటినప్పుడు, అది మొలకెత్తే వరకు వారు చూపే నిరీక్షణ వారిలో 'ఓర్పును' నేర్పుతుంది. పైగా పచ్చని మొక్కల మధ్య గడిపే సమయం వారి కళ్లకూ మనసుకూ ఎంతో ఉల్లాసాన్నిస్తుంది. ఇలా నేర్చుకున్న ప్రతి నైపుణ్యం... రేపటి వారి విజయానికి ఒక మెట్టు.

ఏమిటీ వాపు?

నాకు రెండూ సాధారణ ప్రసవాలే. రెండోసారి ప్రసవమయ్యాక నాభి వద్ద వాపు కనిపిస్తోంది. నొప్పి ఏమీలేదు. కానీ నా స్నేహితురాలికీ ఇలాగే జరిగిందట. కాకపోతే తనకి నొప్పి ఉండేదట. అందుకని తనకి మందులు వాడమన్నారు. నా పరిస్థితేంటి? నేనూ మందులు వాడాలా? సర్జరీ ఏమైనా అవసరమా? - ఓ సోదరి

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

ప్రసవమయ్యాక వాపు వచ్చిందన్నారు. కాబట్టి, చాలావరకూ అంబ్లికల్ హెర్నియా అయ్యుండొచ్చు. ప్రెగ్నెన్సీ సమయంలో పొట్ట సాగుతుంది. ప్రసవమయ్యాక పొట్ట సాధారణ స్థితికి వచ్చినా... కండరాల్లో మార్పుల వల్ల కొందరిలో ఇది బయటపడుతుంది. దీనికి సర్జరీ అవసరమా లేదా అన్నది సంబంధిత వ్యక్తిలో లక్షణాలు, ఆ వాపు పరిమాణం బట్టి ఆధారపడి ఉంటుంది. మీ స్నేహితురాలికి నొప్పి ఉంది కాబట్టి, మందులు ఇచ్చి ఉండొచ్చు. దానితోనూ తగ్గకపోతే సర్జరీని చేయించుకోమంటారు. అయితే ప్రతి ఒక్కరికీ సర్జరీ అవసరమని చెప్పలేం. కొందరిలో ఆ ఉబ్బులోకి కొవ్వు చేరడం, పేగులు అతుక్కోవడం వంటి సమస్యలుంటాయి. అలాంటి పరిస్థితుల్లో నొప్పి ఉన్నా, ఎబ్బెట్టుగా కనిపిస్తున్నా సర్జరీ చేస్తుంటారు. నిజానికి కొన్ని వ్యాయామాలు చేసి, పొట్టను తగ్గించుకున్నా ఇదీ తగ్గిపోయే అవకాశాలుంటాయి. మరికొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ కారణంగా ఇలా ఉబ్బుగా వచ్చే అవకాశాలూ లేకపోలేదు. దాన్ని చెక్ చేయించుకోవాల్సి ఉంటుంది. కాబట్టి, ముందు మీ సమస్యకు కారణమేంటో నిర్ధరించుకోండి. దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటే మేలు.

కార్మిక శక్తిలో మహిళ ఎక్కడ?

నేడు మేడే



కేంద్ర గణాంక శాఖ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' ప్రకారం మార్చి, 2026 నాటికి మొత్తం శ్రామిక శక్తి(56)కోట్లలో మహిళల భాగస్వామ్యం 34.4 శాతం. ఇదే సమయంలో పురుషుల భాగస్వామ్యం 55.4 శాతంగా ఉంది.

- మహిళల భాగస్వామ్యం గ్రామాల్లో 38.9 శాతం ఉండగా, పట్టణాల్లో 25.2 శాతంగా ఉంది.
- ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగంలో మహిళా ఉద్యోగులు 40 శాతం. స్టెమ్ రంగాల్లోనూ 40 శాతం కాగా, బ్యాంకింగ్ రంగంలో మాత్రం 22 శాతం ఉన్నారు.
- 85 శాతం గ్రామీణ మహిళలు వ్యవసాయంలో పనిచేస్తున్నారు.
- మహిళలు రోజులో 363 నిమిషాలను వేతనంలేని పనులకు కేటాయిస్తారు. ఈ పనుల కోసం పురుషులు కేటాయించేది 123 నిమిషాలు.
- 2026 ఆర్థిక సర్వే ప్రకారం- 2050 నాటికి కార్మిక శక్తిలో మహిళా భాగస్వామ్యం 55 శాతానికి పెరుగుతుంది.

మురికివాడల్లో చదువు చెబుతూ...

పదో తరగతి ఫెయిల్... మురికివాడలో జీవనం... పేదరికంతో అడుగడుగునా కష్టాలు, అవమానాలే. చదువులేక తొమ్మిది రూపాయలకే ఉద్యోగం... తరచి చూస్తే 'సఖీ గర్ల్ ఫర్ ఎడ్యుకేషన్' ఎన్‌జీవో మొదలుపెట్టి స్లమ్ గర్ల్స్‌ని చదివిస్తున్నారు ఆర్తీ నాయక్. తన కష్టాల్నే విజయానికి సోపానాలుగా మార్చుకున్న ఆమె కథేంటంటే..





ముంబయి ములుండ్ మురికివాడలో పుట్టి పెరిగారు ఆర్తీ నాయక్. తండ్రి దినసరి కూలీ. పేదరికం వల్ల సరైన విద్యా వసతులు లేక పదోతరగతి ఫెయిల్ అయ్యారీమె. అక్కడితో ఆమె చదువు ఆగిపోయింది అనుకున్నారు ఆ ఏరియా వాళ్లంతా. కానీ, పట్టుదలతో చదివి సోషియాలజీలో డిగ్రీ పట్టా అందుకున్నారు ఆర్తి. ఇందుకు ఆమె పడిన కష్టాలు చాలానే. మళ్లీ తిరిగి చదువుకోవడానికి డబ్బుకోసం రోజు కూలీగా మారారు. రూ.9 కూలీకి ఇంట్లోనే గిల్టు నగలు తయారుచేసేవారు. పరీక్ష ఫీజు కోసం మూడు సంవత్సరాలు డబ్బుని కూడబెట్టి పదోతరగతి పాస్ అయ్యానంటారీమె.

అందుకే... సఖీ ఫర్ గర్ల్స్ ఎడ్యుకేషన్

'నాకెదురైన అనుభవాలు మురికివాడలో ఏ అమ్మాయికీ రాకూడదనుకున్నా. ఎందుకంటే స్లమ్ ఏరియాల్లో ఉండే తల్లిదండ్రులకు చదువుపై అంత అవగాహన ఉండదు. దాంతో పిల్లల చదువుల్ని పట్టించుకోరు. అందునా అమ్మాయిలు చదువుకుంటానంటే ఆర్థిక భారంగానే చూస్తారు. దాంతో ఇక్కడ ఆడపిల్ల చదువు ప్రాథమిక దశలోనే ఆగిపోతుంది. అమ్మాయిల కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి. నేను ఫెయిల్ అయినప్పుడు వెన్ను తట్టి ధైర్యం చెప్పడానికి ఒక్కరూ లేరు. తర్వాత ఏం చేయాలి? ఎలా చదవాలి? ఇవేవీ నాకు తెలీదు. దాంతో మూడేళ్లు చదువుకి దూరం అయ్యా. ఒక విద్యార్థికి ఇదే కీలక దశ. ఇంకెవరికీ ఇలా అవ్వొద్దు అనుకున్నా. అందుకే 'సఖీ ఫర్ గర్ల్స్ ఎడ్యుకేషన్' మొదలుపెట్టా. ఇందులో ఫెయిల్ అయిన, చదువుతున్న వాళ్లకి కలిపి పాఠాలు చెప్పేదాన్ని. మొదట్లో తల్లిదండ్రులు ఇక్కడికి పంపడానికి ఇష్టపడలేదు. దాంతో చదువు ప్రాముఖ్యత ముందు పెద్దవాళ్లకే తెలియాలనుకున్నా. అవగాహన కలిగించా. నెమ్మదిగా వాళ్లలోనూ మార్పు వచ్చింది. పిల్లల్ని పంపడం మొదలుపెట్టారు' అంటారు ఆర్తి.

చదువొక్కటే కాదు...

ప్రతి అమ్మాయికీ నాయకత్వ లక్షణాలూ ఉండాలనే ఆర్తి సఖిలో అదనంగా లీడర్ షిప్ స్కిల్స్‌నీ నేర్పిస్తున్నారు. అంతేకాదు, పొదుపు, మదుపులపై అవగాహన కల్పిస్తూ 'గర్ల్స్ బ్యాంక్'ని మొదలుపెట్టారు. దీంట్లో తక్కువ మొత్తంలో కూడా పొదుపు చేసుకోవచ్చు. మురికివాడల్లో చదువుపై అవగాహన పెరగడానికి లైబ్రరీలను ఏర్పాటుచేశారీమె. అంతేకాదు, ప్రస్తుత విద్యా వ్యవస్థకి ఏమాత్రం తీసిపోకుండా డిజిటల్ పద్ధతిలో బోధిస్తున్నారు. అలా ఇప్పటివరకూ మూడువేల మంది మురికివాడల అమ్మాయిల్ని చదివించారీమె. ఆమె చేసిన కృషికిగానూ జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో గుర్తింపూ లభించింది. 'చుట్టూ ఎలాంటి పరిస్థితులు ఉన్నా సంకల్పం బలంగా ఉంటే మనతోపాటు సమాజాన్నీ మార్చొచ్చు' అనే ఆర్తి ఆలోచన మంచిదే కదూ!

సెలవుల్లో సరదాగా!

నీటితోనూ గీయొచ్చు

పేపర్లు, రంగులు, పెన్సిళ్లు.. ఇవన్నీ లేకుండానే ఒక చక్కని బొమ్మ గీస్తే ఎలా ఉంటుంది? మ్యాజిక్‌లా ఉంటుంది కదూ.. ఇవాళ మనం 'వాటర్ పెయింటింగ్'తో మన ఇంటి ఆవరణని ఒక పేద్ద డ్రాయింగ్ షీట్‌గా మార్చేద్దాం! దీనికోసం, మన దగ్గర ఒక పాత ప్లాస్టిక్ వాటర్ బాటిల్, కొంచెం నీరుంటే చాలు.


ఎలా అంటే..

✤ బాటిల్ మూతకు ఒక చిన్న రంధ్రం చేసి, అందులో నీళ్లు నింపాలి.

✤ ఇప్పుడు మన ఇంటి ముందు/బాల్కనీలో ఆ బాటిల్‌ను వంచుతూ నీళ్లతో నేల మీద బొమ్మలు గీయాలి.

✤ బాటిల్‌ను మనం తిప్పుతున్న కొద్దీ, నీళ్ల ధారలా పడుతూ ఉంటే.. దాంతో పూలు, కార్లు లేదా మనకు నచ్చిన కార్టూన్ బొమ్మలు గీయొచ్చు.

✤ ఈ ఆటలో ఉన్న ఫన్ ఏంటంటే.. ఎండ వేడికి మనం గీసిన బొమ్మలు కొద్దిసేపటికే మాయమైపోతాయి. అంటే, ఒక బొమ్మ ఆరిపోగానే, మళ్లీ ఇంకో కొత్త బొమ్మ గీసుకో వచ్చన్నమాట. భలే ఉంది కదూ!



గుడ్లు వండటం అయిపోయాక అవి తెచ్చిన ఖాళీ అట్ట ట్రేలను పారేస్తుంటారు కదా. ఆ పాత ఎగ్ ట్రేలతో మనం అదిరిపోయే క్రాఫ్ట్స్ తయారు చేద్దామా? వాటితో అందమైన పూలు, బుజ్జి బుజ్జి బొమ్మలు చేయొచ్చు తెలుసా?



ఎగ్ ట్రేతో ఎన్నో!

● ఎగ్ ట్రేలో ఉండే ఒక్కో గుంటను కట్ చేయండి. ఆ కప్పు అంచులను పువ్వు రేకుల్లాగా షేప్‌లో కత్తిరించండి. నచ్చిన రంగులు వేసి, వాటి మధ్యలో ఒక పూసను అంటించండి. ఈ పూలన్నీ కలిపి ఒక పాత అట్ట మీద అంటిస్తే.. మీ గదికి కొత్త 'వాల్ హ్యాంగింగ్' రెడీ! ● ఒకే వరుసలో ఉన్న నాలుగైదు ఎగ్ కప్పులను కట్ చేయండి. ఒక్కో కప్పుకి ఒక్కో కలర్ వేస్తే భలే రంగురంగులుగా కనిపిస్తాయి. ముందు వైపు రెండు కళ్లు, తల మీద చిన్న కొమ్ముల్లా పెడితే, మీ 'క్యాటర్ పిల్లర్' బొమ్మ రెడీ! చెత్తలో పారేసే వస్తువులతో అందమైన బొమ్మలు వస్తున్నాయి చూశారా.. దీన్నే రీసైక్లింగ్ అంటున్నాం!

80 కి.మీ. దాటకూడదంతే

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో.. 50-60 కి.మీ., 60-70 కి.మీ., 70-80 కి.మీ., 80-90 కి.మీ., 90-100 కి.మీ., 100 కి.మీ.కుపైగా.. వేగంతో, ఎంతెంత సమయం ప్రయాణించింది అనేది జీపీఎస్ ట్రాకింగ్‌లో తెలుస్తోంది.

■ 80 కి.మీ. వేగం దాటినట్లు గుర్తిస్తే.. ఆ బస్సుల్ని సీజ్‌చేసి, ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)కు పంపించి.. దాని వేగ నియంత్రణ పరికరం పనిచేస్తుందా? లేదా? అనేది పరీక్ష చేయిస్తున్నారు. తేడా ఉంటే కేసు నమోదుచేస్తున్నారు.

■ ఇలా ప్రతి బస్సును ప్రయాణించిన సమయమంతా ట్రాకింగ్ చేస్తుండటంతో, అవన్నీ దారికొచ్చాయి. అవి గరిష్ఠంగా 80 కి.మీ. వేగం దాటడంలేదు.

పొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాటిపైనా..

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల వేగనియంత్రణ పర్యవేక్షణ ఏపీలోనే కాకుండా.. ఇక్కడి నుంచి పొరుగు రాష్ట్రాల్లోకి వెళ్లినా కొనసాగుతోంది. ఉదాహరణకు ఓ ట్రావెల్స్ సంస్థ బస్సు, విశాఖపట్నం నుంచి మైసూరు వెళ్తుంటే, అది ఏపీ పరిధిలోనే కాకుండా, కర్ణాటకలో కూడా ఎంత వేగంతో వెళుతుందనేది ఏపీ రవాణాశాఖ అధికారులు ట్రాక్ చేస్తున్నారు. దీంతో అక్కడ కూడా పరిమిత వేగంతో వెళ్తున్నాయి.

ఊబకాయం.. మహిళల్లోనే అధికం

(మొదటి పేజీ తరువాయి)

బాలికల మరణాల రేటు 55 నుంచి 25కి తగ్గింది.

■ ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు 2020లో 27 ఉంటే, 2023 నాటికి 21కి తగ్గింది. 2020లో బాలుర మరణాల రేటు 26, బాలికల మరణాల రేటు 27 ఉంటే.. 2023 నాటికి బాలుర 21, బాలికల మరణాల రేటు 20కి తగ్గింది.

■ ప్రతి లక్ష సజీవ జననాలకు ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత మాతృ మరణాల నిష్పత్తి 2004-06 మధ్య 154 ఉంటే.. 2021-23 మధ్య 30కి తగ్గింది.

■ నిపుణులైన ఆరోగ్యసిబ్బంది సమక్షంలో జరిగే ప్రసవాలు రాష్ట్రంలో 2015-16 మధ్య 91.5% ఉంటే.. 2019-21 మధ్య 96.5%కి పెరిగాయి. ఇళ్లలో ఆరోగ్యసిబ్బంది పర్యవేక్షణలో ప్రసవాలు 3.7% నుంచి 1.3%కి తగ్గాయి.

■ రాష్ట్రంలో టీనేజీ ప్రెగ్నెన్సీని పరిశీలిస్తే.. 15-19 ఏళ్ల మధ్య గర్భం దాల్చినవారు/తల్లులైనవారు 2019లో 10.7% (గ్రామీణ ప్రాంతాల్లో 13.1%, పట్టణ ప్రాంతాల్లో 5.6%) ఉంటే.. 2023 నాటికి 9.7%కి (గ్రామీణం 11.9%, పట్టణ 5.6%) తగ్గింది.

తగ్గిన హెచ్ఐవీ కేసులు

■ హెచ్ఐవీ సంక్రమణ రేటు తగ్గుతున్నట్లు తేలింది. 2023లో ప్రతి వెయ్యిమంది పురుషుల్లో 0.07%, మహిళల్లో 0.05% ఉన్నట్లు గుర్తించారు. 2024లో పురుషుల్లో 0.06%, స్త్రీలలో 0.05% ఉన్నట్లు తేలింది.

■ 2024లో క్షయ కేసులు పురుషుల్లో 53,544, స్త్రీలలో 31,245, ఇతరుల్లో 19 ఉన్నట్లు గుర్తించారు.

వైజాగ్ స్టీల్‌కు మరో 8 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల ప్రారంభంతో ప్లాంట్ కార్యకలాపాలు స్థిరంగా సాగుతున్నాయి. ఉక్కు ఉత్పత్తి, అమ్మకాలు కూడా పెరిగాయి. ఇది ఇలాగే దీర్ఘకాలం కొనసాగేందుకు అవసరమైన చేయూతనందించేందుకే కేంద్ర ప్రభుత్వం రెండోదశ ప్యాకేజీలో భాగంగా రూ.8,097 కోట్లు అందించడానికి సిద్ధమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే కేంద్రాన్ని సంప్రదింపులు జరపడంతో తొలిదశలో రూ.11,440 కోట్ల ప్యాకేజీ అందింది. అందులో రూ.10,300 కోట్లు ఈక్విటీ రూపంలో, మరో రూ.1,140 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణాలను 7% నాన్ క్యుములేటివ్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల రూపంలో సమకూర్చింది. ఇప్పుడు కూడా ఈ రూ.8,097 కోట్లను ఈక్విటీ రూపంలో సమకూర్చాలని కేంద్ర ఉక్కుశాఖ నిర్ణయించింది.

నెల్లూరు జిల్లాలో మహానాడు

(మొదటి పేజీ తరువాయి)

భారీ సభ జరుగుతుంది కాబట్టి, వెంట వెంటనే రెండు పెద్ద కార్యక్రమాల్ని ఉత్తరాంధ్రలో నిర్వహించేకంటే... మహానాడు వేదికను మరో ప్రాంతానికి మారిస్తే బాగుంటుందని పార్టీ భావించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గురువారం నెల్లూరు జిల్లా నాయకులతో టెలికాన్ఫరెన్స్‌లో మహానాడు ఏర్పాట్లపై చర్చించారు. కోవూరు నియోజకవర్గంలో కిసాన్‌సెజ్‌కు సమీపంలోను, నెల్లూరు గ్రామీణ మండలంలో పొదలకూరు రోడ్డుకు దగ్గర్లోను, గొలగమూడి రోడ్డు జంక్షన్‌కు సమీపంలోను 3 స్థలాల్ని గుర్తించారు. ఆదివారం నాటికి స్థలాన్ని ఖరారు చేసే అవకాశముంది.

రూ.1,208 కోట్లతో అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ట్విన్ టవర్లు

పుట్టపర్తిలో డీఆర్‌డీవోకు 600 ఎకరాలు

- 23 ఏళ్లుగా నిరీక్షిస్తున్న 385 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి
- 41 కీలక అంశాలకు మంత్రిమండలి సమావేశంలో ఆమోదం
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి



మంత్రివర్గ సమావేశం నిర్ణయాలను వెల్లడిస్తున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, చిత్రంలో ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో రూ.1,208 కోట్లతో ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణ ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. దిల్లీలో రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా రూ.124.5 కోట్లతో 11 ఎకరాల్లో నూతన ఏపీ భవన్ నిర్మించాలని నిర్ణయించింది. డిజైన్, భవన నిర్మాణ బాధ్యతలు నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ)కు అప్పగించాలన్న ప్రతిపాదనలు ఆమోదించింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో కేంద్ర రక్షణ సంస్థ డీఆర్‌డీవో చేపట్టే రక్షణ పరిశ్రమ కోసం 600 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో 41 కీలకాంశాలను ఆమోదించినట్లు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విలేకరులకు వివరించారు.

మంత్రిమండలి ఆమోదించిన అంశాలు

■ అమరావతిలో కృష్ణా నది కుడి గట్టు వద్ద వరద నిరోధక నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు రూ.443.26 కోట్లతో మూడు ప్యాకేజీలుగా పనులు. కొత్త టెండర్లు పిలిచేందుకు ఏపీసీఎల్ సీఎండీకి అనుమతి.

■ అమరావతిలో నిర్మిస్తున్న సచివాలయం, హెడ్ వోడీల కార్యాలయ భవనాలకు గ్లాస్ క్లాడింగ్, క్రౌన్, ఆట్రియం, కెనోపీ స్కైలైట్, కాలమ్ క్లాడింగ్, పీవీ ప్యానెల్, బీఎంయూ పనుల కోసం రూ.2,540 కోట్ల పనులకు ఆమోదం. పనులు చేపట్టేందుకు మూడు ప్యాకేజీల కింద టెండర్లు పిలవడానికి ఏజీఐసీఎల్ ఎండీకి అనుమతి

■ రాజధానిలో శాసనసభ భవనానికి స్పైర్, పార్కింగ్ రింగ్, రూఫ్, పాలవాగు మీద అనుసంధాన వంతెనలు తదితర నిర్మాణాల కోసం రూ.798 కోట్లకు పరిపాలన అనుమతులు

■ అమరావతి జోన్-11 పరిధిలో ఉండవల్లిలో భూసమీకరణ పథకంలో చేపడుతున్న లేఅవుట్లలో రహదారులు, కాలువలు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్తు వ్యవస్థ తదితర మౌలిక వసతుల కల్పనకు రూ.580 కోట్లకు పరిపాలన అనుమతులు. సీఆర్‌డీఏ నిధుల నుంచి ఈ పనుల్ని చేయనున్నారు.

■ సీఆర్‌డీఏ పరిధిలోని ఎన్10-ఈ1 జంక్షన్ నుంచి ఎన్13- ఈ1 జంక్షన్ వరకూ 220 కేవీ ఈహెచ్‌వీ లైన్ బ్యాలెన్స్ పనుల్ని యూజీ కేబుల్స్ ద్వారా రీరూటింగ్ చేయడానికి సవరించిన అంచనా రూ.1,180.54 కోట్లకు పాలనామోదం

■ ఆర్-5 జోన్‌లో గతంలో రెవెన్యూ శాఖకు ఇచ్చిన భూముల్ని రద్దు చేసి, వెనక్కు తీసుకునేందుకు సీఆర్‌డీఏకు అనుమతి

■ భూ సమీకరణలో రైతుల కోరిక మేరకు యాన్యుటీ మొత్తం పెంపు, రుణ మాఫీ కటాఫ్ తేదీ పెంపు తదితర నిర్ణయాలకు ఆమోదం

■ రాజధాని ప్రాంతంలో సెటిల్ 1.5 ఎకరాలు, స్వామి నారాయణ్ గురుకులం, అగ్నిమాపకశాఖ, డీఏవీ పబ్లిక్ స్కూల్‌లకు సీఆర్‌డీఏ చేసిన భూకేటాయింపులకు ఆమోదం

■ సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్ర న్యాయ విభాగాల్లో 21 కొత్త పోస్టుల మంజూరు. ఒక కోర్టు చీఫ్ మేనేజర్, ఐదు సీనియర్ కోర్టు మేనేజర్లు, 15 కోర్టు మేనేజర్ పోస్టుల కల్పన

భోగరాజు పట్టాభి స్మారక భవనానికి 1.5 ఎకరాల కేటాయింపు

■ కృష్ణా జిల్లా మచిలీపట్నంలో డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణం, సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని సంబంధిత ట్రస్టుకు రూ.37.56 కోట్లకు కేటాయించాలనే ప్రతిపాదనకు ఆమోదం

■ ఏపీ ప్రత్యేక రక్షణ దళంలో 23 ఏళ్లుగా పదోన్నతులకు నోచని 385 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

■ రామాయపట్నం పోర్టులో డ్రెడ్జింగ్ ద్వారా తీసిన మట్టిని పారవేసే ప్రదేశం మార్పడంతో వచ్చిన రూ.354 కోట్ల అదనపు ఖర్చుకు ఆమోదం

■ ఎన్‌సీడీసీ నుంచి రూ.1,800 కోట్ల రుణం తీసుకునేందుకు మార్క్‌ఫెడ్‌కు గ్యారంటీ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం

■ అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలు ఒకేలా ఉండేలా మున్సిపల్ చట్టాల సవరణ ముసాయిదాకు ఆమోదం

తెదేపా కార్యాలయాలకు లీజు ప్రాతిపదికన భూములు

తెదేపా కార్యాలయాల నిర్మాణానికి పలు జిల్లాల్లో లీజు ప్రాతిపదికన భూకేటాయింపులకు మంత్రిమండలి ఆమోదం. విజయనగరంలోని కపాసకయ్యన్నపేట, ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం కొత్తమామిడిపాలెం, రాజమహేంద్రవరం, పార్వతీపురం మన్యం జిల్లా సుందరనారాయణపురంలో రెండెకరాల చొప్పున, కర్నూలు జిల్లా కల్లూరులో ఒకటిన్నర ఎకరం, ఏలూరు నగరంలో 1.61 ఎకరాలను 33 ఏళ్ల లీజుకు ఏటా ఎకరా రూ.వెయ్యి చొప్పున అద్దె చెల్లించే పద్ధతిన ఇవ్వాలని నిర్ణయం.

పోలవరం నిర్వాసితులకు ఆర్థిక సాయం పెంపు

■ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు గతంలో ప్రభుత్వమే కాలనీ అభివృద్ధి చేసి, గృహ నిర్మాణం చేపట్టేది. కానీ వన్ టైం సెటిల్‌మెంట్ ఎంచుకున్నవారికి గృహ నిర్మాణానికి రూ.2.85 లక్షల నుంచి 3.57 లక్షలకు పెంచాలని నిర్ణయం. వేరే చోట ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారికి స్థలం విలువ రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల పెంపునకు అనుమతి

■ శ్రీసత్యసాయి జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ఫేజ్-2 పరిధిలో పుంగనూరు బ్రాంచ్ కాలువను సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌తో ఆధునికీకరించేందుకు రూ.309 కోట్ల పనులకు అనుమతి.

జాతీయ క్రీడా పాఠశాల నిర్మాణానికి పదెకరాలు

■ తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కుర్రకాల్వలో అంతర్జాతీయ క్రీడా పాఠశాల నిర్మాణం కోసం సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ ఇనీషియేటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఎకరా రూ.1.12 కోట్ల చొప్పున 10.10 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపునకు ఆమోదం

■ ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు కోసం 22.74 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి రూ.3.18 కోట్ల చెల్లింపుపై కేటాయించేందుకు అనుమతి

■ అసెప్టిక్ ప్యాకింగ్ యూనిట్ అప్‌గ్రేడేషన్, పండ్లు, కూరగాయల నుంచి పల్ప్ తీయడానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చిత్తూరు జిల్లా యాదమరి మండలం మాజిర కొత్తపల్లిలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు 13.17 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరా రూ.లక్ష స్వరకు ఇచ్చేందుకు ఆమోదం

■ అనంతపురం జిల్లా గుత్తిలో ఎంఐజీ లేఅవుట్ల అభివృద్ధి కోసం 11.82 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరా రూ.12.60 లక్షల చొప్పున అనంతపురం- హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థకు కేటాయింపునకు ఆమోదం

■ శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం, అనకాపల్లి జిల్లాలోని పూడిమడక, ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో రూ.1,586.69 కోట్లతో మూడు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సవరించిన అంచనాలకు పరిపాలనా అనుమతులు. పూడిమడకలో ఫిషింగ్ హార్బర్‌ను సమీప పారిశ్రామిక క్లస్టర్లకు ఉపయోగపడేలా కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నారు. దీని వల్ల రహదారి రద్దీ తగ్గుతుంది

■ ఏపీ పవర్ కోఆర్డినేషన్/ డిస్కంలకు రూరల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ నుంచి తీసుకున్న రూ.7 వేల కోట్ల ఎంటీఎల్ రుణాలకు షరతులతో ప్రభుత్వ హామీ పొడిగింపు

శ్రీసత్యసాయి జిల్లాలో భారీ ఏరోస్పేస్ పరిశ్రమ



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కొంచెం పైస్థాయి ఉద్యోగ నియామకాల అర్హతల్లో ఏఐ, ఐటీ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. మంత్రులు కూడా ఏఐ, ఐటీల్లో పరిజ్ఞానం పెంచుకోవాలని, లేకపోతే వెనకబడిపోతారని పేర్కొన్నారు. జలధార, జలహారతి పథకాలపై మంత్రులందరితో సమన్వయం చేసుకోవాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి సూచించారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక వైకాపా విషం కక్కుతోందని సీఎం మండిపడ్డారు. డీజిల్‌కు తాత్కాలిక కొరత వస్తే దాన్నీ అమరావతికి ముడిపెట్టి దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. 'ఇలాంటి తప్పుడు, అరాచక ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత మంత్రులదే' అని తెలిపారు. అమరావతి నిర్మాణవ్యయం ఇతర దేశాలతో పోలిస్తే తక్కువే ఉందన్నారు.

సింగపూర్‌లోని ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేయాలి

మంత్రులు సింగపూర్‌కు వెళ్లామా? వచ్చామా అన్నట్లు కాకుండా, అక్కడ పరిశీలించిన ఉత్తమ విధానాలను రాష్ట్రానికి ఎలా వర్తింపజేయాలన్నది ఆలోచించాలని సీఎం సూచించారు. 'గతంలోనూ మంత్రుల్ని వివిధ దేశాలకు, ప్రాంతాలకు పంపేవాడిని. అక్కడ గమనించిన ఉత్తమ విధానాలను వారు తిరిగొచ్చాక వారి శాఖల్లో అమలు చేసేందుకు ప్రయత్నించేవారు. ఎక్కడ మంచి విధానాలున్నా మనం అందిపుచ్చుకోవాలి. అందుకే మంత్రుల్ని విదేశాలకు పంపుతుంటాను' అని వివరించారు. మంత్రుల సింగపూర్ పర్యటనపైనా వైకాపా చేస్తున్న దుష్ప్రచారానికి దీటుగా బదులివ్వాలన్నారు. అధ్యయనాంశాలపై నివేదికలు సమర్పించాలని పర్యటన నుంచి వచ్చిన మంత్రులకు సీఎం సూచించారు.

వేసవిలో ప్రజలు జాగ్రత్త

ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రుల్ని సీఎం ఆదేశించారు. తాగునీటికి కొరత లేకుండా, ప్రజలకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కాలవల నిర్వహణపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని సూచించారు. సూర్యఘర్ పథకం అమలుతీరు బాగుందని, అన్ని జిల్లాల్లో పర్యటించి మరింత వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సీఎం ఆదేశించారు.

పిల్లలే సంపద పేరుతో ప్రచారం

రాష్ట్రంలో జననాల రేటు పెంపుపైనా చాలా సమయం చర్చ జరిగింది. జూన్ నుంచి 'పిల్లలే సంపద' పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు. మూడోబిడ్డ నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. 'ఇద్దరికి మించి పిల్లల్ని కనేలా అవగాహన కల్పించాలి. మూడోబిడ్డ పుడితే ప్రత్యేక ప్రోత్సాహకం ఇవ్వడంతో పాటు, ఆపైన ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనంతోపాటు ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేస్తాం. పైచదువుల వరకు ఆర్థిక సహకారమూ అందిస్తున్నాం కాబట్టి, తల్లిదండ్రులపై ఆర్థికభారం పెద్దగా పడబోదన్న విషయాన్ని వారికి వివరించాలి' అని సీఎం సూచించారు.

■ ఈసారి పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి సంధ్యారాణి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇతర జిల్లాలు, మొత్తం ఫలితాల వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత గురించి ఆయన చెప్పబోగా.. సీఎం కలగజేసుకుని.. విద్యాశాఖ మంత్రి కేవలం ప్రభుత్వ పాఠశాలలపైనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని రంగాలకు చెందిన విద్యా వ్యవస్థల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

■ క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా బయటకు వెళుతోందన్న ఫిర్యాదులు రావడంలో తొలిసారిగా మంత్రులకు వీపీఎన్ (వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్) ద్వారా ఎజెండా పంపారు.

దిల్లీలో కొత్తగా నిర్మించే ఏపీ భవన్ నమూనాలపై ప్రజంటేషన్

దిల్లీలో కొత్తగా నిర్మించనున్న ఏపీ భవన్ నమూనాలపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంత్రులకు ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం మాట్లాడుతూ... 'దిల్లీలోని ఏపీ భవన్ సరిపోవడం లేదని, హైదరాబాద్ ప్యాలెస్‌ను కేటాయిస్తే అక్కడ ఏపీ భవన్ ఏర్పాటు చేసుకుంటామని వాజ్‌పేయీ ప్రధానిగా ఉండగా కోరాం. హైదరాబాద్ ప్యాలెస్ జాతీయ, అంతర్జాతీయ సమావేశాలకు వేదికగా నిలుస్తోందని, ప్రత్యేక గుర్తింపు పొందిన ఆ భవనాన్ని ఒక రాష్ట్రానికి పరిమితం చేయడం సబబు కాదని కేంద్రం తెలిపింది. దానికి బదులుగా అప్పట్లో మరోచోట 10 ఎకరాలు ఏపీ భవన్‌కు కేటాయించారు. ఆ 10 ఎకరాల్లో ఇప్పుడు మనకు వచ్చిన ఐదెకరాల్లో ఏపీ భవన్‌ను కడుతున్నాం' అని అన్నారు.

సముద్రంలో ముంచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

"దేశం లోపల, వెలుపల ఉన్న 9 కోట్ల మంది ఇరానియన్లు.. నానోటెక్నాలజీ, బయోటెక్నాలజీ నుంచి అణు, క్షిపణి సామర్థ్యాల వరకు ఇరాన్ గుర్తింపు-ఆధారిత, ఆధ్యాత్మిక, మానవ, శాస్త్రీయ, పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలన్నింటినీ జాతీయ ఆస్తులుగా భావిస్తారు. వారు దేశ జలాలు, భూమి, గగనతలాన్ని ఎలాగైతే కాపాడుకుంటారో.. ఈ సామర్థ్యాలనూ అలాగే రక్షించుకుంటారు" అని అందులో పేర్కొన్నారు. "దేవుడి దయవల్ల పర్షియన్ గల్ఫ్ ఉజ్వల భవిష్యత్తులో అమెరికా ప్రమేయం ఉండదు. హర్మూజ్ కోసం చట్టబద్ధమైన కొత్త నిబంధనలను మేం తీసుకువస్తాం. అవి గల్ఫ్ దేశాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తాయి. ప్రాంతీయంగా శాంతిని నెలకొల్పుతాయి. హర్మూజ్, గల్ఫ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలవుతోంది" అని కూడా మొజ్తాబా తెలిపారు. అమెరికాను 'పెద్ద సైతాను'గా మొజ్తాబా అభివర్ణించారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్లకు పనేంటని ప్రశ్నించారు. "అత్యాశ, దుర్బుద్ధితో వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే విదేశీయులకు.. పర్షియన్ గల్ఫ్‌లో నీటి అడుగున తప్ప మరెక్కడా స్థానం ఉండదు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు వాటినవే కాపాడుకోలేకపోతున్నాయి. అలాంటప్పుడు తమపై ఆధారపడిన దేశాల భద్రతకు అవి ఎలా హామీ ఇవ్వగలవు" అని ఆయన ప్రశ్నించారు. హర్మూజ్‌లో శత్రువుల దురాగతాలను ఇరాన్ నిర్మూలిస్తుందన్నారు.

మా కొత్త ఆయుధంతో అమెరికాకు గుండెపోటు: ఇరాన్ నేవీ కమాండర్

శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడతామని ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ హెచ్చరించారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయపెడుతుందని, దానికి గుండెపోటు కూడా తెప్పిస్తుందని వ్యాఖ్యానించారు. అమెరికా బలగాలు దిగ్బంధనం కొనసాగిస్తున్నప్పటికీ తమ నౌకలు కొన్ని.. రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు.

ఇరాన్‌పై మేం మళ్లీ దాడులు వేయొచ్చు: ఇజ్రాయెల్

తమ లక్ష్యాలను పూర్తిస్థాయిలో అందుకునేందుకు ఇరాన్‌పై త్వరలోనే మళ్లీ దాడులు చేసే అవకాశముందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ పేర్కొన్నారు. తమ ఉనికికి టెహ్రాన్ ఎన్నటికీ ముప్పుగా పరిణమించకుండా చూస్తామన్నారు.

ఇరాన్‌కు అత్యవసర భూ మార్గాలను తెరిచిన పాక్

అమెరికా బలగాల దిగ్బంధనంతో సతమతమవుతున్న ఇరాన్‌కు సాయపడేలా.. ఆ దేశానికి తమ ఆరు అత్యవసర భూ మార్గాలను పాకిస్థాన్ తెరిచింది.

ఇరాన్‌పై భూతల దాడులొద్దు

- ట్రంప్‌ను హెచ్చరించిన పుతిన్

మాస్కో, వాషింగ్టన్: ఇరాన్‌పై దాడులను పునఃప్రారంభిస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఆ దేశంపై భూతల దాడులు ప్రమాదకరమని, ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని కూడా పేర్కొన్నారు. ట్రంప్‌తో బుధవారం జరిగిన ఫోన్ సంభాషణలో ఈ వ్యాఖ్యలు చేశారు. పుతిన్ సలహాదారు యూరీ ఉషకోవ్ విలేకర్ల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు.

రాయలసీమలో సెమీకండక్టర్ పరిశ్రమ

రూ.10,239 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు

శ్రీసత్యసాయి జిల్లాలో 30 ఎకరాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాయలసీమలో భారీ సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకానుంది. రూ.10,239.78 కోట్ల పెట్టుబడితో ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ శ్రీసత్యసాయి జిల్లాలో దీన్ని ఏర్పాటు చేయనుంది. పవర్ డివైజ్‌ల కోసం ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సదుపాయం, అత్యాధునిక సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ తయారీ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ముంబయిలో మొదటి ఓఎస్ఏటీ సదుపాయాన్ని పైలట్ విధానంలో సంస్థ నిర్వహిస్తోంది. దీంతోపాటు అణుశక్తి విభాగానికి సరఫరా చేసే రక్షణ పరికరాలూ తయారుచేస్తోంది. రాష్ట్రంలో ఏర్పాటుచేసే ప్రాజెక్టుకు కేంద్రం ప్రకటించిన 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' కింద అనుమతులు పొందేందుకు సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఇది రాష్ట్రంలో రెండో అతిపెద్ద సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ కానుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో అమలు చేసేందుకు వీలుగా ప్రభుత్వంతో సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మొదటిదశలో రూ.3,267.69 కోట్లు, రెండో దశలో రూ.6,972.09 కోట్లు సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. అనుమతులు పొందినప్పటి నుంచి 25 నెలల్లో మొదటిదశను పూర్తిచేయనుంది. దీనిద్వారా సుమారు 1,017 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ పేర్కొంది. మొదటి దశ ప్రాజెక్టు కోసం సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి ... లోడు దగ్గర 30 ఎకరాలను కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

గూడూరు @ 45.8 డిగ్రీలు

- ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేడి, సెగ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డు స్థాయిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్‌లో ఇదే గరిష్ఠం. మేలో ఇంకా ఎక్కువ నమోదు కావొచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 28 మండలాలు, వైఎస్సార్ కడపలో 26, తిరుపతిలో 25, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరులో 25, ప్రకాశంలో 22, మార్కాపురంలో 15, నంద్యాలలో 14, చిత్తూరులో 13, గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో గురువారం 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

■ పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 45.2, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45, తిరుపతి జిల్లా రాయలచెరువులో 44.3, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం, బాపట్ల జిల్లా కారంచేడు, చిత్తూరు జిల్లా తవణంపల్లె, నంద్యాల జిల్లా సంజాముల, వైఎస్సార్ జిల్లా కోడూరులో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మండుతున్న మార్కాపురం

గతంలో పల్నాడు జిల్లా రెంటచింతలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. ఈ ఏడాది మార్కాపురం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల ఉష్ణోగ్రతలు ఆ రికార్డులను దాటేసేలా ఉన్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నివేదికల ప్రకారం ఏప్రిల్ 27న మార్కాపురం జిల్లా బేస్తవారిపేట, కంభం మండలాల్లో 2 చోట్ల 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 9 మండలాల్లో 43 డిగ్రీలు దాటాయి. గత నెల 26, 28న కూడా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలూ మార్కాపురం జిల్లాలోనే రికార్డయ్యాయి. అదే సందర్భంలో రెంటచింతలలో గతంలో కంటే ఉష్ణోగ్రతలు తగ్గాయి. గురువారం రాష్ట్రంలో చాలా మండలాల్లో 45 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు రికార్డయితే.. రెంటచింతలలో మాత్రం 41.2 డిగ్రీలు నమోదైంది.

స్థానిక పరిస్థితులు కారణం

ఎల్‌నినో పరిస్థితులు, మేఘాలు తక్కువగా ఉండడం, అధిక పీడన వ్యవస్థలు గాలిని చల్లబడకుండా నిరోధించడంతో వాతావరణం బాగా వేడెక్కుతోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు ఒకే ప్రాంతానికి పరిమితం కావు. ఆయా ప్రదేశాల్లో ఉష్ణోగ్రతలు మారడానికి స్థానిక పరిస్థితులు దోహదం చేస్తాయి. అక్కడి వాతావరణంలో మార్పులు, పరిశ్రమలు, సాగు విధానాల వంటివి కారణం కావొచ్చు.

– ఓఎస్ఆర్‌యూ భానుకుమార్, విశ్రాంత ఆచార్యులు, ఏయూ వాతావరణ విభాగం

ముందుగానే పలకరించనున్న 'నైరుతి'!

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే దేశంలోకి ప్రవేశిస్తాయని పలువురు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మే 13వ తేదీ నాటికి అండమాన్, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ తెలిపింది. గురువారం విడుదల చేసిన వాతావరణ అంచనా బులెటిన్‌లో ఆయా వివరాలను వెల్లడించింది.

పడుతూ.. లేస్తూ

➚ పది ఫలితాల్లో ఐదేళ్లుగా అంతే
➚ క్షేత్రస్థాయిలో ఎన్నో కారణాలు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - గుంటూరు విద్య



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా ప్రదర్శన పడుతూ.. లేస్తూ.. అన్నట్టుగా ఉంటోంది. ఒక సంవత్సరం మెరుగ్గా ఉండడం, మరో ఏడాది అనూహ్యంగా పడిపోతుండడం పరిపాటిగా మారింది. గత ఐదేళ్ల రికార్డు ఇదే చెబుతోంది. ఉత్తీర్ణత శాతం పెరుగుతున్నట్టు కనిపిస్తున్నా.. రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానం విభిన్నంగా కనిపిస్తోంది.

ప్రైవేటు స్కూళ్లలో..


598
వలకలూరి స్వేచ్ఛా ప్రియదర్శిని
గోరంట్ల, గుంటూరు
నాగలక్ష్మి (సచివాలయ ఉద్యోగిని), వెంకట్రావు (ప్రభుత్వ ఉపాధ్యాయుడు)
ఐఐటీలో ఉత్తమ ర్యాంకు సాధించి ఏఐ ఇంజినీర్ కావడం


598
కన్నధార ఇందువదన
అమరావతి
విమలాదేవి(గృహిణి), శివప్రసాద్(రైతు)
ఐఐటీలో ర్యాంకు సాధించి మంచి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం.


598
పిడపర్తి సాయి శ్రీహర్ష
మంగళగిరి
సౌందర్య (గృహిణి), పిడపర్తి నాగసత్య సురేష్ (చిరు ఉద్యోగి)
సివిల్స్ సాధించడం


598
పాలేరు ఉజ్వల్ చౌదరి
పొన్నెకల్లు, తాడికొండ
లావణ్య(గృహిణి), కిషోర్ బాబు (మెకానికల్ ఇంజినీర్)
ఐఐటీలో సీటు


598
గంగోలు దినేష్
పాతగుంటూరు,
స్వర్ణకుమారి (ప్రైవేటు ఉద్యోగం) తండ్రి (లేటు)
సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడటం.

సర్కారు బడుల్లో..

3001 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. జిల్లా పరంగా సాధించిన ఫలితాల వివరాలు చూస్తే..

	హాజరు	ఉత్తీర్ణులు	శాతం
బాలురు	14,377	12,607	87.69
బాలికలు	12,635	11,404	90.26
మొత్తం	27,012	24,011	88.89


593
జెట్టింగ్ నిహాల్
జడ్పీ స్కూల్ తాడేపల్లి
విద్యారాణి (గృహిణి), శంకర్ (ప్రైవేటు ఉద్యోగి)
సివిల్స్


592
పఠాన్ మహీఆఫ్రీన్
జడ్పీ స్కూల్, గోరుమూడి
రుక్సార్, (ప్రైవేట్ ఉపాధ్యాయురాలు) పఠాన్ బాజీబా (మెకానిక్)
ఐఏఎస్


592
తోట చిన్మయ్ మధురిమ భార్గవి
జడ్పీ స్కూల్, వెల్లటూరు
మహాలక్ష్మి (గృహిణి), మునుస్వామి (ఆర్టీసీ డ్రైవర్).
రవాణా శాఖ అధికారి


590
షేక్ సాజిదా
పురపాలక స్కూల్, తెనాలి
నజ్మా (గృహిణి), బాజి (టైలర్)
సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడటం.



590
షేక్ ఫజీలతబసుం
ప్రభుత్వ పాఠశాల, పాలపర్రు, పెదనందిపాడు
వహీదా, రహీం (ఉపాధ్యాయుడు)
ఐఏఎస్

అష్టమ స్థానం.. అమ్మాయిలదే ఆధిపత్యం

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 88.89% ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాల్లో జిల్లా 8వ రాష్ట్రంలో స్థానంలో నిలిచింది. ఈసారి అగ్రస్థానంలో నిలవాలన్న ప్రయత్నం సఫలం కాలేదు. గతేడాదితో పోలిస్తే మరింత కిందకు పడిపోయింది. బాలికల ఉత్తీర్ణత శాతం, మొదటి డివిజన్‌లో పాసైన విద్యార్థుల పరంగా మెరుగుదల కనిపిస్తోంది. ఏటా మాదిరే ఈసారీ బాలికలు సత్తా చాటారు.

ఐదేళ్లు బాలికలదే హవా
ఏటా బాలికల ఉత్తీర్ణత శాతం పెరుగుతూ వస్తోంది.




ఉత్తీర్ణతా శాతంలో భేష్

ర్యాంకు విషయంలో జిల్లా పడుతూ లేస్తూ సాగుతున్నప్పటికీ.. మొత్తం ఉత్తీర్ణతశాతం పరంగా పురోగతి సాధిస్తోంది.

ఏడాది	విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం	రాష్ట్ర ర్యాంకు
2022	25,874	18,491	71.47	16
2023	26,205	20,283	77.40	6
2024	27,178	23,955	88.14	16
2025	27,254	24,129	88.53	4
2026	27,012	24,011	88.89	8

ఇదీ పరిస్థితి.. 2022లో 16వ స్థానంలో నిలిచిన జిల్లా.. 2023లో 6వ స్థానానికి ఎగబాకింది. మళ్లీ 2024 ఫలితాల్లో 16వ స్థానానికి పడిపోయింది. అనంతరం ప్రత్యేక కసరత్తు చేయడంతో 2025 ఫలితాల్లో నాలుగో స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకుంది. ఆదే ఉత్సాహంతో ఈసారి మొదటిస్థానమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేశారు. అధికారులు సైతం ధీమాగా ఉన్నారు. చివరకు 8వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

అనేక కారణాలు.. ❖ వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయడంలో సమస్య ఏర్పడింది. ❖ అదే సమయంలో డీఈవోల బదిలీ కొంతమేర ప్రభావం చూపింది. ❖ ఎంఈవోల స్థానాలను భర్తీ చేసేందుకు అనేక పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఎంపిక చేయడంతో సబ్జెక్టు బోధకుల కొరత ఏర్పడింది. ❖ అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడింది.



సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత

సబ్జెక్టు	శాతం
తెలుగు	96.67
హిందీ	96.67
ఇంగ్లీషు	99.09
గణితం	95.32
సైన్స్	93.64
సోషల్	94.17

వివిధ పాఠశాలల గణాంకాలిలా...

పాఠశాలలు	విద్యార్థులు	పాస్
ఏపీఆర్ఎస్	129	126
ప్రైవేటు	16,935	16,176
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్	211	196
ఏపీటీడబ్ల్యూఆర్ఎస్	38	30
జడ్పీ	5,754	4,516
ఎయిడెడ్	1,254	958
మునిసిపల్	2,355	1,762
ప్రభుత్వ	336	247
మొత్తం	27012	24011
ప్రభుత్వ సెక్టార్ మొత్తం	10,077	7,835

నారసింహా.. రక్షమాం..

మంగళగిరి, న్యూస్‌టుడే: నరసింహ జయంతి సందర్భంగా మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహుని ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించి, స్వామికి నామకరణం చేశారు. గర్భాలయంలో స్వామివారికి స్తంభోద్భవ మట్టం కళ్లకు కట్టేలా ప్రత్యేక అలంకారం భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవాలకు శాశ్వత కైంకర్యపరులుగా మాల్యవంతం లక్ష్మీ నరసింహాచార్యులు, శేషమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించారు. సహాయ కమిషనర్ సునీల్ కుమార్ పర్యవేక్షించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకుని ఆలయంలో శ్రీలక్ష్మీ నరసింహ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదంగా గురువారం పంపిణీ చేశారు.


శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి

మిర్చియార్డుకు వరుస సెలవులు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డుకు వారాంతపు సెలవులు రెండు రోజులతో పాటు మే డే సందర్భంగా శుక్రవారం సెలవు ప్రకటించారు. దీంతో మిర్చి యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. శుక్రవారం క్రయవిక్రయాలు జరగవు. కార్మిక దినోత్సవం సందర్భంగా సెలవు ప్రకటించాలని చైర్మన్, ఉన్నత శ్రేణి కార్యదర్శికి కార్మిక సంఘాలు వినతిపత్రం అందజేశాయి. దీనికి స్పందించి వారు సెలవు ప్రకటించారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కావడంతో క్రయవిక్రయాలు జరగవు. సోమవారం నుంచి మిర్చి లావాదేవీలు యథాతథంగా జరుగుతాయని చైర్మన్ కుర్రా అప్పారావు తెలిపారు.

తెనాలి జిల్లా ఆసుపత్రికి ఏ గ్రేడ్

సీహెచ్‌సీలలో పొన్నూరు ఎంపిక

తెనాలి(కొత్తపేట),న్యూస్‌టుడే: 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు జనరల్, క్లినికల్, డయాగ్నస్టిక్, గ్లోబల్ అంశాలలో స్పష్టమైన లక్ష్యాలు ఇచ్చి, వీటిని చేరుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటి ప్రాతిపదికన చేసుకొని గ్రేడ్‌లు ప్రకటించింది. ఈ క్రమంలో తెనాలి జిల్లా ఆసుపత్రికి ఏ గ్రేడ్, సీహెచ్‌సీలలో పొన్నూరుకు ఏ గ్రేడ్, కొల్లిపర, ప్రత్తిపాడుకు బీ గ్రేడ్ వచ్చాయి. ఈ వివరాలను డీసీహెచ్ఎస్ బి.వి.రంగారావు, తెనాలి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.సౌభాగ్యవాణి గురువారం తెనాలి జిల్లా ఆసుపత్రిలో వెల్లడించారు. జనరల్ ఇండికేటర్లలో ఓపీ, ఐపీ అంశాలు, క్లినికల్ ఇండికేటర్లలో మేజర్ సర్జరీలు, ట్యూబెక్టమీ, కాన్పుల అంశాలున్నట్లు పేర్కొన్నారు. డయాగ్నస్టిక్ ఇండికేటర్లలో ఎక్స్‌రే, యూఎస్‌జీ, ఈసీజీ, ల్యాబ్ అంశాలున్నట్లు వారు వివరించారు. రాష్ట్రంలోని 5 జిల్లా ఆసుపత్రులను గ్రేడ్ ఏకు ఎంపిక చేయగా అందులో తెనాలి ఒకటి. అలాగే 49 ఏరియా ఆసుపత్రులలో గ్రేడ్ ఏకు ఎంపిక కాగా..ఇందులో పొన్నూరు ఒకటి. గ్రేడ్ బీ కి 82 సీహెచ్‌సీలను ఎంపిక చేయగా ఇందులో కొల్లిపర, ప్రత్తిపాడు ఉన్నాయి.

తూకాల్లో మోసాలా... ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్నారా..?

తూనికలు కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్‌తో 'ఈనాడు' ఫోన్ ఇన్ నేడు



ఈనాడు మీతోడు

తూకాల్లో మోసాలు... తప్పుడు తూకం రాళ్లతో కొలతలు... పెట్రోల్ బంకుల్లో తరుగుతో మాయాజాలం.. ఇలా ఎన్నో విధాలుగా వినియోగదారులు మోసపోతున్నారు. రేషన్ దుకాణాల్లోనూ సరుకుల్లో కోతే. గరిష్ఠ చిల్లర ధరకు మించి శీతల పానీయాలు, ఆహార పదార్థాల విక్రయం.. నిర్ణీత బరువుకన్నా తక్కువ ఉంటున్న గ్యాస్ సిలిండర్లు... ఇలాంటి మోసాలను తెలియజేసేందుకు 'ఈనాడు' మే 1వ తేదీన డయల్ యువర్ జాయింట్ కంట్రోలర్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వినియోగదారుల ప్రశ్నలకు తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్ మాధురి సమాధానాలిస్తారు.

తేదీ: శుక్రవారం (1-5-2026)
సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు
93981 49775

- న్యూస్‌టుడే, పట్నంబజారు

ఆంగ్రూ రిజిస్ట్రార్‌గా మణి

జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) రిజిస్ట్రార్‌గా ఎ.మణి నియమితులయ్యారు. వర్సిటీ విభాగాల అధికారులను బదిలీ చేస్తూ ఇన్‌ఛార్జి ఉపకులపతి డాక్టర్ పి.వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మణి ప్రస్తుతం అగ్రి ఇంజినీరింగ్- టెక్నాలజీ డీన్‌గా కొనసాగుతున్నారు. విస్తరణ విభాగం ముఖ్య శాస్త్రవేత్త బి.ముకుందరావును కంట్రోలర్‌గా, పరీక్షల నియంత్రణ అధికారి డి.సంపత్‌కు మార్చి విద్యార్థి వ్యవహారాల డీన్‌గా, ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఎం.వి.రమణను అగ్రికల్చరల్ ఇంజినీరింగ్-టెక్నాలజీ డీన్‌గా, ఉపకులపతి సాంకేతిక కార్యదర్శి పి.మునిరత్నంను పీజీ కోర్సుల డీన్‌గా, తిరుపతి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ వి.సుమతిని పరిశోధన సంచాలకులుగా, విద్యార్థి వ్యవహారాల డీన్ జి.రామచంద్రరావును విస్తరణ సంచాలకుడిగా, గ్రంథాలయ అధికారి జి.కరుణసాగర్‌ను పరీక్షల నియంత్రణ అధికారిగా, కంట్రోలర్ టీవీఎస్ ప్రసాద్ వర్సిటీ గ్రంథాలయ అధికారిగా నియమితులయ్యారు. ప్రస్తుతం డీఈగా పనిచేస్తున్న విస్తరణ సంచాలకుడు జి.శివనారాయణకు పోస్టింగ్ చూపలేదు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన పి.వి.సత్యనారాయణ విభాగాల అధికారులను మార్చడం ద్వారా మార్పునకు శ్రీకారం చుట్టినట్లయింది.

శీతల గోదాములకు గడ్డుకాలం

మిర్చి నిల్వకు మొగ్గు చూపని రైతులు

ఈనాడు డిజిటల్ అమరావతి

మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడం.. నిల్వ చేయడానికి రైతులు మొగ్గు చూపకపోవడంతో శీతల గోదాముల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రస్తుతం అన్ని రకాల ధరలు క్వింటాకు రూ.20 వేలకుపైగానే పలుకుతున్నాయి. ప్రస్తుతం శీతల గోదాముల్లో ఉన్న సరకులో సింహభాగం వ్యాపారులు, నిల్వదారులదే.

ఇతర ప్రాంతాల నుంచి తగ్గిన సరకు..

గుంటూరుతోపాటు ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి ఏటా శీతల గోదాములకు మిర్చి వచ్చేది. ధర బాగా తక్కువ ఉన్నప్పుడు ఎక్కువమంది నిల్వ చేసేవారు. గతేడాది కర్ణాటక నుంచి రైతులు ఎక్కువగా తీసుకొచ్చారు. ఈ ఏడాది బాగా తగ్గింది. కర్నూలు, ప్రకాశంతోపాటు పల్నాడు జిల్లా నుంచి కూడా ఇదే పరిస్థితి. ఒకవేళ నిల్వ చేసినా.. మార్కెట్ తగ్గితే ఏమిటన్న ఆలోచన కంగారు పెడుతోంది. దీంతో దేశ, విదేశీ ఎగుమతులకు తక్షణమే విక్రయిస్తున్నారు. దీనివల్లనే శీతల గోదాముల్లో మిర్చి నిల్వలు అంతగా లేవు.



"పత్తి, పొగాకు, స్థిరాస్తి, నిర్మాణ రంగం తదితర వ్యాపారాల్లో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న కొంతమంది వ్యాపారులు ప్రత్యామ్నాయంగా మిర్చి వ్యాపారంలోకి అడుగుపెడుతున్నారు. కొంతమంది స్వల్ప కాల వ్యవధిలో సరకు నిల్వ చేసి.. ధర కాస్త పెరిగాక కొద్దిపాటి లాభానికి అమ్మేస్తున్నారు. కొద్దిమంది మాత్రమే దీర్ఘకాలంలో ధరలు పెరుగుతాయన్న అంచనాతో నిల్వ చేస్తున్నారు."

మే నెలలో సరకు వచ్చేనా....?

ఉమ్మడి జిల్లాలో 138 శీతల గోదాములున్నాయి. నిల్వ సామర్థ్యం కోటి బస్తాలకుపైగానే. పాత, కొత్త మిర్చి కలిపి 40 లక్షల బస్తాలే నిల్వ ఉన్నట్లు యజమానులు చెబుతున్నారు. ఎక్కువమంది రైతులు జనవరి - ఏప్రిల్ మధ్యలో పంటను అమ్మేందుకే మొగ్గు చూపారు. దిగుబడులు అంతంతమాత్రంగా ఉండడంతో రైతుల వద్ద సరకు తక్కువగానే ఉంది. మే నెల రెండోవారం నుంచి యార్డుకు సెలవులిచ్చే అవకాశం ఉంది. దీంతో శీతల గోదాములకు సరకు వస్తుందా? అన్న సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామం వాటి నిర్వహణపై ప్రభావం చూపనుంది. గత మూడు దశాబ్దాల్లో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని, ఈసారి 50 శాతం కూడా నిండే పరిస్థితి కనిపించడం లేదని శీతల గోదాముల యజమానుల సంఘం అధ్యక్షుడు సురేంద్ర బాబు చెప్పారు.

రాజధానికి భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించండి

కేంద్ర సహాయమంత్రి పెమ్మసానితో అన్నదాతల భేటీ

ఈనాడు, అమరావతి: రాజధాని గ్రామాల్లో భూసమీకరణ కింద భూములిచ్చిన వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని రైతులు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించారు. గురువారం సాయంత్రం ఆయన నివాసంలో కలిసి.. సమస్యలు వివరించారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన త్రిమెన్ కమిటీలో పెమ్మసాని ఉన్న విషయం విదితమే. రాజధాని ప్రాంతంలో ట్రంక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా గ్రామాల్లో ఖాళీ స్థలాలు, ఇళ్లు కోల్పోతున్నవారికి ఎన్నెస్పీ పాలసీలో ఎక్కడ స్థలాలు కేటాయిస్తారు? ఎప్పటిలోగా అభివృద్ధి చేసి ఇస్తారన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం ఎంతిస్తారు? ఎప్పుడిస్తారు? ప్రత్యామ్నాయంగా ఖాళీ స్థలాలు ఎక్కడిస్తారో తెలియజేయాలన్నారు. ఎంత స్థలం కోల్పోతున్నామో అంతే స్థలం ఇవ్వాలన్నారు. ఇళ్లు, స్థలాల్లో కొంత స్థలం పోతే మిగిలింది తీసుకుంటారా? వదిలేస్తారా. వంటి అంశాలపై కూడా స్పష్టత ఇవ్వాలన్నారు. రిటర్నబుల్ ప్లాట్లలో వీధిపోటు సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. గ్రామకంఠాల సమస్య పరిష్కరించకపోవడంతో కొందరు భూసమీకరణ కింద భూములివ్వాలనుకున్నా.. ముందుకు రావడం లేదు. సమస్య పరిష్కరించకుండా భూసేకరణకు వెళ్తుండడంతో గందరగోళం నెలకొందన్నారు. ఎఫ్ఎస్ఐ సమస్య పరిష్కరించాలని, రాజధాని గ్రామాల్లో గతంలో సెంటు చొప్పున ఇచ్చిన స్థలాలను ఇప్పుడు రద్దు చేసినందున వారిలో అర్హులైన వారికి టిడ్కో ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఉండవల్లిలో భూసేకరణకు ప్రకటన ఇచ్చినందున అక్కడి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాజధాని ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ఉండవల్లి రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయమై మే నెల తొలివారంలో సమావేశమై సమస్యలపై చర్చిస్తామని పెమ్మసాని హామీ ఇచ్చారు.

ఇళ్ల గణన నేటి నుంచే

స్వీయ గణనలో రెండో స్థానంలో గుంటూరు జిల్లా

న్యూస్‌టుడే - కలెక్టరేట్

పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తరువాత చేపడుతున్న ఇళ్ల గణన ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలుకాబోతోంది. మొదటిసారిగా పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ప్రక్రియలో డేటా నమోదు చేస్తారు. ఇందుకోసం పక్కా ప్రణాళికతో యంత్రాంగం సిద్ధమైంది. గత నెల 16 నుంచి 30 వరకు స్వీయ గణన చేపట్టగా.. 63 వేలమంది నమోదు చేసుకున్నారు. తద్వారా రాష్ట్రంలోనే గుంటూరు జిల్లా రెండో స్థానంలో నిలిచింది.

30లోగా పూర్తి.. జన గణన - 2027 ప్రక్రియలో భాగంగా మే 1 నుంచి 30 వరకు తొలుత ఇళ్ల గణన జరగనుంది. ఇందుకోసం సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, ఇతర సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు గుర్తింపు కార్డు సహా నమోదుకు సంబంధించిన కిట్‌ను అందించారు. వీరికి కేటాయించిన బ్లాక్‌లలో గణన పూర్తి చేయాల్సి ఉంటుంది. స్వీయ గణనలో నమోదు చేసుకున్నవారి ఇళ్లకు వెళ్లినప్పుడు ఆయా వివరాలను పరిశీలించి.. ఇంకా సమాచారం అవసరమైతే సంబంధిత యజమానులతో మాట్లాడి ధ్రువీకరించుకుంటారు. కలెక్టర్ సాయికాంత్‌వర్మ గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు.

ఇళ్ల గణనకు సన్నద్ధం ఇలా...

జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి: కలెక్టర్ సీఎం సాయికాంత్‌వర్మ
ఉప ప్రధాన సెన్సస్ అధికారి: డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి
ఎన్యూమరేటర్లు: 4,046 మంది
హౌస్ లిస్టింగ్‌బ్లాక్స్: 3,803
సూపర్‌వైజర్లు: 720 మంది
ఛార్జ్ ఆఫీసర్లు: 23 మంది
ఒక్కో ఎన్యూమరేటరుకు కేటాయించిన ఇళ్లు: 150-200

ఇళ్ల గణనలో తలెత్తే సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1855

సమాచారం సురక్షితం

- కలెక్టర్ సాయికాంత్ వర్మ



ప్రజలందించే సమాచారం సురక్షితంగా ఉంటుంది. వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు కోల్పోతామన్న అపోహలు వద్దు. కచ్చితమైన సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు ఇవ్వాలి. భవిష్యత్తులో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, ప్రజోపయోగ కార్యక్రమాల రూపకల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించేందుకు డేటా ఉపయోగపడుతుంది. ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు ఐడీ కార్డులను పరిశీలించి వివరాలు తెలియజేయాలి. స్వీయ నమోదు చేసుకున్నవారు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ తెలియజేస్తే సిబ్బంది ధ్రువీకరిస్తారు.

సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు అవకాశం


జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టణ భూ పరిమితుల చట్టం పరిధిలోకి వచ్చిన సీలింగ్ భూములు, మిగులు భూముల క్రమబద్ధీకరణకు డిసెంబరు 31వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా డి-పట్టా మంజూరు చేస్తారని, 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని, 300 నుంచి 500 వరకు 30 శాతం, 500 చదరపు గజాలకు పైబడి ఉంటే 100 శాతం ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. సదరు మొత్తాన్ని రెండు దఫాలుగా చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. భూములను క్రమబద్ధీకరించుకునే అర్హులకు కన్వేయన్స్ డీడ్ ఇస్తారని, 2019, మే 1వ తేదీకి ముందు రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటారన్నారు. క్రమబద్ధీకరణ విలువ చెల్లించిన వారి భూములను సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అవకాశం కల్పించడంతో పాటు ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో బదలాయింపు చేసే అవకాశం పదేళ్ల తర్వాతే ఉండేదని, ఇప్పుడు రెండేళ్లకు తగ్గిస్తూ జీవో ఎంఎస్ 241ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇంకా క్రమబద్ధీకరించుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ముందస్తు ఆస్తిపన్ను వసూలు రూ.69.27 కోట్లు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగర పాలకసంస్థ పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు ఆస్తి పన్ను రికార్డుస్థాయిలో రూ.69.27 కోట్లు వసూలైనట్లు కమిషనర్ మయూర్ అశోక్ తెలిపారు. ముందస్తు పన్ను ఏకమొత్తంలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. పన్ను చెల్లించి నగరాభివృద్ధికి భాగస్వాములైన వారందరికీ అభినందనలు తెలిపారు. గతేడాది ముందస్తు ఆస్తి పన్ను రూ.56.27 కోట్లు వసూలైనట్లు పేర్కొన్నారు. నిరంతరం మెసేజ్‌లు, నోటీసులు అందించడంతోపాటు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు, అదనపు కౌంటర్ల ఏర్పాటు వల్ల ఈ లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.

ఏపీపీసెట్ ఫీజు గడువు పెంపు

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీసెట్ ఫీజు గడువు పెంచుతున్నట్లు కన్వీనర్ ఆచార్య పాల్‌కుమార్ చెప్పారు. ఈ నెల 15 వరకు గడువు పెంచామని, రూ. 1000 అపరాధ రుసుముతో మే 20 వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో మే 25 వరకు ఈ నెల 24 నుంచి 26 వరకు తప్పుల సవరణకు అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 28 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ తెలిపారు. జూన్ 3 నుంచి ఏఎన్‌యూలో పీసెట్ ఎంపికలు నిర్వహిస్తామని ఆచార్య పాల్‌కుమార్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం http://www.cets.apsche.ap.gov.in సంప్రదించాలని కన్వీనర్ కోరారు.

హజ్ యాత్రికుల భద్రతకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ఎమ్మెల్యే నసీర్ తదితరులు


పట్టాభిపురం: హజ్ యాత్రికుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని పొన్నూరు రోడ్డు ఎం.కన్వెన్షన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అధ్యక్షత వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ ప్రతి ముస్లిం జీవితంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్ర హజ్ అన్నారు. హజ్-2026 కోసం విజయవాడను ఎంబార్కేషన్ పాయింట్‌గా ఎంపిక చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లే యాత్రికులకు పెద్ద ఎత్తున ప్రయాణ సౌలభ్యం కల్పించామన్నారు. విమాన ప్రయాణ ఖర్చులో రూ.లక్ష అదనపు సహాయం అందిస్తున్నామన్నారు. విజయవాడ నుంచి మదీనాకు నేరుగా చార్టర్డ్ విమాన సర్వీసులు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. యాత్రికుల కోసం ప్రత్యేక బస్సు సదుపాయాలు కల్పించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి ఇతర ఎంబార్కేషన్ కేంద్రాలతో కూడా సమన్వయం కొనసాగుతుందన్నారు. యాత్రికుల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకుని సౌకర్యవంతమైన హజ్ యాత్రను అందించడం బాధ్యతగా భావిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. యాత్రికులు బయలుదేరినప్పటి నుంచి వారి ప్రయాణ భద్రత, సౌకర్యాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గన్నవరం హజ్ శిబిరంలో రిజిస్ట్రేషన్, వసతి, భోజనం, తాగునీరు, ప్రార్థనా స్థలాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

సెలవుల్లో ఊరెళుతున్నారా.. ఇల్లు జాగ్రత్త..!

ఎల్‌హెచ్‌ఎమ్ఎస్‌ను వినియోగించుకోవాలని పోలీసుల సూచన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే


వేసవి సెలవుల నేపథ్యంలో చాలా మంది ఇళ్లకు తాళాలు వేసి కుటుంబాలతో సహా తమ బంధుమిత్రుల ఇళ్లకు వెళుతుండటం సహజం. ఈ సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎమ్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలంటూ జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ చేసిన సూచనలను పోలీసులు ఇప్పటికే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎక్కువ రోజులు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులను సంప్రదించినా, యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో వివరాలు నమోదు చేసినా పోలీసులు ఇంటికి వచ్చి కెమెరాను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. ఇది పూర్తిగా ఉచితం. కెమెరా పరిధిలో పరిస్థితి ఏమిటన్నది సంబంధిత యజమాని చరవాణికి ఎప్పటికప్పుడు చిత్రాలను పంపుతుంటారు. పెట్రోలింగ్ సిబ్బంది సైతం ఆయా ఇళ్లకు వెళ్లి వెలుపలి నుంచి పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు. పది నుంచి 15 రోజుల వరకు ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత మరో ఇంటికి వినియోగించే వీలుంది.


పోలీసులను సంప్రదిస్తే ఇంట్లో ఏర్పాటు చేసే కెమెరా, బ్యాటరీ, ఆన్‌లైన్ పరికరం

పట్టణ ప్రాంతాల్లో అమలు

జిల్లాలో గుంటూరు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో ఈ విధానం అందుబాటులో ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలతోపాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, ఇతర అంశాలను పోలీస్ కంట్రోల్ రూమ్‌లకు ప్రజలు ఫోన్ చేసి చెప్పవచ్చు. ఇవి 24 గంటలూ పనిచేస్తాయి. గుంటూరు పోలీస్ కంట్రోల్ రూం నంబరు: 8688831568. ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ కోసం నంబరు: 8688831503. తెనాలి పోలీస్ కంట్రోల్ రూం నంబరు: 08644-228792. కొద్ది రోజుల క్రితం గుంటూరులో ఈ కెమెరాలు ఏర్పాటు చేసిన ఇంటిలో చోరీ యత్నాన్ని గుర్తించిన పోలీసులు సత్వరం ఘటనా స్థలికి చేరారు. పోలీసుల రాకను పసిగట్టిన దొంగ పారిపోయాడు.

వీటిని పాటించండి



– వి.జనార్ధనరావు, డీఎస్పీ, తెనాలి

★ ఇంటికి తాళం వేసి ఊరెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ★ ఇంటి ముందు భాగంలో తలుపునకు ఇచ్చిన ప్రాధాన్యం..వెనుక భాగానికి ఇవ్వక పోవడంతో దొంగలు సాధారణంగా ఆ మార్గాలనే వినియోగిస్తారు. అందువల్ల ఇంటి లోపలకు వచ్చే ప్రతి మార్గాన్ని కట్టుదిట్టం చేసుకోవాలి. ★ ఇంటి లోపల బంగారం వంటి విలువైన వస్తువులు పెట్టవద్దు. ★ సీసీ కెమెరాలు ఉన్న వారు వాటి డీవీఆర్‌లు కనిపించే ప్రదేశంలో కాకుండా రహస్య ప్రదేశంలో ఉంచాలి. ★ ఊరు వెళుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయవద్దు. ★ వాహనాలను ఇంటి ముందు రోడ్డుపై కాకుండా ఆవరణలో పార్కు చేయాలి. అవకాశం ఉంటే చైన్ వంటివి కూడా ఏర్పాటు చేయాలి. వాటి డిక్కీల్లో విలువైన వస్తువులు పెట్టవద్దు. ★ ఇంటి తాళాలను కుండీల్లో, చెప్పుల స్టాండ్ వద్ద ఉంచవద్దు. ఇంటి లోపల బీరువాల తాళాలు డ్రెసింగ్ టేబుల్, పరుపుల కింద పెట్టవద్దు. ★ ఇంటి సమీపంలోనే బంధువులు ఉంటే రోజూ ఒకటి, రెండు సార్లు ఇంటిని వెలుపలి నుంచి నిశితంగా గమనించమని కోరాలి. ఎల్‌హెచ్‌ఎమ్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాపరిషత్తు (గుంటూరు): జిల్లాలోని గ్రామీణ యువత, మహిళలు, రైతులకు స్వయం ఉపాధి కల్పించేందుకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గుంటూరు సమీపంలోని ... కేంద్రం అధిపతి, ముఖ్య శిక్షణ డైరెక్టర్ ... గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ... మే 22వ తేదీ వరకు శిక్షణ జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 99599 20099, 79894 86835 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నారసింహా.. నమోనమః



తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరం కొండపై విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, విశేష అలంకరణ చేశారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో అర్చన, దివ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

400 కిలోల గంజాయి, మత్తు పదార్థాల దహనం


గంజాయి దహన ప్రక్రియ పరిశీలిస్తున్న అధికారులు

గుంటూరు నేర వార్తలు: జిల్లాలోని 18 పోలీసు స్టేషన్ల పరిధిలో పట్టుకున్న 400 కిలోల గంజాయి, మత్తు పదార్థాలను ప్రత్యేక అధికారుల కమిటీ పర్యవేక్షణలో గురువారం యడ్లపాడు పరిధిలోని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ ఎండీ నజీనా బేగం, ఏఎస్పీ రమణమూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు


మాట్లాడుతున్న కలెక్టర్ సాయికాంత్ వర్మ

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సీఆర్డీఏ కార్యాలయంలో జిల్లా తాగునీటి, పారిశుద్ధ్య కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి రాకుండా ప్రతి నిత్యం పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు మురుగు నీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు అవకాశం ఉన్న గ్రామాల జాబితాను సమర్పించాలన్నారు. జిల్లాలో కనీసం రెండు ఆదర్శ గ్రామాలను రూపొందించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో అన్ని సౌకర్యాలు సంపూర్ణంగా ఉండాలన్నారు. ఆదర్శ గ్రామాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, కాలువలు, రహదారులు, పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, వీధి దీపాలు, మంచి వైద్య సేవలు, విద్య తదితర సౌకర్యాలు ఉండాలన్నారు. జిల్లాలోని ఏ ప్రాంతంలోనూ తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండరాదని, కాలువల నుంచి తాగునీటి పైపులైన్లు వెంటనే తొలగించాలన్నారు. మురుగు కాలువల్లో తాగునీటి పైపులైన్లు లీకై అతిసార బారిన పడితే క్షేత్ర స్థాయిలో సిబ్బంది నుంచి పర్యవేక్షణ ఇంజినీర్ వరకు బాధ్యత వహించాల్సిందేనన్నారు. సమావేశంలో డీపీవో నాగసాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కల్యాణచక్రవర్తి, డ్వామా పీడీ వి.శంకర్, అధికారులు పాల్గొన్నారు.

రాజధాని అమరావతిలో వడగళ్ల వాన

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో గురువారం సాయంత్రం వడగళ్ల వాన పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఇంట్లో ఉక్కపోతకు పిల్లలు, పెద్దలు, వృద్ధులు అల్లాడిపోయారు. ఏదైనా పని మీద బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోయారు. ఆ సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఈదురు గాలులు వీచాయి. ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెలగపూడి, లింగాయపాలెం చుట్టు పక్కల కాసేపు భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో వడగళ్లు పడ్డాయి. దీంతో కొద్ది సేపు రాకపోకలకు జనం ఇబ్బందులు పడ్డారు.

బందోబస్తు విధుల్లో హెడ్ కానిస్టేబుల్‌కు అస్వస్థత

తాడికొండ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా బందోబస్తు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గుంటూరులోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్‌వలి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. రాజధానిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో భాగంగా గురువారం ఆయన బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో వేడికి తట్టుకోలేక మధ్యాహ్నం స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే స్థానిక పోలీస్ సిబ్బంది ఆయన్ను మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుని ఇంటికి చేరుకున్నారు.

అందుబాటులోకి అన్ని విభాగాల సేవలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు సర్వజనాసుపత్రి (జీజీహెచ్) ఆవరణలో కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా నిర్మించిన డాక్టర్ కానూరి జింకానా మాతాశిశు సంరక్షణ కేంద్రంలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. రూ.127 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన ఈ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ఏడాది జనవరి 30న ప్రారంభించగా.. ఇప్పుడు అన్ని విభాగాల సేవలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయి. గతంలో ఆసుపత్రి ఎంసీహెచ్ విభాగంలో అందే మాతాశిశు వైద్య సేవలన్నింటినీ ఈ కేంద్రానికి తరలించారు. ప్రసూతి విభాగంలో 300 పడకలు, పీడియాట్రిక్ విభాగంలో 200 పడకలతో పాటు ఎన్‌ఐసీయూ, పీఐసీయూ, ఎస్‌ఎన్‌సీయూ సేవలు 24 గంటలు అందుబాటులోకి తీసుకొచ్చారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న సీనియర్ గైనకాలజిస్టులు, పీడియాట్రీషియన్లు, అనుభవజ్ఞులైన నర్సింగ్ సిబ్బంది ఇక్కడ విధుల్లో చేరారు. ఆపరేషన్ థియేటర్లు, లేబర్ రూములు, ఆధునిక పరికరాలన్నీ పూర్తిగా సిద్ధమయ్యాయి. మాతాశిశు వైద్యసేవల కోసం ప్రజలు ఇకపై నేరుగా కానూరి జింకానా మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని సంప్రదించాలని ఆసుపత్రి అధికారులు తెలిపారు.

బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనుల ప్రారంభం నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో బసవతారకం ఇండో - అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి మరో ముందు అడుగు పడనుంది. తుళ్లూరు సమీపంలో కేటాయించిన స్థలంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఆ సంస్థ ఛైర్మన్, సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించనున్నారు. ఆసుపత్రి నిర్మాణానికి గతేడాది ఆగస్టు 13న శంకుస్థాపన జరిగింది. అప్పటి నుంచి అనివార్య కారణాల వల్ల పనులు వాయిదా పడుతూ వచ్చాయి. పర్యావరణ అనుమతులు తదితర అడ్డంకులు తొలగిపోవడంతో పనులు ప్రారంభించనున్నారు. మొత్తంగా 21 ఎకరాల్లో రెండు దశల్లో 500 పడకలతో అన్ని వసతుల్లో విశాలంగా ఈ ఆసుపత్రి రూపుదిద్దుకోనుంది. 2028 నాటికి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకుగాను సుమారు రూ.750 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231. కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -113 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203 చికెన్ స్కిన్‌లెస్ - 231 అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 100, 109, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 300.

సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన ఫలితాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు): జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో గత ఏడాది కంటే ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా గిరిజన సంక్షేమ హాస్టళ్ల నుంచి 30 మంది పరీక్షలకు హాజరు కాగా 28 మంది (93 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 80 శాతమే సాధించారు. నాలుగు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి 68 మందికి 58 మంది (85.29 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ❖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ 14 వసతి గృహాల నుంచి 110 మంది పరీక్షలకు హాజరయ్యారు. 89 మంది విద్యార్థులు (81 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 80 శాతాన్ని అధిగమించారు. ❖ జిల్లా బీసీ సంక్షేమ శాఖకు చెందిన 11 హాస్టళ్ల నుంచి 141 మంది పరీక్షలకు హాజరయ్యారు. 127 మంది (90.07 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదిలో 91.82 శాతం కంటే 1.75 శాతం తగ్గింది.

అంబేడ్కర్ గురుకులాల్లో 87.31 శాతం ఉత్తీర్ణత

జిల్లాపరిషత్తు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 87.31 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,435 మంది పరీక్షలకు హాజరు కాగా.. 1,253 మంది ఉత్తీర్ణులయ్యారు. 182 మంది ఫెయిలయ్యారు. గత ఏడాది 2024-25లో 87.56 శాతం ఉత్తీర్ణులు కాగా.. ఈ ఏడాది కొంత తగ్గింది. ❖ బాపట్ల జిల్లా యద్దనపూడి బాలికల గురుకులం విద్యార్థినులు 100 శాతం ఉత్తీర్ణులు కాగా.. చుండూరు బాలుర గురుకులం విద్యార్థులు అత్యల్పంగా 67.80 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ❖ గుంటూరు జిల్లాలోని కాకుమాను, తాడికొండ, అడవితక్కెళ్లపాడు గురుకులాల నుంచి 211 మంది పరీక్షలకు హాజరు కాగా 196 మంది ఉత్తీర్ణులయ్యారు. 92.89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ❖ పల్నాడు జిల్లాలోని 10 గురుకులాల నుంచి 749 మంది పరీక్షలకు హాజరవగా.. 636 మంది ఉత్తీర్ణత సాధించారు. 84.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ❖ బాపట్ల జిల్లాలోని ఏడు గురుకులాల నుంచి 475 మందిలో 421 మంది ఉత్తీర్ణులయ్యారు. 88.63 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పట్టుదలతో చదివారు.. ఫలితాలతో హుషారు..

గుంటూరు బృందం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదివారు. పాఠశాలలో చదివింది మళ్లీ రివిజన్ చేసుకుంటూ.. పకడ్బందీ ప్రణాళికతో సాగారు. పరీక్షల్లో అధిక మార్కులు కైవసం చేసుకున్నారు. ప్రతిభావంతుల వివరాలిలా..

● విద్యార్థి పేరు ● మార్కులు ● ఊరు, మండలం ● పాఠశాల పేరు ● తల్లిదండ్రులు ● లక్ష్యం

- ● కూరపాటి సాయినిత్యప్రియ ● 596 ● వైలుపేట, గుంటూరు ● సరళ(గృహిణి), శివప్రసాద్ ● సివిల్స్ రాసి కలెక్టర్ కావడం
- ● బి.ఈ.శార్వీ ● 596 ● రెడ్డిపాలెం ● శివారాణి అధ్యాపకులు, విజయ్‌కుమార్ ఉపాధ్యాయుడు ● ఐఐటీలో సీటు తెచ్చుకోవడం
- ● టీవీ.యశశ్రీ ● 596 ● గుంటూరు ● ఉషాకిరణ్ గృహిణి, కోటి ప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ● ఐఐటీ చెన్నైలో ఎయిరోనాటికల్ ఇంజినీరింగ్
- ● జి.లోహితాశ్రీ ● 596 ● తిరుపతి ● గీత గృహిణి, రమేష్‌నాయుడు లాయర్ ● సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత ఉద్యోగం
- ● ఎం.మనోజ్ఞ ● 596 ● నరసరావుపేట ● అరుణ టైలర్, బాలరాజు ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ ● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- ● మద్దుల త్రిలోకవరదీపక్ ● 595 ● చెరుకుపల్లి ● లీలాశ్రావ్యశ్రీ, పాండురంగారావు ● ఐఐటీ ర్యాంకు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం
- ● బలభద్రపాత్రుని హేమచంద్ర ● 595 ● నరసరావుపేట ● గాయత్రి(గృహిణి), ప్రవీణ్‌కుమార్ ● ఏరోస్పేస్ ఇంజినీర్ కావడం
- ● నేలం తేజస్విత ● 596 ● కొలకలూరు, తెనాలి మండలం ● సుబ్బారావు, అనూరాధ (ప్రభుత్వ ఉపాధ్యాయులు) ● ఐపీఎస్
- ● బి.మోక్షశ్రీ ● 595 ● స్తంభాలగరువు, గుంటూరు ● నాగసౌజన్య గృహిణి, ఏసుదాసు వ్యాపారి ● ఛార్టెడ్ అకౌంటెంట్
- ● అల్ల తరుణి ● 594 ● గోరంట్ల, గుంటూరు ● రాధ (గృహిణి), శివ ● సివిల్స్ రాసి కలెక్టర్ కావడం
- ● తిరువీధుల బేబి బృంద ● 594 ● తెనాలి ● నాగమల్లేశ్వరి (గృహిణి), వెంకటేశ్వరరావు (వ్యాపారి) ● సీఏ (చార్టెడ్ ఎకౌంటెంట్)
- ● గోదా టీనా వెంకటతేజశ్రీ ● 594 ● ఆనందపురం, పట్టెసిద ● విజయలక్ష్మి(గృహిణి), పోతురాజు (ప్రభుత్వ ఉద్యోగి) ● డాక్టర్
- ● యద్దనపూడి మిధున్ వెంకట్ చక్రవర్తి ● 594 ● పొన్నూరు ● ధనలక్ష్మి, రమేష్‌బాబు ● ఐఐటీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం.
- ● కనుకుర్తి లేఖన ● 594 ● అంగలకుదురు, తెనాలి మండలం ● విజయశాంతి, జయరాజు (ఇరువురూ ప్రభుత్వ ఉపాధ్యాయులు) ● ఐఐఐటీ
- ● వెంకటషణ్ముఖ శ్రీసాయిఅభిరామ్‌హర్ష ● 593 ● తెనాలి ● మాధవీలత (గృహిణి), వెంకటచలపతి రావు (బ్యాంకు అధికారి) ● డాక్టర్
- ● తుంగ శ్రావణి నిరూప ● 593 ● సత్తెనపల్లి ● జ్యోతి, శివప్రసాదరావు ● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం
- ● కంభంపాటి శాంతిశ్రీ ● 593 ● సత్తెనపల్లి ● పద్మజ(గృహిణి), శ్రీనివాసరావు ● సీఏ (చార్టెడ్ ఎకౌంటెంట్) కావడం
- ● వేదుల భవ్య ● 593 ● పోలకంపాడు ● ప్రమీల (గృహిణి), కిరణ్ (వ్యాపారి) ● ఐఐటీలో ర్యాంకు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- ● ముక్తా లోహిత ● 593 ● నారాకోడూరు, చేబ్రోలు మండలం ● చైతన్య, చౌదరి (ప్రయివేటు ఉద్యోగులు) ● చార్టర్డ్ ఎకౌంటెంట్
- ● సోంపర్ల మెర్సీత రెడ్డి ● 592 ● సమతానగర్, గుంటూరు ● సుప్రజ, శరత్ మహేందర్‌రెడ్డి ● ఐఐటీలో ర్యాంకు సాధించి ఇంజినీరింగ్
- ● బొమ్మిశెట్టి తనీష్ ● 592 ● తెనాలి ● వెంకటప్రశాంతి(గృహిణి), ప్రశాంత్(ఫార్మా కంపెనీ ఉద్యోగి) ● యూనిట్ లీడర్ ఐఐటీ సీటు
- ● షేక్.కరీమా అబ్బుల్ ● 592 ● తెనాలి ● షాకీరాబీ (గృహిణి), మహబూబ్ సుభానీ (విశ్రాంత సైనికోద్యోగి) ● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- ● అయిలం అభిరాంచరణ్ ● 592 ● ఉరంపాలెం ● రమాదేవి గృహిణి, రామకోటేశ్వరరావు వ్యవసాయం ● ఐఐటీ ముంబై
- ● షేక్.రహమతున్నీసా ● 591 ● తెనాలి ● హసీనా (గృహిణి), అబ్దుల్ ఖాదర్ (ఆటో మెకానిక్) ● డాక్టర్
- ● సుద్దపల్లి పవిత్ర ● 591 ● తెనాలి ● సుబ్బారావు(ప్రభుత్వ ఉద్యోగి), ప్రశాంతిప్రియదర్శిని (బ్యాంకు అధికారిణి) ● సివిల్స్
- ● కారంపూడి హసీనా ● 591 ● మంగళగిరి ● రేవతి (గృహిణి), ప్రభాకర్‌రావు (స్వర్ణకార పని) ● సీఏ (చార్టెడ్ ఎకౌంటెంట్)
- ● అల్లక చాందిని ● 591 ● మంగళగిరి ● చంద్రిక (గృహిణి), చంద్రశేఖర్ (స్వర్ణకార పని) ● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- ● పెండెం రమాకాంతి ● 591 ● పెదకాకాని ● రేవతి గృహిణి, శివకృష్ణ ప్రైవేటు కంపెనీలో జాబ్ ● ఐఐటీలో సీటు సాధించాలని.
- ● షేక్ ఉమ్మర్ ముస్తాన్ ● 591 ● వేములూరిపాడు, మేడికొండూరు ● షాహీనా (టైలరింగ్), నజీర్ (ఆటో చోదకుడు) ● వైద్యుడు
- ● చుక్క అభిషేక్ ● 590 ● రాజుపాలెం, పెదనందిపాడు ● యశోద (వీఆర్వో), సునీల్ బాబు (రైతు) ● నీట్‌లో ర్యాంకు సాధించి డాక్టర్
- ● తమ్మిశెట్టి అమూల్య ● 590 ● డోకిపర్రు, మేడికొండూరు ● రాణి (ప్రైవేటు ఉద్యోగం), నాగార్జున (ఆటో చోదకుడు) ● కలెక్టర్
- ● పల్లెబోయిన మహిత ● 590 ● శ్యామలానగర్, గుంటూరు ● సునీత, హనుమంతరావు ● నీట్ ర్యాంకు సాధించి గైనకాలజిస్ట్ కావడం
- ● కటికి అనూష ● 589 ● అత్తోట, కొల్లిపర ● జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అత్తోట ● వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ (వ్యవసాయం) ● ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్
- ● కనపాల రూప ● 589 ● అన్నవరం, నిడుబ్రోలు ● ఎంఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల, నాగమణి, దేవరాజు, ఆటో డ్రైవర్ ● డాక్టర్
- ● జి.వెంకట పూర్ణ సాయి ● 588 ● గుడవల్లి, రాజుపాలెం మండలం ● ఏపీఎంఎస్, తాడికొండ ● శివకుమారి (గృహిణి), గోపి బాబు (చిరు ఉద్యోగి) ● వ్యాపార రంగంలో రాణించాలి
- ● గంజి అభినవ్ ● 588 ● తెనాలి ● పురపాలక బాలురోన్నత పాఠశాల ● మౌనిక (గృహిణి), నాగరాజు (ప్రయివేటు ఉద్యోగం) ● సివిల్స్ విజేతగా నిలవడం
- ● రాజశేఖర్ల పూజితగోవర్ధనభవాని ● 586 ● తురుమెళ్ల ● పురపాలక బాలికోన్నత పాఠశాల ● తెనాలి ● తపస్వి (గృహిణి), వెంకటనాగమల్లేశ్వరరావు (రైతు) ● ఐపీఎస్
- ● పోకూరి సూర్యశ్రీ ● 585 ● తెనాలి ● పురపాలక బాలికోన్నత పాఠశాల ● శ్యామలగౌరి (గృహిణి), వెంకటహనుమత్‌ప్రసాద్ (టీవీ మెకానిక్) ● డాక్టర్
- ● నలుకుర్తి అలేఖ్య ● 585 ● తెనాలి మండలం కొలకలూరు గ్రామం ● కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ● సప్న (గృహిణి), బాబురావు (పెయింటర్) ● ఐపీఎస్
- ● యమునశ్రీ ● 585 ● మున్నంగి, కొల్లిపర ● జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మున్నంగి ● కోమలి, సుబ్రహ్మణ్యం (వ్యవసాయం) ● ఐఐటీలో ర్యాంకు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ప్రతిభావంతులకు అభినందన



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చాటిన భాష్యం విద్యార్థులను గుంటూరు నగరంలోని చంద్రమౌళినగర్‌లో భాష్యం మెయిన్ క్యాంపస్‌లో అభినందిస్తున్న భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ - **న్యూస్‌టుడే, గుంటూరు విద్య**

గుంటూరు రైల్వేస్టేషన్‌లో అరగంట ఉత్కంఠ

స్టేషన్ ఫైబర్ టాప్ ఎక్కిన మతిస్థిమితం లేని వ్యక్తి

గుంటూరు రైల్వే: నిత్యం వందలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే గుంటూరు రైల్వేస్టేషన్‌లో గురువారం మధ్యాహ్నం అరగంట పాటు ఉత్కంఠ నెలకొంది. గుర్తుతెలియని ఓ వ్యక్తి 8వ నంబరు ప్లాట్‌ఫాం ప్రవేశ ద్వారం ఆవరణలోని ఫైబర్ టాప్ పైకి ఎక్కడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. దాదాపుగా 35 నుంచి 40 అడుగులు ఎత్తులో ఉండటంతో.. కింద పడితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. సమాచారం అందుకున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ అంజిబాబు, ఎస్సై సుభానీలు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ వ్యక్తితో సంయమనంతో మాట్లాడుతూ అరగంట పాటు శ్రమించి సురక్షితంగా కిందకు దించారు. ఆ వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేదని గుర్తించిన పోలీసులు తక్షణ వైద్యసేవల నిమిత్తం గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో వ్యక్తి ప్రాణాలు నిలబడ్డాయని ప్రయాణికులు అభినందించారు.



వ్యక్తిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న జీఆర్పీ, అగ్నిమాపక సిబ్బంది

పది ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల విజయం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం బృందావన్‌గార్డెన్స్ పాఠశాల ఆవరణలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీ షబ్నమ్ 600 మార్కులకు 597, ఎస్.సాత్విక్‌సాయి 594, జి.తేజసామిక 593, రిషిఈశ్వర్ 593, జి.జోషన్‌శ్రీకర్ 593 సాధించారని వివరించారు. ముగ్గురికి 592, ఐదుగురికి 591, 17 మందికి 590కి పైగా, 74 మందికి 580కి పైగా, 176 మందికి 570కి పైగా, 271 మందికి 560కి పైగా, 344 మందికి 550కి పైగా, 641 మందికి 500కి పైగా మార్కులు వచ్చాయన్నారు. గణితంలో 104 మందికి, తెలుగులో 108 మందికి, సోషల్‌లో 71 మందికి, సైన్స్‌లో 19 మందికి వందమార్కులు చొప్పున వచ్చాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జోసఫ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి మనోజ్, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థ డైరెక్టర్లు విజయభాస్కరరెడ్డి, జోసఫ్‌రెడ్డి తదితరులు

అత్యాచారం కేసు నిందితుడి విచారణ

విజయవాడ: విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఓ వివాహితపై జరిగిన అత్యాచారం ఘటనలో నిందితుడిని విజయవాడ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ఘటనపై రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు అనంతరం కేసును విజయవాడ జీఆర్పీకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా పోరాడదాం

ఈనాడు, అమరావతి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా పోరాడి, వంద శాతం స్థానాల్ని గెలుచుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే యరపతినేని నివాసంలో పల్నాడు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు గురువారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడులో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో జరిగే విషప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. జిల్లా నేతల మధ్య ఎటువంటి అంతరాయాలు లేవని, స్థానికసంస్థల ఎన్నికల్లో విజయం సాధించి కార్యకర్తలు, నాయకుల్లో మనోధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ వరకు సాగు నీరు సరఫరా చేసిన విషయాన్ని కూడా ప్రచారం చేయాలని సూచించారు. తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆదేశాలతో జరిగిన ఈ సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జాన్‌సైదా, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మారెడ్డి, జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యరపతినేని ఇంట్లో సమావేశమైన ఎంపీ, ఎమ్మెల్యేలు

బదిలీపై వెళుతున్న జిల్లా జడ్జిలకు సన్మానం

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: గుంటూరు నుంచి బదిలీపై వెళుతున్న ముగ్గురు అదనపు జిల్లా జడ్జిలను గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు గురువారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. నాలుగో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహించిన ఆర్.శరత్‌బాబు, ఐదో అదనపు జిల్లా జడ్జిగా పని చేసిన కె.నీలిమ, కుటుంబన్యాయస్థానం న్యాయమూర్తి జి.చక్రపాణిని హైకోర్టు గుంటూరు నుంచి బదిలీ చేసిన విషయం విదితమే. గురువారం వీరు తమ బాధ్యతలను ఇన్‌ఛార్జిలకు అప్పగించారు. సాయంత్రం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు మదిర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న ముగ్గురు న్యాయమూర్తులు మంచి సేవలు అందించారని కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావుతో పాటు పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయమూర్తుల సేవలను గుర్తు చేసుకున్నారు. నగరంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మళ్ళపల్లి రమేష్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు సత్యవతి, శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా అదనపు జడ్జిలు ఆర్.శరత్‌బాబు, కె.నీలిమ, జి.చక్రపాణిలను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

పెదరావూరు ఆలయంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ పూజలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఛైర్‌పర్సన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ఒక వేడుకకు హాజరయ్యే నిమిత్తం గురువారం తెనాలి వచ్చారు.



పూజలు నిర్వహించిన జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులు

తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని శ్రీఅభయహస్త సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సతీసమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ స్వాగతం పలికారు. న్యాయమూర్తి ఇందిరాప్రియదర్శిని దంపతులు, తెనాలి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పాలడుగు సురేంద్ర తదితరులు ఉన్నారు.

బాపట్ల జిల్లా జలవనరుల శాఖాధికారిగా గోపీనాథ్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా జలవనరుల శాఖాధికారిగా కె.గోపీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఈఎన్‌సీ ఎంఎల్ఎన్ వరప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఆయన గుంటూరులో నీరు - ప్రగతి ఎస్ఈగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా జలవనరుల శాఖాధికారిగా పని చేసిన విజయవాడ కడా ఎస్ఈ వేణుగోపాల్‌ను అదనపు బాధ్యతల నుంచి తప్పించారు.

ఈనాడు ప్రతిభ
గుంటూరు, శుక్రవారం, మే 1, 2026
VI
• https://pratibha.eenadu.net • https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

❖ ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్‌–2026'ను మార్చి 26 నుంచి ఏప్రిల్ 6 వరకు ఏ రాష్ట్రంలోని రాయ్‌పుర్, జగదల్‌పుర్, సర్గుజాల్లో నిర్వహించారు?

జ: ఛత్తీస్‌గఢ్ (గిరిజన యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏడు క్రీడాంశాల్లో (అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, రెజ్లింగ్) ఈ పోటీలను నిర్వహించారు.)

❖ ఇటీవల 500 అంతర్జాతీయ వికెట్ల మైలురాయిని చేరుకున్న భారత్ బౌలర్ ఎవరు?

జ: జస్‌ప్రీత్ బుమ్రా (2026 టీ-20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో 'ఇంగ్లాండ్ క్రికెటర్ హ్యారీ బ్రూక్‌ను అవుట్ చేయడం ద్వారా బుమ్రా ఈ ఘనత సాధించాడు.)

❖ ది హురున్ రిచ్ లిస్ట్ 2026 ప్రకారం భారత్‌లో ఎంత మంది బిలియనీర్లు ఉన్నారు?

జ: 308 (బిలియనీర్ల సంఖ్యలో భారత్ ప్రపంచంలో చైనా, అమెరికాల తర్వాత మూడో స్థానంలో నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. భారత్‌లో అత్యంత ధనవంతుల జాబితాలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.)


మాదిరి ప్రశ్నలు

మరింత సమాచారం

హైకోర్టు

రాష్ట్ర స్థాయిలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు. భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ఆర్టికల్స్ 214 నుంచి 231 మధ్య హైకోర్టు నిర్మాణం, న్యాయమూర్తుల నియామకం, తొలగింపు ప్రక్రియ, హైకోర్టు అధికారాలు, విధులు మొదలైన అంశాలను వివరించారు.

చారిత్రక నేపథ్యం: ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861 ప్రకారం దేశంలో తొలిసారిగా 1862లో కోల్‌కతా మద్రాస్, బొంబాయిల్లో హైకోర్టులు ఏర్పాటయ్యాయి. కోల్‌కతా హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ బార్నెస్ పీకాక్. 1866లో అలహాబాద్ హైకోర్టు ఏర్పడింది.


సర్ బార్నెస్ పీకాక్

భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వతంత్ర న్యాయ వ్యవస్థలో రాష్ట్ర స్థాయిలో అత్యున్నత విభాగం హైకోర్టు. రాజ్యాంగంలోని నాలుగో భాగంలో పొందుపరిచి ఉన్న నిబంధనలు హైకోర్టుల నిర్మాణం, అధికారాలు, బాధ్యతలను వివరిస్తున్నాయి. బ్రిటిష్ కాలంలో పందొమ్మిదో శతాబ్దం రెండో భాగంలో కోల్‌కతా, మద్రాస్, బొంబాయిల్లో ప్రారంభమైన హైకోర్టుల ప్రస్థానం, నేడు దేశవ్యాప్తంగా విస్తరించి కొనసాగుతోంది. ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణలో, న్యాయ పరిపాలనలో ఈ ధర్మపీఠాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో న్యాయ పాలనకు అధిపతిగా ఉన్న హైకోర్టు గురించి రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలన్నింటినీ పోటీ పరీక్షార్థులు ఆర్టికల్స్‌తో సహా గుర్తుంచుకోవాలి. న్యాయమూర్తుల నియామకం, అర్హతలు, తొలగింపు ప్రక్రియతో పాటు రిట్లను జారీ చేసే అధికారం, దిగువ న్యాయస్థానాలపై పర్యవేక్షణ తదితర అంశాలు హైకోర్టును రాష్ట్ర పాలనలో ఒక శక్తిమంతమైన రాజ్యాంగ వ్యవస్థగా నిలబెట్టిన తీరును అర్థం చేసుకోవాలి.


బాంబే హైకోర్టు

రాష్ట్ర పౌరుల హక్కులకు రక్షణ కవచం!

జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల న్యాయవాద వృత్తి చేపట్టడంపై పరిమితులు (ఆర్టికల్ 220): హైకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం వారు పనిచేసిన హైకోర్టుల్లో న్యాయవాద వృత్తిని చేపట్టకూడదు. సంబంధిత రాష్ట్ర హైకోర్టు పరిధిలోని దిగువ న్యాయస్థానాల్లో కూడా న్యాయవాద వృత్తిని చేపట్టకూడదు. సుప్రీంకోర్టులో లేదా ఇతర హైకోర్టుల్లో న్యాయవాద వృత్తిని చేపట్టవచ్చు.

పదవీ విరమణ వయసు: హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లు. ఈ వయసు విషయంలో మార్పులు, చేర్పులు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది. పదవీ కాలం ముగియక ముందే హైకోర్టు న్యాయమూర్తులు తమ పదవికి రాజీనామా చేయవచ్చు. రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పించాలి.

రాజ్యాంగ వివరణ

ఆర్టికల్ 214: హైకోర్టు ఏర్పాటు గురించి వివరిస్తుంది.

ఆర్టికల్ 231: రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు పార్లమెంటు ఒక చట్టం ద్వారా ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేయవచ్చు


అలహాబాద్ హైకోర్టు

ఆర్టికల్ 230 - ఏ కేంద్రపాలిత ప్రాంతం ఏ హైకోర్టు పరిధి కిందకు వస్తుందో వివరణ ఇస్తూ పార్లమెంటు చట్టం చేయవచ్చు.

7వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956 ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు: రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒక ఉమ్మడి హైకోర్టును ఏర్పాటుచేసే అధికారం పార్లమెంటుకు లభించింది.

ఆర్టికల్ 216: ప్రతి హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, కొంతమంది ఇతర న్యాయమూర్తులు ఉంటారు. ఒక హైకోర్టులో ఎంతమంది న్యాయమూర్తులు ఉండాలనేది సంబంధిత హైకోర్టు పరిధిలోని జనాభా, వైశాల్యం, వివాదాలు, పనిభారం ఆధారంగా రాష్ట్రపతి సూచన మేరకు పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. దేశంలో ఎక్కువ న్యాయమూర్తులు ఉన్న హైకోర్టు అలహాబాద్ హైకోర్టు. ఇక్కడ సుమారు 159 మంది వరకు న్యాయమూర్తులు ఉన్నారు. ▸ 2019, జనవరి 1 నుంచి తెలంగాణ హైకోర్టు పనిచేస్తోంది. దీనిలో న్యాయమూర్తుల సంఖ్య 42. వీరిలో శాశ్వత న్యాయమూర్తులు 32 మంది, అదనపు న్యాయమూర్తులు 10 మంది. ▸ 2019, జనవరి 1 నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పనిచేస్తోంది. మంజూరైన న్యాయమూర్తుల పోస్టులు 37.

అర్హతలు (ఆర్టికల్ 217)

హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకానికి కొన్ని అర్హతలు ఉండాలి. ▲ భారతీయ పౌరుడై ఉండాలి. ▲ జిల్లా కోర్టులో న్యాయమూర్తిగా కనీసం పదేళ్లు పని చేసిన అనుభవం ఉండాలి (లేదా) హైకోర్టులో న్యాయవాదిగా కనీసం పదేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. ▲ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని 'కొలీజియం' సిఫార్సుల మేరకు హైకోర్టుకు ప్రధాన, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు.

జీతభత్యాలు (ఆర్టికల్ 221)



హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. ఈ జీతభత్యాలకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. వీటిని రాష్ట్రాల సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత కేంద్ర సంఘటిత నిధి నుంచి పింఛను పొందుతారు. ఆర్థిక అత్యవసర పరిస్థితిలో తప్ప, ఇతర సందర్భాల్లో న్యాయమూర్తుల జీతభత్యాల్లో కోత విధించకూడదు. ▲ ప్రస్తుతం హైకోర్టు న్యాయమూర్తి వేతనం: రూ.2,25,000, ప్రధాన న్యాయమూర్తి వేతనం: రూ.2,50,000.

ప్రమాణ స్వీకారం (ఆర్టికల్ 219)




▲ హైకోర్టు ప్రధాన, ఇతర న్యాయమూర్తులు గవర్నర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ▲ సాధారణ న్యాయమూర్తులు గవర్నర్ లేదా ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో ప్రమాణం చేస్తారు.

> “సుప్రీంకోర్టు కంటే హైకోర్టు విచారణాధికార పరిధి ఎక్కువ. సుప్రీంకోర్టు కేవలం ప్రాథమిక హక్కుల రక్షణ కోసం మాత్రమే రిట్లు జారీ చేస్తుంది. హైకోర్టు ప్రాథమిక హక్కుల సంరక్షణతో పాటు రాష్ట్ర ప్రభుత్వ శాసనాలు, ఆర్డినెన్స్‌లు, జీవోలు, బైలాల అమలు కోసం కూడా ఆదేశాలు జారీ చేస్తుంది.”

న్యాయమూర్తుల తొలగింపు (ఆర్టికల్ 218): అసమర్థత, దుష్ప్రవర్తన ఆరోపణలపై హైకోర్టు న్యాయమూర్తులను పదవి నుంచి తొలగించవచ్చు. వీరి తొలగింపు తీరు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల తొలగింపు విధానం మాదిరి ఉంటుంది. ❖ హైకోర్టు న్యాయమూర్తులను తొలగించే అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటు ఉభయ సభలు విడివిడిగా 2/3వ వంతు ప్రత్యేకమైన మెజార్టీతో ఆమోదిస్తే రాష్ట్రపతి వారిని తొలగిస్తారు.

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల నియామకాలు

❖ ఆర్టికల్ 223 ప్రకారం ఏదైనా హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి పదవి ఖాళీగా ఉంటే తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి నియమిస్తారు. ❖ ఆర్టికల్ 224 ప్రకారం ఏదైనా హైకోర్టులో పనిభారం ఎక్కువగా ఉందని రాష్ట్రపతి భావిస్తే సంబంధిత రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి తాత్కాలిక న్యాయమూర్తులను నియమిస్తారు. వీరి పదవీ కాలం రెండేళ్లు. సాధారణ న్యాయమూర్తులకు లభించే సౌకర్యాలు, అధికారాలన్నీ వీరికీ వర్తిస్తాయి. ❖ ఆర్టికల్ 224(ఎ) ప్రకారం ఏదైనా హైకోర్టులో ప్రత్యేక కేసుల విచారణ సందర్భంగా అవసరమనుకుంటే పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులను వారి సేవల కోసం రాష్ట్రపతి నియమిస్తారు.





రచయిత: బంగారు సత్యనారాయణ

Transportation

10th Class Bridge Course
Biological Science

- Blood is a fluid connective tissue.
- Blood consists of a fluid medium called plasma in which cells are suspended.
- Blood cells are of three types.
- RBC are known as erythrocytes and are having haemoglobin for transportation of Oxygen and CO_2.
- WBC are known as leucocytes protects our body from foreign substances and diseases.
- Platelets help in blood clotting.



Our heart has four chambers two auricles or atria and two ventricles.

Blood vessels are of three types.

- Arteries having thick and elastic walls with high pressure of blood flow carry Oxygen rich blood from heart to body parts. ● Veins having thin walls and less elastic walls contain valves inside with low pressure of blood flow carry CO_2 rich blood from body parts to heart. ● Capillaries exchange substances that connect arteries and veins.

Blood circulation... If blood goes only once through the heart during one cycle of passage through the body it is known as single circulation. **e.g.:** Fish


- If blood goes through the heart twice during each cycle (once in between heart and lungs next in between heart and body parts) it is known as double circulation.

e.g.: All other vertebrates.

For more Concepts

Blood pressure


- The force that blood exerts against the wall of a vessel is called blood pressure.
- The pressure of blood inside the artery during ventricular systole (contraction) is called systolic pressure. It is about 120 mm of Hg. ● The pressure in artery during ventricular diastole (relaxation) is called diastolic pressure. It is about 80 mm of Hg. ● Hence normal blood pressure is about 120/80 mm of Hg.
- Blood pressure is measured with an instrument called sphygmamonometer. There is another type of fluid also involved in transportation called lymph or tissue fluid. Lymph is similar to the plasma of blood but colourless and contains less protein.



Writer: Mangalampalli Satyanarayanamurthy

వ్యర్థాలను వదిలించి.. రక్త పీడనాన్ని నియంత్రించి!

మానవ శరీరంలో జీవక్రియల వల్ల ఏర్పడిన వ్యర్థ పదార్థాలను విసర్జక వ్యవస్థ బయటకు పంపుతుంది. మూత్రపిండాలు ముఖ్య విసర్జక అవయవాలు. చర్మం, ఊపిరితిత్తులు, కాలేయం మొదలైనవి అనుబంధ విసర్జక అవయవాలుగా పని చేస్తాయి. రక్తాన్ని వడపోసి, మలినాలను, అదనపు పదార్థాలను బయటకు పంపి, రక్తపోటును నియంత్రించే మూత్రపిండాలు శరీర సమతాస్థితిని కాపాడటంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తాయి. మూత్రపిండాల నిర్మాణం, ప్రధాన విధులు, వాటి పనితీరు లోపానికి కారణాలు, వచ్చే వ్యాధులు, చికిత్సా విధానాల గురించి పోటీ పరీక్షార్థులకు కనీస పరిజ్ఞానం ఉండాలి. మూత్రం వివిధ రంగుల్లోకి మారడానికి, కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కారణాలు, డయాలసిస్ అవసరమయ్యే సందర్భాలు తదితరాలను తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - బయాలజీ

విసర్జక వ్యవస్థ

1. మానవుడి విసర్జక వ్యవస్థ ఏ పదార్థాలను శరీరం నుంచి బయటకు పంపుతుంది?
   ఎ) నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలు.
   బి) శరీరానికి అవసరం లేని పదార్థాలు.
   సి) ఉపయోగింపకోగా మిగిలిన పదార్థాలు.
   డి) అదనపు నీరు, లవణాలు.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి 3) సి, డి 4) ఎ, డి
2. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) అమ్మోనియాను ముఖ్య విసర్జక పదార్థంగా విసర్జించే జీవులు అస్థి చేపలు, కప్ప టాడ్‌పోల్ లార్వా
   బి) నీటిలో నివసించే జీవులు అమ్మోనియాను విసర్జిస్తాయి.
   సి) అమ్మోనియాను విసర్జించే జీవులను 'అమ్మోనోటెలిక్ జంతువులు' అంటారు.
   1) ఎ, బి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ, సి
3. వివిధ జంతువులు, అవి విసర్జించే నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల గురించి కింది వాటిలో సరైన జతలను ఎన్నుకోండి.




   ఎ) అమ్మోనియా - ప్రోటోజోవా, హైడ్రా, సాలమండర్, నత్త
   బి) యూరియా - క్షీరదాలు, కప్ప, తాబేలు, మృదులాస్థి చేపలు
   సి) యూరికామ్లం - పక్షులు, కీటకాలు, పాములు
   1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి 4) ఎ, బి, సి
4. జంతురాజ్యంలో వివిధ జీవుల విసర్జక అవయవాల గురించి కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) సకశేరుకాలు	1) మాల్ఫీజియన్ నాళికలు
బి) కీటకాలు	2) మూత్రపిండాలు
సి) మొలస్కా జీవులు	3) జ్వాలా కణాలు
డి) ప్లాటీహెల్మింథిస్ జీవులు	4) రీనల్ అవయవం
ఇ) అనిలెడా జీవులు	5) రెన్నెట్ కణాలు
ఎఫ్) నిమాటీహెల్మింథిస్ జీవులు	6) నెఫ్రీడియా

   1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5, ఎఫ్-6
   2) ఎ-3, బి-2, సి-4, డి-5, ఇ-6, ఎఫ్-1
   3) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-6, ఎఫ్-5
   4) ఎ-6, బి-5, సి-4, డి-2, ఇ-3, ఎఫ్-1
5. మానవుడిలో మూత్రపిండాల విధులకు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) నత్రజని సంబంధ వ్యర్థాలను బయటకు పంపుతాయి.
   బి) నీరు, లవణాల క్రమతను నియంత్రిస్తాయి.
   సి) ధమనుల్లో రక్తపీడనాన్ని నియంత్రిస్తాయి.
   డి) విటమిన్-డి తయారీకి ఉపయోగపడతాయి.
   ఇ) అదనపు, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతాయి.



   1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి 3) సి, డి, ఇ 4) ఎ, డి, ఇ
6. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాలు చిక్కుడు గింజ ఆకారంలో వెన్నెముకకు ఇరువైపులా ఉంటాయి.
   బి) మూత్రపిండాల బరువు సరాసరి 120-170 గ్రాములు.
   సి) మూత్రనాళాలు మూత్రాన్ని మూత్రపిండాల నుంచి మూత్రాశయానికి తీసుకొస్తాయి.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి
7. నెఫ్రానులో రక్తం వడపోత జరిగి, మూత్రం ఏర్పడటానికి ఉపయోగపడే కింది నెఫ్రాను భాగాల సరైన క్రమాన్ని ఎన్నుకోండి.



   1) వృక్కసిర - వృక్కధమని- గ్లోమెరులస్ - బౌమన్స్ గుళిక - హెన్లీశిక్యం- సమీప సంవళిత నాళిక - దూరస్థ సంవళిత నాళిక.
   2) వృక్కసిర - సమీప సంవళిత నాళిక - దూరస్థ సంవళిత నాళిక - బౌమన్స్ గుళిక - హెన్లీ శిక్యం - గ్లోమెరులస్ - వృక్కధమని
   3) గ్లోమెరులస్ - వృక్కసిర - వృక్కధమని - సమీప సంవళిత నాళిక - దూరస్థ సంవళిత నాళిక - బౌమన్స్ గుళిక- హెన్లీ శిక్యం
   4) వృక్కధమని - గ్లోమెరులస్ - బౌమన్స్ గుళిక - సమీప సంవళిత నాళిక - హెన్లీ శిక్యం - దూరస్థ సంవళిత నాళిక
8. కింది వాక్యాల్లో సరికాని వాటిని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాలు వాయు వినిమయం చేసి రక్తాన్ని శుభ్రపరుస్తాయి.
   బి) ఒక జత మూత్రపిండాలు రోజుకు 190 లీటర్ల మూత్రాన్ని తయారుచేస్తాయి.
   సి) మూత్రం పసుపు రంగులో ఉండటానికి కారణం యూరోక్రోమ్.
   1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి
9. మూత్రంలో ఉండే పదార్థాలు వాటివల్ల కలిగే వ్యాధుల గురించి కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) హిమటూరియా	1) మూత్రంలో చీము ఉండటం
బి) గ్లైకోసూరియా	2) మూత్రంలో రక్తం ఉండటం
సి) ఆల్బిన్యూరియా	3) మూత్రం నల్లరంగులోకి మారడం
డి) ఆల్కాప్టోన్యూరియా	4) మూత్రంలో చక్కెర ఉండటం
ఇ) పైయూరియా	5) మూత్రంలో ప్రోటీన్ ఉండటం


   1) ఎ-1; బి-4; సి-3; డి-2; ఇ-5.
   2) ఎ-5; బి-3; సి-4; డి-2; ఇ-1
   3) ఎ-2; బి-4; సి-5; డి-3; ఇ-1
   4) ఎ-4; బి-3; సి-2; డి-1; ఇ-5
10. కింది వాటిలో సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.



   ఎ) ఒక రోజులో సరాసరి ఏర్పడే మూత్ర పరిమాణం 1.5 నుంచి 1.8 లీటర్లు.
   బి) ఆల్కహాల్, కాఫీ లాంటి వాటిని 'అతిమూత్ర వర్ధకాలు' అంటారు.
   సి) మూత్రం ఏర్పడటమనేది మనం తాగే నీటి పరిమాణం, శారీరక వ్యాయామంపై ఆధారపడి ఉంటుంది.
   1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి
11. మానవ మూత్రంలో కింది ఏ నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలుంటాయి?
   ఎ) అమ్మోనియా బి) యూరియా
   సి) యూరికామ్లం డి) క్రియాటినైన్
   1) ఎ, బి, డి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, బి
12. కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) మన శరీరంలో అదనపు అమైనో ఆమ్లాలు నిల్వ అవుతాయి.
   బి) రక్తంలో అధిక యూరియా ఉండటాన్ని 'యూరిమియా' అంటారు.
   సి) మూత్రంలో అధిక నీరు ఉండటాన్ని 'పాలి యూరియా' అంటారు.
   డి) మూత్రపిండాలు 'రెనిన్' అనే హార్మోన్ (ఎంజైమ్)ను స్రవించి రక్తపీడనాన్ని నియంత్రిస్తాయి.
   1) బి, డి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, డి
13. నెఫ్రాన్‌లోని కింది ఏ భాగం నుంచి రక్తం వడపోయడం వల్ల ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది?
   1) వృక్క ధమని 2) హెన్లీ శిక్యం
   3) గ్లోమెరూలస్ 4) బౌమన్స్ గుళిక
14. కింది వాటిలో సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాలు రోజుకు సుమారు 190 లీటర్ల రక్తాన్ని వడపోసి, శుభ్రపరుస్తాయి.
   బి) మూత్రపిండాల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు నెఫ్రానులు.
   సి) నెఫ్రానులు, మూత్రపిండాలు పనిచేసే విధాన అధ్యయనాన్ని 'నెఫ్రాలజీ' అంటారు.
   1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి
15. కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) కృత్రిమ మూత్రపిండం	1) గ్వానైన్
బి) మూత్రపిండంలోని రాళ్లు రసాయనికంగా..	2) యూరికామ్లం
సి) మూత్రంలో ఎక్కువ మైత్యరస వర్ణకాలు	3) కాల్షియం ఆగ్జలేట్
డి) పక్షుల్లో ముఖ్య నత్రజని సంబంధ పదార్థం	4) డయాలసిస్ యంత్రం
ఇ) సాలీడు విసర్జించే పదార్థం	5) కామెర్లు

   1) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
   2) ఎ-5, బి-3, సి-4, డి-2, ఇ-1
   3) ఎ-5, బి-1, సి-3, డి-2, ఇ-4
   4) ఎ-4, బి-3, సి-5, డి-2, ఇ-1
16. కింది జతల్లో తప్పుగా ఉన్న వాటిని గుర్తించండి.
   ఎ) కీటోన్యూరియా - మూత్రంలో కొవ్వు దేహాలు ఉండటం
   బి) ఎన్యూరియా - మూత్రంలో ఎసిటోన్ ఉండటం
   సి) నెఫ్రాలజీ - మూత్రపిండం, దీని వ్యాధుల అధ్యయనం
   డి) మూత్రపిండంలో రాళ్లు రసాయనికంగా - కాల్షియం కార్బొనేట్
   1) ఎ, బి 2) బి, డి 3) ఎ, సి 4) బి, సి
17. కింది వాక్యాల్లో సరైన వాటిని పరిశీలించి, సమాధానాన్ని గుర్తించండి.



   ఎ) నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల్లో అధిక విషపూరితమైంది అమ్మోనియా.
   బి) మన శరీరంలో చర్మం అదనపు విసర్జక అవయవంగా పనిచేస్తుంది.
   సి) పక్షుల ముఖ్య విసర్జక పదార్థం - యూరికామ్లం
   1) ఎ, బి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ, సి
18. మానవ మూత్రం ద్వారా కింది ఏ పదార్థాలు విసర్జితమవుతాయి?
   ఎ) ఎక్కువైన నీరు, లవణాలు
   బి) అదనపు విటమిన్ - సి
   సి) నత్రజని సంబంధ వ్యర్థాలు
   డి) యూరోక్రోమ్ వర్ణద్రవ్యం
   1) ఎ, బి, సి, డి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
19. కింది వాటిని పరిశీలించి, సరైన వాక్యాలను ఎంచుకోండి.
   ఎ) మూత్రపిండాలు ఎరిత్రోపాయిటిన్ ప్రోటీన్‌ను ఉత్పత్తి చేస్తాయి.
   బి) మూత్రనాళం మూత్రాన్ని మూత్రపిండం నుంచి మూత్రాశయానికి చేరవేస్తుంది.
   సి) మూత్రపిండం నుంచి రక్తాన్ని సంగ్రహించేది వృక్కసిర.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

సమాధానాలు

1-1, 2-2, 3-4, 4-3, 5-1, 6-3, 7-4, 8-2, 9-3, 10-1, 11-3, 12-1, 13-3, 14-3, 15-4, 16-2, 17-2, 18-1, 19-3.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు



దాతలను సత్కరిస్తున్న లక్ష్మీశివరామప్రసాద్, సభ్యులు


శిర్డీ సాయి మందిర అభివృద్ధికి విరాళం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గ్రామంలోని శిర్డీ సాయిమందిర్ అన్నపూర్ణాలయ అభివృద్ధి నిమిత్తం బచ్చు సుబ్బారావు, శకుంతల పేరిట (జ్ఞాపకార్థం) బాలకోటేశ్వరరావు, ధనలక్ష్మి, శివప్రసాద్, నాగలక్ష్మి దంపతులు రూ. 1,01,116 విరాళం అందజేసినట్లు కమిటీ వారు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ అధ్యక్షుడు లక్ష్మీశివరామప్రసాద్, కార్యదర్శి రామసుబ్బారావు, సభ్యులు శేఖర్, ఉమామహేశ్వరరావు ఘనంగా సత్కరించి సాయిబాబా చిత్రపటాలను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుదల అమోఘం.. భవిష్యత్తు పదిలం


• పేరు • మార్కులు • ఊరు • పాఠశాల

న్యూస్‌టుడే బృందం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం విడుదలైన ఫలితాల్లో పట్టుదల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉత్తమ మార్కులతో మెరిశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతంగా రాణించి సత్తా చాటారు.

 • మాడపాటి తనుశ్రీ • 589 • నవులూరు, మంగళగిరి • ప్రైవేటు

 • కట్టా శరణ్య • 589 • నవులూరు, మంగళగిరి • ప్రైవేటు పాఠశాల

 • జంపాల ప్రణవ్‌కృష్ణ • 589 • దుగ్గిరాల గ్రామం, మండలం • ప్రైవేటు

 • కొమ్మాలపాటి పోషిక • 589 • అన్నవరం, పెదనందిపాడు • ప్రైవేట్

 • దేవరపల్లి కళ్యాణి • 589 • పేరేచర్ల, మేడికొండూరు • ప్రైవేటు

 • ఇమ్మడి జయంత్ • 587 • పెదవడ్లపూడి, మంగళగిరి • ప్రైవేటు

 • అశ్విన్ సాయి • 587 • గొట్టిపాడు, ప్రత్తిపాడు మండలం • ప్రైవేటు

 • కటికల దురిత నాగసుదీప్ • 587 • వేములూరిపాడు, మేడికొండూరు • ప్రైవేటు

 • బొందిగ మోహన్‌కృష్ణ • 587 • రావిపాడు, పెదనందిపాడు • ప్రైవేటు

 • తోటా ప్రణతి • 585 • వరగాని, పెదనందిపాడు • ప్రైవేటు

 • గొట్టిపాటి శ్యాంబాబు నాయుడు • 585 • ఫిరంగిపురం • ప్రైవేటు

 • కొల్లి భార్గవి • 585 • నుదురుపాడు, ఫిరంగిపురం • ప్రైవేటు

 • మొగరాల అఖిల • 584 • తాడేపల్లి • జడ్పీ ఉన్నత పాఠశాల, తాడేపల్లి

 • కోనంకి మహా వెంకట నాగలక్ష్మి • 583 • మంగళగిరి • పీ.ఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్

 • మన్నవ కృపా ఐశ్వర్య • 584 • సరిపూడి, మేడికొండూరు • మేడికొండూరు జడ్పీ ఉన్నత

 • బడిసె నాగ వెంకట భువన చంద్ర • 584 • కొర్రపాడు, మేడికొండూరు • కొర్రపాడు జడ్పీ ఉన్నత


 • షేక్ బాబు ఆధిమున్ని • 582 • అమీనబాద్, ఫిరంగిపురం • ఎయిడెడ్ పాఠశాల, అమీనబాద్

 • గడ్డం పావనిదుర్గ • 581 • ముట్లూరు, వట్టిచెరుకూరు • ముట్లూరు జడ్పీ ఉన్నత

 • మథిర శ్రీప్రియ • 580 • పెదవడ్లపూడి, మంగళగిరి • జిల్లా పరిషత్ ఉన్నత

 • బుక్కా సాయిచందన • 579 • పెదపాలెం, దుగ్గిరాల మండలం • పెదపాలెం జిల్లాపరిషత్తు హైస్కూలు

 • లోకం హర్షనందిని • 579 • ఈమని, దుగ్గిరాల మండలం • ఈమని జడ్పీ హైస్కూలు

 • ఆదిమూలం తనూజ • 579 • ప్రత్తిపాడు • బీవీఆర్ జడ్పీ ఉన్నత, ప్రత్తిపాడు

 • బక్కా రవికుమార్ • 575 • గొట్టిపాడు, ప్రత్తిపాడు • జడ్పీ ఉన్నత, గొట్టిపాడు.

 • పెనుగొండ వెంకట షణ్ముఖప్రియ • 576 • చింతలపూడి, దుగ్గిరాల • జడ్పీ బాలికల ఉన్నత

• అజీజ్‌ఖాన్ • 573 • పెనుమాక, తాడేపల్లి • జడ్పీ ఉన్నత పాఠశాల

• అన్నలదాస్ అఖిల • 573 • పాలపర్రు, పెదనందిపాడు • శ్రీ వెలివోలు ప్రభుత్వ బాలికల సంస్థ

• షేక్.షఫీయా • 572 • గొట్టిపాడు, ప్రత్తిపాడు • జడ్పీఉన్నత, గొట్టిపాడు.

• తోటకూర జ్ఞాన దీపిక • 572 • ముట్లూరు, వట్టిచెరుకూరు • జడ్పీ ఉన్నత

• ఎస్‌కే.నసీమా బేగం • 572 • గారపాడు, వట్టిచెరుకూరు • జడ్పీ ఉన్నత

• బి.హారిక • 572 • కొర్నెపాడు, వట్టిచెరుకూరు • జడ్పీ ఉన్నత

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని వివరిస్తున్న నాగార్జున హైస్కూల్ డైరెక్టర్ రాఘవయ్య

మంగళగిరి, న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో మంగళగిరి మండలం పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. కె.జోత్స్న 600 మార్కులకుగాను 593 మార్కులు సాధించి హైస్కూల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయస్థానం కె.స్ఫూర్తి 587, ఆర్.వర్షిణి 586, ఐ.శరణ్యారెడ్డి 585, కనకసాయి యోషిత 583, కె.దేవిశ్రీ, ఎస్.సిరివెన్నెల, కె.చంద్రశేఖర్ ఒక్కొక్కరూ 581 మార్కులు సాధించారు. ఆర్.జాహితా చౌదరి 577, కె.నాహుపా 577, మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 84 మంది పరీక్షకు హాజరుకాగా 43 మందికి 500లకు పైగా మార్కులు వచ్చాయి. ఈ విజయానికి కారకులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందిని స్కూల్ డైరెక్టర్ రాఘవయ్య అభినందించారు.

సత్తా చాటి..ప్రశంసలు అందుకుని..



విద్యార్థినులను అభినందిస్తున్న ఉమామహేశ్వరరావు, టీచర్లు

మంగళగిరి, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి విజేత హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. కారంపూడి హాసిని 600 మార్కులకు 591 సాధించి పాఠశాలలోని ప్రథమస్థానంలో నిలిచింది. ఐ.జయంత్ 587, ఎల్.సాహితి 586, ఎం.గురుప్రవీణ 579, పి.భరతసింహారెడ్డి, కృష్ణవర్షిత 577 మార్కులు సాధించారని డైరెక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరాదేవి మాట్లాడుతూ 132మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 77 మంది 500లకు పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. మిగిలిన వారు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చిరువ్యాపారి దుర్మరణం

మేడికొండూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..డోకిపర్రుకు చెందిన పెదవలి హనుమయ్య (63) మోటారు సైకిల్‌పై ఇంటింటికీ తిరుగుతూ చింతపండు, ఉల్లిపాయలు విక్రయిస్తుంటారు. గురువారం సరకు తెచ్చుకునేందుకు బైక్‌పై గుంటూరు వెళ్లి తిరిగి వస్తుండగా.. పేరేచర్ల శివారు డోకిపర్రు అడ్డరోడ్డు వద్ద ఎదురుగా అజాగ్రత్తగా, వేగంగా వస్తున్న మరో బైక్ ఆయన్ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన హనుమయ్యను 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు, అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు.

ఆ దారులు.. నరకానికి నకళ్లు

రాకపోకలకు జనం ఇక్కట్లు



బండారుపల్లి-గరికపాడు గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురై..

మేడికొండూరు, తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ అడ్డరోడ్డు నుంచి బండారుపల్లి వరకూ ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ఆ దారిలో 10 కిలోమీటర్ల పొడవునా గుంతలు పడ్డాయి. అక్కడక్కడా భారీ గోతులు ఏర్పడ్డాయి. పలు చోట్ల రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. ఒక్కో చోట రోడ్డు ఎక్కడుందా అని వెతుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. చివరకు కొన్నిచోట్ల తారు రోడ్డు ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఏదైనా పని మీద ఈ దారిలో వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఈ దారిలో ప్రయాణిస్తుంటే వెన్నెముక సమస్య వస్తుందని వాపోతున్నారు.

• బండారుపల్లి నుంచి మందపాడు పరిధి వరకూ తారు రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఆయా పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఒక కొలిక్కి రాలేదు. పని పూర్తి కాకపోవడంతో కంకర రాళ్లు పైకి లేచాయి. ఈ దారిలో వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

• ఎస్ఆర్ఐటీ కళాశాల నుంచి వీశదల వరకూ రోడ్డు అధ్వానంగా తయారైంది. పలు చోట్ల గుంతలు పడ్డాయి. వీధి దీపాలు సరిగా లేకపోవడంతో రాత్రుళ్లు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పుతున్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో భారీగా నీరు నిలుస్తుంది. ఆ సమయంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఆయా రోడ్లు బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డాబాపై నుంచి పడి ఆటో డ్రైవర్ మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: డాబా మెట్లు దిగుతుండగా కాలుజారి కింద పడిన వ్యక్తి తీవ్ర గాయాల పాలై మృతి చెందిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశదలకు చెందిన బత్తుల సాయిబాబు (38) ఆటో నడుపుతుంటారు. గత నెల 27వ తేదీ రాత్రి డాబా పై నుంచి కిందకి దిగుతుండగా అదుపు తప్పి మెట్లపై నుంచి కింద పడ్డారు. తలకు గాయం కావడంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆయన మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



నాగులపాడులో కార్తికేయునికి పూజలు



గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారు

శరవణభవా.. పాహిమాం

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: నాగులపాడులోని శృంగేరి శారద పీఠ పాలిత వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వీటిలో భాగంగా గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కమిటీ అధ్యక్షుడు జి. సాంబశివరావు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కమనీయం.. శివ కల్యాణం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక శివాలయంలో స్వామి వారి వార్షిక కల్యాణం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. అర్చకుడు నాగేశ్వరం యుగంధర్ ఆధ్వర్యంలో దంపా శ్రీనివాసరావు, కల్యాణి దంపతులు కల్యాణ క్రతువు జరిపించారు. తొలుత అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈవో జేవీ నారాయణ పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నాయకులు

వంగిపురం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: వంగిపురంలోని శ్రీగంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు కోరారు. గురువారం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్మాణ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.2 33 కోట్ల నిధులు మంజూరు చేసిందని చెప్పారు. గ్రామస్థులు, పలువురు దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ డి.భాగ్యారావు, ఎంపీటీసీ సభ్యుడు పాలేటి సాంబశివరావు, నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి బలవన్మరణం

మేడికొండూరు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని భీమినేనివారిపాలేనికి చెందిన గుత్తా దుర్గా సాయి ప్రతాప్ (30) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. అక్కడే గిరిజ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. కొద్దినెలలుగా ఇద్దరికీ మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన కొద్ది రోజుల కిందట గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన.. గురువారం ఉదయం గ్రామంలోని చెరువు కట్టపై పడి ఉన్నారు. స్థానికులు ఆరా తీయగా కడుపునొప్పి తాళలేక ...మద్యంలో విషద్రావకం కలుపుకొని తాగినట్లు చెప్పారు. 108 వాహనంలో ఆయన్ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి అమ్మమ్మ వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జనగణన సమర్థంగా నిర్వహించండి



సిబ్బందికి కిట్లు అందజేస్తున్న ఎంపీడీవో

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమర్థంగా జనగణన నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి, జనగణన అదనపు ఇన్‌ఛార్జి బండి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందికి ఎంపీడీవో జనగణన కిట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో జనాభా లెక్కల సేకరణకు అవసరమైన కిట్‌లను తహసీల్దారు క్షమారాణి గురువారం సిబ్బందికి పంపిణీ చేశారు. జనగణన, గృహాల లెక్కింపు పక్కాగా ఉండాలని ఆమె సూచించారు.

పొగాకు రైతులకు అండగా నిలవాలి



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు సాగు చేసే తమకు తగిన ధర లభించేలా చూడాలని కోరుతూ గురువారం గుంటూరులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు పెదనందిపాడు మండలానికి చెందిన కొందరు రైతులు వినతి పత్రం అందజేశారు. గత ఏడాది కిలో పొగాకు ధర రూ. 280తో ప్రారంభించి రూ. 356 వరకు కొన్నారని, ఈ ఏడాది రూ. 250 తో మొదలు పెట్టి రూ. 200 వరకు కొనుగోలు చేస్తున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. మందకొడిగా కొనుగోలు జరుగుతుందని ఒక రోజు అమ్మవాల్సిన పొగాకు మూడు రోజుల పాటు అమ్మకం చేయాల్సి వచ్చిందన్నారు. వేలం కేంద్రం రోజు విడిచి రోజు పని చేయడం వల్ల పొగాకు రంగుమారి ధర తగ్గే ప్రమాదం ఉందని విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లాలో వైకాపా ఇప్పటికే ఈ అంశంపై అసత్య ప్రచారం చేస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతులు బొల్లారావు, రామారావు, వీరయ్య, వెంకటరామయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

అన్నదాతల బెంబేలు



దుగ్గిరాలలో మొక్కజొన్న గింజలపై పట్టాలు కప్పుతున్న రైతులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఒక్కసారిగా మారిన వాతావరణం అన్నదాతల్ని కలవరపెట్టింది. గురువారం సాయంత్రం మబ్బులు కమ్మాయి. పొలాల్లో మొక్కజొన్న గింజలు, కండెలు ఆరబెట్టిన రైతులు పట్టాలు తీసుకుని చేలవైపు కుటుంబసభ్యులతో కలిసి పరుగులు తీశారు. మొక్కజొన్న గింజలు తడిస్తే బూజు వచ్చేస్తుందనే భయంతో పట్టాలు కప్పారు.

ఉన్నత చదువుకు భరోసా

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మారెళ్ల లోకేశ్ 600లకు గాను 569 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా హైదరాబాదుకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీవ్యాల్ మాట్లాడుతూ విద్యార్థి ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు తమ ఫౌండేషన్ భరాయిస్తుందని తెలిపారు. కోఆర్డినేటర్ కడియాల శివప్రసాద్, హెచ్‌ఎం లక్ష్మీదుర్గ, పీడీ శరత్‌బాబు పాల్గొన్నారు.

బాటసారులకు బాసట

ప్రత్తిపాడు: వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యుత్తు శాఖ ఈఈ వై.ఏడుకొండలు తెలిపారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ప్రాంగణంలో చలివేంద్రాన్ని గురువారం డీఈలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. చలివేంద్రం ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందిస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావును అభినందించారు. మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ ఎ.గురునాథరావు, ఏఈలు జి.రవితేజ, డి.సాంబశివరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.రమేష్‌బాబు పదవీ విరమణ సమావేశం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను ఎంఆర్‌వో క్షమారాణి, ఈవోపీఆర్డీ జ్యోతిలు వివరించారు. విధి నిర్వహణలో నిబద్ధత చాటారని కొనియాడారు. ఎంపీడీవో రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అంకిత భావంతో ఇచ్చిన బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఏవో సురేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంకితభావంతో బోధన ఆదర్శనీయం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఆంగ్లం బోధనలోనే కాకుండా ప్రిన్సిపల్‌గా కళాశాల నిర్వహణలోనూ కొత్త గిరిధరరావు ఆదర్శంగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ కొత్త రఘురామయ్య స్మారక డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గిరిధరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా చాగర్లమూడి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సభలో పలువురు మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డాక్టర్ కొత్త రవీంద్రబాబు, కంభంపాటి నరేంద్రబాబు, దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, దోస్త్ ప్రతినిధి గద్దె వాసు, కోనేరు మల్లికార్జునరావు, పసుపులేటి రవి యాదవ్, తాడిబోయిన ఏడుకొండలు, పలువురు విశ్రాంత అధ్యాపకులు, ప్రజలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



వైద్య కిట్ అందజేస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రసాదస్వామి


పెదనందిపాడు, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణతోపాటు పలు దస్త్రాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నాగులపాడు, కొప్పరపాడు, ఉప్పలపాడు, వరగాని గ్రామాలకు చెందిన బోద కాలు వ్యాధితో బాధపడుతున్న కొందరికి కిట్‌లను అందజేశారు. మండల వైద్య ఆరోగ్యాధికారి నందకుమార్, సీహెచ్‌వో ప్రసాదస్వామి, సబ్ యూనిట్ అధికారులు శివగణేష్, ప్రశాంతకుమార్, ఎంపీహెచ్ఎస్ నరసింహారావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ అదృశ్యంపై కేసు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పీఈటీగా పనిచేస్తున్న యువకుడు అదృశ్యం అయినట్లు వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై బాబురావు తెలిపిన సమాచారం మేరకు..మార్కాపురం జిల్లా హనుమంతునిపాడు మండలం నరవగోపాలపురం గ్రామానికి చెందిన వెంకటరామకృష్ణ ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు. ఏప్రిల్ 27న కళాశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అత్యాచార బాధితుల కోసం

గర్భవిచ్ఛిత్తి చట్టాన్ని మార్చండి



- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: అవాంఛిత గర్భాన్ని కొనసాగించాలంటూ అత్యాచార బాధిత బాలికలను బలవంతపెట్టలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. పిండం వయసు 20 వారాలు దాటిన తర్వాత కూడా దానిని తొలగించుకునేందుకు అనుమతించేలా చట్టాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అత్యాచార బాధితులకు వారి శరీరంపై ఉన్న స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం స్పష్టం చేసింది. పదిహేనేళ్ల బాలిక మోస్తున్న 30 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం ఇటీవల అనుమతించింది. అలా చేయడం మైనర్ తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, భవిష్యత్తులో బిడ్డల్ని కనలేదని పేర్కొంటూ ఎయిమ్స్ వైద్యులు క్యూరేటివ్ పిటిషన్ వేశారు. 'ప్రసవానికి ఇంకా నాలుగు వారాల వ్యవధే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించవచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే'నని ఎయిమ్స్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి గురువారం సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. 'బాలికపై అత్యాచారం జరిగిన కేసు ఇది. ఆ ఘటన తాలూకు క్షోభ ఆమెను జీవితాంతం వెంటాడుతుంది. ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భాన్ని తొలగించాలి. ఆరోగ్య సమస్యల విషయంలో బాధితురాలి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వండి. వారు సముచిత నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయండి' అని ధర్మాసనం పేర్కొంది.

జూన్ నుంచి ఆగస్టు మధ్య

కైలాశ్- మానసరోవర్ యాత్ర



దిల్లీ: కైలాశ్- మానసరోవర్ యాత్ర ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య ఉంటుందని విదేశీ వ్యవహారాల శాఖ(ఎంఈఏ) గురువారం ప్రకటించింది. ఈ యాత్ర ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథులా అనే రెండు మార్గాల ద్వారా సాగుతుందని తెలిపింది. "లిపులేఖ్ పాస్, నాథులా నుంచి మొత్తం 20 బృందాలు యాత్రలో పాల్గొంటాయి. ఒక్కో బృందంలో 50 మంది యాత్రికులు ఉంటారు. యాత్ర కోసం దరఖాస్తును స్వీకరించేందుకు వెబ్‌సైట్ **(kmy.gov.in)**ను ప్రారంభించాం. ఆసక్తిగల యాత్రికులు ఈ నెల 19 లోపు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు" అని ఎంఈఏ ప్రకటించింది.

మహిళా స్వయం సహాయక సంఘాలకు

జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ అకౌంట్

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) కోసం కేంద్ర తపాలా శాఖ అధ్వర్యంలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ అకౌంట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆర్థిక సాధికారత కల్పించడానికి ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఆర్.విశ్వేశ్వరన్ ప్రకటించారు. ఈ ఖాతాల్లో కనీస ప్రాథమిక డిపాజిట్ అవసరం లేదు. నెలవారీ సగటు బ్యాలెన్స్ కూడా నిర్వహించాల్సిన అవసరం ఉండదు. గరిష్ఠంగా రూ.2లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు. ఆ మొత్తానికి అమల్లో ఉన్న సేవింగ్స్ రేట్స్ ప్రకారం మూడునెలలకోసారి వడ్డీ చెల్లిస్తారు. నగదు డిపాజిట్, ఉపసంహరణకు ఎలాంటి ఛార్జీలూ ఉండవు.

ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పరీక్షల్లో 99% ఉత్తీర్ణత

దిల్లీ: 'ది కౌన్సిల్ ఫర్ ద ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్' (సీఐఎస్‌సీఈ) నిర్వహించిన 10, 12 తరగతుల పరీక్షా ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. పదో తరగతి (ఐసీఎస్ఈ) పరీక్షలకు 2,58,721 మంది హాజరుకాగా వారిలో 99.18% మంది, 12వ తరగతి (ఐఎస్‌సీ) పరీక్షలకు హాజరైన 1,03,316 మందిలో 99.13% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు పరీక్షల్లోనూ బాలుర కంటే బాలికలు మంచి ప్రతిభ కనబరిచారు. సీఐఎస్‌సీఈ వెబ్‌సైట్లో ఫలితాలు అందుబాటులో ఉంటాయి.

657 ప్రాచీన కళాఖండాలను భారత్‌కు అప్పగించిన అమెరికా

న్యూయార్క్: అపహరణకు గురై తమ దేశానికి చేరిన 1.4 కోట్ల డాలర్ల (రూ.132.8 కోట్లు) విలువ చేసే 657 ప్రాచీన కళాఖండాలను అమెరికా తిరిగి భారత్‌కు అప్పగించింది. ఈ మేరకు మన్‌హట్టన్ జిల్లా అటార్నీ ఆల్విన్ బ్రాగ్ ప్రకటించారు. అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై జరిపిన అనేక దర్యాప్తుల అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులివి. న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి హాజరైన రాయబారి రాజ్‌లక్ష్మి కదమ్ సమక్షంలో వీటిని అప్పగించారు.



నాయకత్వమంటే అధికారం చలాయించడం కాదు

నాయకత్వం అంటే అధికారం చలాయించడం కాదు. కష్టకాలంలో బాధ్యతలను తలకెత్తుకోవడం. తోటివారికి నచ్చకపోయినా వ్యవస్థ బాగుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడం. వైఫల్యాలు ఎదురైనప్పుడు తానే బాధ్యత వహించగలగడం.

– అనుష్క సోహంబాథ్వాల్, అంత్రప్రెన్యూర్

బెంగాల్ గరంగరం

- ఎగ్జిట్‌పోల్స్‌తో సంబరాల్లో భాజపా
- కలవరంలో తృణమూల్
- ఈవీఎంలు తారుమారంటూ స్ట్రాంగ్‌రూం ముందు మమత ధర్నా

కోల్‌కతా, దిల్లీ: ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పశ్చిమబెంగాల్‌లో వేడి తగ్గకపోగా పెరుగుతోంది. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ఈసారి గెలిచేందుకు అవకాశం ఉందని ఎక్కువశాతం ఎగ్జిట్‌పోల్స్ చెబుతుండటంతో కమలనాథులు రెట్టించిన ఉత్సాహంతో విజయోత్సవాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు అధికార తృణమూల్ కాంగ్రెస్‌లో కలవరం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈవీఎంలను మార్చేస్తున్నారన్న ఆరోపణలపై గురువారం కోల్‌కతాలో హైడ్రామా నడిచింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా ధర్నాకు దిగారు. తాను పోటీచేసిన భవానీపుర్ నియోజకవర్గంలో ఈవీఎంలలో మతలబులు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో.. జోరున కురుస్తున్న వర్షాన్నీ లెక్కచేయకుండా గురువారం రాత్రి స్ట్రాంగ్‌రూం వద్దకు మమత చేరుకున్నారు. చాలాసేపు అక్కడే బైఠాయించారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. కోల్‌కతాలోని 'ఖుదీరాం అనుశీలన్ కేంద్ర'లోనూ తృణమూల్ అభ్యర్థులు ధర్నాకు దిగారు. అధీకృత ప్రతినిధులు లేకుండా "బ్యాలెట్ బాక్సు"ల్ని తెరిచే ప్రయత్నం చేస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీ చూపిస్తోందని, ఇదంతా ఈసీకి తెలిసే జరుగుతోందని తృణమూల్ ఆరోపించింది. ఈసీ వీటిని ఖండించింది. స్ట్రాంగ్‌రూంలు భద్రంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్లకు అదేచోట విడిగా స్ట్రాంగ్‌రూంలు కేటాయించామని తెలిపింది. బ్యాలెట్ల విభజనను నిర్దిష్ట నిబంధనల ప్రకారమే చేస్తున్నట్లు వివరించింది. హింసను రెచ్చగొట్టేవారిని తక్షణం అరెస్టు చేయాలని బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ అగర్వాల్ ఆదేశించారు. కౌంటింగ్‌లో కేంద్ర సిబ్బందిని వినియోగించవద్దంటూ తృణమూల్ వేసిన పిటిషన్‌ను కలకత్తా హైకోర్టు కొట్టివేసింది.

2 నిమిషాలకు మించి వెళ్లొద్దు

అంతకుముందు మమత ఒక వీడియో సందేశం వెలువరించారు. అందులో ఎగ్జిట్‌పోల్స్‌ను కొట్టిపడేశారు. వీటిని భాజపా ఆదేశాల ప్రకారం రూపొందించారని, కచ్చితంగా తప్పు అవుతాయని పేర్కొన్నారు. ఓట్లలెక్కింపు రోజు తాను చెప్పేవరకు ఏజెంట్లలో ఏ ఒక్కరూ ఆయా కేంద్రాలను వీడొద్దని చెప్పారు. తినడానికైనా, లఘుశంకకైనా రెండు నిమిషాలకు మించి కేటాయించవద్దని దిశానిర్దేశం చేశారు. 294కి గానూ 226 పైబడిన స్థానాల్లో విజయం సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. "స్టాక్ మార్కెట్లను పెంచేందుకు, మా శ్రేణుల్ని నైతికంగా దెబ్బ తీసేందుకు భాజపా కార్యాలయం నుంచి రూపొందించిన అంచనాలను ప్రసారం చేశారు. తరలింపు సమయంలో ఈవీఎంలను మార్చేయకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. నేను కూడా వచ్చి కాపలా కాస్తా" అని చెప్పారు.

టుడేస్ చాణక్యదీ అదే మాట...

■ పశ్చిమ బెంగాల్‌లో 294కి గానూ 192 స్థానాలు భాజపాకు, 100 సీట్లు తృణమూల్‌కు వస్తాయని 'టుడేస్ చాణక్య' సంస్థ ఎగ్జిట్‌పోల్ లెక్కగట్టింది. ఈ సంస్థ గురువారం తన అంచనాలు వెల్లడించింది. కేరళలో 140 స్థానాలకు 69 యూడీఎఫ్‌కు, 64 ఎల్డీఎఫ్‌కు వస్తాయని తెలిపింది. అస్సాంలో 102 సీట్లతో భారీ భాజపా భారీ విజయం అందుకోబోతోందని పేర్కొంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి రానుందని కూడా అంచనా వేసింది.

ఓటును ప్రాథమిక హక్కుగా మార్చాలి: కాంగ్రెస్

దిల్లీ: చట్టబద్ధ హక్కుగా ఉన్న ఓటును ప్రాథమిక హక్కుగా మార్చాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ హక్కుకు ముప్పు పొంచి ఉందని, అందువల్ల దీనికి ఇలాంటి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని గట్టిగా అభిప్రాయపడింది. సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనరే తటస్థ పరిశీలకుడిగా లేరని, ఇంతకుముందెన్నడూ లేనంతగా ఈసీ రాజీ పడుతోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్నికల్లో ఒక ఆటగాడిగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ మారిపోయారని విమర్శించారు. భారత పౌరులు కానివారిని 'గుర్తించు, తొలగించు, వెనక్కి పంపించు' అనేది పాటిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారని, ఇలా ఎందరిని పంపించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఈసీ అభిశంసనకు విపక్ష ప్రయత్నాలు కొనసాగుతాయని చెప్పారు. కులగణన కసరత్తును జాప్యం చేయాలనే ఎత్తుగడలో ప్రధాని మోదీ ఉన్నారని ఆయన ఆరోపించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద తొలిసారి క్యూఆర్ కోడ్ గుర్తింపు వ్యవస్థ

దిల్లీ: అయిదు అసెంబ్లీల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, పుదుచ్చేరిలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు వ్యవస్థను ప్రవేశపెడుతోంది. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్లు ఈసీ తెలిపింది. భవిష్యత్తులో జరగబోయే అన్ని లోక్‌సభ, శాసనసభ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికల్లోనూ ఈ విధానాన్ని కొనసాగించనున్నట్లు పేర్కొంది. ఈ నూతన విధానం ప్రకారం.. కౌంటింగ్ హాల్ వద్ద క్యూఆర్ కోడ్‌తో ధ్రువీకరించిన తరువాతే లోపలికి అనుమతిస్తారు.

గల్ఫ్‌లో కొత్త ఆట

ఒపెక్ నుంచి యూఏఈ నిష్క్రమణతో...



ఒపెక్ నుంచి వైదొలగాలన్న యూఏఈ నిర్ణయం ఆకస్మికమే అయినా.. అనూహ్యం కాదు! కూటమిలో పరిమితుల కారణంగా తన ఉత్పత్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేక ఆ దేశం చాన్నాళ్లుగా అసంతృప్తితో ఉంది. యుద్ధం,హర్మూజ్ మూసివేత.. ఇప్పుడు దాని నిష్క్రమణ నిర్ణయానికి తక్షణ కారణాలుగా నిలిచాయంతే. మరి ఒపెక్ నుంచి బయటకు వచ్చి.. చమురు విపణిలోకి వైల్డ్‌కార్డు ఎంట్రీలా అడుగిడబోతున్న యూఏఈ వల్ల భారత్‌కు లాభమేనా?

ప్రపంచ చమురు విపణికి ఒపెక్ సెంట్రల్ బ్యాంకులాంటిదని చెప్పొచ్చు. సభ్యదేశాలు ఎంత చమురును ఉత్పత్తి చేయాలి.. ఎంత ఎగుమతి చేయాలి.. ధర ఎంత.. అనేవన్నీ ఒపెక్ నియంత్రిస్తుంటుంది.

ఇక స్వేచ్ఛగా నిర్ణయాలు

కూటమిలో సౌదీ అరేబియా పెత్తనం ఎక్కువ. ఉత్పత్తి/ఎగుమతి పెంపునకు ఈ దేశం వ్యతిరేకం. ఒపెక్ నుంచి బయటకొస్తే స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటూ.. తన ఉత్పత్తిని పెంచుకొని ఆర్థికంగా లాభపడొచ్చన్నది యూఏఈ అభిప్రాయం.

ఆర్థిక కోణం ఒక్కటే కాదు..

నిష్క్రమణ నిర్ణయానికి ఆర్థిక అంశాలు మాత్రమే కారణమనుకుంటే పొరపాటే. యూఏఈ రాజకీయంగా ఇజ్రాయెల్‌కు సన్నిహిత దేశం. టెహ్రాన్‌తో తీవ్ర వైరం ఉంది. యుద్ధం వేళ యూఏఈపై ఇరాన్ 2,200 డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసింది. తన శత్రువైన టెహ్రాన్ ఒపెక్‌లో వ్యవస్థాపక సభ్యదేశంగా ఉంటూ కూటమి నిర్ణయాలను ప్రభావితం చేస్తుండటం అబుదాబీకి రుచించడం లేదు. యూఏఈలోని కీలక రువైస్ రిఫైనరీ, ఫుజైరా పోర్టు, హబ్షన్ గ్యాస్ క్షేత్రాలు టెహ్రాన్ దాడుల్లో దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఒపెక్ నుంచి యూఏఈ నిష్క్రమించింది.

తాత్కాలిక ఒడుదొడుకులున్నా..

ఒపెక్‌లో మూడో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారు యూఏఈ. దీని నిష్క్రమణ.. కూటమిని బలహీనపరుస్తుందనడంలో సందేహం లేదు. విపణిలో ఒపెక్‌కు ఇప్పుడు యూఏఈ పోటీదారుగా మారుతుంది. దానివల్ల మార్కెట్లలో కొన్నాళ్లు అస్థిరత తలెత్తొచ్చు. అయితే యూఏఈ తన ఉత్పత్తి ప్రణాళికలను సాఫీగా అమలుచేస్తే.. మార్కెట్లకు సరఫరా భారీగా పెరుగుతుంది. ధరలు దిగొస్తాయి.

58 లక్షల బ్యారెళ్లు

మన దేశంలో చమురు రోజువారీ సగటు వినియోగం. ఇందులో 85%కు దిగుమతులే ఆధారం.

6.2 లక్షల బ్యారెళ్లు

ఈ నెలలో సగటున రోజూ యూఏఈ నుంచి భారత్ కొనుగోలు చేసిన చమురు.

భారత్‌కు మేలు

- ■ యూఏఈ చమురు ఎగుమతులను పెంచితే.. భారత్ వంటి భారీ దిగుమతి దేశాలు బాగా లాభపడతాయి.
- ■ ధర ఎక్కడ తక్కువుంటే అక్కడ ఆయిల్ కొనుగోలు చేసుకోవచ్చు. కొన్ని దేశాలపైనే ఆధారపడటం తప్పుతుంది.
- ■ పైప్‌లైన్ల ద్వారా ఒమన్ తీరంలోని ఫుజైరా పోర్టుకు యూఏఈ తన చమురును తరలిస్తే.. హర్మూజ్‌ను బైపాస్ చేస్తూ దిగుమతి చేసుకోవచ్చు.

- నేషనల్ డెస్క్

పవన్ ఖేడా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీం తీర్పు రిజర్వు

దిల్లీ: అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ 'రాజ్యాంగ కౌబాయ్' లేదా 'రాజ్యాంగ రాంబో' లాగా వ్యవహరిస్తూ తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా సుప్రీంకోర్టుకు తెలిపారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ బతికుంటే హిమంత వ్యాఖ్యలు చూసి దిగ్భ్రాంతి చెందేవారని అన్నారు. హిమంత భార్య రినికి భూయాన్ శర్మకు పలు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయంటూ ఖేడా చేసిన ఆరోపణలపై పరువు నష్టం కేసు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఖేడా దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఖేడా తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. పరువు నష్టం కేసు విచారణ కోసం కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. "నిర్బంధ విచారణతో అవమానించాల్సిన అవసరం ఏముంది? అస్సాం సీఎం హిమంత తాను చట్టాలకు అతీతమన్న రీతిలో ప్రవర్తించారు. పవన్ ఖేడాను జీవితాంతం జైలులో పెడతామని బెదిరించారు" అని సింఘ్వీ పేర్కొన్నారు. 'ఖేడాపై మోపిన కొన్ని సెక్షన్ల కింద బెయిల్ పొందే అవకాశం ఉంది. మరికొన్ని సెక్షన్ల కింద అసలు అరెస్టు చేయాల్సిన అవసరమే రాదు" అని వాదించారు. అస్సాం పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ముఖ్యమంత్రి సతీమణి పాస్‌పోర్టులకు సంబంధించిన నకిలీ, వక్రీకరించిన కాపీలను ఖేడా ప్రదర్శించారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

కోహినూర్‌ను భారత్‌కు ఇచ్చేయమని అడుగుతా

- బ్రిటన్ రాజుతో భేటీకి ముందు న్యూయార్క్ మేయర్ మమ్దానీ వ్యాఖ్య



బ్రిటన్ రాజు ఛార్లెస్-3తో న్యూయార్క్ మేయర్ మమ్దానీ

న్యూయార్క్: చారిత్రక కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేయాలని బ్రిటన్ రాజు ఛార్లెస్-3ని కోరతానని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ తెలిపారు. భారతీయ మూలాలున్న మమ్దానీ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బ్రిటన్ రాజు, రాణి కెమిల్లా ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్నారు. న్యూయార్క్‌లోని 9/11 స్మారక చిహ్నాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముందు మమ్దానీ మీడియాతో మాట్లాడుతూ.. రాజుతో విడిగా మాట్లాడే అవకాశం వస్తే కోహినూర్‌ను ప్రస్తావిస్తానని చెప్పారు. ఆ తర్వాత బ్రిటన్ రాజుతో ఆయన మాట్లాడినప్పటికీ వారిద్దరి మధ్య కోహినూర్ ప్రస్తావన వచ్చిందా.. లేదా అనేది స్పష్టంగా తెలియలేదు. న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యలపై స్పందించేందుకు బకింగ్‌హామ్ ప్యాలెస్ నిరాకరించింది. 105.6 క్యారెట్ల కోహినూర్ వజ్రాన్ని మహారాజా దులీప్ సింగ్ 1849లో విక్టోరియా రాణికి ఇచ్చారు. ఆ తర్వాత రాణి కిరీటంలో అలంకరించిన ఈ వజ్రం అప్పటినుంచీ బ్రిటన్ రాజవంశం అధీనంలోనే ఉంది.

ఈ పిట్ట బతికి బట్టకట్టలేకపోయింది..!



భూమిపై నుంచి తుడిచిపెట్టుకుపోయే ముప్పును ఎదుర్కొంటున్న బట్టమేక పిట్ట జాతికి ఊపిరులూదేందుకు చేసిన ప్రయత్నం ఫలించినట్టే ఫలించి.. విఫలమైంది. వినూత్న విధానం ద్వారా గుజరాత్‌లో దశాబ్దం తర్వాత పుట్టిన ఈ పక్షి పిల్ల గల్లంతైంది. దీన్ని ఏదైనా జంతువు తినేసి ఉంటుందని భావిస్తున్నారు. దీంతో ఈ పక్షి జాతిని సంరక్షించేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు వ్యూహాన్ని మార్చాల్సి వచ్చింది.

ఏమిటీ పక్షి?

గగనవిహారం చేసే భారీ పక్షుల్లో బట్టమేక పిట్ట ఒకటి. దీని పొడవు ఒక మీటరు వరకూ ఉంటుంది. 15 కిలోల వరకూ బరువు పెరుగుతుంది. ఇది రాజస్థాన్ రాష్ట్ర పక్షి. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాల్లో ఈ పక్షుల సంచారం ఉండేది. నేడు వాటి సంఖ్య 150 కన్నా తక్కువకు పడిపోయింది. ఇందులో 90 శాతం.. రాజస్థాన్‌లోనే ఉన్నాయి. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం (ఐయూసీఎన్) దీన్ని 2011లో తీవ్ర స్థాయిలో అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న జాతిగా ప్రకటించింది.

ఇవే ముప్పులు..

బట్టమేక పిట్టకు సంబంధించిన లోపాలు వాటి ఉనికికి ముప్పుగా మారాయి. ఇది ఏడాదికి ఒకటొక్క గుడ్డు నేలపై నిర్మించుకున్న గూడులో పెడుతుంది. అందువల్ల 60 శాతం పిల్లలు మొదటి రెండు నెలల్లోనే చనిపోతుంటాయి. వాటిని నక్కలు, ముంగిసలు, పిల్లులు, మానిటర్ లిజర్డ్స్ వంటివి తినేస్తుంటాయి. ■ ముందువైపు ఉన్న దృశ్యాలను ఈ పక్షి సరిగా చూడలేదు. విద్యుత్ తీగలను ఢీకొట్టడం వల్ల మృత్యువాత పడుతుంటాయి.

జంప్ స్టార్ట్..

నలియాలో బట్టమేక పిట్టల సంఖ్యను పెంచేందుకు 'జంప్ స్టార్ట్' అనే విధానాన్ని అధికారులు అనుసరించారు. ఇందులో.. సంరక్షణ కేంద్రంలో ఫలదీకరణం చెందిన అండాన్ని అటవీ ప్రాంతానికి తరలిస్తారు. దాన్ని.. ఫలదీకరణం చెందని అండాలపై పొదిగిన ఒక ఆడ బట్టమేక పిట్ట గూడులో పెడతారు.

■ ఇలా పుట్టే పిల్లకు సరోగేట్ తల్లి ద్వారా రక్షణ అందించి, అడవిలో వాటి సంతతిని పెంచడం ఈ ప్రయోగం ఉద్దేశం.

■ జంప్‌స్టార్ట్‌లో భాగంగా 770 కిలోమీటర్ల దూరంలో.. రాజస్థాన్‌లోని ఒక సంరక్షణ కేంద్రంలో నుంచి ఫలదీకరణ చెందిన అండాలను గుజరాత్‌కు రప్పించారు. వీటిని తరలిస్తున్న వాహనం నాన్‌స్టాప్‌గా ప్రయాణించేందుకు రెండు రాష్ట్రాలు ప్రత్యేక కారిడార్‌ను కూడా ఏర్పాటు చేశాయి.

■ మగ పిట్ట తోడులేకపోవడం వల్ల నలియాలో ఓ బట్టమేక పక్షి అపరిపక్వ అండాన్ని పెట్టింది. మార్చి 22న అధికారులు దాన్ని తొలగించి.. రాజస్థాన్ నుంచి తెచ్చిన గుడ్డును ఆ గూడులో పెట్టారు. మార్చి 26న ఈ గుడ్డు నుంచి పక్షి పిల్ల పుట్టింది.

ఒక్క పిట్టకూడా పుట్టలేదు..

గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో ఉన్న నలియా గడ్డినేలల్లో ఒకప్పుడు పెద్ద సంఖ్యలో బట్టమేక పిట్టలు ఉండేవి. ఇప్పుడు అక్కడ 2-3 ఆడ పిట్టలు మాత్రమే ఉన్నాయి. జోడు కట్టడానికి మగ పిట్ట లేదు. అందువల్ల దశాబ్దకాలంలో అక్కడ ఒక్క బట్టమేక పిట్ట కూడా పుట్టలేదు.

రెక్క విదిల్చింది..

దశాబ్దం తర్వాత కచ్‌లో పుట్టిన బట్టమేక పిట్ట పిల్ల కదలికలను నిశితంగా గమనించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేసింది. 10 రోజుల కిందట అది కొద్దిసేపు గగనవిహారానికి ప్రయత్నించింది. ఆ తర్వాత దాని ఆచూకీ లేదు. ఏదో ఒక జంతువు దాన్ని నోటకరచుకొని వెళ్లి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జంప్‌స్టార్ట్‌ను కొనసాగిస్తూనే.. భవిష్యత్‌లో ఈ పక్షుల పరిరక్షణకు మరిన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పటిష్ఠంగా ఫెన్సింగ్ ఏర్పాటు, వీటిని వేటాడే జంతువులను వేరే ప్రాంతాలకు తరలించడం, నీటి నిర్వహణ విధానాలను అమలు వంటివి చేపట్టనున్నారు.

బర్త్‌డే పార్టీలో 3 హత్యలు.. ప్రధాన నిందితుడి ఎన్‌కౌంటర్

బులంద్‌శహర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌శహర్ జిల్లాలో జరిగిన మూడు హత్యల కేసు ప్రధాన నిందితుణ్ని గురువారం తెల్లవారుజామున పోలీసులు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరు ఎదురు కాల్పుల అనంతరం గాయాలతో పోలీసులకు పట్టుబడిన మర్నాడే.. ప్రధాన నిందితుడు జీతూ సైనీని ఎన్‌కౌంటరులో కాల్చిచంపడం గమనార్హం.



జీతూ సైనీ

ఈ సందర్భంగా ఇద్దరు పోలీసులు కూడా గాయపడ్డారు. ముగ్గురు మిత్రులను కాల్చిచంపిన జీతూపై రూ.50 వేల రివార్డు ఉంది. ఖుర్జా గ్రామీణ పోలీస్‌స్టేషను పరిధిలో పోలీసులు తనిఖీలు జరుపుతుండగా ఎదురుపడిన జీతూ కాల్పులకు దిగినట్లు అధికారులు తెలిపారు. ఖుర్జాలో ఏప్రిల్ 25వ తేదీ రాత్రి జరిగిన పుట్టినరోజు వేడుకలు ఈ వివాదం మొత్తానికి కారణం. కేక్ ముఖానికి పులమడంతో వాగ్వాదం చెలరేగి.. అమర్‌దీప్ (30), మనీశ్ (28), ఆకాశ్ (18)లను కాల్చిచంపారు.

రాయ్‌పుర్‌లో అత్యవసరంగా దిగిన ఇండిగో విమానం

రాయ్‌పుర్: ప్రయాణికుల్లో ఒక మహిళ అస్వస్థురాలు కావడంతో కోల్‌కతా-పుణె ఇండిగో విమానాన్ని గురువారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో అత్యవసరంగా దించాల్సి వచ్చింది. గగనతలంలో ఆమె స్పృహ కోల్పోవడంతో సంబంధిత ఏటీసీని విమాన సిబ్బంది అప్రమత్తం చేసి అత్యవసర వైద్య సేవలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఆ ప్రకారం విమానాన్ని దారి మళ్లించారు. రాయ్‌పుర్ విమానాశ్రయంలో ప్రథమ చికిత్స అందించి, సమీపంలోని ఆసుపత్రికి ఆమెను తరలించారు. గంట ఆలస్యంగా విమానం అక్కడి నుంచి బయల్దేరింది.

టెక్సాస్‌లో హెచ్-1బీ దుర్వినియోగం ఆరోపణలు... 30 సంస్థలపై దర్యాప్తు

వాషింగ్టన్: అమెరికాలోని టెక్సాస్‌లో హెచ్-1బీ వీసాల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో 30 సంస్థలపై దర్యాప్తు మొదలైంది. టెక్సాస్ అటార్నీ జనరల్ కెన్ పాక్స్‌టన్ ఈ మేరకు దర్యాప్తును ప్రారంభించారు. హెచ్-1బీ వీసాలను దుర్వినియోగం చేస్తూ ఈ సంస్థలు 'ఘోస్ట్ ఆఫీసు'లను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని కెన్ పాక్స్‌టన్ నోటీసులు జారీ చేశారు.

వైష్ణోదేవి దర్శనానికి వెళ్లివస్తూ ఐదుగురి సజీవ దహనం



మంటల్లో దహనమైన కారు

జైపుర్: రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా పరిధిలో గల దిల్లీ - ముంబయి ఎక్స్‌ప్రెస్ వేపై కారుకు నిప్పంటుకొని ఒకే కుటుంబంలోని అయిదుగురు సజీవదహనం అయ్యారు. డ్రైవరు వినోద్‌కుమార్ 80 శాతం కాలిన గాయాలతో బయటపడినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లి తిరిగివస్తుండగా బుధవారం అర్ధరాత్రి మౌజ్‌పుర్ వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక వాహనాలు పదిహేను నిమిషాల్లో మంటలను అదుపులోకి తెచ్చాయని, అప్పటికే కారు పూర్తిగా కాలి బూడిద అయినట్లు ఏఎస్పీ ప్రియాంక రఘువంశీ తెలిపారు. మృతులను మధ్యప్రదేశ్‌లోని శ్యోపుర్ జిల్లాకు చెందిన ఖైన్‌పురా వాసులుగా గుర్తించారు. సంతోష్ అనే వ్యక్తి, ఆయన భార్య ఇద్దరు కుమార్తెలు, తల్లి మంటల్లో కాలిపోయి అస్థిపంజరాలుగా మిగిలారు. సీఎన్‌జీ వాహనం కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయని, షార్ట్‌సర్క్యూట్ నిప్పును రాజేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

జమ్మూకశ్మీర్‌ను పాక్‌లో చూపిస్తూ మ్యాప్

భారత్‌కు నేపాల్ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు

కాఠ్‌మాండూ: జమ్మూకశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపిస్తూ నేపాల్ ఎయిర్‌లైన్స్ ఇటీవల నెట్‌వర్క్ మ్యాప్‌ను పోస్ట్ చేయడం వివాదాన్ని రేకెత్తించింది. సామాజిక మాధ్యమాల్లో ఆ పటం వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది చిన్న పొరపాటు కాదని, ఉద్దేశపూర్వక చర్యేనని మండిపడ్డారు. భారత్ నుంచి అనేక రకాలుగా సాయం పొందుతున్న నేపాల్ ఇలా చేయడం ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీయవచ్చని హెచ్చరించారు. 'బాయ్‌కాట్ నేపాల్ ఎయిర్‌లైన్స్' అనే హ్యాష్‌ట్యాగ్ కూడా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో నేపాల్ ఎయిర్‌లైన్స్ దిగొచ్చి, భారత్‌కు క్షమాపణలు చెప్పింది. మ్యాప్‌లో తప్పులున్నాయని అంగీకరిస్తూ ఆ పోస్ట్‌ను తొలగించింది.

ఐదుగురికీ ఒకేసారి పెళ్లి.. పాండవుల కథ కాదు



ఉత్తరాఖండ్‌లోని 'జోజోడా' అనే సంప్రదాయం పెళ్లిళ్లలో జరిగే ఖర్చుల భారాన్ని బాగా తగ్గిస్తోంది. ఒకే కుటుంబంలో పెళ్లీడుకు వచ్చిన పిల్లలు ఒకరి కంటే ఎక్కువమంది ఉంటే వారికి సామూహిక వివాహాలు జరిపించడమే ఈ సంప్రదాయం. ఇక్కడ వధువులే పెళ్లి ఊరేగింపుతో వరుడి ఇంటికి వస్తారు. దేహ్రాదూన్ జిల్లాలోని జౌన్సార్ బావర్ గిరిజన ప్రాంతంలో ఉన్న ఖర్బి గ్రామానికి చెందిన దౌలత్ సింగ్‌ది ఉమ్మడి కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములకు చెందిన అయిదుగురు కుమారులు పెళ్లీడుకు వచ్చారు. దౌలత్ కుమార్తె రాధికకు కూడా వివాహం చేయాల్సి ఉంది. ఏప్రిల్ 29న 'జోజోడా' పద్ధతిలో ఈ ఆరుగురి పెళ్లిళ్లు సంప్రదాయబద్ధంగా ఒకేసారి జరిగాయి. ఉమ్మడి కుటుంబంలోకి అయిదుగురు కోడళ్లు ఒకేరోజు అడుగు పెట్టారు. రాధిక అత్తారింటికి వెళ్లింది. ఈ జోజోడా వివాహ సంప్రదాయం చాలా పురాతనమైనదని పురోహితుడు భీమ్‌దత్ శర్మ తెలిపారు.

ఈటీవీ భారత్



ఇవాళ ఏం చేద్దాం?

చింటూ చాలా అల్లరి పిల్లవాడు. ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగా ఉంటాడు. సెలవుల్లో ఏవేవో చేయాలని బోలెడు ప్లాన్స్ వేసుకున్నాడు. కానీ తీరా హాలిడేస్ వచ్చాక, టీవీ చూడటం, నిద్రపోవడం, ఏదో కాసేపు రొటీన్ గేమ్స్ ఆడుకోవడంతోనే అయిపోతోంది. దాంతో వారంలోనే బోర్ కొట్టేసింది తనకు. మరి మనకిలా కాకుండా ఉండాలంటే.. ఓ మంచి 'సెలవుల ప్రణాళిక' రెడీ చేసుకుందాం. ఇందులో ఏం ఉండాలంటే..

సెలవుల్లో సరదాగా!

● కొత్తగా నేర్చుకోవాలి అనుకుంటున్న ఏదైనా ఒక స్కిల్ ఉండాలి. అంటే పెయింటింగ్, సింగింగ్.. ఏదైనా కానివ్వండి. దానికి ప్రతి రోజూ కొంత టైమ్ కేటాయిద్దాం.

● కనీసం గంటసేపైనా ఏదైనా పట్టించు బయట ఉండాలి. అది ఇంటి 'హెల్త్' చాలా మేలు చేస్తుంది పెద్ద వాళ్లు జోలెదుసార్లు చెప్పారు మరి.

● కాసేపైనా పుస్తకాలు తీయాలి. హాలిడే హోం వర్క్‌ను మర్చిపోకూడదు.

● సొంతంగా క్రియేటివ్ వర్క్ చేసేందుకు ప్రయత్నం చేయాలి. అది ఏదైనా కావొచ్చు రైటింగ్, ఆర్ట్, క్రాఫ్ట్.. ఇలా.



ఇలా ఎవరికి వారే మీకు నచ్చిన, వచ్చిన పనుల్లో ఓ టు-డూ లిస్ట్ తయారుచేసుకోండి. దాన్ని గదిలో గోడ మీద అతికించండి. దానికి తగినట్టుగా సరదాగా టైం స్పెండ్ చేయండి.

తినే బొమ్మలివి

రోజూ అమ్మ రకరకాల వంటలు చేసిపెడితే, మనం తిని పెడతాం. ఈ సెలవుల్లో మనం గోధుమ పిండితో చపాతీలు చేద్దాం. అది రొటీన్‌గా అనుకుంటున్నారా? అందుకే వాటిని బొమ్మల్లా మారుద్దాం!

● గోధుమ పిండి కలిపి ఒక పెద్ద చపాతీలా చేయండి.



● ఇప్పుడు చపాతీ మీద చిన్న గ్లాసుతో నొక్కితే రౌండ్స్, దానితో మూడు వైపులా కట్ చేస్తే త్రిభుజాకారంలో, నక్షత్రాలు ఉన్న కట్టర్‌తో నొక్కితే స్టార్లు... ఇలా మీకు నచ్చిన బొమ్మలు వస్తాయి.

● మీరు కట్ చేసిన పిండి బొమ్మలను అమ్మకు ఇవ్వండి. అమ్మ వాటిని పెనం మీద వేసి చక్కగా కాల్చి ఇస్తుంది. ఇంట్లో ఎయిర్ ఫ్రైయర్ ఉంటే, అందులో తక్కువ నూనెతో క్రిస్పీగా కూడా చేసుకోవచ్చు. భలే కొత్తగా ఉంటాయివి!

ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధిక ఉత్తీర్ణత

3,135 మంది విద్యార్థులకు 96.04% మంది పాస్

నాలుగేళ్లుగా ఈ బడులదే అగ్రస్థానం

ప్రభుత్వ పాఠశాలల్లో 30.37% మంది అనుత్తీర్ణత

ఈనాడు, అమరావతి: పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 96.04% ఉత్తీర్ణత నమోదైంది. నాలుగేళ్లుగా ఈ పాఠశాలలే ఫలితాల్లో ముందువరుసలో నిలుస్తున్నాయి. రాష్ట్ర సరాసరి 85.25% ఉత్తీర్ణత కంటే ఆరు యాజమాన్యాల్లోని బడుల్లో తక్కువ ఉత్తీర్ణత నమోదైంది. అతి తక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో 69.63% మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని అన్ని యాజమాన్యాలూ రాష్ట్ర సరాసరి కంటే తక్కువ ఉత్తీర్ణతే సాధించాయి. అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 3,67,284 మంది పరీక్షలకు హాజరు కాగా.. 2,87,917 (78.39%) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటులో 2,50,847 మంది పరీక్షలు రాయగా 2,39,037 (95.29%) మంది పాసయ్యారు.

యాజమాన్యం	పరీక్ష రాసినవారు	ఉత్తీర్ణత శాతం
ఏపీ రెసిడెన్షియల్	3,135	96.04
ప్రైవేటు పాఠశాలలు	2,50,847	95.29
బీసీ సంక్షేమం	5,433	96.02
ఆదర్శ పాఠశాలలు	13,655	89.50
సాంఘిక సంక్షేమం	13,566	89.41
ఆశ్రమ పాఠశాలలు	11,080	70.09
కేజీబీవీ	13,596	88.81
గిరిజన సంక్షేమం	5,914	75.04
జిల్లాపరిషత్తు	2,37,299	78.09
ఎయిడెడ్	10,696	76.55
పురపాలక పాఠశాలలు	31,058	72.02
ప్రభుత్వ బడులు	21,852	69.63
మొత్తం	6,18,131	85.25

ఎంజేపీ గురుకులాల్లో 96 శాతం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బీసీ విద్యార్థులు సత్తా చాటారు. మహాత్మా జ్యోతిబా ఫులే గురుకులాల నుంచి 5,501 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5,274 మంది (96.02 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే.. ఈ దఫా ఉత్తీర్ణత 1.02 శాతం పెరిగింది. 100 బీసీ గురుకులాల్లో 32 చోట్ల వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎంజేపీ గురుకులాల నుంచి నంద్యాల జిల్లా నరవాడకు చెందిన శ్రీసాయి 593 మార్కులతో మొదటి స్థానం, రీటా సాహితీ, యశస్వినిలు 589 మార్కులు చొప్పున సాధించి రెండు, మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు.

■ బీసీ వసతిగృహాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 8,466 మంది పరీక్షలు రాయగా.. 7,280 (85.99%) మంది పాసయ్యారు. 1001 మంది 500కి పైగా మార్కులు సాధించారు. 5,187 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. గతేడాది కంటే ఈ సంవత్సరం 8.78 శాతం ఉత్తీర్ణత పెరిగింది. మంచి ఫలితాలు సాధించడంపై గురుకులాలు, వసతిగృహాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అభినందించారు.



సచివాలయంలో జ్యోతిబా ఫులే గురుకులాల అధికారులను అభినందిస్తున్న మంత్రి సవిత

ప్రతిభ చూపిన అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు 85.32 శాతం ఉత్తీర్ణత సాధించగా.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులు 89.49% మంది పాస్ అయ్యారు. ఆయా విద్యార్థులు, సిబ్బందిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అభినందించారు. అంబేడ్కర్ గురుకులాల నుంచి 13,538 మంది పరీక్షలు రాయగా.. 12,115 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించారని మంత్రి ప్రశంసించారు.

విభిన్న ప్రతిభావంతులు 100% పాస్

రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు. 54 మంది విభిన్న ప్రతిభావంతులు పరీక్షలు రాయగా.. అందరూ పాసయ్యారు.

■ విశాఖ అంధుల పాఠశాల నుంచి 13 మంది పరీక్షలకు రాయగా.. అందరూ మొదటిశ్రేణి మార్కులు సాధించారు.

■ శ్రీసత్యసాయి అంధుల పాఠశాలలో ఆరుగురు, ప్రకాశం జిల్లా ఒంగోలులోని వినికిడి లోపం ఉన్నవారి పాఠశాల నుంచి 16 మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

■ బాపట్ల విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నుంచి 19 మంది హాజరవ్వగా.. అందరూ ఉత్తీర్ణత సాధించారు. వారందరినీ వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అభినందించారు.

16 బడులు సున్నా చుట్టేశాయ్

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 16 పాఠశాలల్లో సున్నా ఫలితాలు నమోదయ్యాయి. వీటిలో నుంచి 64 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. ఒక్కరూ ఉత్తీర్ణులవ్వలేదు. గతేడాది 19 బడుల్లో సున్నా ఫలితాలు వచ్చాయి. వీటిపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అనంతపురం జిల్లా ఊబిచర్ల జిల్లా పరిషత్తు పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఉండగా.. అందరూ ఫెయిలయ్యారు. రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కలిపి 20 మంది విద్యార్థులు ఉండగా.. ఒక్కరూ పాస్ కాలేదు. వంద శాతం ఉత్తీర్ణులైన బడులు 2,161 ఉండగా.. వీటిల్లో అత్యధికంగా 1,542 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. గతేడాది 1,680 బడుల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈసారి 481 బడులు పెరిగాయి.

యాజమాన్యం	సున్నా ఫలితాలు	100% పాస్
ప్రభుత్వ	0	12
జిల్లా పరిషత్తు	1	399
ఆదర్శ పాఠశాలలు	0	13
పురపాలక బడులు	0	1
ఏపీ రెసిడెన్షియల్	0	11
సాంఘిక సంక్షేమ	0	16
గిరిజన సంక్షేమ	0	15
కేజీబీవీ	0	54
బీసీ సంక్షేమ	0	31
ఎయిడెడ్	2	15
ప్రైవేటు	11	1,542
ఆశ్రమ పాఠశాలలు	2	52
మొత్తం	16	2,161

పది ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ విజయభేరి

ఈనాడు, అమరావతి: పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. రాష్ట్రంలోనే గరిష్ఠంగా 599 మార్కులు తమ పాఠశాల విద్యార్థికే వచ్చాయని వెల్లడించారు. 598 మార్కులు 18 మందికి, 597 పైన 64 మందికి, 596 పైన 139 మందికి, 595 పైన 258 మందికి వచ్చాయని వివరించారు. మొత్తంగా 99 శాతం ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె అభినందించారు.

నారాయణ విద్యార్థుల సత్తా

ఈనాడు, అమరావతి: పది ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. 10 మంది విద్యార్థులకు అత్యధికంగా 598 మార్కులు వచ్చాయని చెప్పారు. 597 మార్కులు 9 మందికి, 596 మార్కులు 33 మందికి, 595 మార్కులు 37 మందికి వచ్చాయని వివరించారు. మొత్తంగా 99.03 శాతం ఉత్తీర్ణత నమోదైందని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

సత్తా చాటిన భాష్యం విద్యార్థులు

ఈనాడు, అమరావతి: పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. భాష్యం విద్యార్థి జి.దినేష్ 600కు 598 మార్కులు తెచ్చుకున్నారన్నారు. 214 మంది 590, ఆపైన మార్కులు సాధించారని వెల్లడించారు. గురువారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

శ్రీవిశ్వశాంతి విజయభేరి

ఈనాడు, అమరావతి: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని శ్రీవిశ్వశాంతి సంస్థ ఛైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. తమ విద్యార్థి ఎస్.కె.షమీమ్ 600కు 596 మార్కులు సాధించారన్నారు. ఎస్.పావని 592 మార్కులు, జి.హెచ్.ఎస్ నాగవెంకట్ 591 మార్కులతో సత్తా చాటారని తెలిపారు. 78 మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను, అధ్యాపకులను ఛైర్మన్ అభినందించారు.

కేశవరెడ్డి విద్యార్థుల విజయ విహారం

ఈనాడు, అమరావతి: పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని కేశవరెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ ఎన్.కేశవరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు జె.అభిషక్, ఎం.అఫషీన్ ఫాతిమా 597 మార్కులు సాధించారని తెలిపారు. 60 మంది విద్యార్థులు 590, ఆపైన మార్కులు సాధించారని పేర్కొన్నారు. సత్తా చాటిన విద్యార్థులకు, అధ్యాపకులకు ఆయన అభినందనలు తెలిపారు.

డా.కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థుల సంచలనం

ఈనాడు, అమరావతి: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో డా.కె.కె.ఆర్ గౌతమ్ విద్యాసంస్థల విద్యార్థులు సంచలనాలు సృష్టించారని సంస్థ యాజమాన్యం ప్రకటించింది. తమ విద్యార్థి ఆర్.హేమశ్రీరెడ్డి 600 మార్కులకు 598 మార్కులు సాధించారని తెలిపింది. 61 మంది విద్యార్థులు 590కి పైగా మార్కులు తెచ్చుకున్నారని పేర్కొంది. సత్తా చాటిన విద్యార్థులకు, అధ్యాపకులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

తిరుమల విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం: పది ఫలితాల్లో తిరుమల ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సూరె సుచితానందకు 597 మార్కులు, లోళ్ల శశాంక్ శివసాయితేజ, పిన్నమరాజు కార్తీక్ వర్మ, బర్నికల పూర్ణిత కీర్తిలకు 596 మార్కులు వచ్చాయని చెప్పారు. 595 మార్కులు ఐదుగురికి వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ నున్న సరోజినీదేవితో కలిసి ఆయన అభినందించారు.

ఆక్స్‌ఫర్డ్ ప్రభంజనం

ఈనాడు, అమరావతి: పది ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆక్స్‌ఫర్డ్ స్కూల్స్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. 597, 594 వంటి గరిష్ఠ మార్కులు తమ విద్యార్థులకు వచ్చాయన్నారు. 593 మార్కులు ముగ్గురికి, 592 ముగ్గురికి, 591 ఐదుగురికి వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ ఆరోన్‌రెడ్డితో కలిసి విద్యార్థులను ఆయన అభినందించారు.

శశి-వైజాగ్ విద్యార్థుల ప్రతిభ

ఈనాడు, అమరావతి: పది ఫలితాల్లో శశి నరేంద్ర విద్యాసంస్థలకు చెందిన అన్ని క్యాంపస్‌లలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్‌ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు. టి.హేమశ్రీ 597, డి.వైదేహి, సిహెచ్.సంపత్ తన్వీర్ 596, కె.రిషి, సిహెచ్.హెప్సిబ, ఐ.హరీష్ 595 మార్కులు సాధించారని చెప్పారు. మొత్తంగా 100 శాతం ఉత్తీర్ణత నమోదైందని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధతో కలిసి వారు అభినందించారు

25 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఈనాడు, అమరావతి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 25 నుంచి జూన్ 4 వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. విద్యార్థులు మే 1 నుంచి 9 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. అపరాధ రుసుము రూ.50తో మే 10 నుంచి 24 వరకు ఫీజు చెల్లించొచ్చని చెప్పారు. విద్యార్థులు పునర్ మూల్యాంకనం (రీకౌంటింగ్), పునర్ పరిశీలన (రీవెరిఫికేషన్)కు ఆన్‌లైన్‌లో మే 1 నుంచి 7 వరకు ఫీజు చెల్లించొచ్చని వెల్లడించారు. పునర్ మూల్యాంకనానికి ఒక్కో సబ్జెక్టుకు రూ.500, పునర్ పరిశీలనకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విశాఖ బాలికకు 599 మార్కులు

రాష్ట్రంలో 47 మంది విద్యార్థులకు 598

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. విశాఖపట్నానికి చెందిన కె.జ్ఞానేశ్వరి అత్యధికంగా 599 మార్కులు కైవసం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజులలంకకు చెందిన దివ్యతేజశ్రీ 596 మార్కులు పొందింది. రాష్ట్ర స్థాయిలో 47 మందికి 598 మార్కులు లభించాయి. అత్యధిక మార్కులు సాధించిన వారిలోనూ బాలికలే ముందున్నారు. గతేడాది కాకినాడకు చెందిన విద్యార్థినికి 600 మార్కులకు 600 రాగా.. ఈసారి ఫలితాల్లో ఒక్క మార్కు తగ్గింది. ఉత్తీర్ణులైన వారిలో అత్యధికంగా 83.69% మంది మొదటి శ్రేణిలో పాస్ అయ్యారు.

టైఫాయిడ్ నుంచి కోలుకొని.. అద్భుత విజయం

విశాఖపట్నం (కరాస), న్యూస్‌టుడే: విశాఖకు చెందిన విద్యార్థిని కె.జ్ఞానేశ్వరి పదోతరగతి ఫలితాల్లో 599/600 మార్కులు సాధించింది. ఈమె విశాఖ ఎన్ఏడీలోని శ్రీచైతన్య పాఠశాలలో చదివింది. బాలిక తండ్రి కె.శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి భారతి విశాఖ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగిని. పదోతరగతి పరీక్షలకు ముందు జ్ఞానేశ్వరికి టైఫాయిడ్ వచ్చింది. కొంచెం భయం వేసినా.. కోలుకొని ఈ విజయం సాధించిందని ఆమె తండ్రి తెలిపారు. ఆంగ్లంలో ఒక్క మార్కు తగ్గిందని చెప్పారు. ఇంటర్ బైపీసీలో చేరి, భవిష్యత్తులో డాక్టర్ కావాలనేది తన లక్ష్యమని విద్యార్థిని తెలిపింది.

నాన్న లేరన్న బాధను దిగమింగుకొని..

విశాఖపట్నం (గాజువాక), న్యూస్‌టుడే: పరీక్షలు రాసేముందు ఆ విద్యార్థిని తన కళ్లముందే జరిగిన రోడ్డుప్రమాదంలో తండ్రిని కోల్పోయింది. ఆ బాధను దిగమింది.. పది పరీక్షలు రాసింది. ఫలితాల్లో 542 మార్కులు సాధించింది. పదోతరగతి పరీక్షలు మార్చి 16 నుంచి మొదలు కాగా.. మార్చి 15న విశాఖకు చెందిన విద్యార్థిని అనుపమ హాల్‌టికెట్‌ను అప్పన్న పాదాల చెంత పెట్టేందుకు సింహాచలానికి తండ్రితో కలిసి బయలుదేరింది. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. రోడ్డుప్రమాదంలో కుమార్తె కళ్లెదుటే తండ్రి మృతిచెందారు. అంత్యక్రియలు ముగించి అనుపమ పరీక్షలకు హాజరైంది. ఫలితాల్లో ఆమె 542 మార్కులు సాధించింది. ఈ విజయం తన తండ్రికి అంకితమని పేర్కొంది. తల్లి రాజ్యలక్ష్మి అనుపమను అభినందించి మిఠాయి తినిపించారు.



అనుపమకు మిఠాయి తినిపిస్తున్న తల్లి రాజ్యలక్ష్మి

పదిలో 85.25% పాస్

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి విజయం సాధించాలని సూచించారు. ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 96.07% ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా 57.12% ఉత్తీర్ణతతో అట్టడుగున నిలిచింది.

రెండు వేలకు పైగా పాఠశాలల్లో అందరూ పాస్

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,089 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. వాటిల్లో 2,161 బడుల్లో అందరూ ఉత్తీర్ణులయ్యారు. 16 పాఠశాలల్లో అందరూ ఫెయిలయ్యారు. యాజమాన్యాల వారీగా చూస్తే ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు 96.04% ఉత్తీర్ణతతో మొదటిస్థానంలో నిలిచాయి. వీటిలో 2015 నుంచి 2019 వరకు 91%పైగా ఉత్తీర్ణత నమోదు కాగా.. కరోనా తర్వాత 2022లో 67.26 శాతానికి పడిపోయింది. 2024లో 86.69% మంది పాసయ్యారు. కరోనా తర్వాత అత్యధిక ఉత్తీర్ణత ఇదే. గతేడాది 81.14% ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈసారి 4.11% పెరిగింది.

మొదటి శ్రేణిలోనే అత్యధికం

● ఉత్తీర్ణులైన 5,26,954 మందిలో 4,40,995 (83.69%) మంది మొదటిశ్రేణిలో పాస్ అయ్యారు. ద్వితీయశ్రేణిలో 62,572 (11.87%)మంది, మూడో డివిజన్‌లో 23,387 (4.44%) మంది ఉత్తీర్ణులయ్యారు.

● అత్యధికంగా విశాఖపట్నం జిల్లా నుంచి 22,977 మంది మొదటి డివిజన్‌లో పాస్ కాగా.. తర్వాత స్థానంలో 22,772 మందితో ప్రకాశం జిల్లా నిలిచింది. ద్వితీయ డివిజన్ 4,529 మంది, తృతీయ డివిజన్ 2,333 మందితో కర్నూలు మొదటి స్థానంలో ఉండగా.. ద్వితీయ డివిజన్ 3,561 మంది, తృతీయ డివిజన్ 1,611 మందితో అనంతపురం జిల్లా రెండో స్థానంలో నిలిచింది.

ఫలితాలు ఇలా..

	బాలురు	బాలికలు	మొత్తం
పరీక్ష రాసిన వారు	3,14,018	3,04,113	6,18,131
ఉత్తీర్ణులు	2,59,633	2,67,321	5,26,954
శాతం	82.68	87.90	85.25

తెలుగు మాధ్యమానికి గడ్డు కాలం

తెలుగు మాధ్యమంలో చదివేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. 2024లో 1.61 లక్షల మంది తెలుగుమాధ్యమంలో పరీక్షలు రాయగా.. 2025లో 49,519 మంది, ఈ ఏడాది 30,129 మందే రాశారు. ఈ సంవత్సరం రాసిన వారిలో 19,834 (65.83%) మంది ఉత్తీర్ణులయ్యారు. మాతృభాష సబ్జెక్టులోనూ 6.05% మంది అనుత్తీర్ణులయ్యారు. ఆంగ్ల మాధ్యమంలో 5,83,645 మంది పరీక్షలు రాయగా.. 5,03,539 (86.28%) మంది పాసయ్యారు.

సైన్సులో ఎక్కువ తప్పారు

పదోతరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో ఎక్కువ మంది సామాన్యశాస్త్రంలో అనుత్తీర్ణులయ్యారు. తర్వాత గణితంలో ఎక్కువమంది ఫెయిలయ్యారు. సామాన్య శాస్త్రం పరీక్షకు 6,17,745 మంది హాజరు కాగా.. 5,63,855 (91.28%) మంది పాసయ్యారు. గణితానికి వచ్చేసరికి 6,17,670 మంది పరీక్ష రాయగా.. 5,78,403 (93.64%) మంది ఉత్తీర్ణులయ్యారు. హిందీలో అత్యధిక ఉత్తీర్ణత 99.82% నమోదైంది.

జిల్లాల వారీగా ఉత్తీర్ణత శాతాల వివరాలు www.eenadu.net లో

నాలుగేళ్లుగా మన్యం జిల్లాదే మొదటిస్థానం

ఈనాడు, అమరావతి, పార్వతీపురం మన్యం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో నాలుగేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లా మొదటిస్థానంలో నిలుస్తోంది. 2023లో 87.47%, 2024లో 96.37%, గతేడాది 93.90%, ఈసారి 96.07%తో అగ్రస్థానంలో నిలిచింది. గతేడాదిలానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ రెండో స్థానంలో నిలవగా.. విజయనగరం మూడో స్థానంలో ఉంది. అట్టడుగు నుంచి వరుసగా మూడు స్థానాల్లో గతేడాదిలానే అల్లూరి సీతారామరాజు (57.12%), కర్నూలు (71.08%), చిత్తూరు (76.69%) జిల్లాలున్నాయి. అల్లూరి జిల్లాలో 42.88% మంది ఫెయిలయ్యారు. రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 85.25% కంటే తొమ్మిది జిల్లాలు వెనుకంజలో నిలిచాయి.

వరుసగా నాలుగుసార్లు ఇలా సాధ్యం..

మన్యం జిల్లాలోని ప్రతి పాఠశాలలోని విద్యార్థులను ఏబీసీడీ వర్గాలుగా విభజించారు. వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ చదువులో వెనుకబడినవారిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టారు. కొందరిని ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. వందరోజుల ప్రణాళికను పక్కాగా అమలుచేశారు. రైజింగ్, షైనింగ్‌స్టార్స్‌పై దృష్టిపెట్టి ఉత్తమ ఫలితాలు సాధించారు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో నాలుగేళ్లుగా మన్యం జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోవడం గర్వకారణమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు.

తల్లీకుమారులు ఒకేసారి..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో తల్లీకుమారులు పదోతరగతి పరీక్షల్లో ఒకేసారి ఉత్తీర్ణత సాధించారు. పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన బందారు లక్ష్మీలహరి కొన్ని కారణాలతో ఆరో తరగతిలోనే చదువు ఆపేశారు. ఆమె కుమారుడు ముత్యాల శరణ్‌విజయ్ పూలపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదివారు. చదువుపై మక్కువతో లక్ష్మీలహరి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ)లో చదివి పదోతరగతి పరీక్షలు రాశారు. గురువారం విడుదలైన ఫలితాల్లో తల్లి లక్ష్మీలహరి 360/500, కుమారుడు విజయ్ 562/600 మార్కులు సాధించారు.



లక్ష్మీలహరి, విజయ్

తల్లి, కుమార్తె పాస్

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లాలో తల్లీకుమార్తె ఇద్దరూ ఒకేసారి పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించారు. చక్రాయపేట మండలం చేయకొంపల్లెకు చెందిన యశోద ఎనిమిదో తరగతి వరకు చదివారు. తర్వాత పెళ్లయింది. చదవాలనే కోరికతో ఈ ఏడాది ఓపెన్‌స్కూల్‌లో పదోతరగతి పరీక్షలు రాశారు. ఆమె కుమార్తె మానస జమ్మలమడుగు పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదివి, పరీక్షలు రాసింది. ఫలితాల్లో.. యశోదకు 299, మానసకు 390 మార్కులు వచ్చాయి.



తల్లి యశోదతో మానస

తండ్రీ కుమార్తె కలిసి..

రెంటచింతల, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరానికి చెందిన తండ్రి, కుమార్తె ఒకేసారి పదోతరగతి పరీక్షల్లో పాసయ్యారు. తండ్రి బాబూరావు 2001లో తొమ్మిదో తరగతిలో చదువుకు స్వస్తి పలికి పశువులకాపరిగా మారారు. నాలుగేళ్ల క్రితం నుంచి ఓ సిమెంట్ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే ఓపెన్‌స్కూల్‌లో పదో తరగతిలో చేరారు. ప్రస్తుతం 257 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఆయన కుమార్తె చిట్టి స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో ఉంటూ ఉన్నత పాఠశాలలో చదివింది. పదో తరగతి పరీక్షల్లో 448 మార్కులతో ఉత్తీర్ణురాలైంది.



కుమార్తె చిట్టికి మిఠాయి తినిపిస్తున్న తండ్రి బాబూరావు

నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకే పెద్ద దస్తగిరి హత్య!

పోలీసు కస్టడీలో నిందితుల వాంగ్మూలం

ఈనాడు, కడప; న్యూస్‌టుడే, కడప నేరవార్తలు: వైకాపా నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకే రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్ద దస్తగిరిని హత్య చేశామని ఈ కేసులోని నిందితులు పోలీసుకస్టడీలో అంగీకరించినట్లు తెలిసింది. కడప కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న 11 మందిని పోలీసులు బుధ, గురువారాల్లో కస్టడీకి తీసుకొని విచారించారు. వారిని కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఆవరణలో వేర్వేరుగా రహస్యంగా విచారించారు. ఈ క్రమంలోనే కేసులో నిత్యానందరెడ్డి పాత్రపై పూర్తి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఆలంఖాన్‌పల్లెలో జాతరలో జరిగిన వివాదం నిత్యానందరెడ్డికి చెప్పగా.. పెద్ద దస్తగిరిని చంపేందుకు ఇదే సరైన సమయమని తమకు సూచించారని, కేసు విషయం చూసుకుంటానని హామీ ఇవ్వడంతో తామంతా హత్య చేసినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అంతేతప్ప పెద్ద దస్తగిరితోనూ, మారెమ్మ జాతరలో పోటీచేసుకున్న వివాదంతోనూ తమకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ఆలంఖాన్‌పల్లెలో గత నెల ఐదునే హత్యకు ప్రణాళిక వేశామని పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. నిత్యానందరెడ్డి చెప్పినట్లు రవి(ఏ1), రాజా(ఏ2)లు పథకం వేయగా తాము హత్యచేసి, తర్వాత నిత్యానందరెడ్డి ఇంటికి వెళ్లి విషయం చెప్పి పారిపోయినట్లు మిగిలిన 9మంది నిందితులు పోలీసుల ఎదుట చెప్పినట్లు సమాచారం. విచారణ అనంతరం నిందితులను కడపలోని కేంద్ర కారాగారానికి తరలించారు.

మనమెందుకు తడుస్తాం?

చిటపట చినుకులు పడుతుంటే... తడిసి ముద్దవడం ఖాయం. తడిచాక జలుబు, జ్వరాలు వేరే సంగతి... ఇంతకీ ఈ తడి అంటే ఏమిటి? అది ఎలా ఏర్పడుతుంది? దుస్తులైనా, మనమైనా ఎందుకు తడుస్తాం..?



ఈ ప్రశ్నకు సమాధానం కావాలంటే... అసలు ఈ తడిపే గుణం నీటికి ఎలా వచ్చింది? అన్న ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటారు వాతావరణ శాస్త్రవేత్తలు. నీరు దుస్తుల్ని తాకిన వెంటనే వ్యాపించడానికి ప్రధాన కారణం నీటి అణువులకున్న ప్రత్యేక గుణం.

- ఇతర వస్తువుల్లోని అణువులకు నీటి అణువులు బాగా ఆకర్షితమవుతాయి. అందువల్ల నీరు పడినచోటే కాకుండా ఆ భాగమంతా తడిగా, చల్లగా మారిపోతుంది. ఈ రసాయన చర్యను అడ్‌హెసన్ (అతుక్కునే గుణం) అని పిలుస్తారు.
- ప్రతి నీటి అణువూ ఓ ద్రవ రూప అయస్కాంతం అనే చెప్పాలి. దానికి ఓ చివర చిన్న రుణాత్మక ఆవేశం, మరో చివర చిన్న ధనాత్మక ఆవేశం ఉంటాయి. గాజు, చర్మం, దుస్తులు వంటి వాటికీ విద్యుదావేశ గుణం ఉంటుంది. నీటి ఉపరితలాల్ని నీరు తాకినప్పుడు అవి నీటి అణువుల్ని ఆకర్షించి, పట్టి నిలిపి ఉంచుతాయి. అవి ఒకదానినొకటి చిక్కగా అతుక్కుని అలాగే ఉండిపోతాయి. దీంతో అక్కడ తాకితే తడిగా అనిపిస్తుంది.
- దుస్తులు తడిగా ఉన్నప్పుడు కలిగే చల్లని అనుభూతి బాష్పీభవనం వల్ల వస్తుంది. ద్రవాలు వాయువుగా మారడానికి శక్తి అవసరం. ఈ శక్తిని తమ పరిసరాల నుంచి ఉష్ణం రూపంలో తీసుకుంటాయి. చర్మం నుంచీ వేడిని తీసుకుంటాయి కాబట్టి. దేహం చల్లగా అనిపిస్తుంది.



- నీటిలాగే ఆల్కహాల్ కూడా ఆవిరైపోతుంది. ఉదాహరణకు గాయమైన చోట స్పిరిట్‌తో దూది పెట్టి తుడిచినప్పుడు చల్లగా అనిపిస్తుంది. దీనికి కారణం అందులో ఆల్కహాల్ ఉండడమే. శరీరంపై చెమట ఆవిరైనప్పుడూ సరిగ్గా ఇలాంటి భావనే కలుగుతుంది.

ఆ తడి పేరు... తేమ!

- కొన్నిసార్లు నీరు లేకపోయినా తడిగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఇది గాల్లోని నీటి ఆవిరి పరిమాణానికి సంబంధించినది. దీన్నే తేమ అంటాం.
- గాలి పూర్తిగా నీటి ఆవిరితో నిండిపోయినప్పుడు.. ఆ ఆవిరి ఘనీభవించి తిరిగి మంచు బిందువులు లేదా పొగమంచుగా ఏర్పడుతుంది.
- మనం చీకటి లేదా నీడ ప్రదేశాల వెళ్తే అక్కడ తేమగా అనిపిస్తుంది. దీని వెనక కూడా సైన్స్ ఉంది. గాలి ఎంత నీటి ఆవిరిని పట్టుకోగలదనేది ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది. వెచ్చని గాలి ఎక్కువగా, చల్లని గాలి తక్కువగా నీటి ఆవిరిని స్వీకరిస్తాయి. చీకటి లేదా నీడ ప్రదేశాలకు సూర్యరశ్మి తక్కువగా వస్తుంది కాబట్టి నీరు సులభంగా ఆవిరిగా మారదు. అందుకే ఆ ప్రాంతం తడిగా ఉంటుంది.



మీకు తెలుసా?

- వాతావరణ సూచనల్లో గాల్లోని వాస్తవ నీటి ఆవిరి పరిమాణానికి బదులుగా, గాలి ఎంత తేమగా అనిపిస్తుందో వివరించడానికి సాపేక్ష ఆర్ద్రతను ఉపయోగిస్తారు.
- వేడి గాలి చాలా తేమను పట్టుకుంటుంది కాబట్టి సాపేక్ష ఆర్ద్రత తక్కువగా ఉంటుంది. అందుకే, కార్చిచ్చులు పెద్ద మొత్తంలో నీటి ఆవిరిని విడుదల చేస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతుంటారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

పచ్చముక్కలతో చిల్‌కలు



వేసవి ఎండల తీవ్రతకు పక్షులు, జంతువులు కూడా ఇబ్బందిపడుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి మినీ జూపార్కులోని ఈ చిలుకలు కూడా అల్లాడాయి. నిర్వాహకులు గమనించి చల్లగా పుచ్చముక్కలు అందించగానే ఇలా చిల్ అవుతున్నాయి. - ఈనాడు, మహబూబ్‌నగర్

పిచ్చివాడన్నారు.. పచ్చదనం పెంచాడు



పాతికేళ్లుగా గ్రామం చుట్టూ చెట్లను పెంచుతున్న ఆయనను గ్రామస్థులంతా మొదట్లో పిచ్చివాడనేవారు. ప్రస్తుతం మారిన గ్రామ పరిసరాలను చూసి 'ట్రీ మ్యాన్' అంటూ కీర్తిస్తున్నారు. ఆయనే హరియాణాలోని కైథల్ జిల్లా కిచ్చానా గ్రామానికి చెందిన రాజ్‌పాల్(67). 1995లో వచ్చిన వరదతో చెట్లన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. వాటిని చూసి కలత చెందిన రాజ్‌పాల్ అప్పటి నుంచి మొక్కలు నాటడం ప్రారంభించారు. రోజూ వాటికి నీరు పోయడం, కంచె వేసి సంరక్షించడం కోసం ప్రత్యేక వాహనాన్ని కూడా తయారు చేయించుకున్నారు. అలా ఇప్పటివరకు 2 వేలకుపైగా చెట్లను పెంచారు. పోలీసుగా పనిచేస్తున్న కుమారుడు ఈ పనుల నిమిత్తం ప్రతి నెలా తండ్రికి రూ.10 వేలు ఇవ్వడం విశేషం. జిల్లా అటవీ అధికారి సైతం రూ.లక్ష ప్రోత్సాహక నిధిని అందించారు. –ఈటీవీ భారత్

మర్రి చెట్టు చుట్టూ గట్టు!

ఎన్నో ఏళ్ల నుంచి తమ జ్ఞాపకాలకు సాక్షిగా ఉన్న మర్రిచెట్టును ఇలా రక్షించుకుంటున్నారు కృష్ణా జిల్లా తేలప్రోలు గ్రామస్థులు. వంద ఏళ్ల నాటి ఈ చెట్టు చాలా స్థలం ఆక్రమించడంతో గతంలో కొమ్మలు తొలగించారు. కాండంతో పాటు పైన చిన్న కొమ్మను మాత్రం విడిచిపెట్టారు. దీన్నైనా రక్షించుకుందామని గ్రామస్థులే రూ.2.5 లక్షలను సమీకరించుకుని చెట్టు చుట్టూ గట్టును నిర్మించుకున్నారు. చల్లదనం కోసం గడ్డితో పైకప్పు వేశారు. రోజూ ఈ చెట్టు కింద కబుర్లు చెప్పుకొంటూ సేద తీరతామని పలువురు గ్రామస్థులు తెలిపారు. - ఈనాడు, అమరావతి



పిల్లలూ... బస్టాండు పాఠం విన్నాకే బస్సెక్కేది



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మెదక్ జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖ 'బాల హక్కుల దర్శిని- రక్షాబాట' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. చిన్నారుల కోసం మెదక్ కొత్త బస్టాండులో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించింది. శిశు సంక్షేమశాఖ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి ప్రయాణికులకు, చిన్నారులకు బాలల హక్కులు, వారికి చట్టపరంగా లభించే వెసులుబాటు గురించి చిత్రాల ద్వారా వివరిస్తున్నారు. బాలికలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి కూడా వివరిస్తున్నారు. బడులకు సెలవుల నేపథ్యంలో రాకపోకలు సాగించే చిన్నారులు ఈ చిత్ర ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్నారు. - ఈనాడు, మెదక్

కెరీర్‌లో ఎదుగుదలకు..



కెరీర్‌లో ఎదుగుదలకు అధిగమించాల్సిన అంశాలు..
◆ అస్పష్ట ప్రాధాన్యాలు ◆ భావవ్యక్తీకరణ లోపం ◆ నిలకడలేని ప్రయత్నం ◆ ఏకాగ్రత లోపించడం ◆ ఇతరుల సూచనలు, సలహాలు పట్టించుకోకపోవడం ◆ స్పష్టమైన గమ్యం లేకపోవడం ◆ విధినిర్వహణ కంటే ఆలోచనల్లో ఎక్కువగా మునిగి ఉండటం ◆ తగిన సమయాల్లో నిర్ణయాలు తీసుకోలేకపోవడం.

- టోలులోప్ మైఖేల్, రచయిత

ఒకటి కాటేసింది.. మరొకటి కన్నేసింది!



పాము కరిచిందని ఆసుపత్రిలో చేరిన వ్యక్తి దగ్గరకు మరో పాము వచ్చిన ఘటన ఇది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన రైతు శివశ్రీనివాస్‌ను మంగళవారం తాచుపాము కరిచింది. కుటుంబసభ్యులు అతడిని జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అదేరోజు రాత్రి శివశ్రీనివాస్ చికిత్స పొందుతున్న వార్డు గుమ్మం వద్ద తాచుపాము కనిపించింది. ఆసుపత్రి సిబ్బంది దాన్ని చంపేశారు. ఇంట్లో కాటువేసిన పామే మళ్లీ ఆసుపత్రికి వచ్చిందని కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. అయితే పాములు పగ పట్టడం అనేది మూఢనమ్మకమని స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు క్రాంతి వివరించారు. - న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం పట్టణం



లబూచేను గెలిచారు!

సంకల్పం బలంగా ఉంటే చాలు.. వయసుతో పనేముంది అంటున్నారు విజయవాడకు చెందిన లింగం రవీంద్రరావు. నేపాల్‌లోని హిమాలయాల్లో భాగమైన లబూచే పర్వతాన్ని 71 ఏళ్ల వయసులో ఆయన విజయవంతంగా అధిరోహించారు. ఏప్రిల్ 24న రాత్రి 9 గంటలకు పర్వతారోహణను ప్రారంభించి, 10 గంటల్లోనే 6,119 మీ. ఎత్తున ఉన్న పర్వత శిఖరాన్ని చేరుకున్నామని తెలిపారు. ఎవరెస్టును అధిరోహించే ముందు అనుభవం కోసం లబూచేను అధిరోహించానని వివరించారు. - న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

రెజిన్ ఆర్ట్‌తో జ్ఞాపకాలు పదిలం



మధుర స్మృతులను పదిలపరుచుకునేందుకు ఫొటోలు, పెయింటింగ్‌లను ఆశ్రయిస్తున్నా అవి కొన్నాళ్లకే పాడైపోతున్నాయి. దీనికి పరిష్కారంగా రెజిన్ ఆర్ట్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. జిగురులాంటి ఎపాక్సీ రెజిన్, హార్డ్‌నర్‌ను కలిపి ఈ ఆర్ట్‌ను రూపొందిస్తారు. కాకినాడకు చెందిన దివ్య మౌనిక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఈ కళలో రాణిస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పెళ్లి ఫొటోను రెజిన్‌తో తయారుచేసి ఆయనకు బహుమతిగానూ ఇచ్చారు. 'ఆన్‌లైన్‌లోనే ఈ కళ నేర్చుకున్నా. నెలకు రూ.50 వేల వరకు ఆదాయం పొందుతున్నా' అని మౌనిక వివరించారు. - ఈనాడు, కాకినాడ

EENADU Vol: 31, Issue: 25 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh and M/s. Kalajyothi Process Private Limited, Survey No. 94 B, C & D, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur District - 522 016, Andhra Pradesh and Published at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh. Editor: M Nageswara Rao. RNI No. 63819/1996. Regd. No. GTR/21/2024-26, Phones: 0863-2512142. Mobile No. 9959021812. Air Surcharge. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

అన్‌స్టాపబుల్... సావిత్రి


కీర్తి సురేశ్

బాక్సాఫీసు వద్ద విజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది కథానాయిక కీర్తి సురేశ్. ఈ ఏడాది కూడా వరుస చిత్రాలతో నటిస్తూ మంచి జోరుమీదుంది తార. ఈ నేపథ్యంలో తాజాగా తమిళంలో రానున్న ఆమె కొత్త చిత్రం 'సత్యవాన్ సావిత్రి' సామాజిక మాధ్యమాలలో ప్రకటించింది. ఈ మేరకు 'ప్రశాంతత కూడిన ముఖం.. అన్‌స్టాపబుల్ పోర్స్. ఇప్పుడిది ఆమె ఆట..' అనే వ్యాఖ్యలతో పోస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేసింది. కీర్తి సురేశ్, దర్శకుడు మిష్కిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రవీణ్ ఎస్ విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విడుదలైన ఈ పోస్టర్‌లో కీర్తి వివాహిత మహిళగా న్యాయవాదుల మధ్య సీరియస్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో బాల శరవణన్, చారుకేశ్, శిల్పా మంజునాథ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఉత్కంఠభరితమైన కోర్టు రూమ్ డ్రామా నేపథ్యంలో రూపొందిస్తున్నట్లు సమాచారం.

రెండో వారంలో.. రెండో పాటతో!


నాని

'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన 'ఆయా షేర్..' పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.


అనుపమ

కందుల సులోచన రాణిగా అనుపమ

కథానాయకుడు శర్వానంద్.. దర్శకుడు సంపత్ నంది కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'భోగి'. కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి గురువారం అనుపమ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో తను కందుల సులోచన రాణిగా తలపై మోదుగ ఆకులతో నిండిన గంప.. చేతిలో టిఫిన్ డబ్బాతో డీగ్లామర్ లుక్‌లో ఆసక్తిరేకెత్తిస్తూ కనిపించింది. శర్వా ఇందులో గంగా అనే రా రస్టిక్ పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. తుపాన్ లాంటి ఆ పాత్రకు ఆత్మలా నిలిచే సులోచన పాత్ర కనిపించనుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఇది 1960ల నేపథ్యంలో తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో సాగే యాక్షన్ కథాంశంతో రూపొందుతోంది. ఇటీవలే రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లో భారీ యాక్షన్ సన్నివేశాలు తెరకెక్కించారు. త్వరలోనే హైదరాబాద్‌లో తదుపరి షెడ్యూల్ మొదలు కానుంది. ఇది రక్షా బంధన్ సందర్భంగా ఆగస్టు 28న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: కిశోర్ కుమార్ మన్నె.

'అగధ'లో హారిణి


జోవిక విజయ్ కుమార్

ప్రముఖ నటి మంజుల మనవరాలు, నటి వనిత కుమార్తె జోవిక విజయ్ కుమార్ 'అగధ'తో తెరపై అడుగుపెట్టనుంది. ఎస్.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. శ్రీ విశాల్ బయను నిర్మించారు. శ్రవణ్ రెడ్డి, కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించారు. జోవిక విజయ్ ఇందులో హారిణి అనే ఓ ముఖ్య పాత్ర పోషించింది. దీని టీజర్‌ను గురువారం తన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో తను జోరున కురుస్తున్న వానలో చేతిలో కత్తి పట్టుకుని సీరియస్‌గా నిలబడి కనిపించింది. ఇది అద్భుత అంశాలు, మార్మికమైన మూలాలతో ముడిపడిన ఆసక్తికర కథతో రూపొందిన సినిమా. గ్రాఫిక్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ సినిమాకి సంగీతం: రాకేశ్ వెంకటాపురం, ఛాయాగ్రహణం: నాని చమిడిశెట్టి.

ఛావా హీరో... 'మహావతార్'?


విక్కీ కౌశల్

గతేడాది 'ఛావా' సినిమాలో శంభాజీ మహారాజ్ పాత్రలో ఒదిగిపోయి రుద్ర తాండవం చేసి బాక్సాఫీస్ వద్ద వసూళ్ల రికార్డు సృష్టించారు బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్. ఇప్పుడాయన వరుసగా ముచ్చటగా మరో శక్తిమంతమైన పాత్రలో తెరపై అదరగొట్టడానికి సన్నద్ధమవుతున్నారు. విక్కీ ప్రధాన పాత్రలో అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మహావతార్'. తాజాగా ఈ సినిమాని 2027 జనవరిలో పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "వచ్చే సంవత్సరం మొత్తం 'మహావతార్' షూటింగ్‌కే సమయాన్ని కేటాయించనున్నారు విక్కీ. దీన్ని ఆయన జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ప్రాజెక్ట్‌గా భావిస్తున్నాడు. అందుకు తగ్గట్లే ఇందులోని తన పాత్ర కోసం శరీరకంగా తనని తాను మార్చుకోవడానికి ఆరు నెలలు శిక్షణ తీసుకోబోతున్నాడ"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

'షేర్షా' జోడీ మరోసారి


కియారా, సిద్ధార్థ్

"రావాలి నీతో ఈ పయనం... చేరాలి కోరిన ఆ తీరం.." అంటూ 'షేర్షా' సినిమాలో ప్రేమ పాటలు పాడుకొని సినీప్రియుల్ని కట్టిపడేసిన బాలీవుడ్ జోడీ సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వాణీ. ఇప్పుడీ జంట తెరపైకి మళ్లీ వస్తుందంటే.. థియేటర్లలో ప్రేక్షకులకు పండగే కదా! అలాంటి పండగ వాతావరణం కోసమే సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా సిద్ధార్థ్ సామాజిక మాధ్యమాల వేదికగా కియారాతో కలిసి ఉన్న ఓ ఫొటోను పంచుకున్నారు. అందులో వారిద్దరూ వెనక్కి తిరిగి ఉండడం.. మరోవైపు "నేను ఎవరితో షూటింగ్ చేస్తున్నానో చెప్పుకోండి" అంటూ సిద్ధార్థ్ ఆ ఫొటోకి క్యాప్షన్ పెట్టారు. దీంతో వీరిద్దరూ కలిసి మరో చిత్రంలో నటించబోతున్నారని అభిమానుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. మరి సినీప్రియుల ఊహాగానాలు నిజమవుతాయా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే. ప్రస్తుతం సిద్ధార్థ్ హీరోగా నటించిన 'వీవాన్', కియారా కథానాయికగా కనిపించనున్న 'టాక్సిక్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

తమాషాని ఆస్వాదించండి


రాశీఖన్నా

మీ జీవితం గాడిలో పడాలంటే నాకు సీక్రెట్ ఏజెంట్‌గా మారండి అంటూ శక్తిమంతమైన పోలీసు అధికారిణి పాత్రతో ఓటీటీలో సందడి చేయడానికి సిద్ధమైపోయింది కథానాయిక రాశీఖన్నా. ఆమె.. కింగ్, పాలక్ తివారీ, నకుల్ రోషన్ సహదేవ్ తదితరులు కలిసి నటించిన సిరీస్ 'లుక్కే'. ఈ సిరీస్‌కి హిమాంక్ గౌర్ దర్శకత్వం వహించారు. ఇటీవల ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది అమెజాన్ ప్రైమ్. 'స్వరం పెరుగుతుంది.. లెక్క తేలుతుంది.. ఇక ప్రతీకారం తీర్చుకోవాల్సి ఉంది' అనే వ్యాఖ్యల్ని పేర్కొంది. ఈ నెల 8 నుంచి ఈ సిరీస్ ప్రైమ్ వేదికగా ప్రసారం కానుంది. 'సంగీతం మనకు కీర్తిని తెస్తుంది.. కీర్తి ఉన్నవాడికి చెడ్డ పేరొస్తుంది..' 'కుక్క ఎముకని వదులుకోలేదు కదా! మనం దాన్ని విసిరేసి తమాషాని ఆస్వాదించడమే..' లాంటి ఆసక్తికర సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ రాశీ యాక్షన్ సన్నివేశాలు, ఓ యువ జంట ప్రేమకథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంది. మ్యూజికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సిరీస్‌లో రాశీఖన్నా తన క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లతో భిన్నమైన లుక్కుల్లో కనిపించనుంది.

'ప్రళయ్' వస్తాడు!


రణ్‌వీర్ సింగ్

'ధురంధర్' ఫ్రాంఛైజీ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. ఈ సినిమాల తర్వాత ఆయన తదుపరి ప్రాజెక్టుల గురించి ఎటువంటి అధికారిక ప్రకటనా చేయలేదు. కానీ, గతంలోనే ఓ ఇంటర్వ్యూలో ప్రముఖ హిందీ చిత్ర నిర్మాత హన్సల్ మెహతా... రణ్‌వీర్ ప్రధాన పాత్రలో 'ప్రళయ్' అనే సినిమాని రూపొందించనున్నారని వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల సోషల్ మీడియాలో రణ్‌వీర్, చిత్ర నిర్మాతల మధ్య విభేదాల కారణంగా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారని ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ అవి వాస్తవం కాదని చిత్రవర్గాలు చెప్పినట్లు సమాచారం. "రణ్‌వీర్ జాంబీ థ్రిల్లర్ 'ప్రళయ్' అనుకున్న విధంగానే పట్టాలెక్కనుంది. సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్తల్లో నిజం లేదు. దర్శకుడు జై మెహతా.. రణ్‌వీర్‌లు స్క్రిప్ట్ గురించి నిరంతరం చర్చలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. భారతీయ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని ఒక భారీ అద్భుతాన్ని సృష్టించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. ఆగస్టు నాటికి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది"ని సినిమా బృందం చెప్పినట్లు సమాచారం.

కెరీర్ తొలినాళ్లలో బాలీవుడ్‌లో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఎవరితోనూ బంధుత్వం లేదని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. అందాల పోటీలో విజేతగా మొదలు పెట్టి.. బాలీవుడ్, హాలీవుడ్‌లోనూ సత్తాచాటి అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్న నాయిక ఈమె. పలు వైవిధ్యమైన కథలతో ఓటీటీ వేదికగా కూడా అదరగొడుతున్న ఈ తార.. ప్రస్తుతం 'వారణాసి'తో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక.. తన సినీ కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.


ప్రియాంక చోప్రా

ఆ అవమానం తర్వాత ఆ బలహీనతను అధిగమించా!

"నాకు ఒక సవాలు ఎదురైతే.. దానిని ఎదుర్కొని నిలబడి విజయం సాధించాలని గట్టిగా నిర్ణయించుకునే రకం నేను. నాకు ఎప్పుడూ పోటీతత్వం ఇష్టం. నాతో నేను కూడా పోటీ పడతా. అందాల పోటీ ప్రపంచంలో గానీ, సినిమా రంగంలో గానీ నాకు ఎవరితోనూ బంధుత్వం లేదు. అందుకే చాలా వేగంగా పనిని నేర్చుకోవాల్సి వచ్చింది. షూటింగ్ లేనప్పుడూ ఖాళీగా కూర్చునే దాన్ని కాదు. అనుభవం ఉన్న సహనటుల నుంచి ఏదైనా కొత్తగా నేర్చుకుంటూ.. వారి సృజనాత్మక ఆలోచనలన్నింటినీ గ్రహించేదాన్ని".

ఆగ్రహంతో మైక్ కింద పడేశారు!

"కెరీర్ ఆరంభంలో డ్యాన్స్ విషయంలో చాలా ఇబ్బందులు పడ్డా. ఓవైపు నటన, మరోవైపు కొరియోగ్రాఫర్ చెప్పిన మూమెంట్స్. ఇవన్నీ ఒకేసారి చేయడం నావల్ల అయ్యేది కాదు. వీటితో పాటు నా పక్కన కోస్టార్‌కు సరిపోయేలా స్టెప్స్ వేయడం అసాధ్యంలా అనిపించేది. ఓసారి దక్షిణాఫ్రికాలో ఓ పాట షూటింగ్ జరుగుతున్నప్పుడు కొరియోగ్రాఫర్ రాజు ఖాన్ నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "నువ్వు ఏదో అందాల పోటీల నుంచి వచ్చుండొచ్చు. కానీ నటి కావాలంటే ముందు డ్యాన్స్ నేర్చుకో" అంటూ మైక్ కింద పడేసి సెట్ నుంచి వెళ్లిపోయారు. ఆ సమయంలో నాకెంతో అవమానంగా అనిపించింది. దీన్ని సవాలుగా తీసుకొని నాలో ఉన్న ఈ డ్యాన్స్ అనే బలహీనతను అధిగమించాను. రోజుకు ఆరు గంటలు కత్రినా కైఫ్‌తో కలిసి ప్రాక్టీస్ చేశా".

ఇది ఏ కళాకారుడికైనా వర్తిస్తుంది

"బాలీవుడ్‌లో మాదిరిగానే హాలీవుడ్‌లో కూడా నన్ను ఒక సూపర్ స్టార్‌గా పరిగణిస్తారా? అని అడుగుతుంటారు. ఒక దేశంలో మీకు పేరు ప్రఖ్యాతులు ఉన్నంత మాత్రాన మరో దేశంలో కూడా అదే విధంగా గౌరవం పొందాలని ఆశించకూడదు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ప్రేక్షకులను సంపాదించుకోవాలి. ఇది ఏ మాధ్యమంలోని కళాకారుడికైనా వర్తిస్తుంది. మీ సినిమాలను చూసే ప్రజల నుంచి ఆ విధమైన గౌరవాన్ని, ప్రేమను పొందాలంటే మీరు కష్టపడాలి. కానీ దాని కోసం డిమాండ్ చేయలేరు".

అన్ని విషయాల్లోనూ నేను భారతీయురాలినే

"నా లోకమంతా మా పాపనే. నాలోని, నా భర్త నిక్‌లోని ఉత్తమ లక్షణాలకు ఆమె ప్రతీక. మా ఆయన ప్రతి విషయంలోనూ చురుకుగా ఉంటారు. నా సంస్కృతికి మంచి ప్రాతినిధ్యం కల్పించడానికి నాకున్న వేదికను ఉపయోగించుకోవడానికి నా వంతు కృషి చేస్తాను. నాకు భారతదేశం అంటే చాలా ఇష్టం. ఆహార ఎంపికలోనూ, ఇంకా ఎన్నో విషయాల్లోనూ నేను భారతీయురాలినే. మా కుమార్తెను పలు భిన్న సంస్కృతుల వాతావరణంలో పెంచాలనుకుంటున్నాం. నిక్‌కు భారతీయ సంస్కృతి గురించి తెలియకపోయినా.. అతను భారత్‌ను ఎంతో ప్రేమిస్తాడు".

వేటాడే వైద్యురాలు


భావన

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం నేపథ్యంగా రూపొందిన మలయాళ చిత్రం 'హంట్'. భావన ప్రధాన పాత్రధారిగా షాజీ కైలాస్ తెరకెక్కించిన ఈ సినిమాని 'డాక్టర్ కీర్తి: ఎంబీబీఎస్ ఎంఎస్' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది స్వర్ణ క్రియేషన్స్ సంస్థ. ఇది ఈనెల 8న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు స్వర్ణకుమారి, ఎం విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ.. "కోల్‌కతా హత్యాచార ఘటన పట్ల ప్రపంచమంతా నివ్వెరపోయింది. ఆ కేసు ఆధారంగానే షాజీ కైలాస్ ఈ సినిమాని తెరకెక్కించారు. ఇందులోని భావోద్వేగాలు, భావన అద్భుతమైన నటన ప్రేక్షకుల్ని కట్టిపడేస్తాయి. ఇది తెలుగులోనూ విజయం సాధిస్తుందనే నమ్మకముంది" అన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, లయన్ సాయి వెంకట్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాపాల గతం.. అరిష్టాల భవిష్యత్తు!

హారర్ జానర్ సినీప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ చిత్రాలలో 'తుంబాడ్ 2' ఒకటి. చిన్న సినిమాగా విడుదలైన మొదటి చిత్రం 'తుంబాడ్' ప్రేక్షకులలో మంచి ఆదరణని సొంతం చేసుకుంది. ఇటీవలే సీక్వెల్‌ని కూడా పట్టాలెక్కించినట్లు ప్రకటించారు నటుడు, నిర్మాత సోహమ్ షా. ఆయన తన సొంత బ్యానర్ సోహమ్ షా ఫిల్మ్స్‌పై దీనిని నిర్మిస్తున్నారు. ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'పాపాలతో కూడిన గతం.. అరిష్టాల భవిష్యత్తు.. ఆకలి రగులుతోంది.. దురాశ వారసత్వం కొనసాగుతోంది' అనే వ్యాఖ్యలతో 'తుంబాడ్ 2' విడుదల తేదీని ప్రకటించింది. వచ్చే ఏడాది డిసెంబరు 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. హారర్ ఫాంటసీ జానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ.

కథను నడిపించేదెవరు?


నయనతార


కత్రినా కైఫ్

అత్యాశ ఎంత ప్రమాదకరమో.. మళ్లీ చూపించడానికి సిద్ధమైంది 'తుంబాడ్ 2' చిత్రం. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో కథానాయిక కోసం ఓ అగ్రతారను రంగంలోకి దించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. "ఈ చిత్రంలో ఒక ప్రముఖ నాయిక కథను ముందుకు నడిపించే పాత్రను పోషించనుంది. దీని కోసం అందాల తారలు ప్రియాంక చోప్రా, కత్రినా కైఫ్, నయనతారల పేర్లను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈ ముగ్గురిలో ఏ భామకు ఇందులో నటించే అవకాశం వస్తుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

ఈనాడు బిజినెస్

లారస్ ల్యాబ్స్ లాభంలో 19.46% వృద్ధి



లారస్ ల్యాబ్స్, మార్చి త్రైమాసికంలో రూ.279.14 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.233.67 కోట్ల కంటే ఇది 19.46% ఎక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.1,720.30 కోట్ల నుంచి 5% పెరిగి రూ.1,811.57 కోట్లకు చేరింది. 2024-25తో పోలిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి నికర లాభం రూ.358.32 కోట్ల నుంచి 148.05% పెరిగి రూ.888.79 కోట్లుగా నమోదు కాగా... కార్యకలాపాల ఆదాయం రూ.5553.96 కోట్ల నుంచి 22.67% అధికమై రూ.6812.90 కోట్లకు చేరింది.రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.1.20 (60%)ను రెండో మధ్యంతర డివిడెండుగా చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. 'భవిష్యత్ వృద్ధికి పునాది వేసే దిశగా కొత్త సాంకేతికతలు, విస్తరణ, సమీకృత సామర్థ్యాల బలోపేతంపై గణనీయంగా పెట్టుబడులు పెడుతున్నామ'ని లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) సత్యనారాయణ చావ తెలిపారు.

ఉద్యోగాల కోత యోచనలో మైక్రోసాఫ్ట్

రానున్న నెలల్లో మరిన్ని ఉద్యోగాల కోత ఉండొచ్చని అంతర్జాతీయ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంకేతాలు ఇచ్చింది. కొత్త నియామకాల విషయంలోనూ నెమ్మదిగానే ముందుకెళ్లే యోచనలో ఉంది. ఏఐ (కృత్రిమమేధ) పెట్టుబడులు, వ్యయ నియంత్రణపై మరింతగా దృష్టి సారిస్తుండటం వల్లే.. ప్రస్తుత సిబ్బందిని తగ్గించుకునే అవకాశాలను ఉన్నాయని మైక్రోసాఫ్ట్ ముఖ్య ఆర్థిక అధికారి ఆమి హుడ్ సంకేతాలు ఇచ్చారని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. 2026 జులైతో ప్రారంభమయ్యే నూతన ఆర్థిక సంవత్సరంలో నియామకాల అంచనాలు, ప్రణాళికలపై విశ్లేషకులు అడిగిన ప్రశ్నకు 'తొలగింపులు ఉంటాయనే' సమాధానాన్ని హుడ్ ఇచ్చారు. 'మా కార్యకలాపాల వేగాన్ని పెంచుకోవడానికి ఎలా ముందుకెళ్లాలనే దానిపైనే దృష్టి సారిస్తుంటాం. రాబోయే సంవత్సర కాలంలో సిబ్బంది సంఖ్య తగ్గొచ్చని భావిస్తున్నామ'ని తెలిపారు. బాధ్యతలను మరింత స్పష్టంగా తెలియజేస్తూ, చిన్నచిన్న బృందాలను ఏర్పాటు చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ అనుకుంటోందని కొందరు ఉద్యోగులకు ఇచ్చిన ఇంటర్నల్ మెమోలో వివరించారు. ఫలితాల విషయంలో ఉద్యోగులను మరింత జవాబుదారీగా చేసే అవకాశమూ ఉందని తెలిపారు. అమెరికాలో 7% మంది ఉద్యోగులకు (సుమారు 8,750 మంది) స్వచ్ఛంద పదవీ విరమణ అవకాశాన్ని మైక్రోసాఫ్ట్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఇన్ఫోసిస్ వైస్ ఛైర్మన్‌గా నితిన్ పరాంజే

ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్, నాన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నితిన్ పరాంజేను నియమించింది. ఆయన హెచ్‌యూఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్నారు. నితిన్ నియామకం వెంటనే అమల్లోకి వచ్చిందని ఇన్ఫోసిస్ పేర్కొంది. బోర్డు, కంపెనీ ఛైర్మన్‌కు తగిన సలహాలు ఇచ్చేందుకు నితిన్ అపార అనుభవం తమకు ఉపకరిస్తుందని వివరించింది.

కోడి గుడ్లు

మే 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	525
వరంగల్	527
విజయవాడ	515
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	583

బజాజ్ ఆటో నుంచి షేర్ల బైబ్యాక్!

ఈ నెల 6న జరగనున్న సమావేశంలో షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను తమ బోర్డు పరిశీలించనున్నట్లు బజాజ్ ఆటో ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. మిగులు నిధులను వాటాదార్లకు అందించేందుకు గతంలో కూడా ఈ కంపెనీ బైబ్యాక్ ఆఫర్లు ఇచ్చింది.

చైనా ఎఫ్‌డీఐకు ఓకే

- ఆ దేశ కంపెనీలకు 10% వాటా ఉన్న విదేశీ సంస్థలకు వెసులుబాటు
- నిబంధనల్లో మార్పునకు నిర్ణయం
- త్వరలోనే నోటిఫై



చైనా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించేందుకు మన ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. చైనా కంపెనీలకు 10% వరకు వాటా లుండే విదేశీ సంస్థలు, మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఇందుకోసం ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించేలా త్వరలో కేంద్రం నోటిఫై చేయనుంది. అనంతరం ఆ మార్పులు అమల్లోకి వస్తాయి. అందుకు అనుగుణంగా ప్రెస్ నోట్(పీఎన్) 3 ఆఫ్ 2020లో సవరణలకు గత మార్చిలోనే కేంద్రం ఆమోదం తెలిపింది. దీని కింద 10% వరకు చైనా కంపెనీలకు వాటా ఉన్న విదేశీ సంస్థలు భారత్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టొచ్చు.

ఎఫ్‌డీఐ తీరు ఇలా..
2025-26: 88.29 బిలియన్ డాలర్లు (ఏప్రిల్-ఫిబ్రవరి)

60 రోజుల్లో..

యంత్రపరికరాలు, ఎలక్ట్రానిక్ యంత్రపరికరాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పాలీసిలికాన్, ఇన్‌గాట్‌వేఫర్ లేదా కమిటీ ఆఫ్ సెక్రటరీస్ జత చేసిన ఏ ఇతర రంగం/కార్యకలాపాలకు సంబంధించిన ఎఫ్‌డీఐ ప్రతిపాదనలను 60 రోజుల్లోనే ప్రాసెస్ చేయనున్నారు. 60 రోజుల్లోపు ప్రాసెస్ చేయదగ్గ ఉప రంగాలను గుర్తించే పనిలో తమ విభాగం ఉన్నట్లు జైప్రకాశ్ తెలిపారు.

2025-26లో 90 బి. డాలర్లు

గత ఆర్థిక సంవత్సరం(2025-26)లో మనదేశంలోకి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐ 90 బిలియన్ డాలర్లు (రూ.8.3 లక్షల కోట్లు)గా ఉండొచ్చని డీపీఐఐటీ కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా పేర్కొన్నారు. సంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధి వల్లే దేశంలోకి భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు.

వీటికి అనుమతి లేదు

చైనా/హాంకాంగ్ లేదా భారత్‌తో సరిహద్దు పంచుకున్న ఇతర దేశాల్లో నమోదైన కంపెనీలకు ఈ సవరించిన ఎఫ్‌డీఐ నిబంధనలు వర్తించవు. కొత్త మార్పులను ఇప్పటికే పరిశ్రమల, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) నోటిఫై చేయగా, ఆర్థిక కార్యకలాపాల విభాగం (డీఈఏ) నోటిఫై చేయాల్సి ఉంది. విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) కింద డీఈఏ నోటిఫికేషన్ త్వరలోనే జారీ అవుతుందని డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి జై ప్రకాశ్ శివహరే పేర్కొన్నారు.

ఎఫ్‌డీఐ రెండు మార్గాల్లో..

భారత్ వెలుపలి వ్యక్తి దేశంలోని అన్‌లిస్టెడ్ కంపెనీలో పెట్టుబడులు పెడితే దానిని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ)గా పరిగణిస్తారు. లేదా లిస్టెడ్ కంపెనీలో 10% లేదా అంతకంటే ఎక్కువ పోస్ట్ ఇష్యూ పెయిడప్ ఈక్విటీ క్యాపిటల్ కొనుగోలు చేయడాన్నీ ఎఫ్‌డీఐగానే పిలుస్తారు. ఇది రెండు మార్గాల్లో పెట్టొచ్చు. ఆర్‌బీఐ లేదా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఆటోమేటిక్ మార్గంలో చేయొచ్చు. కొన్ని రంగాల్లో మినహా చాలా వరకు 100% ఆటోమేటిక్ మార్గంలో ఎఫ్‌డీఐకు అనుమతి ఉంది. రెండో మార్గంలో ప్రభుత్వ ముందస్తు అనుమతులు తీసుకుని పెట్టుబడులు పెట్టొచ్చు. మనదేశంతో భూ సరిహద్దులు పంచుకునే ఏ దేశమైనా, తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకునే పెట్టుబడులు పెట్టాలి.

చమురు ధరలే రూపాయిని ముంచేస్తున్నాయ్




పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమయ్యాక, ముడిచమురు ధర 50% పెరగడంతో, రూపాయి మారకపు విలువ మరింత క్షీణిస్తోంది. ముడిచమురు బ్యారెల్ ధర 100-120 డాలర్ల మధ్య కదలాడుతోంది. గురువారం ఒకదశలో 125 డాలర్లకూ చేరింది. 2022 గరిష్ఠస్థాయిలకు ఇందన ధరలు చేరినట్లయ్యింది. ఫలితంగా ద్రవ్యోల్బణం అధికమవుతోందనే ఆందోళనలు పెరుగుతున్నాయి.ఒకవైపు, విదేశీ పెట్టుబడుల రాక దేశంలోకి తగ్గుతుంటే, మరోవైపు, విదేశీ మదుపర్లు మన రుణపత్రాలను భారీగా విక్రయిస్తూ, పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఈ ఏడాదిలో విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు ఇప్పటివరకు రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను మన ఈక్విటీ మార్కెట్ల నుంచి ఉపసంహరించారు. వీటన్నింటి ఫలితంగానే, గతంలో ఎన్నడూ లేనివిధంగా గురువారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.34కు క్షీణించినా, అనంతరం కాస్త కోలుకుని 94.84 వద్ద స్థిరపడింది. మార్చి 30న కూడా డాలర్ విలువ రూ.95 స్థాయిని అధిగమించినా, మళ్లీ కాస్త దిగివచ్చిన సంగతి విదితమే.

ఈ ఏడాదిలో 5.31% పతనం: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించాక మార్చిలోనే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 4% తగ్గింది. మళ్లీ ఏప్రిల్‌లో 0.11% నష్టపోయింది. ఈ ఏడాది జనవరి నుంచి చూస్తే ఇప్పటికి రూపాయి మారకపు విలువ 5.31% క్షీణించింది.

వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ బకాయిలు 27% తగ్గింపు

వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన సవరించిన స్థూల ఆదాయ బకాయిలు (ఏజీఆర్)ను ప్రభుత్వం 27% తగ్గించి, రూ.64,046 కోట్లకు పరిమితం చేసినట్లు సంస్థ ప్రకటించింది. గత డిసెంబరు చివరకు వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ బకాయిల మొత్తం రూ.87,695 కోట్లుగా టెలికాం విభాగం నిర్ధారించింది. తదుపరి వీటిని సమగ్రంగా పరిశీలించి, ఈ మొత్తాన్ని రూ.64,046 కోట్లకు పరిమితం చేసినట్లు తెలిపింది. 10 సంవత్సరాల వ్యవధిలో ఈ బకాయిలను వొడాఫోన్ ఐడియా తీర్చాల్సి ఉంది.

హైసియా అధ్యక్షుడిగా బిపిన్ పెండ్యాల



హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) అధ్యక్షుడిగా బిపిన్ పెండ్యాలను ఎన్నుకున్నారు. 2026-28 కాలానికి ఆయన ఈ పదవిలో ఉంటారు. హైదరాబాద్‌లో జరిగిన సంస్థ 34వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఆప్సెన్ ఇండియాలో జనరల్ మేనేజర్‌గా బిపిన్ పనిచేస్తున్నారు. హైసియా ప్రస్తుత అధ్యక్షుడు ప్రశాంత్ నాదెళ్ల స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఇసాక్ రాజ్‌కుమార్ (రియల్‌పేజ్ ఇండియా ఎస్‌వీపీ, ఎండీ)ను, ప్రధాన కార్యదర్శిగా జితేంద్ర పుర్వా (ట్రిడెన్స్ ఇంక్ సీఓఓ)ను, కోశాధికారిగా రఘు బోడుపల్లి (గచ్చిబౌలి క్యాంపస్ ఇన్ఫోసిస్ వైస్ ప్రెసిడెంట్, డీసీ హెడ్)ని, సంయుక్త కార్యదర్శిగా రాజ్యలక్ష్మి ఆచంట (ఇన్ఫోమైండ్స్ సాఫ్ట్‌వేర్)ను ఎన్నుకున్నారు.

ఒకేసారి టాటా సియెరా 101 కార్ల డెలివరీ



ఒకేరోజు 101 సియెరా కార్లను కొనుగోలుదారులకు టాటా మోటార్స్ అందజేసింది. హైదరాబాద్‌లోని జలవిహార్ ఇందుకు వేదికైంది. ఈ కార్యక్రమంలో జాస్పర్ ఇండస్ట్రీస్, మాలిక్ ఆటో పరల్స్, ఆరెంజ్ ఆటో, ప్రథమ్ మాలిక్ ఆటో, తేజస్వీ ఆటోమొబైల్స్, వెంకటరమణ మోటార్స్, సెలెక్ట్ కార్స్, వీవీసీ ఆటో వంటి డీలర్లు పాల్గొని, తమ వద్ద బుక్‌చేసుకున్న కొనుగోలుదారులకు కార్లను అందజేశారు. దేశవ్యాప్తంగా ఈ ఎస్‌యూవీ మోడల్‌కు ఇప్పటికే 1,00,000కు పైగా బుకింగ్‌లు వచ్చాయి.

తెలుగు రాష్ట్రాల్లోకి ఇవానా జువెల్స్



హైదరాబాద్: జిందాల్ గ్రూప్‌నకు చెందిన ఆభరణాల సంస్థ ఇవానా జువెల్స్ హైదరాబాద్‌కు విస్తరించింది. ల్యాబ్‌లో ఉత్పత్తి చేసే వజ్రాల బ్రాండ్ ఇది. దేశీయ విలాసవంత ఆభరణాల రంగంలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి సారించామని, అందులో భాగంగానే తమ 11వ విక్రయశాలను హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ రోడ్డులో ప్రారంభించినట్లు ఇవానా జువెల్స్ డైరెక్టర్ యోగేశ్ జిందాల్ తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరులోనూ విక్రయశాలలు నెలకొల్పుతామని మరో డైరెక్టర్ ఆయుషి జిందాల్ ప్రకటించారు.

ధరలు పెంచనున్న హెచ్‌యూఎల్

- జనవరి- మార్చి లాభంలో 21% వృద్ధి
- తుది డివిడెండు రూ.22

ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) తన ఉత్పత్తుల ధరలను విభాగాల వారీగా పెంచుతోంది. ముడి సరకు వ్యయాలు, ముడి చమురు ఆధారిత ప్యాకేజింగ్ రేట్లు పెరగడమే ఇందుకు కారణమని హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీ ప్రియా నాయర్ తెలిపారు. ముడి సరకు వ్యయాల భారం 8-10% ఉండగా.. ఇప్పటివరకు తమ ఉత్పత్తుల ధరలను 3-5 శాతమే పెంచినట్లు కంపెనీ సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా తెలిపారు. గృహ సంరక్షణ, వ్యక్తిగత సంరక్షణ, సౌందర్య ఉత్పత్తుల విభాగంలో ధరల పెంపు ఎక్కువగా ఉండొచ్చని పేర్కొన్నారు.

- జనవరి- మార్చి త్రైమాసికానికి హెచ్‌యూఎల్ ఏకీకృత ప్రాతిపదికన రూ.2,994 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాల లాభం రూ.2,475 కోట్లతో పోలిస్తే ఇది 21% అధికం. అనుకోని లాభాల రూపేణా రూ.247 కోట్లు రావడం ఇందుకు తోడ్పడింది.
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి హెచ్‌యూఎల్ నికర లాభం రూ.41% పెరిగి రూ.15,059 కోట్లకు చేరింది.
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.22 (2200%) తుది డివిడెండుగా చెల్లించేందుకు హెచ్‌యూఎల్ డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది.

ఐడీబీఐ బ్యాంక్ లాభం రూ.1,943 కోట్లు

దిల్లీ: ఐడీబీఐ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో రూ.1,943 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,051 కోట్లతో పోలిస్తే ఇది 5% తక్కువ. నిర్వహణ లాభం రూ.3,195 కోట్ల నుంచి రూ.3,043 కోట్లకు పరిమితం కావడం వల్లే, నికర లాభం తగ్గింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.9,035 కోట్ల నుంచి రూ.9,409 కోట్లకు పెరిగింది. ఇందులో వడ్డీ ఆదాయమే రూ.6,979 కోట్ల నుంచి రూ.7,798 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.3,290 కోట్ల నుంచి రూ.3,851 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2.98%నుంచి 2.32 శాతానికి మెరుగయ్యాయి. నికర ఎన్‌పీఏలు 0.15% వద్ద స్థిరంగా ఉన్నాయి. కేటాయింపుల కవరేజీ నిష్పత్తి (సాంకేతిక రైటాఫ్‌లతో పాటు) 99.39 శాతంగా నమోదైంది. 2023 సెప్టెంబరు నుంచి ఈ నిష్పత్తి 99% పైన స్థిరంగా ఉంటోంది.

- 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం రూ.9,513 కోట్లకు చేరింది. 2024-25 లాభం రూ.7,515 కోట్ల కంటే ఇది 27% అధికం. మొత్తం ఆదాయం రూ.33,826 కోట్ల నుంచి రూ.35,744 కోట్లకు పెరిగింది. బ్యాంక్ మూలధన కనీస నిష్పత్తి 25.05% నుంచి 26.65 శాతానికి మెరుగైంది.

68% తగ్గిన ఏసీసీ లాభం

దిల్లీ: అదానీ గ్రూప్ సిమెంట్ సంస్థ ఏసీసీ, గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చిలో రూ.238.3 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.751.04 కోట్లతో పోలిస్తే ఇది 68.3% తక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.6,039.70 కోట్ల నుంచి 17.96% పెరిగి రూ.7,124.47 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 22.7% పెరిగి రూ.6,826.24 కోట్లకు చేరాయి. సిమెంట్ వ్యాపార ఆదాయం 16% పెరిగి రూ.6,656.53 కోట్లకు చేరింది. విక్రయాల పరిమాణం గతంలో ఎన్నడూ లేని విధంగా 11.9 మిలియన్ టన్నులకు చేరింది. రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ఆదాయం 36.64% పెరిగి రూ.573.82 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం (ఇతర ఆదాయంతో కలిపి) 14.1% పెరిగి రూ.7,198.52 కోట్లకు చేరింది.

- 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నికర లాభం 11% తగ్గి రూ.2,137.23 కోట్లకు పరిమితమైంది. ఏకీకృత మొత్తం ఆదాయం 14.66% పెరిగి రూ.26,363.8 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.7.50 డివిడెండ్ ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది.

2025-26లో పీఎస్‌బీల్లో
50,552 మందికి ఉద్యోగాలు

ఆర్థిక శాఖ వెల్లడి



దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 50,552 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాయని ఆర్థిక శాఖ తెలిపింది. పెరుగుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా, బ్యాంకులు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించింది. 2024-25లో 37,860 మందికి, 2023-24లో 30,827 మందికి పీఎస్‌బీలు ఉద్యోగాలు ఇచ్చాయి. ఈ గణాంకాల ప్రకారం చూస్తే... అంతకుముందు రెండు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే 2025-26లో పీఎస్‌బీల్లో ఉద్యోగ నియామకాలు గణనీయంగా పెరిగాయని ఆర్థిక శాఖ తెలిపింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ ద్వారా పీఎస్‌బీల్లో నియామకాల ప్రక్రియ జరుగుతోంది. పీఎస్‌బీల కార్యకలాపాల సామర్థ్యం బలోపేతానికి, పనిభారం ఒత్తిడి తగ్గేందుకు ఈ నియామకాలు తోడ్పడనున్నాయి. మారుమూల ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవల విస్తరణకు దోహదం చేయడంతో పాటు వినియోగదారులకు మరింత వేగంగా సేవలు అందించేందుకూ ఉపయోగపడనుంది. అందరికీ బ్యాంకింగ్ సేవలను దరిచేర్చాలనే లక్ష్య సాధనకు, ఆర్థిక వ్యవస్థ వృద్ధి తోడ్పాటులో కీలక పాత్ర పోషించేలా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తగినంత సంఖ్యలో నిపుణులైన సిబ్బంది ఉండేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

రిలయన్స్ రిటెయిల్ చేతికి
ప్రియాంక చోప్రా 'అనామలి' బ్రాండు



దిల్లీ: బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా జోనాస్‌కు చెందిన కేశసంరక్షణ బ్రాండు 'అనామలి'ని రిలయన్స్ రిటెయిల్ కొనుగోలు చేసింది. ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందీ వెల్లడించలేదు. 'అనామలి ట్రేడ్‌మార్క్‌లు, డిజిటల్ అసెట్స్‌ను కొనుగోలు చేశాం. మా రిటెయిల్ నెట్‌వర్క్, సౌందర్య ఉత్పత్తుల ప్లాట్‌ఫామ్ టిరా ద్వారా ఈ బ్రాండును మరింతగా విస్తరిస్తామ'ని రిలయన్స్ రిటెయిల్ తెలిపింది. దేశీయంగా, అంతర్జాతీయంగా అధిక వృద్ధితో కూడిన వినియోగదారు బ్రాండ్ల అభివృద్ధి, విస్తరణపై తమకున్న నిబద్ధతకు ఈ కొనుగోలు నిదర్శనమని పేర్కొంది. 2021లో అనామలి బ్రాండును ప్రియాంక చోప్రా స్థాపించారు. 'అనామలి బ్రాండును మా పోర్ట్‌ఫోలియోలో చేర్చడం.. కొత్త తరం, అధిక వృద్ధి సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ల విస్తరణ దిశగా ఒక వ్యూహాత్మక అడుగు' అని రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు. క్రియేటివ్ డైరెక్టరుగా బ్రాండును మరింత ముందుకు తీసుకెళ్లడంలో ప్రియాంక చోప్రా పాత్ర కొనసాగుతుందని రిలయన్స్ రిటెయిల్ తెలిపింది.

3 ఏళ్ల గరిష్ఠానికి
అమెరికా ద్రవ్యోల్బణం



మార్చిలో అమెరికా ద్రవ్యోల్బణం 0.7% పెరిగింది. గతేడాది మార్చితో పోలిస్తే ధరలు 3.5% పెరిగాయి. ఇది దాదాపు మూడేళ్లలోనే అధికం. ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాసోలిన్ ధరలు మార్చిలో 21% పెరగడమే ఇందుకు కారణం. ప్రస్తుతం అమెరికాలో గ్యాలన్ గ్యాస్ ధర 4.30 డాలర్లుగా ఉంది. ద్రవ్యోల్బణం లక్ష్యమైన 2% కంటే ఎక్కువగా ఉండటంతో, వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయించిన సంగతి విదితమే.

- ఈ ఏడాది జనవరి- మార్చిలో అమెరికా ఆర్థిక వ్యవస్థ 2% వృద్ధి నమోదుచేసింది. గత ఏడాది చివర్లో ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోవడం వల్ల ఏర్పడిన మందగమనం (0.5%) నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకుంది.
- అమెరికాలో నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య గత వారం 1,89,000కు పడింది. మార్కెట్ అంచనాల కన్నా, తక్కువగా వీరి సంఖ్య నమోదైంది. ఉద్యోగ మార్కెట్ బలంగా ఉందనడానికి ఇది సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు.

ఫోన్‌పే @ 70 కోట్ల వినియోగదారులు

డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే, ఏప్రిల్ 29 నాటికి 70 కోట్ల నమోదిత వినియోగదారుల మైలురాయిని చేరుకున్నట్లు ప్రకటించింది. మొదటి 10 లక్షల మంది వినియోగదారులను చేరుకోవడానికి ఫోన్‌పేకు 136 రోజుల సమయం పట్టగా, ప్రస్తుతం ప్రతి 6 రోజులకు 10 లక్షల మంది కొత్త వినియోగదారులు చేరుతున్నారు. 2022-23 నుంచి 2024-25 మధ్య కంపెనీ 56.25% వార్షిక సమ్మిళిత వృద్ధి రేటును నమోదుచేసింది.

పుణెలో స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ టెక్నాలజీ కేంద్రం విస్తరణ

పుణెలోని బానెర్‌లో ఉన్న టెక్నాలజీ కేంద్రాన్ని విస్తరించినట్లు స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా వెల్లడించింది. 33000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త పరిశోధన, అభివృద్ధి విభాగాన్ని ప్రారంభించింది. ఇందులో 250 మంది ఇంజినీర్లు పనిచేస్తారు. వీరితో కలిపి కంపెనీ మొత్తం ఇంజినీర్ల సంఖ్య 450కి చేరింది.

ధన్ నుంచి గోల్డ్ వాల్ట్

రిటెయిల్ మదుపర్ల కోసం 'గోల్డ్ వాల్ట్' పేరిట కొత్త ఉత్పత్తిని పెట్టుబడుల ప్లాట్‌ఫామ్ 'ధన్' తీసుకొచ్చింది. ఇందులో ఎంసీఎక్స్ తాజా ధరల వద్ద భౌతిక బంగారం, వెండిని మదుపర్లు కొనుగోలు చేయొచ్చు. ఈ లావాదేవీలు సెబీ నిబంధనల ప్రకారం జరుగుతాయి. ఎంసీఎక్స్ క్లియరింగ్ కార్పొరేషన్ ద్వారా సెటిల్‌మెంట్ చేస్తారు. పెట్టుబడిదారులు అవసరమైతే భౌతికంగా డెలివరీని కూడా పొందొచ్చు.

టాటా పవర్ రెన్యూవబుల్ రూ.6500 కోట్ల పెట్టుబడులు

10 గిగావాట్ల సామర్థ్యం కలిగిన ఫోటోవోల్టాయిక్ ఇంగాట్, వేఫర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తమ అనుబంధ సంస్థ టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ రూ.6500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు టాటా పవర్ తెలిపింది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. ఒక్కోదశలో 5 గిగావాట్ల చొప్పున మొత్తం 10 గిగావాట్ల సామర్థ్యాన్ని నిర్మిస్తారు.

ఫెడరల్ బ్యాంక్ చేతికి స్టాన్‌సి క్రెడిట్ కార్డ్ వినియోగదార్లు

ముంబయి: పెద్ద నగరాల్లో తమ వినియోగదారుల సంఖ్య పెంచుకోవడానికి, దేశంలోని స్టాండర్డ్ ఛార్టర్డ్ (స్టాన్‌సి) బ్యాంక్ క్రెడిట్ కార్డ్ పోర్ట్‌ఫోలియోలో కొంత భాగాన్ని కొనుగోలు చేయనున్నట్లు ఫెడరల్ బ్యాంక్ గురువారం ప్రకటించింది. స్టాన్‌సి ఒకే ఉత్పత్తికి సంబంధించిన సంబంధాలు, లావాదేవీలతో కూడిన పోర్ట్‌ఫోలియోను విక్రయిస్తోంది. సంపన్న వర్గంపై మరింతగా దృష్టి కేంద్రీకరించడానికి ఫెడరల్ బ్యాంకుకు ఇది సహాయపడుతుంది. ఫెడరల్ బ్యాంక్ వద్ద ప్రస్తుతం ఉన్న 8 లక్షల నాన్-కో-బ్రాండెడ్ కార్డులు, 13 లక్షల కో-బ్రాండెడ్ కార్డులున్నాయి. స్టాండర్డ్ ఛార్టర్డ్ నుంచి అదనంగా 4.5 లక్షల వరకు క్రెడిట్ కార్డ్‌లు జత కాబోతున్నాయి.

మార్కెట్లకు చమురు నష్టాలు



సెన్సెక్స్ ▼583 76913 | నిఫ్టీ ▼180 23998

ముడిచమురు ధర మరింత పెరగడం, మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా దేశీయ మార్కెట్లు గురువారంనష్టపోయాయి. నాలుగేళ్లలోనే తొలిసారిగా బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 120 డాలర్ల పైకి చేరడం ఇందుకు నేపథ్యం. ద్రవ్యోల్బణం పెరగొచ్చన్న భయాలతో షేర్ల అమ్మకాలు వెల్లువెత్తాయి. అయితే చమురు ధర మళ్లీ 115 డాలర్లకు దిగిరావడంతో నష్టాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 4 పైసలు పెరిగి 94.84 వద్ద ముగిసింది. ఒకదశలో 95ను మించింది కూడా. ఆసియా మార్కెట్లలో షాంఘై మినహా మిగతావి నష్టపోగా, ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.33 లక్షల కోట్లు తగ్గి రూ.463.29 లక్షల కోట్ల (4.86 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 482 పాయింట్ల (క్రితం ముగింపు 77,496.36) నష్టంతో 77,014.21 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో ఇంట్రాడేలో 1237.5 పాయింట్లు క్షీణించి 76,258.86 పాయింట్లకు పడింది. తదుపరి కోలుకుని నష్టాలు తగ్గించుకున్న సూచీ, చివరకు 582.86 పాయింట్లు తగ్గి 76,913.50 దగ్గర ముగిసింది. నిఫ్టీ 180.10 పాయింట్లు కోల్పోయి 23,997.55 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,796.85- 24,087.45 పాయింట్ల మధ్య కదలాడింది.
- త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫైనాన్స్ షేరు 0.72% పెరిగి రూ.936.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు రూ.975.50 వద్ద గరిష్ఠాన్ని తాకింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 22 నష్టాలు నమోదుచేశాయి. ఎటర్నల్ 2.85%, హెచ్‌యూఎల్ 2.70%, యాక్సిస్ బ్యాంక్ 2.14%, టాటా స్టీల్ 2.13%, అల్ట్రాటెక్ 2.08%, ఎల్ అండ్ టీ 2.03%, ట్రెంట్ 1.97%, ఎం అండ్ ఎం 1.71%, ఎస్‌బీఐ 1.69%, బీఈఎల్ 1.39% డీలాపడ్డాయి. సన్‌ఫార్మా 1.64%, ఇన్ఫోసిస్ 1.20%, టెక్ మహీంద్రా 0.95%, బజాజ్ ఫైనాన్స్ 0.72% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 2.13%, పీఎస్‌యూ బ్యాంక్ 1.66%, స్థిరాస్తి 1.44%, కమొడిటీస్ 1.36%, ఎఫ్‌ఎంసీజీ 1.13%, ఆర్థిక సేవలు 1.08%, పరిశ్రమలు 1.05% తగ్గాయి. బీఎస్ఈలో 1581 షేర్లు లాభపడగా, 2606 స్క్రిప్‌లు నష్టపోయాయి. 159 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

నేడు మార్కెట్లకు సెలవు

మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. కమొడిటీ మార్కెట్లు సాయంత్రం 5 గంటల నుంచి పనిచేస్తాయి.

రెండు ఐపీఓలకు సెబీ అనుమతి

జనరిక్ ఔషధ సంస్థ హిందుస్థాన్ లేబొరేటరీస్, స్టీల్ ట్యూబ్స్, పైప్స్ తయారీదారు ఆర్‌కే స్టీల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ అనుమతి లభించింది. గతేడాది సెప్టెంబరులో ఈ రెండు కంపెనీలు ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి.

జనవరి - మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
అదానీ పోర్ట్స్	3308.30	3023.10	11489.45	8769.63
బజాజ్ ఫిన్‌సర్వ్1	2539.00	2417.00	38508	36434
మంగళం వరల్డ్‌వైడ్	15.37	8.47	266.50	324.56
నాల్కో	1722.44	2067.23	5012.82	5267.83
చోళమండలం ఫైనాన్స్2	1645.00	1260.00	8564.00	7137.00
ఎడెల్‌వైజ్ ఫైనాన్షియల్	132.00	158.32	1969.28	2343.26
వారీ ఎనర్జీస్	1126.00	644.47	8659.98	4140.92
ఎవరెడీ ఇండస్ట్రీస్	141.80	10.40	327.20	299.00
స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్	16.62	8.30	532.70	362.05
హెచ్ఎఫ్‌సీఎల్	184.45	(83.30)	1824.12	801.00
కేఫిన్ టెక్నాలజీస్	81.15	85.05	347.3	282.7
సెంట్రల్ బ్యాంక్3	724	1034	10,811	10,333

1) డివిడెండ్ రూ.1.50 2) తుది డివిడెండ్ 70 పైసలు 3) తుది డివిడెండ్ రూ.0.60

సిరి

siri@eenadu.net

ఆటపాటలతో ఆర్థిక పాఠాలు

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు, ఇళ్లల్లో పిల్లల సందడి కనిపిస్తుంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసేందుకు చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను నాట్యం, సంగీతం, పెయింటింగ్ లేదా కోడింగ్‌లాంటి వేసవి శిబిరాలకు పంపిస్తుంటారు. కానీ, వేగంగా మారుతున్న ప్రస్తుత కాలంలో పిల్లలకు తప్పనిసరిగా నేర్పించాల్సిన నైపుణ్యాల్లో ఆర్థిక అక్షరాస్యత అత్యంత కీలకమైనదిగా మారుతోంది. రేపటి తరం ఆర్థికంగా స్థిరపడాలన్నా, మార్కెట్ ఆటుపోట్లను తట్టుకోవాలన్నా.. చిన్నతనం నుంచే డబ్బు విలువపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆర్థిక, మనస్తత్వ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం అధ్యయనం ప్రకారం.. ఏడెనిమిదేళ్ల నాటికే పిల్లల్లో డబ్బుపై ఒక ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఆ వయసులో పడే బీజాలే.. వారు పెద్దయ్యాక తీసుకునే ఆర్థిక నిర్ణయాలను శాసిస్తాయి. అందుకే, ఈ వేసవి విరామాన్ని పిల్లలకు మనీ మేనేజ్‌మెంట్ నేర్పించే సువర్ణావకాశంగా మలచుకోవాలి. ఇందుకోసం ఇలా చేయండి..

అవసరం-కోరిక

ప్రకటనలు చూసో, స్నేహితుల దగ్గర ఉన్నాయనో పిల్లలు కొత్త వస్తువుల కోసం మారాం చేయడం సహజం. ఆ సమయంలో వారికి అవసరం- కోరిక మధ్య ఉన్న తేడాను సున్నితంగా వివరించాలి. బడికి వెళ్లడానికి బూట్లు కొనడం అవసరం.. కానీ కేవలం ఉండాలి కాబట్టి, బ్రాండెడ్ బూట్లే కావాలనడం కోరిక అని వారు గ్రహించేలా చెప్పాలి. సూపర్ మార్కెట్‌కు వెళ్లినప్పుడు బడ్జెట్ పరిమితులను వివరిస్తూ వస్తువులను ఎంచుకోవడం చూపిస్తే.. వారిలో విచక్షణతో ఖర్చు చేసే జ్ఞానం అలవడుతుంది.

పొదుపు.. ఓ సంప్రదాయం

పాతకాలపు మట్టి హుండీలు లేదా కిడ్డీ బ్యాంకులు డబ్బు దాచుకునే అలవాటుకు అత్యుత్తమ సాధనాలు. వారికిచ్చే పాకెట్ మనీ నుంచి కొంత మొత్తాన్ని పక్కనపెట్టడం నేర్పించాలి. ఏదైనా ఖరీదైన బొమ్మ కావాలని అడిగితే వెంటనే కొనివ్వకుండా.. 'సగం డబ్బు నీ కిడ్డీ బ్యాంకు నుంచి తీద్దాం.. మిగతా సగం నేను ఇస్తాను' అని చెప్పండి. దీనివల్ల నిరీక్షణలోని గొప్పదనంతో పాటు, వస్తువు విలువ కూడా వారికి బోధపడుతుంది.

డిజిటల్ యుగంలో.. బ్యాంకింగ్ పాఠాలు

నేటి తరం పుట్టుకతోనే టెక్నాలజీకి అలవాటు పడుతోంది. ఫోన్‌పే, గూగుల్‌పే లాంటి యాప్‌లతో చేసే చెల్లింపులను వారు గమనిస్తూనే ఉంటారు. అయితే ఫోన్‌లోకి డబ్బు ఎలా వస్తుంది? ఎక్కడ దాచుకోవచ్చు? అనే విషయాలను విడమర్చి చెప్పాలి. కనీసం ఒక్కసారైనా బ్యాంకుకు తీసుకెళ్లి డబ్బులు డిపాజిట్ చేయడం, ఏటీఎం నుంచి డ్రా చేయడం, పాస్‌బుక్ ఎంట్రీలు చూపించాలి. మైనర్ల కోసం బ్యాంకులు అందిస్తున్న ప్రత్యేక సేవింగ్స్ ఖాతాలు తెరిపిస్తే.. వారిలో బాధ్యత పెరుగుతుంది.

పెట్టుబడి.. చక్రవడ్డీ పాఠం

డబ్బును పొదుపు చేయడంతో పాటే.. దాన్ని వృద్ధి చేయడమూ నేర్పించాలి. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ గురించి వారి వయసుకు తగ్గట్లుగా ఉదాహరణలతో వివరించాలి. వారు ఇష్టంగా తినే చాక్లెట్లు, వాడే వస్తువులను తయారు చేసే కంపెనీల పేర్లను చెబుతూ.. వాటిలో పెట్టుబడి పెడితే లాభాలు ఎలా వస్తాయో ఆసక్తికరంగా చెప్పాలి. ముఖ్యంగా చక్రవడ్డీ (కాంపౌండింగ్)లోని మహిమను వివరిస్తే.. చిన్న వయసులోనే పెట్టుబడుల పట్ల ఆకర్షితులవుతారు.

శ్రమ లేనిదే.. ప్రతిఫలం లేదు

డబ్బులు ఊరికే రావు అని పిల్లలకు స్పష్టం చేయడం అత్యవసరం. ఇంట్లో చిన్న చిన్న పనుల్లో సాయం చేసినప్పుడు వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. ఆ పని చేస్తే ఇస్తాం అని చెప్పకూడదు. చేసిన తర్వాత ఇవ్వడం మంచి అలవాటు. శ్రమకు, సంపాదనకు మధ్య ఉన్న బంధాన్ని ఈ ప్రక్రియ వారిలో బలంగా నాటుతుంది.

తల్లిదండ్రులదే కీలకపాత్ర

చాలామంది తల్లిదండ్రులు తమ ఆర్థిక ఇబ్బందులను పిల్లల ముందు ప్రస్తావించేందుకు సంకోచిస్తుంటారు. కానీ కుటుంబ బడ్జెట్ రూపకల్పనలో పిల్లలను సైతం భాగస్వాములను చేస్తే.. వారిలో బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుంది. ఈ వేసవిలో కోడింగ్ క్లాసులతో పాటు, ఇలాంటి ఆచరణాత్మక ఆర్థిక పాఠాలు నేర్పించడం వల్ల వారు భవిష్యత్తులో అప్పుల ఊబిలో పడకుండా, ఆర్థిక స్వతంత్రులుగా మారే అవకాశం ఉంటుంది.

ఇలా చేయొచ్చు..

ఆటల ద్వారా: మోనోపోలీ, బిజినెస్ లాంటి బోర్డ్ గేమ్స్ ఆడించడం వల్ల ఆటపాటల్లోనే వ్యాపార నైపుణ్యాలను నేర్పొచ్చు.

లక్ష్య నిర్దేశం: స్వల్పకాలిక (కొత్త బొమ్మ కోసం), దీర్ఘకాలిక (సైకిల్ కోసం) పొదుపు లక్ష్యాలను పిల్లలే నిర్ణయించుకునేలా ప్రోత్సహించాలి.

మీరే ఆదర్శం: పిల్లలు తల్లిదండ్రులను చూసే నేర్చుకుంటారు. కాబట్టి పారదర్శకత పాటిస్తూ, ఖర్చుల విషయంలో మీరే వారికి ఆదర్శంగా నిలవాలి.

ఈ రోజు మీరు మీ పిల్లలకు ఇచ్చే రూ.100 రూపాయల కంటే.. ఆ మొత్తాన్ని ఎలా పొదుపు చేయాలి? ఎంత మేరకు ఖర్చు చేయాలి అని నేర్పే పాఠమే.. వారి జీవితానికి మీరు ఇచ్చే అతిపెద్ద ఆస్తి!

పిల్లల చదువుల కోసం

పిల్లల భవిష్యత్తు, ముఖ్యంగా విద్యాపరమైన అవసరాలను తీర్చే లక్ష్యంతో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికోసం బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి 'బజాజ్ లైఫ్ యంగ్ అచీవర్ ప్లాన్' అందుబాటులోకి వచ్చింది. సంపద సృష్టితోపాటు పిల్లల భవిష్యత్తుకు సమగ్ర రక్షణను ఏకకాలంలో అందించేలా ఈ పాలసీ రూపొందించారు. దురదృష్టవశాత్తూ తల్లిదండ్రులు మరణించినా, తీవ్ర వైకల్యానికి గురైనా, తీవ్రమైన వ్యాధి బారిన పడినా, భవిష్యత్తులో చెల్లించాల్సిన ప్రీమియంలు మాఫీ అయ్యేలా వేవర్ ఆఫ్ ప్రీమియం రైడర్ ఉంది. పిల్లల వయసు, వారి విద్యా లక్ష్యాలకు అనుగుణంగా 5-12 ఏళ్ల వరకూ ప్రీమియం చెల్లింపు గడువులను ఎంచుకోవచ్చు. పిల్లల విభిన్న అవసరాలకు అనుగుణంగా, కచ్చితమైన మొత్తాన్ని ఒకేసారిగానీ లేదా క్రమం తప్పని ఆదాయంగానీ పొందే సదుపాయాన్ని తల్లిదండ్రులు ఎంచుకోవచ్చు.

పింఛను ఇచ్చే పాలసీ

కొత్త పథకం

పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం రావాలని కోరుకునే వారిని లక్ష్యంగా చేసుకొని అవివా లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా 'అవివా సెక్యూర్డ్ నెస్ట్ యాన్యుటీ ప్లాన్' పేరుతో యాన్యుటీ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా పాలసీదారులు ఒక్కసారి ప్రీమియం చెల్లిస్తే, జీవితకాలం పాటు స్థిరమైన ఆదాయం పొందవచ్చు. 80 ఏళ్ల వారూ ఈ పాలసీలో చేరగలిగే అవకాశం ఉండటం ప్రత్యేకత. ఈ పాలసీలో సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ కవరేజీలతోపాటు, పాలసీదారుడికి నచ్చిన విధంగా వివిధ వాయిదాల్లో జీవితకాల ఆదాయాన్ని పొందే సదుపాయం ఉంది. నామినీలకు ప్రయోజనం చేకూరేలా 'కొనుగోలు ధర వాపసు' వెసులుబాటూ ఉంది. ఈ ప్లాన్ పీఎఫ్‌ఆర్‌డీఏ నిబంధనలకు అనుగుణంగా ఉంటుంది కాబట్టి, జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) చందాదారులకూ అనువైన ఎంపికగా కంపెనీ అంటోంది. 'పదవీ విరమణ ఒక భద్రత, ఆత్మగౌరవంతో కూడుకున్న మైలు రాయి. ఈ దశలో స్థిరమైన ఆదాయాన్ని అందించడం ద్వారా వారి ఆర్థిక శ్రేయస్సును కాపాడేందుకు ఈ పాలసీ తోడ్పడుతుంది'అని సంస్థ ఎండీ, సీఈఓ అసిత్ రథ్ పేర్కొన్నారు.

రాబడి ఒక్కటే చూడొద్దు

ఆర్థిక ప్రణాళికలో మనం ఎంత సంపాదించామన్నది మాత్రమే కాదు, కష్టకాలంలో ఆ డబ్బు ఎంత త్వరగా చేతికి అందుతుందన్నదే మదుపరుల ఆర్థిక భద్రతను నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో పెట్టుబడులకు సంబంధించిన కీలకమైన నగదు లభ్యత (లిక్విడిటీ) గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.



లిక్విడిటీ అంటే ఒక ఆస్తిని (ఉదాహరణకు షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఇల్లు) దాని అసలు విలువ కోల్పోకుండా ఎంత సులభంగా, వేగంగా నగదుగా మార్చుకోగలమనే సామర్థ్యం. చేతిలో ఉన్న నగదుకు, సేవింగ్స్ ఖాతాలోని డబ్బుకు లిక్విడిటీ అత్యధికంగా ఉంటుంది, వాటిని తక్షణమే వాడుకోవచ్చు. స్టాక్ మార్కెట్లో షేర్లనూ సులభంగా అమ్ముకోవచ్చు. కానీ, స్థలాలు లేదా ఇల్లులాంటి ఆస్తులను వెంటనే విక్రయించడం సాధ్యపడదు కాబట్టి వీటికి నగదు లభ్యత తక్కువగా ఉంటుంది.

ఎందుకు కీలకం?

జీవితంలో ఎదురయ్యే ఆకస్మిక వైద్య ఖర్చులు, ఉద్యోగంలో మార్పులు లేదా ఆర్థిక ఒడుదొడుకులను ఎదుర్కోవడానికి తగినంత నగదు లభ్యత తప్పనిసరి. మీ పెట్టుబడుల్లో తగినంత లిక్విడిటీ ఉంటే క్రెడిట్ కార్డుల వంటి అధిక వడ్డీ రుణాలపై ఆధారపడాల్సిన అవసరం రాదు. అత్యవసర పరిస్థితుల్లో స్థిరాస్తి లేదా ఈక్విటీ వంటి దీర్ఘకాలిక పెట్టుబడులను నష్టాలకు అమ్ముకునే ముప్పును ఇది నివారిస్తుంది. అంతేకాకుండా, మార్కెట్లు పతనమైనప్పుడు ఆకర్షణీయమైన ధరల్లో పెట్టుబడి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ నగదు సహాయపడుతుంది.

సాధారణంగా నగదు లభ్యతకు, రాబడి మధ్య వ్యతిరేక సంబంధం ఉంటుంది. అత్యధిక లిక్విడిటీ ఉండే ఆస్తుల్లో నష్టభయం తక్కువగా ఉండి, రాబడీ తక్కువ లేదా మోస్తరుగానే ఉంటుంది. తక్కువ లిక్విడిటీ ఉండే దీర్ఘకాలిక పెట్టుబడుల్లో అస్థిరత ఎక్కువ ఉన్నప్పటికీ, రాబడీ అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

ఫండ్లలో మదుపు చేస్తే..

మ్యూచువల్ ఫండ్లలో మీరు పెట్టిన పెట్టుబడిని ఉపసంహరించుకున్న తర్వాత, ఆ డబ్బు మీ బ్యాంకు ఖాతాకు ఎంత త్వరగా చేరుతుందనేది ఆ ఫండ్ రకాన్ని బట్టి, మారుతుంది. సాధారణంగా డెట్ ఫండ్లలో ఒక రోజులో (టీ+1), ఈక్విటీ ఫండ్లలో రెండు రోజుల్లో (టీ+2), అంతర్జాతీయ ఫండ్లలో అయిదు రోజుల్లో (టీ+5) డబ్బు ఖాతాలో జమ అవుతుంది. ఫండ్లను ఎంచుకునే ముందు వాటికి సంబంధించిన పూర్తి సమాచార పత్రాన్ని పరిశీలించి, ఎగ్జిట్ లోడ్, లాకిన్ వ్యవధిలాంటివి ఉన్నాయేమో చూసుకోవాలి.

తాకట్టు పెట్టి

మీకు అత్యవసరంగా డబ్బు కావాల్సి వస్తే, మ్యూచువల్ ఫండ్లను విక్రయించకుండానే వాటిని తాకట్టు పెట్టి రుణం తీసుకునే సౌలభ్యమూ ఉంది. దీనివల్ల మీ పెట్టుబడులు మార్కెట్లోనే కొనసాగుతాయి, కానీ మీరు తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరి ఆర్థిక అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి, కనీసం 3 నుంచి 6 నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా మొత్తాన్ని అత్యవసర నిధిగా లిక్విడ్ ఫండ్లు లేదా పొదుపు ఖాతాలో అందుబాటులో ఉంచుకోవడం ఉత్తమం. ఇలా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకుని, మిగిలిన మొత్తాన్ని దీర్ఘకాలిక సంపద సృష్టికి మళ్లించడం ద్వారా అన్ని మార్కెట్ పరిస్థితుల్లోనూ ఆర్థికంగా సురక్షితంగా ఉండొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

పన్ను ఆదా ఉండాలి ముందస్తు ప్రణాళిక

చాలామంది పన్ను చెల్లింపుదారులు చేసే అతిపెద్ద పొరపాటు.. ఆర్థిక సంవత్సరం ముగిసే తరుణంలో పన్ను ప్రణాళికను ప్రారంభించడం. దీనివల్ల ఆశించిన ప్రయోజనం లభించకపోగా, అనవసర ఒత్తిడి పెరుగుతుంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను ఆదా ప్రక్రియను ఇప్పుడే మొదలుపెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, అనుసరించాల్సిన వ్యూహాలను ఒకసారి చూద్దాం.



ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే పన్ను ప్రణాళికలు వేసుకోవడం వల్ల చేతిలో తగినంత సమయం ఉంటుంది. దీని వల్ల మీ నగదు ప్రవాహాన్ని ఇబ్బంది పెట్టకుండా పెట్టుబడులకు కేటాయింపులు చేయొచ్చు. ఉదాహరణకు మార్చిలో ఒకేసారి రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టడం కంటే, నెలకు రూ.12,500 చొప్పున జమ చేయడం సులభం.

పాత.. కొత్త.. ఏ విధానం?

పన్ను ప్రణాళికలో మొదటి అడుగు సరైన విధానాన్ని ఎంచుకోవడమే.

కొత్త విధానం: ఇందులో పన్ను రేట్లు తక్కువగా ఉంటాయి. కానీ, సెక్షన్ 80సీ, సెక్షన్ 80డీ వంటి మినహాయింపులు ఏవీ వర్తించవు. పెద్దగా పెట్టుబడులు లేని వారికి ఈ విధానం అనుకూలం.

పాత విధానం: గృహరుణం, జీవిత బీమా, విద్యా రుణం వంటివి ఉన్నప్పుడు పాత విధానాన్ని పరిశీలించవచ్చు.

పన్ను ఆదాకు ఉన్న ప్రధాన మార్గాలను పరిశీలిస్తే..

సెక్షన్ 80 సీ: ఇది పన్ను చెల్లింపుదారుల్లో అత్యంత ఆదరణ పొందిన సెక్షన్. దీని కింద గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు పొందవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్) ఎంచుకుంటే పన్ను ఆదాతోపాటు సంపద పెరుగుతుంది. దీనికి మూడేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. సురక్షితమైన రాబడి కోరుకునే వారికి ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్), జాతీయ పొదుపు పథకాలు (ఎన్ఎస్‌సీ) ఉత్తమ మార్గాలు. పదేళ్ల లోపు అమ్మాయిలున్న వారు సుకన్య సమృద్ధి యోజనలోనూ పెట్టుబడులు పెట్టొచ్చు.

సెక్షన్ 80సీసీడీ1బీ: సెక్షన్ 80సీ పరిమితికి అదనంగా, జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో పెట్టుబడి పెట్టడం ద్వారా మరో రూ.50,000 వరకూ పన్ను మినహాయింపు పొందవచ్చు. అంటే, మొత్తంగా రూ.2లక్షల వరకూ పన్ను మినహాయింపు క్లెయిం చేసుకోవచ్చు.

సెక్షన్ 80డీ: ప్రస్తుత కాలంలో ఆరోగ్య బీమా చాలా ముఖ్యం. మీకు, మీ జీవిత భాగస్వామి, పిల్లల కోసం చెల్లించే ప్రీమియంపై రూ.25,000 వరకూ మినహాయింపు వర్తిస్తుంది. అలాగే తల్లిదండ్రుల పేరుమీద తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీలకూ మినహాయింపు పొందవచ్చు.

గృహరుణంపై: గృహరుణం తీసుకున్న వారు చెల్లించిన అసలును 80సీ కింద, వడ్డీ చెల్లింపులను సెక్షన్ 24 కింద రూ.2లక్షల వరకూ మినహాయింపు పొందవచ్చు.

లక్ష్యం ఆధారంగా..

- కేవలం పన్ను కోసమే కాకుండా మీ ఆర్థిక లక్ష్యాలకు సరిపోయే పథకాలను ఎంచుకోండి.
- స్థిరాదాయం ఇచ్చే పథకాలపై ఆధారపడకుండా, కొంత మొత్తాన్ని ఈఎల్ఎస్ఎస్‌లాంటి వాటి వైపు మళ్లించడం వల్ల ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే రాబడులు వస్తాయి.
- మీరు చేసే ఖర్చులు (అద్దె రశీదులు, ట్యూషన్ ఫీజులు) పన్ను పరిధిలోకి వస్తే, వాటికి సంబంధించిన వివరాలను జాగ్రత్తగా ఉంచుకోండి.

పన్ను చెల్లించడం ఒక బాధ్యత. దాన్ని ఆదా చేసుకునేందుకు ఉన్న చట్టబద్ధమైన మార్గాలను వినియోగించుకోవడమూ మంచిదే. సరిగ్గా ఆలోచించి, తీసుకునే నిర్ణయం ఎప్పుడూ ఆర్థిక భద్రతను పెంచుతుందని మర్చిపోవద్దు.

ఇండెక్స్ ఈటీఎఫ్‌లు లాభమేనా?



ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు అనిశ్చితితో ఉన్నాయి. ఇప్పుడు ఎలాంటి మార్గాన్ని ఎంచుకోవాలన్న సందేహం చాలామందిలో ఉంది. స్టాక్ మార్కెట్లో మదుపు చేయాలనుకున్నప్పుడు మ్యూచువల్ ఫండ్లు ఎంతో అనుకూలంగా ఉంటాయి. అందులోనూ నిఫ్టీలాంటి సూచీలో మదుపు చేసే ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్) ఇప్పుడున్న పరిస్థితుల్లో మదుపరులకు అనుకూలంగా కనిపిస్తున్నాయి. దీనికి అనుగుణంగానే ఫండ్ సంస్థలూ కొత్త ఇండెక్స్ ఈటీఎఫ్‌లను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటిలో పెట్టుబడి పెట్టడం వల్ల లాభమేమిటి? తెలుసుకుందాం.

పేరులోనే ఉన్నట్లు ఈ ఫండ్లు సూచీల్లో ఉన్న షేర్లలోనే మదుపు చేస్తాయి. సూచీలో ఒక్కో షేరుకు ఎంత వెయిటేజీ కేటాయించారో అదే నిష్పత్తిలో ఈ ఫండ్లూ ఆయా షేర్లలో మదుపు చేస్తాయి. సూచీల్లో ఆ షేరుకు వెయిటేజీ మారితే.. అందుకు తగ్గట్టుగానే ఫండ్ పెట్టుబడుల్లోనూ సర్దుబాటు జరుగుతుంది. ఉదాహరణకు నిఫ్టీ ఇండెక్స్ ఫండ్.. నిఫ్టీ 50 సూచీలోని 50 కంపెనీల్లో మాత్రమే పెట్టుబడి పెడుతుందన్నమాట.

ప్రయోజనాలు ఇలా..

వైవిధ్యం: ఇండెక్స్ ఫండ్ ద్వారా మదుపు చేసినప్పుడు సులభంగా వైవిధ్యమైన షేర్లలో మదుపు చేసేందుకు అవకాశం లభిస్తుంది. నిఫ్టీ 50 ఇండెక్స్‌నే తీసుకుంటే.. ఈ సూచీ ద్వారా మదుపరులు విభిన్న కంపెనీల్లో మదుపు చేయొచ్చు. ఇండెక్స్‌లో భాగంగా ఉన్న ఏదైనా కంపెనీ ప్రతికూల వృద్ధిని నమోదు చేసినా.. పోర్ట్‌ఫోలియోలోని ఇతర షేర్లు పెట్టుబడి నష్టపోకుండా భర్తీ చేస్తాయి. ఈ వైవిధ్యం కేవలం రూ.100 పెట్టుబడితో సాధించవచ్చు.

ఖర్చులు తక్కువ: ఈక్విటీ పథకాలతో పోలిస్తే ఇండెక్స్ ఫండ్లలో ఖర్చులు తక్కువగా ఉంటాయి. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రకారం ఇండెక్స్ ఫండ్ కోసం మొత్తం వ్యయ నిష్పత్తి 1 శాతానికే పరిమితం. కాబట్టి, పెట్టుబడుదారులకు ఈ ఫండ్లు చౌకైన ఎంపికగా చెప్పుకోవచ్చు.

రాబడి: ఆర్థిక వృద్ధిని మార్కెట్ సూచీలు ప్రతిబింబిస్తాయి. ఇండెక్స్ ఫండ్లు అంతర్లీనంగా సూచీకి దగ్గరగా రాబడిని అందిస్తాయి. దీర్ఘకాలంలో పెట్టుబడిని కొనసాగించినప్పుడు మంచి లాభాలను పొందేందుకు వీలవుతుంది. ఉదాహరణకు అయిదేళ్ల కాలంలో నిఫ్టీ 50 టీఆర్ఐ 10-12 శాతం వార్షిక సగటు రాబడిని అందించింది.

సిప్: ఇతర ఈక్విటీ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడులు పెట్టినట్లే... వీటిలోనూ సిప్ చేసేందుకు అవకాశం ఉంది. సూచీలు తగ్గినప్పుడు వీలును బట్టి, ఈటీఎఫ్ యూనిట్లను కొనుగోలు చేసే వీలూ ఉంది.

పరిమితులున్నాయి..

మార్పులకు అవకాశం లేకపోవడం: క్రియాశీలకంగా ఉండే ఈక్విటీ ఫండ్లలో ఫండ్ మేనేజర్ పాత్ర కీలకం. మార్కెట్ పోకడను బట్టి, షేర్ల ఎంపిక మారుతూ ఉంటుంది. ఇండెక్స్ ఫండ్స్‌లో ఈ అవకాశం ఉండదు. మార్కెట్ ప్రతికూలతలోనూ పెట్టుబడులు సూచీకి అనుసంధానంగా ఉన్న షేర్లలోనే పెట్టుబడులు కొనసాగుతాయి.

అధిక లాభాలు: ఇండెక్స్ ఫండ్లలో మదుపు చేస్తున్నప్పుడు మదుపరులు సూచీ ఇచ్చే లాభాలకే పరిమితం కావాల్సి ఉంటుంది. అంటే.. పెట్టుబడులతో అధిక రాబడులను ఆర్జించే అవకాశం ఈక్విటీ ఫండ్లతో పోలిస్తే కొన్ని సందర్భాల్లో అంత ఎక్కువగా ఉండకపోవచ్చు.

ఎవరికి..

ప్రతి మదుపరి తన పెట్టుబడుల జాబితాలో ఇండెక్స్ ఫండ్లకు స్థానం కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. కొత్తగా ఈక్విటీల్లో మదుపు చేస్తున్న వారు ఈ ఫండ్లను తొలి మెట్టుగా భావించవచ్చు. స్వల్పకాలంలో ఈ ఫండ్ల పనితీరులో కాస్త హెచ్చుతగ్గులు ఉండవచ్చు. కానీ, దీర్ఘకాలంలో ఇవి పరిమితమే. వీటిలో పెట్టుబడి పెట్టేటప్పుడు మీ నష్టభయం భరించే సామర్థ్యం, వ్యవధి, ఆర్థిక లక్ష్యాలు తదితరాలను బట్టి, నిర్ణయం తీసుకోవాలి.

పెట్టుబడి.. ఇప్పటికీ మించిపోలేదు

చాలామంది స్టాక్ మార్కెట్ పడిపోయినప్పుడు పెట్టుబడి పెడదామని వేచి చూస్తుంటారు. మరికొందరు తమ 20వ ఏట పెట్టుబడులు ప్రారంభించలేకపోయామని, ఇక ఇప్పుడు లాభం లేదని 40 లేదా 50 ఏళ్లప్పుడు బాధపడుతుంటారు. ఈ రెండు ఆలోచనలూ ఆర్థిక పురోగతికి ఆటంకాలే! మార్కెట్ ఎప్పుడెలా ఉంటుందో అంచనా వేయడం కంటే, వీలైనంత త్వరగా పెట్టుబడి ప్రారంభించడమే సంపద సృష్టికి అసలైన రహస్యం. ఒకవేళ మీరు అప్పటికే ఆలస్యం చేసినా, సరైన వ్యూహంతో ఆ లోటును సులభంగా భర్తీ చేయవచ్చు.



క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ప్రారంభించడంలో చేసే జాప్యం దీర్ఘకాలంలో భారీ నష్టాన్ని మిగులుస్తుంది. మార్కెట్ అట్టడుగు (కనిష్ఠ) స్థాయికి చేరే దాకా వేచి చూస్తే రాబడి శాతం కొద్దిగా పెరగొచ్చు కానీ, మీరు సృష్టించే వాస్తవ సంపద మాత్రం గణనీయంగా తగ్గిపోతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు 30 ఏళ్లప్పుడు నెలకు రూ.25,000 మదుపు చేశారనుకుందాం.. 12 శాతం సగటు వార్షిక రాబడితో.. 60 ఏళ్లు వచ్చే నాటికి.. రూ.7.70 కోట్లు చేతికి వస్తాయి. అదే.. 40 ఏళ్ల నుంచి నెలకు రూ.50వేలు మదుపు చేసినా.. వచ్చేది రూ.4.60 కోట్లు మాత్రమే. ఇక్కడ పదేళ్ల ఆలస్యం చేయడం వల్ల మన సంపద ఎంత తగ్గిందో అర్థం చేసుకోవచ్చు.

40-50 ఎప్పుడైనా..

20లలో పెట్టుబడి పెట్టకుండా 40 లేదా 50 ఏళ్లలో మొదలుపెట్టే వారి పరిస్థితి ఏమిటి? ఆర్థిక నిపుణుల ప్రకారం, పెట్టుబడికి వయసుతో సంబంధం లేదు, వ్యూహంతో సంబంధం ఉంది. మీకు పెట్టుబడికి సమయం తక్కువగా ఉన్నప్పటికీ, మీకున్న అనుభవం, పెరిగిన ఆదాయాన్ని ఆయుధాలుగా చేసుకుని కోల్పోయిన కాలాన్ని భర్తీ చేయవచ్చు.

పెద్ద మొత్తంలో పొదుపు: చిన్న వయసులో.. తక్కువ మొత్తాలతో మదుపు చేస్తే.. ఇప్పుడు పెద్ద మొత్తాలతో చేయాల్సి ఉంటుంది. మీ ఆదాయంలో కనీసం 40% నుండి 50% వరకు పొదుపు చేయాలి. ఆదాయం - పొదుపు = ఖర్చు అనే సూత్రాన్ని పాటిస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలరు.

స్టెప్-అప్ సిప్ వ్యూహం: ప్రతి ఏటా మీ సిప్ మొత్తాన్ని కనీసం 10-15% పెంచుకుంటూ వెళ్లాలి. జీతం పెరిగినప్పుడల్లా విలాసాలకు ఖర్చు చేయకుండా, ఆ మొత్తాన్ని పెట్టుబడిగా మారిస్తే మీ పదవీ విరమణ నిధి ఊహించని విధంగా పెరుగుతుంది. ఉదాహరణకు.. 40 ఏళ్ల వయసులో నెలకు రూ.25,000లతో మొదలు పెట్టి, ఏటా 15 శాతం పెంచుకుంటూ వెళ్లారనుకుందాం.. అప్పుడు 20 ఏళ్లలో రూ.7.14 కోట్ల నిధిని సాధించవచ్చు.

ఆస్తుల ఎంపిక: ఇప్పటికే మీ పీపీఎఫ్, ఎన్‌పీఎస్ లాంటి వాటిలో కొంత నిధి ఉంటుంది. దీనికి అదనంగా మరింత డబ్బును కూడబెట్టేలా వ్యూహం ఉండాలి. తక్కువ సమయం ఉంది కదా అని నష్టభయం ఉన్న పథకాల్లో డబ్బు పెట్టకండి. ఈక్విటీ ఫండ్లలోనూ వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. లార్జ్ క్యాప్ ఫండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకటి రెండు ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లు, మిడ్, మల్టీ క్యాప్, హైబ్రిడ్ ఫండ్లు ఇలా పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవాలి. గుర్తుంచుకోండి.. మ్యూచువల్ ఫండ్లలో కనీసం ఆరేడేళ్లపాటు కొనసాగినప్పుడే లాభాలు కనిపిస్తాయి.

పదవీ విరమణ: భారతీయ తల్లిదండ్రులు చాలా మంది తమ పదవీ విరమణ నిధిని పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఖర్చు చేయడం సహజం. పిల్లల చదువు కోసం బ్యాంకులు రుణాలు ఇస్తాయి. కానీ మీ పదవీ విరమణ కోసం ఏ బ్యాంకూ అప్పు ఇవ్వదు. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉండటమే మీరు మీ పిల్లలకు ఇచ్చే అతిపెద్ద బహుమతి అని మర్చిపోకండి.

అనవసర ఖర్చులు వద్దు: ఈ వయసులో సమాజం కోసం లేదా హోదా కోసం చేసే ఖరీదైన ఖర్చులు మీ ఆర్థిక భవిష్యత్తును దెబ్బతీస్తాయి. అవసరం-విలాసం మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి నిరాడంబరంగా జీవిస్తే పదవీ విరమణ కాలం బాగుంటుందని మర్చిపోవద్దు.

బీమాతో ధీమాగా: వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆరోగ్య సమస్యల వల్ల ఒక్కసారి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే, మీ పొదుపు మొత్తం హరించివేస్తుంది. కాబట్టి, కార్యాలయం ఇచ్చే పాలసీతో సంబంధం లేకుండా, సొంతంగా ఒక ఆరోగ్య బీమా పాలసీని ఇప్పటికైనా తీసుకోండి.

40 లేదా 50 ఏళ్లలో పెట్టుబడి మొదలుపెట్టడం సవాలే అయినప్పటికీ అసాధ్యం కాదు. గతకాలపు సమయం గురించి చింతించడం మాని, నేటి ఆదాయాన్ని క్రమశిక్షణతో పెట్టుబడిగా మారిస్తే మీరూ సురక్షితమైన పదవీ విరమణ జీవితాన్ని గడపవచ్చు. ఆలస్యం కంటే ఆరంభం ముఖ్యమని గుర్తుంచుకోండి.

ఈనాడు ప్రతిభ
శుక్రవారం, మే 1, 2026
18 • https://pratibha.eenadu.net • https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

❖ ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్-2026'ను మార్చి 26 నుంచి ఏప్రిల్ 6 వరకు ఏ రాష్ట్రంలోని రాయ్‌పుర్, జగదల్‌పుర్, సర్గుజాల్లో నిర్వహించారు?

జ: ఛత్తీస్‌గడ్ (గిరిజన యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏడు క్రీడాంశాల్లో (అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, రెజ్లింగ్) ఈ పోటీలను నిర్వహించారు.)

❖ ఇటీవల 500 అంతర్జాతీయ వికెట్ల మైలురాయి చేరుకున్న భారత్ బౌలర్ ఎవరు?

జ: జస్‌ప్రీత్ బుమ్రా (2026 టీ-20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో 'ఇంగ్లాండ్ క్రికెటర్ హ్యారీ బ్రూక్‌ను అవుట్ చేయడం ద్వారా బుమ్రా ఈ ఘనత సాధించాడు.)

మాదిరి ప్రశ్నలు

❖ ది హురున్ రిచ్ లిస్ట్ 2026 ప్రకారం భారత్‌లో ఎంత మంది బిలియనీర్లు ఉన్నారు? జ: 308 (బిలియనీర్ల సంఖ్యలో భారత్ ప్రపంచంలో చైనా, అమెరికాల తర్వాత మూడో స్థానంలో నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. భారత్‌లో అత్యంత ధనవంతుల జాబితాలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.)

మరింత సమాచారం

రాష్ట్ర పౌరుల హక్కులకు రక్షణ కవచం!

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ


భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వతంత్ర న్యాయ వ్యవస్థలో రాష్ట్ర స్థాయిలో అత్యున్నత విభాగం హైకోర్టు. రాజ్యాంగంలోని నాలుగో భాగంలో పొందుపరిచి ఉన్న నిబంధనలు హైకోర్టుల నిర్మాణం, అధికారాలు, బాధ్యతలను వివరిస్తున్నాయి. బ్రిటిష్ కాలంలో పంధొమ్మిదో శతాబ్దం రెండో భాగంలో కోల్‌కతా, మద్రాస్, బొంబాయిల్లో ప్రారంభమైన హైకోర్టుల ప్రస్థానం, నేడు దేశవ్యాప్తంగా విస్తరించి కొనసాగుతోంది. ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణలో, న్యాయ పరిపాలనలో ఈ ధర్మపీఠాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో న్యాయ పాలనకు అధిపతిగా ఉన్న హైకోర్టు గురించి రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలన్నింటినీ పోటీ పరీక్షార్థులు ఆర్టికల్స్‌తో సహా గుర్తుంచుకోవాలి. న్యాయమూర్తుల నియామకం, అర్హతలు, తొలగింపు ప్రక్రియతో పాటు రిట్లను జారీ చేసే అధికారం, దిగువ న్యాయస్థానాలపై పర్యవేక్షణ తదితర అంశాలు హైకోర్టును రాష్ట్ర పాలనలో ఒక శక్తిమంతమైన రాజ్యాంగ వ్యవస్థగా నిలబెట్టిన తీరును అర్థం చేసుకోవాలి.


బాంబే హైకోర్టు

హైకోర్టు

రాష్ట్ర స్థాయిలో అత్యున్నత న్యాయస్థానం 'హైకోర్టు'. భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ఆర్టికల్స్ 214 నుంచి 231 మధ్య హైకోర్టు నిర్మాణం, న్యాయమూర్తుల నియామకం, తొలగింపు ప్రక్రియ, హైకోర్టు అధికారాలు, విధులు మొదలైన అంశాలను వివరించారు.

చారిత్రక నేపథ్యం: ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861 ప్రకారం దేశంలో తొలిసారిగా 1862లో కోల్‌కతా మద్రాస్, బొంబాయిల్లో హైకోర్టులు ఏర్పాటయ్యాయి. కోల్‌కతా హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ బార్నెస్ పీకాక్. 1866లో అలహాబాద్ హైకోర్టు ఏర్పడింది.


సర్ బార్నెస్ పీకాక్

రాజ్యాంగ వివరణ

ఆర్టికల్ 214: హైకోర్టు ఏర్పాటు గురించి వివరిస్తుంది.

ఆర్టికల్ 231: రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు పార్లమెంటు ఒక చట్టం ద్వారా ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేయవచ్చు.


అలహాబాద్ హైకోర్టు

ఆర్టికల్ 230 - ఏ కేంద్రపాలిత ప్రాంతం ఏ హైకోర్టు పరిధి కిందకు వస్తుందో వివరణ ఇస్తూ పార్లమెంటు చట్టం చేయవచ్చు.

7వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956 ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు: రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒక ఉమ్మడి హైకోర్టును ఏర్పాటుచేసే అధికారం పార్లమెంటుకు లభించింది.

ఆర్టికల్ 216: ప్రతి హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, కొంతమంది ఇతర న్యాయమూర్తులు ఉంటారు. ఒక హైకోర్టులో ఎంతమంది న్యాయమూర్తులు ఉండాలనేది సంబంధిత హైకోర్టు పరిధిలోని జనాభా, వైశాల్యం, వివాదాలు, పనిభారం ఆధారంగా రాష్ట్రపతి సూచన మేరకు పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. దేశంలో ఎక్కువ న్యాయమూర్తులు ఉన్న హైకోర్టు అలహాబాద్ హైకోర్టు. ఇక్కడ సుమారు 159 మంది వరకు న్యాయమూర్తులు ఉన్నారు. ▸ 2019, జనవరి 1 నుంచి తెలంగాణ హైకోర్టు పనిచేస్తోంది. దీనిలో న్యాయమూర్తుల సంఖ్య 42. వీరిలో శాశ్వత న్యాయమూర్తులు 32 మంది, అదనపు న్యాయమూర్తులు 10 మంది. ▸ 2019, జనవరి 1 నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పనిచేస్తోంది. మంజూరైన న్యాయమూర్తుల పోస్టులు 37.

అర్హతలు (ఆర్టికల్ 217)

హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకానికి కొన్ని అర్హతలు ఉండాలి. ▲ భారతీయ పౌరుడై ఉండాలి. ▲ జిల్లా కోర్టులో న్యాయమూర్తిగా కనీసం పదేళ్లు పని చేసిన అనుభవం ఉండాలి (లేదా) హైకోర్టులో న్యాయవాదిగా కనీసం పదేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. ▲ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని 'కొలీజియం' సిఫార్సుల మేరకు హైకోర్టుకు ప్రధాన, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు.

జీతభత్యాలు (ఆర్టికల్ 221)



హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంటు చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. ఈ జీతభత్యాలకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. వీటిని రాష్ట్రాల సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత కేంద్ర సంఘటిత నిధి నుంచి పింఛను పొందుతారు. ఆర్థిక అత్యవసర పరిస్థితిలో తప్ప, ఇతర సందర్భాల్లో న్యాయమూర్తుల జీతభత్యాల్లో కోత విధించకూడదు. ▲ ప్రస్తుతం హైకోర్టు న్యాయమూర్తి వేతనం: రూ.2,25,000, ప్రధాన న్యాయమూర్తి వేతనం: రూ.2,50,000.

ప్రమాణ స్వీకారం (ఆర్టికల్ 219)



▲ హైకోర్టు ప్రధాన, ఇతర న్యాయమూర్తులు గవర్నర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ▲ సాధారణ న్యాయమూర్తులు గవర్నర్ లేదా ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో ప్రమాణం చేస్తారు.

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల నియామకాలు

❖ ఆర్టికల్ 223 ప్రకారం ఏదైనా హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి పదవి ఖాళీగా ఉంటే తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి నియమిస్తారు. ❖ ఆర్టికల్ 224 ప్రకారం ఏదైనా హైకోర్టులో పనిభారం ఎక్కువగా ఉందని రాష్ట్రపతి భావిస్తే సంబంధిత రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి తాత్కాలిక న్యాయమూర్తులను నియమిస్తారు. వీరి పదవీ కాలం రెండేళ్లు. సాధారణ న్యాయమూర్తులకు లభించే సౌకర్యాలు, అధికారాలన్నీ వీరికీ వర్తిస్తాయి. ❖ ఆర్టికల్ 224(ఎ) ప్రకారం ఏదైనా హైకోర్టులో ప్రత్యేక కేసుల విచారణ సందర్భంగా అవసరమనుకుంటే పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులను వారి సేవల కోసం రాష్ట్రపతి నియమిస్తారు.



పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల న్యాయవాద వృత్తి చేపట్టడంపై పరిమితులు (ఆర్టికల్ 220): హైకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం వారు పనిచేసిన హైకోర్టుల్లో న్యాయవాద వృత్తిని చేపట్టకూడదు. సంబంధిత రాష్ట్ర హైకోర్టు పరిధిలోని దిగువ న్యాయస్థానాల్లో కూడా న్యాయవాద వృత్తిని చేపట్టకూడదు. సుప్రీంకోర్టులో లేదా ఇతర హైకోర్టుల్లో న్యాయవాద వృత్తిని చేపట్టవచ్చు.

పదవీ విరమణ వయసు: హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లు. ఈ వయసు విషయంలో మార్పులు, చేర్పులు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది. పదవీ కాలం ముగియక ముందే హైకోర్టు న్యాయమూర్తులు తమ పదవికి రాజీనామా చేయవచ్చు. రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పించాలి.

> సుప్రీంకోర్టు కంటే హైకోర్టు విచారణాధికార పరిధి ఎక్కువ. సుప్రీంకోర్టు కేవలం ప్రాథమిక హక్కుల రక్షణ కోసం మాత్రమే రిట్లు జారీ చేస్తుంది. హైకోర్టు ప్రాథమిక హక్కుల సంరక్షణతో పాటు రాష్ట్ర ప్రభుత్వ శాసనాలు, ఆర్డినెన్స్‌లు, జీవోలు, బైలాల అమలు కోసం కూడా ఆదేశాలు జారీ చేస్తుంది.

న్యాయమూర్తుల తొలగింపు (ఆర్టికల్ 218): అసమర్థత, దుష్ప్రవర్తన ఆరోపణలపై హైకోర్టు న్యాయమూర్తులను పదవి నుంచి తొలగించవచ్చు. వీరి తొలగింపు తీరు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల తొలగింపు విధానం మాదిరి ఉంటుంది. ❖ హైకోర్టు న్యాయమూర్తులను తొలగించే అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటు ఉభయ సభలు విడివిడిగా 2/3వ వంతు ప్రత్యేకమైన మెజార్టీతో ఆమోదిస్తే రాష్ట్రపతి వారిని తొలగిస్తారు.




రచయిత: బంగారు సత్యనారాయణ

Transportation

10th Class Bridge Course – Biological Science

- Blood is a fluid connective tissue.
- Blood consists of a fluid medium called plasma in which cells are suspended.
- Blood cells are of three types.
- RBC are known as erythrocytes and are having haemoglobin for transportation of Oxygen and CO_2.
- WBC are known as leucocytes protects our body from foreign substances and diseases.
- Platelets help in blood clotting.



Our heart has four chambers two auricles or atria and two ventricles.

Blood vessels are of three types.

- Arteries having thick and elastic walls with high pressure of blood flow carry Oxygen rich blood from heart to body parts. ● Veins having thin walls and less elastic walls contain valves inside with low pressure of blood flow carry CO_2 rich blood from body parts to heart. ● Capillaries exchange substances that connect arteries and veins.


Blood circulation... If blood goes only once through the heart during one cycle of passage through the body it is known as single circulation. **e.g.:** Fish

- If blood goes through the heart twice during each cycle (once in between heart and lungs next in between heart and body parts) it is known as double circulation.
e.g.: All other vertebrates.

For more Concepts

Blood pressure


- The force that blood exerts against the wall of a vessel is called blood pressure.
- The pressure of blood inside the artery during ventricular systole (contraction) is called systolic pressure. It is about 120 mm of Hg. ● The pressure in artery during ventricular diastole (relaxation) is called diastolic pressure. It is about 80 mm of Hg. ● Hence normal blood pressure is about 120/80 mm of Hg.
- Blood pressure is measured with an instrument called sphygmamonometer. There is another type of fluid also involved in transportation called lymph or tissue fluid. Lymph is similar to the plasma of blood but colourless and contains less protein.



Writer: Mangalampalli Satyanarayanamurthy

వ్యర్థాలను వదిలించి.. రక్త పీడనాన్ని నియంత్రించి!

జనరల్ స్టడీస్ - బయాలజీ



మానవ శరీరంలో జీవక్రియల వల్ల ఏర్పడిన వ్యర్థ పదార్థాలను విసర్జక వ్యవస్థ బయటకు పంపుతుంది. మూత్రపిండాలు ముఖ్య విసర్జక అవయవాలు. చర్మం, ఊపిరితిత్తులు, కాలేయం మొదలైనవి అనుబంధ విసర్జక అవయవాలుగా పని చేస్తాయి. రక్తాన్ని వడపోసి, మలినాలను, అదనపు పదార్థాలను బయటకు పంపి, రక్తపోటును నియంత్రించే మూత్రపిండాలు శరీర సమతాస్థితిని కాపాడటంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తాయి. మూత్రపిండాల నిర్మాణం, ప్రధాన విధులు, వాటి పనితీరు లోపానికి కారణాలు, వచ్చే వ్యాధులు, చికిత్సా విధానాల గురించి పోటీ పరీక్షార్థులకు కనీస పరిజ్ఞానం ఉండాలి. మూత్రం వివిధ రంగుల్లోకి మారడానికి, కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కారణాలు, డయాలసిస్ అవసరమయ్యే సందర్భాలు తదితరాలను తెలుసుకోవాలి.

విసర్జక వ్యవస్థ

1. మానవుడి విసర్జక వ్యవస్థ ఏ పదార్థాలను శరీరం నుంచి బయటకు పంపుతుంది?
   ఎ) నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలు.
   బి) శరీరానికి అవసరం లేని పదార్థాలు.
   సి) ఉపయోగించుకోగా మిగిలిన పదార్థాలు.
   డి) అదనపు నీరు, లవణాలు.
   1) ఎ, బి, సి, డి   2) బి, సి, డి   3) సి, డి   4) ఎ, డి
2. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) అమ్మోనియాను ముఖ్య విసర్జక పదార్థంగా విసర్జించే జీవులు అస్థి చేపలు, కప్ప టాడ్‌పోల్ లార్వా
   బి) నీటిలో నివసించే జీవులు అమ్మోనియాను విసర్జిస్తాయి.
   సి) అమ్మోనియాను విసర్జించే జీవులను 'అమ్మోనోటెలిక్ జంతువులు' అంటారు.
   1) ఎ, బి   2) ఎ, బి, సి   3) బి, సి   4) ఎ, సి
3. వివిధ జంతువులు, అవి విసర్జించే నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల గురించి కింది వాటిలో సరైన జతలను ఎన్నుకోండి.




   ఎ) అమ్మోనియా - ప్రోటోజోవా, హైడ్రా, సాలమండర్, నత్త
   బి) యూరియా - క్షీరదాలు, కప్ప, తాబేలు, మృదులాస్థి చేపలు
   సి) యూరికామ్లం - పక్షులు, కీటకాలు, పాములు
   1) ఎ, సి   2) బి, సి   3) ఎ, బి   4) ఎ, బి, సి
4. జంతురాజ్యంలో వివిధ జీవుల విసర్జక అవయవాల గురించి కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) సకశేరుకాలు	1) మాల్పీజియన్ నాళికలు
బి) కీటకాలు	2) మూత్రపిండాలు
సి) మొలస్కా జీవులు	3) జ్వాలా కణాలు
డి) ప్లాటీహెల్మింథిస్ జీవులు	4) రీనల్ అవయవం
ఇ) అనిలెడా జీవులు	5) రెన్నెట్ కణాలు
ఎఫ్) నిమాటీహెల్మింథిస్ జీవులు	6) నెఫ్రీడియా

   1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5, ఎఫ్-6
   2) ఎ-3, బి-2, సి-4, డి-5, ఇ-6, ఎఫ్-1
   3) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-6, ఎఫ్-5
   4) ఎ-6, బి-5, సి-4, డి-2, ఇ-3, ఎఫ్-1
5. మానవుడిలో మూత్రపిండాల విధులకు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) నత్రజని సంబంధ వ్యర్థాలను బయటకు పంపుతాయి.
   బి) నీరు, లవణాల క్రమతను నియంత్రిస్తాయి.
   సి) ధమనుల్లో రక్తపీడనాన్ని నియంత్రిస్తాయి.
   డి) విటమిన్-డి తయారీకి ఉపయోగపడతాయి.
   ఇ) అదనపు, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతాయి.
   1) ఎ, బి, సి, డి, ఇ   2) బి, సి, డి   3) సి, డి, ఇ   4) ఎ, డి, ఇ



6. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాలు చిక్కుడు గింజ ఆకారంలో వెన్నెముకకు ఇరువైపులా ఉంటాయి.
   బి) మూత్రపిండాల బరువు సరాసరి 120-170 గ్రాములు.
   సి) మూత్రనాళాలు మూత్రాన్ని మూత్రపిండాల నుంచి మూత్రాశయానికి తీసుకొస్తాయి.
   1) ఎ, బి   2) బి, సి   3) ఎ, బి, సి   4) ఎ, సి
7. నెఫ్రాను‌లో రక్తం వడపోత జరిగి, మూత్రం ఏర్పడటానికి ఉపయోగపడే కింది నెఫ్రాను భాగాల సరైన క్రమాన్ని ఎన్నుకోండి.



   1) వృక్కసిర - వృక్కధమని- గ్లోమెరులస్ - బొమన్స్ గుళిక - హెన్లీశిక్యం- సమీప సంవళిత నాళిక - దూరస్థ సంవళిత నాళిక.
   2) వృక్కసిర - సమీప సంవళిత నాళిక - దూరస్థ సంవళిత నాళిక - బొమన్స్ గుళిక - హెన్లీ శిక్యం - గ్లోమెరులస్ - వృక్కధమని
   3) గ్లోమెరులస్ - వృక్కసిర - వృక్కధమని - సమీప సంవళిత నాళిక - దూరస్థ సంవళిత నాళిక - బొమన్స్ గుళిక- హెన్లీ శిక్యం
   4) వృక్కధమని - గ్లోమెరులస్ - బొమన్స్ గుళిక - సమీప సంవళిత నాళిక - హెన్లీ శిక్యం - దూరస్థ సంవళిత నాళిక
8. కింది వాక్యాల్లో సరికాని వాటిని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాలు వాయు వినిమయం చేసి రక్తాన్ని శుభ్రపరుస్తాయి.
   బి) ఒక జత మూత్రపిండాలు రోజుకు 190 లీటర్ల మూత్రాన్ని తయారుచేస్తాయి.
   సి) మూత్రం పసుపు రంగులో ఉండటానికి కారణం యూరోక్రోమ్.
   1) ఎ, సి   2) ఎ, బి   3) బి, సి   4) ఎ, బి, సి
9. మూత్రంలో ఉండే పదార్థాలు వాటివల్ల కలిగే వ్యాధుల గురించి కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) హిమటూరియా	1) మూత్రంలో చీము ఉండటం
బి) గ్లైకోసూరియా	2) మూత్రంలో రక్తం ఉండటం
సి) ఆల్బ్యునూరియా	3) మూత్రం నల్లరంగులోకి మారడం
డి) ఆల్‌కాప్టోన్యూరియా	4) మూత్రంలో చక్కెర ఉండటం
ఇ) పైయూరియా	5) మూత్రంలో ప్రొటీన్ ఉండటం


   1) ఎ-1; బి-4; సి-3; డి-2; ఇ-5.
   2) ఎ-5; బి-3; సి-4; డి-2; ఇ-1
   3) ఎ-2; బి-4; సి-5; డి-3; ఇ-1
   4) ఎ-4; బి-3; సి-2; డి-1; ఇ-5
10. కింది వాటిలో సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.



   ఎ) ఒక రోజులో సరాసరి ఏర్పడే మూత్ర పరిమాణం 1.5 నుంచి 1.8 లీటర్లు.
   బి) ఆల్కహాల్, కాఫీ లాంటి వాటిని 'అతిమూత్ర వర్ధకాలు' అంటారు.
   సి) మూత్రం ఏర్పడటమనేది మనం తాగే నీటి పరిమాణం, శారీరక వ్యాయామంపై ఆధారపడి ఉంటుంది.
   1) ఎ, బి, సి   2) బి, సి   3) ఎ, సి   4) ఎ, బి
11. మానవ మూత్రంలో కింది ఏ నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలుంటాయి?
   ఎ) అమ్మోనియా   బి) యూరియా
   సి) యూరికామ్లం   డి) క్రియాటినైన్
   1) ఎ, బి, డి   2) బి, సి, డి   3) ఎ, బి, సి, డి   4) ఎ, బి
12. కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) మన శరీరంలో అదనపు అమైనో ఆమ్లాలు నిల్వ అవుతాయి.
   బి) రక్తంలో అధిక యూరియా ఉండటాన్ని 'యూరిమియా' అంటారు.
   సి) మూత్రంలో అధిక నీరు ఉండటాన్ని 'పాలి యూరియా' అంటారు.
   డి) మూత్రపిండాలు 'రెనిన్' అనే హార్మోన్ (ఎంజైమ్)ను స్రవించి రక్తపీడనాన్ని నియంత్రిస్తాయి.
   1) బి, డి   2) ఎ, సి   3) బి, సి   4) ఎ, డి
13. నెఫ్రాన్‌లోని కింది ఏ భాగం నుంచి రక్తం వడపోయడం వల్ల ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది?
   1) వృక్క ధమని   2) హెన్లీ శిక్యం
   3) గ్లోమెరూలస్   4) బొమన్స్ గుళిక
14. కింది వాటిలో సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాలు రోజుకు సుమారు 190 లీటర్ల రక్తాన్ని వడపోసి, శుభ్రపరుస్తాయి.
   బి) మూత్రపిండాల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు నెఫ్రానులు.
   సి) నెఫ్రానులు, మూత్రపిండాలు పనిచేసే విధాన అధ్యయనాన్ని 'నెఫ్రాలజీ' అంటారు.
   1) ఎ, సి   2) బి, సి   3) ఎ, బి, సి   4) ఎ, బి
15. కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) కృత్రిమ మూత్రపిండం	1) గ్వానైన్
బి) మూత్రపిండంలోని రాళ్లు రసాయనికంగా..	2) యూరికామ్లం
సి) మూత్రంలో ఎక్కువ పైత్యరస వర్ణకాలు	3) క్యాల్షియం ఆగ్జలేట్
డి) పక్షుల్లో ముఖ్య నత్రజని సంబంధ పదార్థం	4) డయాలసిస్ యంత్రం
ఇ) సాలీడు విసర్జించే పదార్థం	5) కామెర్లు

   1) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
   2) ఎ-5, బి-3, సి-4, డి-2, ఇ-1
   3) ఎ-5, బి-1, సి-3, డి-2, ఇ-4
   4) ఎ-4, బి-3, సి-5, డి-2, ఇ-1
16. కింది జతల్లో తప్పుగా ఉన్న వాటిని గుర్తించండి.
   ఎ) కీటోన్యూరియా - మూత్రంలో కొవ్వు దేహాలు ఉండటం
   బి) ఎన్యూరియా - మూత్రంలో ఎసిటోన్ ఉండటం
   సి) నెఫ్రాలజీ - మూత్రపిండం, దీని వ్యాధుల అధ్యయనం
   డి) మూత్రపిండంలో రాళ్లు రసాయనికంగా - క్యాల్షియం కార్బోనేట్
   1) ఎ, బి   2) బి, డి   3) ఎ, సి   4) బి, సి
17. కింది వాక్యాల్లో సరైన వాటిని పరిశీలించి, సమాధానాన్ని గుర్తించండి.



   ఎ) నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల్లో అధిక విషపూరితమైంది అమ్మోనియా.
   బి) మన శరీరంలో చర్మం అదనపు విసర్జక అవయవంగా పనిచేస్తుంది.
   సి) పక్షుల ముఖ్య విసర్జక పదార్థం - యూరికామ్లం
   1) ఎ, బి   2) ఎ, బి, సి   3) బి, సి   4) ఎ, సి
18. మానవ మూత్రం ద్వారా కింది ఏ పదార్థాలు విసర్జితమవుతాయి?
   ఎ) ఎక్కువైన నీరు, లవణాలు
   బి) అదనపు విటమిన్ - సి
   సి) నత్రజని సంబంధ వ్యర్థాలు
   డి) యూరోక్రోమ్ వర్ణద్రవ్యం
   1) ఎ, బి, సి, డి   2) బి, సి   3) సి, డి   4) ఎ, డి
19. కింది వాటిని పరిశీలించి, సరైన వాక్యాలను ఎంచుకోండి.
   ఎ) మూత్రపిండాలు ఎరిథ్రోపాయిటిన్ ప్రొటీన్‌ను ఉత్పత్తి చేస్తాయి.
   బి) మూత్రనాళం మూత్రాన్ని మూత్రపిండం నుంచి మూత్రాశయానికి చేరవేస్తుంది.
   సి) మూత్రపిండం నుంచి రక్తాన్ని సంగ్రహించేది వృక్కసిర.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి   4) ఎ, సి

సమాధానాలు

1-1, 2-2, 3-4, 4-3, 5-1, 6-3, 7-4, 8-2, 9-3, 10-1, 11-3, 12-1, 13-3, 14-3, 15-4, 16-2, 17-2, 18-1, 19-3.

ఈనాడు ప్రతిభ
■ e-mail: support@epratibha.net
19
శుక్రవారం మే 1, 2026

నేల ఆరోగ్యంపైనే మానవ జాతి మనుగడ ఆధారపడి ఉంటుంది. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు ఆహార భద్రత కల్పించడంలో వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నేల సారాన్ని కాపాడుతూ అధిక దిగుబడిని సాధించడం. ఈ క్రమంలో మొక్కలకు అవసరమైన పోషకాలను కృత్రిమంగా లేదా సహజంగా అందించే పదార్థాలనే ఎరువులు అంటారు. సాధారణంగా మొక్కలు తమ పెరుగుదలకు వాతావరణం, నేల నుంచి 17 రకాల ఆవశ్యక మూలకాలను గ్రహిస్తాయి. అయితే, నిరంతర సాగు వల్ల నేలలో తగ్గుతున్న నత్రజని, భాస్వరం, పొటాషియం లాంటి స్థూల పోషకాలను భర్తీ చేయడానికి ఎరువుల వాడకం అనివార్యమైంది.

వర్మీ కంపోస్ట్.. ఎరువుల్లో నల్ల బంగారం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

సేంద్రియ ఎరువులు (ఆర్గానిక్ ఎరువులు)

సేంద్రియ ఎరువులు సహజ వనరులైన మొక్కలు, జంతు వ్యర్థాల విచ్ఛిన్నం ద్వారా ఏర్పడతాయి. ఇవి కేవలం పోషకాలను అందించడమే కాకుండా, నేల భౌతిక, రసాయన, జీవ స్వభావాలను మెరుగుపరుస్తాయి.

పశువుల ఎరువు (FYM): ఇది పశువుల పేడ, మూత్రం, పశుగ్రాస వ్యర్థాల మిశ్రమం.

- ఇందులో నత్రజని (0.5%), భాస్వరం (0.2%), పొటాషియం (0.5%) ఉంటాయి.
- ఇది నేలలో హ్యూమస్ శాతాన్ని పెంచుతుంది. తద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- ఒక హెక్టారుకు సుమారు 10-15 టన్నుల FYM వాడటం ద్వారా తదుపరి రెండు పంటలకు కూడా పోషకాలు అందుతాయి.

వర్మీ కంపోస్ట్: ఇది వానపాములను ఉపయోగించి సేంద్రియ వ్యర్థాలను తక్కువ కాలంలో ఎరువుగా మార్చే ప్రక్రియ. దీన్ని 'నల్ల బంగారం' అని కూడా పిలుస్తారు.



- వానపాములు వ్యర్థాలను తిని విసర్జించే వర్మీకాస్ట్‌లో సాధారణ మట్టి కంటే 5 రెట్లు ఎక్కువ నత్రజని, 7 రెట్లు ఎక్కువ భాస్వరం ఉంటాయి.
- ఇది నేలలో గాలి ప్రసరణను పెంచి, వేర్లు లోతుగా చొచ్చుకుపోయేలా సహకరిస్తుంది.
- పట్టణ ప్రాంతాల్లో వంటింటి వ్యర్థాలను ఉపయోగించి ఇంటి వద్దే వర్మీ కంపోస్ట్ తయారు చేయడం అనేది ప్రస్తుతం సుస్థిరాభివృద్ధిలో భాగంగా మారింది.

పచ్చిరొట్ట ఎరువు (గ్రీన్ మెన్యూర్): త్వరగా పెరిగే మొక్కలను పొలంలోనే సాగు చేసి, అవి పూత దశకు రాగానే భూమిలోనే కలిపి దున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువు అంటారు.

- ఇవి ప్రధానంగా వాతావరణంలోని నత్రజనిని నేలలో స్థిరీకరిస్తాయి.
- వరి నాట్లు వేయడానికి 2-3 వారాల ముందు జీలుగ మొక్కలను భూమిలో కలిపి దున్నడం ద్వారా రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా తగ్గుతుంది.

మొక్కలు - పోషక ఎరువులు

మొక్కల పెరుగుదల, అభివృద్ధికి అవసరమైన పోషకాలను అందించే పదార్థాలను ఎరువులు అంటారు. వీటిని ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

- రసాయనిక ఎరువులు
- సేంద్రియ ఎరువులు
- జీవ ఎరువులు



రసాయనిక ఎరువులు

రసాయనిక ఎరువులు ఆధునిక వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీటిని కర్మాగారాల్లో కృత్రిమంగా తయారుచేస్తారు. ఇవి మొక్కలకు అవసరమైన పోషకాలను వెనువెంటనే అందిస్తాయి. రసాయనిక ఎరువులు అకర్బన పోషకాలను (N, P, K) అధిక సాంద్రతలో కలిగి ఉంటాయి.

- వీటిని తిరిగి మూడు రకాలుగా విభజించవచ్చు. అవి:

నత్రజని సంబంధిత ఎరువులు: మొక్కల శాఖీయ పెరుగుదలకు నత్రజని అత్యంత అవసరం. ఇది క్లోరోఫిల్ (పత్రహరితం)లో ముఖ్య భాగం.

- ఇవి కిరణజన్య సంయోగక్రియ వేగాన్ని పెంచుతాయి. మొక్కలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణమవుతుంది.

యూరియా: ఇందులో 46% నత్రజని ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా వినియోగించే ఎరువు.

అమ్మోనియం సల్ఫేట్: ఇది నత్రజనితో పాటు గంధకాన్ని (సల్ఫర్) కూడా అందిస్తుంది.

కాల్షియం అమ్మోనియం నైట్రేట్ (CAN): దీన్ని 'కిసాన్ ఖాద్' అని కూడా పిలుస్తారు. ఇది నేల స్వభావాన్ని పెద్దగా మార్చదు.

భాస్వరం సంబంధిత ఎరువులు: ఇవి మొక్కల శక్తి ప్రసారానికి (ATP), వేర్ల అభివృద్ధికి, పునరుత్పత్తికి అవసరం.

- ఇవి కణ విభజనను ప్రోత్సహించడంతో పాటు వేర్లు భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయేలా చేస్తాయి. పూత, కాత త్వరగా రావడానికి ఇవి తోడ్పడతాయి.

సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (SSP): ఇందులో ఫాస్పరస్‌తో పాటు కాల్షియం, సల్ఫర్ ఉంటాయి.

డై అమ్మోనియం ఫాస్ఫేట్ (DAP): ఇది అత్యంత ప్రాచుర్యం పొందిన మిశ్రమ ఎరువు. ఇందులో నత్రజని (18%), భాస్వరం (46%) రెండూ ఉంటాయి.

ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ (TSP): ఇందులో భాస్వరం అధిక సాంద్రతలో ఉంటుంది.

పొటాషియం సంబంధిత ఎరువులు: ఇవి మొక్కల కణాల్లో ద్రవాభిసరణ క్రమతను, ఎంజైమ్‌ల ఉత్తేజాన్ని నియంత్రిస్తాయి.

- ఇవి మొక్కలకు వ్యాధి నిరోధక శక్తిని ఇవ్వడంతో పాటు కరవును తట్టుకునే శక్తిని పెంచుతాయి. పండ్లు, గింజల నాణ్యతను (రుచి, రంగు, నిల్వ కాలం) మెరుగుపరుస్తాయి.

మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (MOP - KCl): ఇది పొటాషియం క్లోరైడ్. ఎరుపు రంగులో ఉంటుంది. సుమారు 60% పొటాష్‌ను కలిగి ఉంటుంది.

పొటాషియం సల్ఫేట్: క్లోరిన్ పడని పంటలకు (ఉదా: పొగాకు, బంగాళాదుంప) దీన్ని ఉపయోగిస్తారు.



రచయిత
డా.కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

జీవ ఎరువులు

జీవ ఎరువులు అనేవి ఎరువులు మాత్రమే కావు, ఇవి నేల జీవక్రియను వేగవంతం చేసే సజీవ పదార్థాలు. ఇవి వాతావరణంలోని పోషకాలను మొక్కలకు అందుబాటులోకి తీసుకువస్తాయి. లేదా నేలలో నిగూఢంగా ఉన్న పోషకాలను కరిగిస్తాయి.

- ఈ ఎరువులను తిరిగి మూడు రకాలుగా విభజించవచ్చు. అవి:

నత్రజని స్థిరీకరణ జీవ ఎరువులు: నత్రజని వాతావరణంలో పుష్కలంగా ఉన్నప్పటికీ, మొక్కలు దాన్ని నేరుగా గ్రహించలేవు. కొన్ని సూక్ష్మజీవులు నత్రజనిని అమ్మోనియా లేదా నైట్రేట్ రూపంలోకి మారుస్తాయి. అవి:

రైజోబియం - సహజీవనం: ఇవి లెగ్యుమినేసి కుటుంబానికి చెందిన మొక్కల (కంది, పెసర, మినుము, శనగ) వేర్లలో బుడిపెలను ఏర్పరుస్తాయి. మొక్క వీటికి ఆహారం అందిస్తే, ఇవి మొక్కకు నత్రజనిని ఇస్తాయి. పంట కోత తర్వాత కూడా నేలలో నత్రజని నిల్వలు పెరిగి, తర్వాతి పంటకు మేలు జరుగుతుంది.

అజటోబాక్టర్ - స్వేచ్ఛా స్థితి: ఇవి ఏ మొక్కతో సంబంధం లేకుండా నేలలో స్వతంత్రంగా ఉంటూ నత్రజనిని స్థిరీకరిస్తాయి. వరి, పత్తి, చెరకు, జొన్న లాంటి పంటలకు ఇవి అమృతం లాంటివి. ఇవి మొక్క పెరుగుదలకు అవసరమైన హార్మోన్లను కూడా విడుదల చేస్తాయి.

అజోస్పైరిల్లం: ఇది మొక్క లోపల, బయట జీవిస్తుంది. మొక్కజొన్న, తృణధాన్యాల పంటల్లో నీటి ఎద్దడిని తట్టుకునే శక్తి అందిస్తుంది.

నీలి ఆకుపచ్చ శైవలాలు, అజోల్లా: ఇవి వరి సాగులో అత్యంత కీలకమైనవి.

BGA: వీటిని సయనో బ్యాక్టీరియా అని కూడా అంటారు. (ఉదా: అనబీనా, నాస్టాక్). ఇవి కిరణజన్య సంయోగక్రియ ద్వారా నత్రజనిని స్థిరీకరిస్తాయి.

అజోల్లా: ఇది ఒక నీటి ఫెర్న్. దీని ఆకుల్లో అనాబీనా అనే శైవలం ఉంటుంది. వరి పొలంలో అజోల్లాను ఒక పొరలా పెంచడం వల్ల కలుపు మొక్కలు పెరగవు. ఎకరాకు 20-30 కిలోల నత్రజని అందుతుంది.

భాస్వరాన్ని కరిగించే, గ్రహించే జీవ ఎరువులు: నేలలో భాస్వరం ఉన్నప్పటికీ, అది కరగని రూపంలో ఉండటం వల్ల మొక్కలు గ్రహించలేవు.

ఫాస్ఫో బ్యాక్టీరియా (PSB): బాసిల్లస్, సూడోమోనాస్ లాంటి బ్యాక్టీరియాలు సేంద్రియ ఆమ్లాలను విడుదల చేసి, నేలలో గట్టిగా ఉన్న ఫాస్ఫేట్‌ను కరిగిస్తాయి.

మైకోరైజా (VAM - Vesicular Arbuscular Mycorrhiza): ఇది ఒక రకమైన శిలీంధ్రం. ఇది మొక్క వేర్ల చుట్టూ ఒక నెట్‌వర్క్‌లా ఏర్పడి, భూమిలో చాలా లోతుగా ఉన్న ఫాస్ఫేట్, సూక్ష్మ పోషకాలను (Zn, Cu) లాగి మొక్కకు అందజేస్తాయి.

Word of the Day

997

Obscure

Telugu meaning: నిగూఢమైన, అస్పష్టమైన

English meaning: As an adjective, the word obscure (అబ్‌స్క్యూర్) describes something that is not clear or not well known. As a verb, it means to make something unclear or difficult to understand.

Synonyms: Vague, Unclear; ***Antonyms:*** Clear, Obvious

Usage: **1.** As an Adjective: The author used obscure references in the article, making it difficult for general readers to understand the message.

2. As a Verb: The heavy fog began to obscure the road, forcing drivers to slow down considerably.

పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాలు ఎంతో కీలకం. ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్/ యాప్ 'మంత్లీ కరెంట్ అఫైర్స్'ను వీడియో రూపంలో యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంచింది. వీటితోపాటు జనరల్ స్టడీస్‌కి సంబంధించిన మరిన్ని పాఠాలూ ఉన్నాయి. టాపిక్‌పై అవగాహన పెంచుకోవడానికి, సులభంగా నేర్చుకోవడానికి ఇవి మీకు సాయం చేస్తాయి.

- కన్‌ఫ్యూజ్ చేసే ప్రశ్నలకు పోల్స్ రూపంలో క్లారిటీ ఇస్తూ.. క్విజెస్‌తోపాటు జాబ్ నోటిఫికేషన్స్ సమాచారాన్ని రీల్స్‌గా.. ముఖ్యమైన జనరల్ నాలెడ్జ్ కంటెంట్‌ను షార్ట్స్ రూపంలో అందిస్తూ మీ సన్నద్ధతకు తోడుగా, సరైన సమాచారానికి వేదికగా ఈనాడు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ నిలుస్తోంది. మీరు జాబ్ కొట్టాలని బలంగా కోరుకుంటే ఇప్పుడే మా ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోండి.

నోటిఫికేషన్స్

అప్రెంటిస్ పోస్టులు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో అప్రెంటిస్‌షిప్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 1,865. దరఖాస్తు రుసుము రూ.944. అర్హులైన అభ్యర్థులు 2026, మే 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జూనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు

పట్నాలోని ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజీఐఎంఎస్), వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రెసిడెంట్ (నాన్ అకడమిక్) పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 18. దరఖాస్తు ఫీజు రూ.1000. ఇంటర్వ్యూ తేదీ 6 మే 2026.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (మే 1) చివరి తేదీ

- ఐఆర్ఎఫ్‌సీ లిమిటెడ్‌లో 23 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు. సీఏ/సీఎంఏ, ఎంబీఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

జనరల్ నాలెడ్జ్
చరిత్రలో ఈనాడు
మే 1

పనిచేయాలనే కోరిక, పనిచేసే సామర్థ్యం ఉన్న జనాభాను శ్రామికశక్తిగా పేర్కొంటారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో వీరు ఎంతో కీలకంగా ఉంటారు. దేశ వర్తమాన, భవిష్యత్తు జీవనాన్ని ప్రభావితం చేసే శక్తి వీరికి ఉంది. ఆర్థికాభివృద్ధిలో కార్మికుల కృషికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఏటా మే 1న 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం'గా (International Labour Day) నిర్వహిస్తారు. దీన్నే 'మే' డే అని కూడా అంటారు. కష్టపడే, అంకితభావంతో పనిచేసే కార్మికులను గుర్తించడంతోపాటు, వారి హక్కులు, సమస్యల పరిష్కారంపై జరిపిన పోరాటాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

చారిత్రక నేపథ్యం:

19వ శతాబ్దం చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా కార్మికులు మెరుగైన పని పరిస్థితులు, న్యాయమైన వేతనాలు, తక్కువ పని గంటల కోసం పోరాటాలు చేయడం ప్రారంభించారు. 1886, మే 1న అమెరికావ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాన్ని కోరుతూ సుమారు నాలుగు లక్షల మంది కార్మికులు సమ్మె చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సోషలిస్ట్, లేబర్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సెకండ్ ఇంటర్నేషనల్ సమావేశం 1889లో పారిస్‌లో జరిగింది. అందులో ఏటా మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించారు. మన దేశంలో మొదటి కార్మిక దినోత్సవాన్ని 1923లో మద్రాస్ (ప్రస్తుత చెన్నై)లో నిర్వహించారు. ఇది లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందుస్థాన్ ఆధ్వర్యంలో జరిగింది.



కార్మికులు అంటే ఎవరు? భారత్‌లో కార్మిక కోడ్‌లు, ఎంప్లాయిమెంట్ అండ్ సోషల్ ట్రెండ్స్ రిపోర్ట్ 2026, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

రవాణా సౌకర్యాలు - రైలు రవాణా

భారతదేశ రవాణా రంగంలో రైల్వే వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. బ్రిటిష్ వారు తమ అవసరాల కోసం దేశంలో మొదటిసారి రైల్వే మార్గం వేశారు. తొలిసారిగా ఆవిరి ఇంజిన్‌తో నడిచిన రైలు నేడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. రవాణా, ఆర్థిక రంగాల్లో బాసటగా నిలుస్తోంది. భారతీయ రైల్వే సుదూర ప్రాంతాలను కలుపుతూ, ప్రయాణికులను, సరకులను గమ్యస్థానాలకు చేర్చడంలో తోడ్పడుతోంది. దేశంలోని రైల్వే వ్యవస్థ, అనుబంధ సంస్థలు, జోన్లు, వంతెనలు, మార్గాలు, మెట్రో వ్యవస్థ తదితరాలపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలి.



ప్రపంచ రైల్వే పితామహుడిగా స్టీఫెన్‌సన్‌ను అభివర్ణిస్తారు. ఈయన 1814లో రైలు ఇంజిన్‌ను కనిపెట్టారు.

- ప్రపంచంలో మొదటి రైలుమార్గాన్ని 1825లో ఇంగ్లండ్‌లోని స్టాక్టన్, డార్లింగ్‌టన్ పట్టణాల మధ్య సుమారు 9 మైళ్ల దూరం వేశారు. మొదటి రైలు వేగం 5 మైళ్లు/గంట.

భారతదేశ రైల్వే వ్యవస్థ

భారతదేశ రైల్వే పితామహుడిగా లార్డ్ డల్హౌసీని పేర్కొంటారు.

- భారత్‌లో మొదటి రైలు 1853 ఏప్రిల్ 16న గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే ఆధ్వర్యంలో బొంబాయి నుంచి థానే వరకు 34 కిలోమీటర్లు ప్రయాణించింది. నాటి గవర్నర్ జనరల్‌గా లార్డ్ డల్హౌసీ ఉన్నారు.
- దేశంలో రెండో రైలు హౌరా, హుగ్లీల మధ్య నడిచింది.

ముఖ్యమైన సొరంగ మార్గాలు

- పిర్‌పంజాల్/ బనిహాల్ రైల్వే టన్నెల్
- కర్బుడే టన్నెల్

రైలు గేజుల వర్గీకరణ, ముఖ్యమైన రైల్వే వంతెనలు, మెట్రోరైల్ లేదా మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్, భారతదేశంలోని రైల్వేజోన్లు మొదలైన అంశాలు సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Shekha Jheel Bird Sanctuary in..

Current Affairs

1. Which of the following statements is correct regarding the Bharat Maritime Insurance Pool (BMI Pool)?
A) It is a scheme for agricultural insurance
B) It is launched by private companies without government support
C) It is meant only for inland transport insurance
D) The Union Cabinet approved the Bharat Maritime Insurance Pool with a sovereign guarantee of Rs.12,980 crore to strengthen India's maritime trade resilience

2. Which of the following statements is correct regarding Marine Spatial Planning (MSP) in India?
A) MSP is related only to inland river management
B) Kerala is the first state to launch MSP
C) Odisha became the first state to launch a Marine Spatial Plan in collaboration with the National Centre for Coastal Research for integrated coastal and marine planning
D) MSP is a defence-only coastal monitoring system

3. Which of the following statements is correct regarding the Constitution (131st Amendment) Bill, 2026?
A) The Bill was successfully passed by both Houses of Parliament
B) The Lok Sabha failed to pass the Constitution (131st Amendment) Bill, 2026, which aimed to fast-track 33% reservation for women in legislatures through delimitation based on the 2011 Census
C) The Bill abolished reservation for women
D) The Bill is related only to taxation reforms

4. Which of the following statements is correct regarding Shekha Jheel Bird Sanctuary?
A) Shekha Jheel Bird Sanctuary in Uttar Pradesh has been designated as India's 99th Ramsar Site
B) It is located in Rajasthan and is India's first Ramsar Site
C) It is a marine protected area in Tamil Nadu
D) It is not included in any international conservation list

Geography

5. Which of the following statements is correct regarding iron ore mines in India?
A) Noamundi and Gua are coal mines
B) Iron ore is mainly found only in Rajasthan
C) Bailadila mines are located in Uttar Pradesh
D) Noamundi and Gua are iron ore mines; major haematite reserves are in Odisha, Jharkhand, Chhattisgarh, Karnataka, and Goa, with important mines like Bailadila in Chhattisgarh

SSC Exams Special

General Awareness

6. Which of the following statements is correct regarding soils in India?
A) Arid soils are mainly found in eastern India
B) Western Rajasthan is characterized by arid (desert) soil, and ICAR classifies Indian soils into eight major categories
C) Black soil is found mainly in the Himalayan region
D) India has only four major soil types

General Science

7. Which of the following statements is correct regarding Amoeba?
A) Pseudopodia are permanent limbs used only for reproduction
B) Contractile vacuole stores food inside the cell
C) Pseudopodia are temporary cytoplasmic extensions used for movement and feeding, while the contractile vacuole helps in osmoregulation by expelling excess water
D) Amoeba does not regulate water balance

8. Which of the following statements is correct regarding praseodymium (Pr)?
A) Praseodymium is a solid rare-earth element used in devices like colour televisions, fluorescent lamps, energy-saving lamps, and glass
B) Praseodymium is a liquid metal used as fuel
C) It is a non-metal gas found in the atmosphere
D) It is used only in agriculture as a fertilizer

Polity

9. Which of the following statements is correct regarding Article 58 of the Indian Constitution?
A) Article 58 deals with the impeachment of the President
B) It explains the powers of the Prime Minister
C) It provides for emergency provisions in India
D) Article 58 lays down the qualifications required for election as the President of India

10. Which of the following statements is correct regarding constitutional and legal offices in India?
A) The Solicitor General of India is appointed by the Appointments Committee of the Cabinet; the Attorney General is provided under Article 76; and the Comptroller and Auditor General is provided under Article 148
B) The Solicitor General is appointed by the President under Article 148
C) The Attorney General is appointed by the Supreme Court
D) The CAG is a non-constitutional post

11. Which of the following statements is correct regarding a No-Confidence Motion?
A) It is introduced only in the Rajya Sabha
B) It is used to remove the President of India
C) It is passed without voting in Parliament
D) A No-Confidence Motion is a formal proposal in the Lok Sabha to test whether the government enjoys the confidence of the House

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

రోడ్డు ప్రమాదాల నివారణకు జైపుర్ పోలీస్ 'క్యూఆర్ కోడ్'



ఈటీవీ భారత్: రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్ రేంజి పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యానికి సాంకేతికతను అనుసంధానం చేశారు. దేశంలోనే మొదటిసారిగా.. ఈ రేంజి పరిధిలోని ప్రమాద కేంద్రాలు (బ్లాక్ స్పాట్స్) వాహన చోదకులకు సెల్‌ఫోను తెరపై కనిపించేలా క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. అజ్‌మేర్ - జైపుర్ - ఆగ్రా - దిల్లీ మార్గంలో ప్రయాణించే వాహనాల డ్రైవర్లు క్యూఆర్ కోడ్ స్కానింగు ద్వారా ఆయా కేంద్రాల వద్ద అప్రమత్తం అయ్యేందుకు ఇది వీలు కల్పిస్తుంది. గూగుల్‌తో సమన్వయం చేసుకొని గూగుల్ మ్యాప్స్‌లో ఈ బ్లాక్‌స్పాట్స్ కనిపించేలా పోలీసులు చేస్తున్న ఈ ప్రయత్నం మరో నెల రోజుల్లో అమలులోకి రానుంది. ఇది విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామని జైపుర్ రేంజి ఐజీ రాహుల్ ప్రకాశ్ తెలిపారు.



రష్యాలోని పెర్మ్ ప్రాంతంలో ఉక్రెయిన్ డ్రోన్‌దాడిలో చమురు నిల్వ ట్యాంకులు పేలడంతో భారీస్థాయిలో వెలువడుతున్న మంటలు, దట్టమైన పొగ. ప్లానెట్ ల్యాబ్స్ తీసిన ఉపగ్రహ చిత్రమిది.



జైలు నుంచి గృహనిర్బంధానికి అంగ్‌సాన్ సూకీ

బ్యాంకాక్: జైలులో ఉన్న మయన్మార్ నేత అంగ్‌సాన్ సూకీ(80)ని గృహనిర్బంధానికి తరలించినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా సంస్థ వెల్లడించింది. పోలీసుల సమక్షంలో ఉన్న సూకీ ఫొటోను ఈ సందర్భంగా విడుదల చేసింది. 2021 ఫిబ్రవరి 1న మయన్మార్‌లో సైన్యం అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత సూకీని అరెస్టు చేసి జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఆమె కారాగారంలోనే గడుపుతున్నారు. ఇన్నాళ్లుగా ఆమె బాహ్య ప్రపంచానికి కనిపించలేదు.

15 నుంచి ఐరోపా పర్యటనకు ప్రధాని మోదీ

దిల్లీ: ప్రధాని మోదీ ఐరోపా పర్యటన ఖరారైంది. మే 15 నుంచి 20 వరకూ ఆయన నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీల్లో పర్యటిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ పర్యటన ఆరంభం లేదా ముగింపులో ప్రధాని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)నూ సందర్శించే అవకాశాలున్నట్లు పేర్కొన్నాయి. నార్వేలో 15-16 తేదీల్లో మూడవ ఇండియా-నోర్డిక్ సదస్సులో పాల్గొంటారు. భారత్-ఐరోపా సమాఖ్యల మధ్య జనవరిలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తర్వాత మోదీ చేస్తున్న తొలి యూరప్ పర్యటన ఇది. ఇంధన సరఫరా భద్రత, స్వేచ్ఛా వాణిజ్య కార్యకలాపాలకు ఎదురవుతున్న ఆటంకాలను నియంత్రించే దిశగా చర్చలు జరపడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలుస్తోంది.

హెచ్‌వీడీసీ సబ్‌స్టేషన్లలో కనీసం 60% స్థానిక వస్తువులే వినియోగించాలి

ఈనాడు, దిల్లీ: హైవోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ)సబ్‌స్టేషన్ల నిర్మాణంలో 2035 నాటికి కనీసం 60% స్థానిక వస్తువులనే వినియోగించాలని కేంద్ర విద్యుత్తుశాఖ నిర్దేశించింది. ఈమేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు గురువారం లేఖరాసింది. 'మేకిన్ ఇండియా'కు ప్రాధాన్యం ఇస్తూ సబ్‌స్టేషన్ల ఏర్పాటులో 2028 మార్చి 31 నాటికి 30% వరకు స్థానిక ఉత్పత్తులనే వాడాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత ప్రతి రెండేళ్లకోసారి 10% చొప్పున పెంచుకుంటూ 2035 మార్చి 31 నాటికి స్థానిక వస్తువుల వినియోగాన్ని 60%కి తీసుకెళ్లాలని పేర్కొంది. అన్ని ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ)/టర్న్‌కీ ప్రాజెక్టులకూ ఈ నిబంధన వర్తిస్తుందని కేంద్ర విద్యుత్తుశాఖ తెలిపింది.

అఫిడవిట్ దాఖలుకు అవరోధం ఏమిటి?

- విమాన టికెట్ ధరల నియంత్రణ వ్యాజ్యంపై కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

దిల్లీ: అకస్మాత్తుగా పెరిగే ప్రైవేటు విమానాల టికెట్ ధరలు, వాటి అనుబంధ ఛార్జీలను నియంత్రించడానికి మార్గదర్శకాలు జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్రంపై సుప్రీంకోర్టు మండిపడింది. ఈ అంశంపై గత ఏడాది నవంబరు 17 నుంచి స్పందనను కోరుతున్నా కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయకపోవడంపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. 'అఫిడవిట్ దాఖలుకు కేంద్రాన్ని నిరోధిస్తుంది ఏమిటి' అని ధర్మాసనం గురువారం ప్రశ్నించింది. విమాన టికెట్ ధరల నియంత్రణకు నిబంధనలు రూపొందిస్తున్నామని, మరో మూడు వారాల గడువునివ్వాలని కేంద్రం తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేయగా ధర్మాసనం నిరాకరించింది. ఇప్పటికే మూడుసార్లు సమయం ఇచ్చామని గుర్తు చేస్తూ మే 8వ తేదీ కల్లా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. జాప్యానికి కారణమేమిటో కూడా వివరించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మే 11వ తేదీకి వాయిదా వేసింది.

77ఏళ్ల వృద్ధుడి పింఛను పోరాటంపై సత్వర విచారణ

క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడైన 77 ఏళ్ల వృద్ధుడికి పింఛను మంజూరు, పదవీ విరమణ ప్రయోజనాల అందజేత విషయమై దాఖలైన పిటిషన్‌పై సత్వరమే విచారణ జరపాలని అలహాబాద్ హైకోర్టును గురువారం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. వృద్ధుడి ఇబ్బందులను సానుభూతితో పరిశీలించి వాయిదాలు వేయకుండా వ్యాజ్యాన్ని పరిష్కరించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం సూచించింది. పింఛను, పదవీ విరమణ ప్రయోజనాల కోసం రాంశంకర్ అనే రిటైర్డ్ ఉద్యోగి దాఖలు చేసిన పిటిషన్ 2017 నుంచి హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.



న్యాయవాదికి షోకాజ్ నోటీస్

బార్ అసోసియేషన్లలో మహిళా న్యాయవాదులకు 33శాతం రిజర్వేషన్ల కేటాయింపుపై సామాజిక మాధ్యమంలో అత్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన దిల్లీలోని రోహిణీ జిల్లా కోర్టుల న్యాయవాది వికాస్‌కుమార్ ఝాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసును సమోటోగా నమోదు చేస్తున్నట్లు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం గురువారం వెల్లడించింది. న్యాయవాది లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరిస్తూ షోకాజ్ నోటీస్ జారీ చేసింది.

ఫోరెన్సిక్ పరీక్షకు మణిపుర్ మాజీ సీఎం ఆడియో క్లిప్

మణిపుర్‌లో జాతుల మధ్య వైరం, హింసాత్మక ఘటనలకు సంబంధించి ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో ముడిపడిన ఆడియో క్లిప్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించాల్సిందిగా సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. గుజరాత్‌లోని జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో ఈ పరీక్షలు నిర్వహించాలని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పష్టం చేసింది. దాదాపు 2గంటల నిడివి ఉన్న ఈ ఆడియో క్లిప్‌ను కుకీ తెగకు చెందిన హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ తరఫు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ అందజేశారు.

రెవిన్యూ జ్యుడీషియల్ సర్వీస్‌పై సమాధానం ఇవ్వండి

దేశంలో భూవివాదాల పరిష్కారానికి రెవిన్యూ జ్యుడీషియల్ సర్వీస్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. భూవివాదాలను పరిష్కరించే ప్రభుత్వాధికారులకు ఆయా చట్టాలకు సంబంధించిన కనీస పరిజ్ఞానం ఉండేలా అర్హతలను నిర్దేశించాలని, శిక్షణ ఇవ్వాలని పిటిషనర్, న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ సూచించారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం గురువారం దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, లా కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. సివిల్ వివాదాల్లో 66 శాతం కేసులు భూములకు సంబంధించినవేనని, అధికారులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల అనేక పొరపాట్లు జరుగుతున్నాయని పిటిషనర్ తెలిపారు.

బార్ అసోసియేషన్ నేతలపై చర్యలు తీసుకోండి

గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా కోర్టులో తరచూ న్యాయవాదులు సమ్మెకు దిగడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు విధులకు అడ్డుతగులుతున్న బార్ అసోసియేషన్ నేతలపై జిల్లా జడ్జి నుంచి నివేదిక తెప్పించుకోవాలని అలహాబాద్ హైకోర్టు కమిటీని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం ఆదేశించింది. ఆ నివేదికను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

భారత్‌ది సాంకేతిక ఐటీ.. పాక్‌ది ఉగ్రవాద ఐటీ

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్

దిల్లీ: ఉగ్రవాదం అనేది వికృత, వక్ర మనస్తత్వం నుంచి ఉద్భవిస్తుందని భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని జాతీయ భద్రతా సమస్య మాత్రమే కాదని, మానవత్వపు మూల విలువలను కాపాడటానికి చేసే యుద్ధమని ఆయన అభివర్ణించారు.

"భారత్, పాకిస్థాన్‌లకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. నేడు భారత్.. సమాచార సాంకేతిక రంగం(ఐటీ)కి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతుంటే, పాక్ మాత్రం ఇంటర్నేషనల్ టెర్రరిజం (ఐటీ) అనే మరో రకం ఐటీకి కేంద్రబిందువుగా మారింది" అని రాజ్‌నాథ్ ఎద్దేవాచేశారు.

ఉగ్రవాదం సైద్ధాంతిక, రాజకీయ మూలాలను కూకటివేళ్లతో పెకిలించేయాలని దిల్లీలో జరుగుతున్న ఏఎన్ఐ జాతీయ భద్రతా సదస్సు 2.0లో ఆయన గురువారం పిలుపునిచ్చారు. "భారత్ గడ్డపై ఉగ్రదాడులు జరిగినప్పుడు కేవలం దౌత్యపరమైన ప్రకటనలు జారీచేసే పాత ఆలోచనా విధానానికి దేశం ఇకపై కట్టుబడి ఉండదని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపాం. ప్రధాని మోదీ నాయకత్వంలో ఎలాంటి పరిస్థితులలోనైనా ఉగ్రవాద కార్యకలాపాలను భారత్ సహించబోదు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సాయుధ దళాలు తమ సామర్థ్యాలను విస్తరించుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో కచ్చితమైన లక్ష్యాలను టార్గెట్ చేశాం. మా సామర్థ్యాలు తగ్గిపోయినందుకు కాదు. స్వచ్ఛందంగానే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపేశాం. అవసరమైతే పాక్‌తో మేం సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం. అంతేకాకుండా, ఆకస్మిక అవసరాల సమయంలో మా సామర్థ్యాలను విస్తరించే శక్తి మాకుంది" అని ఆయన అన్నారు. మరోవైపు, కృత్రిమమేధ (ఏఐ) తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అనేక రంగాలను ప్రభావితం చేయగలదని, డీప్‌ఫేక్‌లు, సైబర్ యుద్ధం, స్వయంప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థలు రక్షణ రంగానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయంటూ, ఏఐ వినియోగాన్ని పౌరాణిక రాక్షసుడైన భస్మాసురుడితో రాజ్‌నాథ్ పోల్చారు.

ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయానికి 'రేడియో యాక్టివ్' బెదిరింపులు

నాగ్‌పుర్: మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం, భాజపా ఆఫీసుతో పాటు కీలక ప్రదేశాల్లో రేడియో యాక్టివ్ పదార్థాలను అమర్చినట్లు బెదిరింపు లేఖ అందిందని పోలీసులు తెలిపారు. ఏప్రిల్ 27న గుర్తు తెలియని వ్యక్తులు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి ఈ లేఖను పంపారని, దీంతో నాగ్‌పుర్‌లో భద్రతను పెంచి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదన్నారు.

మధ్యప్రదేశ్‌లో పడవ బోల్తా

ఏడుగురి మృతి

జబల్‌పుర్: మధ్యప్రదేశ్‌లో పడవ బోల్తాపడి ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురు గల్లంతయ్యారు. మొత్తం 15 మందిని రక్షించారు. జబల్‌పుర్ జిల్లాలో నర్మదా నదిపై ఉన్న బర్గీ డ్యాం జలాశయంలో 29మంది పర్యాటకులతో వెళ్తున్న పడవ తుపాను కారణంగా బోల్తా పడిందని అధికారులు తెలిపారు.

లద్దాఖ్ ప్రజల గొంతును నొక్కుతున్నారు: రాహుల్

దిల్లీ: లద్దాఖ్ ప్రజల గొంతు నొక్కి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని, వారి భూమిని, పర్యావరణాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తన బిలియనీర్ మిత్రులకు అప్పగిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. లద్దాఖ్ చెందిన కొందరు యువకులతో సంభాషించిన వీడియోను 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. 'లద్దాఖ్ ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదు. స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధిని కోరుకుంటున్నారు. పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి ఈ వాస్తవాన్ని తెలుసుకోవాలని ఆశిస్తున్నా' అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్‌గా కె.సి.వేణుగోపాల్

దిల్లీ: పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్‌గా కాంగ్రెస్ నేత కె.సి.వేణుగోపాల్ మరోసారి నియమితులయ్యారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా భారతీయ జనతా పార్టీ నేత ఫగ్గాన్ సింగ్, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా సంజయ్ జైస్వాల్‌లను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నియమించారు. ఈ నియామకాలు 2026 మే 1 నుంచి 2027 ఏప్రిల్ 30 వరకు అమలులో ఉంటాయని అధికారికంగా ప్రకటించారు.

భారత్‌లో పప్పుధాన్యాల విప్లవం రావాలి

- 2030లోపు వందశాతం స్వదేశీ ఉత్పత్తి లక్ష్యం
- ఇక్రిశాట్ అధ్యయన నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో పప్పుధాన్యాల విప్లవం రావాల్సిన అవశ్యకత ఉందని, దేశం దిగుమతుల నుంచి ఎగుమతుల వైపు పురోగమించాలని హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్) సూచించింది. వంద శాతం స్వదేశీ పప్పుధాన్యాల ఉత్పత్తి లక్ష్యాన్ని 2030లోగా సాధించే దిశగా అడుగులు వేయాలంది. విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ దిగుబడిపై అనిశ్చితి, ధరల అస్థిరత, సరైన సేకరణ విధానం లేకపోవడంతో సాగుకు రైతులు వెనుకాడుతున్నారని తెలిపింది. ఉత్పాదకత పెంపు, పంట మార్పిడి, కేంద్ర ప్రభుత్వ ఆత్మనిర్భరత్ భారత్ క్రాప్స్, ఇక్రిశాట్ నూతన పరిశోధన ఫలితాల అమలు వంటివి లక్ష్య సాధనకు ఉపకరిస్తాయని పేర్కొంది. దేశంలో పప్పుధాన్యాల స్థితిగతులపై ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ అధ్యయన నివేదికను గురువారం విడుదల చేసింది. అందులోని ముఖ్యాంశాలు..



- దేశంలో ఏటా 25 మిలియన్ టన్నుల పప్పుధాన్యాలు ఉత్పత్తి అవుతుండగా 5 నుంచి 6 మిలియన్ టన్నులు దిగుమతి చేసుకుంటున్నాం. వీటి కోసం రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ప్రధానంగా కంది, మినుము, పెసర వంటి పప్పులు అమెరికా, మయన్మార్, ఆస్ట్రేలియా, కెనడా, ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి.
- భారత్‌లో 44 మిలియన్ హెక్టార్లలో వరిని సాగు చేస్తున్నాం. ఇందులో 6-7 మిలియన్ హెక్టార్ల మెట్ట భూములు ఉన్నాయి. ఈ ప్రాంతాలు పప్పుధాన్యాల సాగుకు అనువైనవి. ఒక ఎకరం వరి పంటకు వినియోగించే నీటితో ఐదు ఎకరాల కంది పంటను పండించవచ్చు. పప్పుధాన్యాలు వాతావరణంలోని నత్రజనిని గ్రహించి భూమిలో స్థిరీకరిస్తాయి. తద్వారా నేల సారం తగ్గకుండా ఉంటుంది.
- 2030-31 నాటికి దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తిని 350 లక్షల టన్నులకు, సాగు విస్తీర్ణాన్ని 310 లక్షల హెక్టార్లకు పెంచడాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. గత అక్టోబరు 11న ఆరు సంవత్సరాల కాలపరిమితితో.. రూ.11,440 కోట్లతో పప్పుధాన్యాల ఆత్మనిర్భరత్ భారత్ క్రాప్స్‌ను ప్రారంభించింది. దీనిలో భాగంగా కంది, మినుము, పెసర రకాలను నాలుగు సంవత్సరాల పాటు 100 శాతం కనీస మద్దతు ధరకు సేకరిస్తారు. రెండు కోట్ల మంది రైతులకు 88 లక్షల ఉచిత విత్తన కిట్లు, 126 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తారు.
- దేశంలో పప్పుధాన్యాల సాగు లక్ష్యాలు నెరవేరాలంటే ఉత్పాదకత హెక్టారుకు 1.4 లేదా 1.5 టన్నులకు పెరగాలి. దీనికి అనుగుణంగా ఇక్రిశాట్ ఇతర భారతీయ పరిశోధన సంస్థలతో కలిసి పని చేస్తూ, కొత్త కంది వంగడాలను అభివృద్ధి చేసింది. ఐసీపీ 25444 రకం 120-125 రోజుల్లోనే హెక్టారుకు 2.5 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.



పెట్టుబడులు పెడుతూనే ఉండాలి

స్టాక్ మార్కెట్‌లో పరిస్థితులు చక్కబడతాయి..లేదా కుప్పకూలిపోతాయి..అప్పటి వరకూ వేచి చూద్దాం అని కూర్చుంటే అవకాశాలు చేజారిపోతాయి. చరిత్రలో యుద్ధాలు, మహమ్మారులు, ఉపద్రవాలు వస్తుంటాయి..పోతుంటాయి. సమయానుకూలంగా మార్కెట్‌లో పెట్టుబడి కొనసాగిస్తూ ఉండటమే ఉత్తమం.

– బ్రెన్నాన్ ష్లాగ్‌బామ్, రచయిత

నివేదిక ఇచ్చేందుకు సిట్‌కు మరో రెండు నెలల గడువు

- గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు ఉత్తర్వులు
- విచారణ జూన్ 29కి వాయిదా

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై దర్యాప్తు పూర్తిచేసి నివేదిక ఇచ్చేందుకు సిట్‌కు హైకోర్టు మరో రెండు నెలల గడువు ఇచ్చింది. మరోసారి సమయాన్ని పొడిగించబోమని తేల్చిచెప్పింది. సిట్ అధిపతి సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, సిట్ సభ్యులను కోర్టుకు పిలిపించి ధర్మాసనం వారితో నేరుగా మాట్లాడింది. వారు చెప్పిన కారణాలతో సంతృప్తి చెంది మరో 2 నెలల సమయం ఇస్తున్నామని పేర్కొంది. విచారణను జూన్ 29కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

- మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. గురువారం విచారణలో సిట్ నివేదిక దాఖలు చేయాల్సి ఉంది. సిట్ తరఫున పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ దర్యాప్తు పురోగతిపై వివరాలను కోర్టు ముందు ఉంచామని, తుది నివేదిక వేసేందుకు మరో రెండు నెలల సమయం కావాలన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. దర్యాప్తులో వెలుగు చూసిన విషయాలను గోప్యంగా ఉంచకుండా మరికొంత సమయం కోరుతూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌కు జత చేస్తూ కోర్టు ముందు ఏవిధంగా ఉంచుతారని ప్రశ్నించింది. ఇలాగేనా దర్యాప్తు చేసేది అని మండిపడింది. ఎవరికో సహాయం చేయడం కోసం దర్యాప్తులో పురోగతి వివరాలను కోర్టు ముందు ఉంచారని వ్యాఖ్యానించింది. సిట్ అధిపతి, సభ్యులతో నేరుగా మాట్లాడతామని వారిని కోర్టుకు వచ్చేలా సూచించాలని పీపీని కోరి తాత్కాలికంగా వాయిదా వేసింది. దీంతో సిట్ అధిపతి, సభ్యులు కోర్టుకు హాజరయ్యారు. మధ్యాహ్నభోజన విరామం తర్వాత వారితో ధర్మాసనం నేరుగా మాట్లాడింది. వారు ఇచ్చిన వివరణతో నివేదిక దాఖలు చేసేందుకు మరో రెండు నెలలు పొడిగిస్తున్నట్లు పేర్కొంది.

యూజీసీ-నెట్ పరీక్షకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ షురూ

దిల్లీ: యూజీసీ-నెట్ పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ ఏడాది జూన్ 22-30 మధ్య 85 సబ్జెక్టుల్లో కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ పరీక్షను నిర్వహిస్తారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తరఫున నిర్వహించే ఈ పరీక్ష ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు, పీహెచ్‌డీప్రవేశాలకుఅర్హులనుఎంపికచేస్తారు. ttps://ugcnet.nta.nic.in/ , www.nta.ac.in వెబ్‌సైట్లలో ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలి. ఏప్రిల్ 29 నుంచి మే నెల 20వ తేదీ రాత్రి 11.50 లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మే 22-24 మధ్య దరఖాస్తుల్లో సవరణలు చేసుకోవచ్చు. జూన్ 15 కల్లా అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటాయి.

నేషనల్ ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో 4.7 కోట్లమంది విద్యార్థుల నమోదు

ఈనాడు, దిల్లీ: వృత్తి విద్యా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో ఇప్పటివరకూ 4.7 కోట్ల మంది విద్యార్థులు నమోదైనట్లు ఏఐసీటీఈ గురువారం తెలిపింది. ఇందులో 2.9 కోట్లమందిని ధ్రువీకరించినట్లు పేర్కొంది. ఇప్పటివరకు 79,57,193 మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించగా, అందులో 32,78,900 మంది పూర్తిచేసినట్లు వెల్లడించింది. ఇందులో దేశవ్యాప్తంగా 81,483 కంపెనీలు, 12,077 కాలేజీలు పాలుపంచుకున్నట్లు తెలిపింది. ఈ పోర్టల్ ద్వారా సాంకేతిక, వృత్తినైపుణ్యపరమైన అంశాలతోపాటు ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో సుమారు 200 ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నట్లు ఏఐసీటీఈ పేర్కొంది. ఈ పోర్టల్ ద్వారా పేరు నమోదుచేసుకున్న విద్యార్థులకు మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబీఎం, సిస్కో, సర్వీస్‌నౌ, సేల్స్‌ఫోర్స్‌లాంటి ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థలతోపాటు సీడాక్, ఎన్‌హెచ్ఏఐ, ఇండియన్ ఆర్మీ, ఎన్‌సీటీఈ లాంటి ప్రభుత్వరంగ సంస్థలు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపింది.

అగ్ని-6 ప్రాజెక్టుకు మేం సిద్ధం!

- ప్రభుత్వానిదే తుది నిర్ణయం
- డీఆర్‌డీవో వెల్లడి

దిల్లీ: ఆధునాతన ఖండాంతర క్షిపణి 'అగ్ని-6'పై కసరత్తు ప్రారంభించడానికి తాము సిద్ధమని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అధిపతి సమీర్ కామత్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే దీనిపై పని మొదలుపెడతామని చెప్పారు. ప్రస్తుతం భారత అమ్ములపొదిలో ఉన్న అగ్ని శ్రేణి క్షిపణులన్నింటి కన్నా ప్రతిపాదిత అగ్ని-6 పరిధి, సామర్థ్యం ఎక్కువగా ఉంటాయి. దేశ వ్యూహాత్మక రక్షణ సత్తాలో ఈ అస్త్రం పెద్ద ముందడుగు అవుతుంది. హైపర్‌సోనిక్ ఆయుధ కార్యక్రమంలోనూ భారత్ పురోగతి సాధిస్తున్నట్లు కామత్ తెలిపారు. దీర్ఘశ్రేణి నౌకా విధ్వంసక క్షిపణి (ఎల్‌ఆర్-ఏఎస్‌హెచ్‌ఎం) హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ ప్రాజెక్టు తుది దశకు చేరుకుందని చెప్పారు. సమీప భవిష్యత్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. భారత్ ఏకకాలంలో హైపర్‌సోనిక్ గ్లైడ్, హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేస్తోందన్నారు. స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్'ను దేశ అమ్ములపొదిలో చేరేందుకు సిద్ధమైందన్నారు. గురువారం దిల్లీలో జరిగిన జాతీయ భద్రతా సదస్సు 2.0లో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు.

సంజయ్ కపూర్ ఆస్తులను సంరక్షించండి

దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: నటి కరిష్మా కపూర్ మాజీ భర్త, దివంగత పారిశ్రామికవేత్త సంజయ్ కపూర్ ఆస్తులను సంరక్షించాలని దిల్లీ హైకోర్టు గురువారం ఆదేశించింది. సంజయ్ కపూర్, కరిష్మాల సంతానం లేవనెత్తిన అన్ని అనుమానాలను సంజయ్ మూడో భార్య ప్రియా కపూర్ పూర్తిగా నివృత్తి చేసిన తర్వాతే ఆయన చివరి వీలునామా చెల్లుబాటు అవుతుందని కోర్టు స్పష్టం చేసింది. సుమారు రూ.30,000 కోట్ల విలువైన తమ తండ్రి ఆస్తులను విక్రయించకుండా ప్రియా కపూర్‌ను అడ్డుకోవాలని కోరుతూ కరిష్మా వారసులు దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తుపై జస్టిస్ జ్యోతి సింగ్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రభుత్వ సిఫార్సు బదిలీలు ఉపసంహరించుకోవాలి: ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్-2025 ప్రకారం ఉపాధ్యాయులను 26 జిల్లాలకు సర్దుబాటు చేయకముందే ప్రభుత్వం సిఫార్సు బదిలీలు చేయడం ఆందోళన కలిగిస్తోందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య(ఏపీటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, బసవలింగారావు కోరారు. 'కౌన్సెలింగ్ విధానానికి విరుద్ధంగా ఒక్క ఉపాధ్యాయుడినీ సిఫార్సు బదిలీల ద్వారా నియమించబోమని ప్రకటించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అధికారులు మాట తప్పి నేరుగా బదిలీలు చేస్తున్నారు. దీంతో పలుకుబడి లేని సాధారణ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఈ విధానం మానుకోకపోతే ఆందోళన చేపట్టక తప్పదు. కౌన్సెలింగ్ విధానం ద్వారా మాత్రమే బదిలీలు చేయాలి' అని కోరారు.

సంస్కరణలు చంద్రబాబు డీఎన్ఏలోనే ఉన్నాయి: పయ్యావుల

ఈనాడు, అమరావతి: సంస్కరణలనేవి చంద్రబాబు డీఎన్ఏలోనే ఉన్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఇటీవల బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు అందుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి గురువారం మంత్రులు, సీఎస్, డీజీపీ, కార్యదర్శులు, హెచ్‌వోడీలకు ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'విద్యుత్తు, ఓపెన్ స్కైపాలసీ, టెలికాం, ఐటీ, డ్రిప్ ఇరిగేషన్, పీపీపీ వంటి రంగాల్లో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు' అని పేర్కొన్నారు.

చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారు: టీజీ భరత్

పెట్టుబడులు రాబట్టే విషయంలో సీఎం చంద్రబాబు మమ్మల్ని పరుగులు పెట్టిస్తున్నారు. పరిశ్రమలు గ్రౌండింగ్ చేసేంత వరకు విశ్రమించొద్దని పదే పదే గుర్తు చేస్తుంటారు.

పట్టిసీమతో రూ.50వేల కోట్ల సంపద: నిమ్మల రామానాయుడు

పట్టిసీమను ఒట్టిసీమ అని విమర్శలు చేసిన వారికి...అదే పట్టిసీమతో రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించి చంద్రబాబు తన సత్తా చూపించారు. ఆయన నేతృత్వంలో రికార్డుస్థాయిలో హంద్రీ-నీవా జలాలను రాయలసీమకు తీసుకెళ్లాం.

ఏమడుగుతారోనని తరగతులకు అటెండయ్యా: సత్యకుమార్

వివిధ అంశాలపై అధ్యయనానికి సింగపూర్‌కు వెళ్లినప్పుడు..తిరిగొచ్చాక చంద్రబాబు ఏం అడుగుతారోననే భయంతో ఏడు రోజులపాటు తరగతులకు అటెండయ్యా. చదువుకునే రోజుల్లో కూడా నేను ఇంత శ్రద్ధ పెట్టలేదు. సింగపూర్ పర్యటనలో మాత్రం సీరియస్‌గా తరగతులకు హాజరయ్యా.

శ్రీవారి లడ్డూ రుచి అద్భుతం

- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ అభివర్ణన
- ఎక్స్‌లో వెల్లడించిన తితిదే ఛైర్మన్

తిరుమల, న్యూస్‌టుడే: ఇటీవల తిరుమలకు విచ్చేసిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శ్రీవారి లడ్డూ ప్రసాదం రుచి అద్భుతంగా ఉందని పేర్కొన్నారని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఎక్స్‌లో వెల్లడించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి శ్రీవారి లడ్డూలను ఉపరాష్ట్రపతి ఆస్వాదించారని, ఈ సందర్భంగా తన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారని చెప్పారు. భక్తులను మెప్పించేలా అత్యుత్తమ నాణ్యతతో లడ్డూలను తయారుచేస్తున్న తితిదే అధికారులను ప్రశంసించినట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతి తన అనుభూతులను పంచుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తితిదే ఛైర్మన్ ఎక్స్‌లో పేర్కొన్నారు.



ఇటీవల తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్. చిత్రంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, బీఆర్ నాయుడు

శ్రీశ్రీకి చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: కవిత్వాన్ని, కార్మిక, కర్షక, శ్రామికవర్గాల స్వరంగా మలిచిన ప్రజాకవి శ్రీశ్రీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా గురువారం నివాళి అర్పించారు. 'సమసమాజ నిర్మాణంలో కవులు, కళాకారులు కీలకపాత్ర పోషించాలని, దోపిడీ వ్యవస్థల్ని ధైర్యంగా ప్రశ్నించాలని శ్రీశ్రీ సూచించారు. మానవుడే నా మతం అనే భావజాలాన్ని ప్రతిపాదించారు. ఆ మహానుభావుడి స్ఫూర్తిని స్మరించుకుందాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

జీఎన్ నాయుడి మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటు: సీఎం

ఈనాడు, అమరావతి: ప్రముఖ పారిశ్రామికవేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జీఎన్ నాయుడు ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్పించారని 'ఎక్స్' వేదికగా గురువారం పేర్కొన్నారు.

అనుత్తీర్ణులైన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా

ఈనాడు, అమరావతి: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించనున్నామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఫలితాల విడుదల అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. "ప్రభుత్వ పాఠశాలల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక తరగతులు నిర్వహించాలా.. ఆన్‌లైన్‌లో వీడియోలు పంపించాలా.. అనే దానిపై ఆలోచిస్తున్నాం" అని వెల్లడించారు.

ఇంటర్మీడియట్‌లో ఫలితాలు తగ్గిన కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో తక్కువ ఉత్తీర్ణత నమోదైన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఈ నెల 5న ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఫలితాల మెరుగుకు తీసుకునే చర్యలతో కూడిన సమగ్ర నివేదికలతో సమావేశానికి రావాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, పర్యవేక్షణ బలోపేతానికి తీసుకునే చర్యలను ఈ సమావేశంలో వివరించాలని సూచించారు. జిల్లాల వారీగా 50% లోపు ఫలితాలు వచ్చిన కళాశాలల వివరాలను ఆయా కళాశాలలకు పంపించారు.

నకిలీ మార్కుల జాబితాలు, వెబ్‌సైట్

పోలీసులకు ఫిర్యాదు చేసిన పాఠశాల విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల వెల్లడి సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ మార్కుల జాబితాలతో కొందరు గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారు. ఏపీ పదో తరగతి ఫలితాల మార్కుల జాబితాలపై తెలంగాణ ప్రభుత్వ లోగో పెట్టి తప్పుడు ప్రచారం చేశారు. ఇవి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి రావడంతో ఆమె వాటిని నకిలీవని నిర్ధారించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులు, మంత్రుల ఫొటోలున్న మరో నకిలీ వెబ్‌సైట్ లింకును సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. అందులో కనిపిస్తున్న అధికారులు, నాయకులు ఏపీ వారు కాగా.. వెబ్ పోర్టల్‌పై మాత్రం తెలంగాణ లోగో ఉంది. వీటిపై పాఠశాల విద్యాశాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏపీఏడీసీఎల్‌కు రూ.48 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ(ఏపీఏడీసీఎల్)కు రూ.48.35 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మొత్తాన్ని 2026-27 బడ్జెట్ కేటాయింపుల నుంచి ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తంలో వయబులిటీ గ్యాప్ ఫండ్(వీజీఎఫ్) చెల్లించేందుకు రూ.15 కోట్లు, ఏపీఏడీసీఎల్ తీసుకున్న రుణాలు చెల్లించేందుకు రూ.33 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.34.63 లక్షలు వినియోగించేందుకు అనుమతించింది.

అరకు కాఫీ అవుట్‌లెట్ల ఏర్పాటుకు అవగాహన ఒప్పందం

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఫ్రాంఛైజీ విధానంలో అరకు కాఫీ దుకాణాల ఏర్పాటుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), నేటివ్ అరకు కాఫీ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మెప్మా ఎండీ వాకాటి కరుణ, నేటివ్ కాఫీ ప్రతినిధులు అవగాహనపత్రాలు మార్చుకున్నారు. ప్రయోగాత్మకంగా మహిళల ఆధ్వర్యంలో వంద అవుట్‌లెట్లు ఏర్పాటు చేయనున్నారు.

ఈ-మొబిలిటీ సిటీలుగా 5 నగరాలు

- ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రభుత్వ దృష్టి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు, ఇందుకు సంబంధించిన మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ(4.0) 2024-29ని ప్రకటించింది. ఇందులో ప్రధానంగా ఐదు నగరాలను మోడల్ ఈ-మొబిలిటీ సిటీలుగా గుర్తించింది. వీటిలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, తిరుపతి ఉన్నాయి. సంబంధిత నగరపాలక సంస్థలు ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల్ని అభివృద్ధి చేయనున్నాయి. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్లను ఆదేశిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విచారణ అధికారి మార్పు

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు గంగాభవానితో పాటు మరో ఏడుగురు అధికారులు, సిబ్బందిపై మోపిన అభియోగాల్లో విచారణ అధికారిని మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జేడీ గంగాభవాని గుంటూరు జిల్లా డీఈవోగా పనిచేసినప్పుడు ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం, నిబంధనల ఉల్లంఘనపై శాఖాపరమైన విచారణ కొనసాగుతోంది. విచారణ అధికారిగా మొదట పాఠ్యపుస్తకాల ముద్రణ విభాగం డైరెక్టర్ మధుసూదన్‌ను ప్రభుత్వం నియమించగా.. తనకు ఈ విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరడంతో ఆయన్ని ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో సమగ్రశిక్షా అభియాన్ ఏపీడీ ప్రసన్నకుమార్‌ను నియమించింది. 2 వారాల్లో నివేదిక సమర్పించాలని సూచించింది.

ప్రపంచ టాప్ వర్సిటీలతో భాగస్వాములవ్వండి

- మన వర్సిటీలు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలి
- పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలి
- యువతలో నైపుణ్యాలు గుర్తించేందుకు ఆడిట్ చేయాలి
- విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



విద్యాశాఖపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: ప్రపంచంలోని టాప్-200 వర్సిటీలతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆధునిక కోర్సులు, నైపుణ్య రంగాలు, స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్, తదితర అంశాల్లో సహకారానికి ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వర్సిటీలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా పురోగమించాలని అన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా కోర్సులు రూపొందించాలన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖలపై గురువారం నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. "విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీలాంటి రంగాల్లోనూ కొత్త కోర్సులు రావాలి. ప్రతి వర్సిటీ ఏదో ఒక పరిశ్రమతో అనుసంధానం కావాలి. జర్మనీ సహా విదేశీ భాషల్లో శిక్షణ కోసం ఒక విభాగం ఏర్పాటు చేయాలి. ఆరోగ్యం, టెక్నాలజీతో పాటు ఉత్తమ విధానాలు నేర్పించేలా పాఠ్యాంశాలు ఉండాలి. ఐఐటీ మద్రాస్ సహా వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి సూచనలు తీసుకుని విద్యాశాఖలో అమలు చేయాలి. వర్సిటీల రికార్డులను ఆన్‌లైన్ చేయాలి. వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థలు రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఏవియేషన్, ఉద్యాన వర్సిటీలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి" అని తెలిపారు.

పీ4తో మౌలిక సదుపాయాలు కల్పించాలి

"విద్యార్థులకు అన్ని రకాల పోషకాలు అందేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలి. లీప్ యాప్ ద్వారా విద్యార్థుల హాజరును తల్లిదండ్రులు తెలుసుకునేలా సదుపాయం కల్పించాలి. పీ4లాంటి కార్యక్రమాలను అనుసంధానం చేసుకుని మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు కొత్త ఆలోచనలు వచ్చేలా వారితో 'స్టూడెంట్స్ ఇన్నొవేషన్ కాంక్లేవ్' పేరుతో ఏఐ సదస్సు నిర్వహించాలి. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో అధ్యయనం చేయాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.

స్కిల్ గ్యాప్ సలహాదారులను నియమించుకోవాలి

"యువతలో నైపుణ్యాలను గుర్తించేందుకు ప్రయోగాత్మకంగా నైపుణ్య ఆడిట్ నిర్వహించాలి. ప్రపంచ స్థాయి నైపుణ్యాలు యువతకు అందేలా చూడాలి. నైపుణ్యాలపై సూచనలు చేసేందుకు స్కిల్ గ్యాప్ సలహాదారులను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలల ద్వారా ఇంధన, లాజిస్టిక్స్, క్వాంటమ్, ఏఐ లాంటి రంగాల్లో నైపుణ్యాలు పెరగాలి. జిల్లాల వారీగా నైపుణ్య మ్యాప్ తయారు చేయడం ద్వారా ఏ ప్రాంతంలో ఎంతమంది నిపుణులున్నారో తెలుస్తుంది. గడిచిన 22 నెలల్లో 7లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. వివిధ శాఖల ద్వారా కల్పించిన ఉద్యోగ, ఉపాధి వివరాలను నైపుణ్యం పోర్టల్ ద్వారా వెల్లడించాలి" అని సీఎం ఆదేశించారు. క్వాంటమ్ టెక్నాలజీపై రాష్ట్రంలో మొట్టమొదటిగా కోర్సును ప్రారంభించిన ఆంధ్ర వర్సిటీని సీఎం అభినందించారు.

'టీచర్-విద్యార్థి-ఫలితం' విధానంతో విప్లవాత్మక మార్పులు: లోకేశ్

రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను తీర్చిదిద్దుతున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సమీక్షలో భాగంగా విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణలను ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. "తరగతికో టీచర్ పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టాం. పాఠశాలల్లో ప్రవేశాలు పెంచుతున్నాం. 'టీచర్-విద్యార్థి-ఫలితం' అనే విధానంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంపైనా దృష్టిసారించాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమయం పెంచి, పోటీపరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. నైపుణ్యాభివృద్ధి కల్పనలో భాగంగా అందరికీ నైపుణ్య మదింపు చేస్తున్నాం" అని మంత్రి చెప్పారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మందుల వినియోగంపై పునఃపరిశీలన

- వైద్యారోగ్య శాఖ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్



అధికారులతో సమీక్షిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వాసుపత్రులకు మందులను సరఫరా చేసే వ్యవస్థలో సమూల మార్పులు తెస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సచివాలయంలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసీ అధికారులతో మందుల లభ్యత, ఇతర అంశాలపై గురువారం సమీక్షించారు. ఔషధాల కొనుగోలు నుంచి రోగులకు అందించే వరకు వివిధ స్థాయిల్లో ప్రక్రియలను ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పునఃసమీక్షించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రులకు అందిస్తున్న మందులు, మార్కెట్లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చిన కాంబినేషన్ మందుల వాడకంపైనా సమీక్షిస్తామన్నారు. అవసరం లేనివాటిని జాబితా నుంచి తొలగించి, అవసరమైనవి చేరుస్తామన్నారు. ఇందుకు నిపుణుల సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు అవసరమైన మందులు డీఎంహెచ్‌వో కార్యాలయాల నుంచి కాకుండా సెంట్రల్ డ్రగ్‌స్టోర్ నుంచి నేరుగా ఆసుపత్రులకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యులు రాసే మందులపైనా ఆడిటింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తెలిపారు. 712 రకాల్లో 176 రకాల తక్కువ వినియోగం ఉన్న మందులను సరఫరా చేసేందుకు సంస్థలు ముందుకు రావడంలేదని డ్రగ్స్ విభాగం అధికారులు తెలిపారు. సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని.. ఉద్యోగం పొందిన ప్రతి ఒక్కరి వివరాలను పోర్టల్‌లో నమోదుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. సచివాయంలో ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్‌పై మంత్రుల బృందం గురువారం సమీక్షించింది. సీఎస్ మాట్లాడుతూ.. 'పోర్టల్‌లో నమోదుచేసే ఉద్యోగుల వివరాలు పారదర్శకంగా ఉండాలి. ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. భారీ, మధ్యతరహా, చిన్న పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల ఏర్పాటు, వాటి ద్వారా కల్పించిన ఉద్యోగాల వివరాలు పక్కాగా ఉండాలి' అని అన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రుల బృందం పిలుపునిచ్చింది. మంత్రులు కందుల దుర్గేష్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ సమీక్షలో పాల్గొన్నారు.

చేసిన పనే మళ్లీ మళ్లీ!

- ఆర్థిక శాఖలో కొత్త పోకడ
- ఆలస్య నివారణ అంటూ అధికారాల కేంద్రీకరణ
- కార్యదర్శి నిర్ణయానికి మళ్లీ సెక్షన్‌లో మూల్యాంకనా?
- 20 సెక్షన్లు చేసిన పని మళ్లీ 2 సెక్షన్లకు!

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆర్థికశాఖలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనపు బడ్జెట్ విడుదలకు కొత్త విధానం తీసుకొచ్చారు. దీనికి గత ఆర్థిక సంవత్సరంలోనే ఉత్తర్వులిచ్చినా ఈ అంశంపై విమర్శలు రావడంతో పాటు ఆర్థిక శాఖలోని 20 పర్యవేక్షక సెక్షన్లు అసంతృప్తి వ్యక్తం చేయడంతో కొంత కాలం ఆపారు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో మళ్లీ ఆ ఉత్తర్వుల అమలుకు ఆర్థికశాఖ అడుగులు వేసింది. ఆలస్య నివారణ పేరుతో కొత్త విధానం తెచ్చి, చేసిన పనే మళ్లీ చేసేలా మార్పులు చేశారు. ఒక కార్యదర్శి స్థాయిలో నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నిర్ణయాన్ని ఏఎస్‌వో, ఎస్‌వో స్థాయిలో బడ్జెట్ సెక్షన్ పరిశీలించడం కొత్త విధానంలో ప్రశ్నార్థకమవుతోంది. ఆర్థిక సంఘం గ్రాంట్లు, వడ్డీల చెల్లింపులు తదితర అంశాల్లో నిధుల విడుదలలో ఆలస్యం నివారించేందుకే ఈ విధానాలు మారుస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్న ఆర్థికశాఖ... వాస్తవానికి మరింత ఆలస్యమయ్యే ప్రక్రియ చేపడుతోంది.

తొలి నెలలోనే రూ.671 కోట్ల అదనపు బడ్జెట్!

బడ్జెట్ తయారీ ఎంతో కీలకమైన బాధ్యత. ఇందులో ఆర్థికశాఖలోని అన్ని విభాగాలనూ వినియోగించుకుని సరైన ప్రక్రియలో చేపట్టాలి. అలాంటిది వారి భాగస్వామ్యం లేకుండానే కేవలం కొందరు 'నిపుణుల' పేరుతో బడ్జెట్ తయారీ పూర్తిచేస్తున్నారు. వాస్తవ పరిస్థితులకు, బడ్జెట్ రూపకల్పనకు మధ్య సంబంధం ఉండట్లేదు. కిందటి ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.3.23 లక్షల కోట్ల వ్యయ అంచనాలతో బడ్జెట్ రూపొందించారు. ఇది కాకుండా మరో రూ.50 వేల కోట్ల మేర అదనపు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర రాబడి సుమారు రూ.1.80 లక్షల కోట్లు, రుణాలు పరిగణనలోకి తీసుకున్నా మరో రూ.80 వేల కోట్ల వరకు అవకాశం ఉంది. వాస్తవ పరిస్థితికి, బడ్జెట్ అంచనాలకు మధ్య ఇంత వ్యత్యాసం ఏటా సాధారణమవుతోంది. రెవెన్యూ లోటు పెరిగిపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 29 రోజుల్లోనే 9 అదనపు బడ్జెట్ ఉత్తర్వులిచ్చారు. రూ.671 కోట్ల మేర అదనపు బడ్జెట్ ఇప్పటికే విడుదల చేయాల్సి వచ్చింది. ఇది బడ్జెట్ తయారీ ప్రక్రియ ఎలా ఉందో చెప్పేందుకు అద్దం పడుతోంది.

రెండుసార్లు మూల్యాంకన ఎందుకు? ఇద్దరు కార్యదర్శులకు ఎందుకు?

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన దాదాపు 187 మంది విభాగాధిపతులు, 33 మంది కార్యదర్శుల నుంచి ఆర్థికశాఖకు బడ్జెట్ అంశాలపై ప్రతిపాదనలు అందుతాయి. వీటిని 20 ఫైనాన్స్ మానిటరింగ్ సెక్షన్లు పరిశీలిస్తాయి. ఒకో సెక్షన్ ఐదారు ప్రభుత్వ విభాగాల అంశాలు పర్యవేక్షిస్తుంది. ఈ సెక్షన్లను ఇద్దరు కార్యదర్శులు పర్యవేక్షిస్తారు. ఆయా కార్యదర్శుల అభిప్రాయంతో లేదా నిర్ణయంతో వెళ్లిన ఫైలును ముఖ్యకార్యదర్శి పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటే తిరిగి బడ్జెట్ సెక్షన్ వస్తుంది. అదనపు బడ్జెట్ డాక్యుమెంట్ వారు సిద్ధం చేసి తిరిగి ఎఫ్ఎంయూకు పంపిస్తారు. వారు ఉత్తర్వులిస్తారు. ఇంతవరకు ఇదే పద్ధతి అమలయ్యేది.

◆ తాజా మార్పులో ఎఫ్ఎంయూ సెక్షన్ నుంచి కార్యదర్శి వద్ద నిర్ణయం తీసుకున్నాక మళ్లీ బడ్జెట్ సెక్షన్‌కు ఫైలు వెళ్లాలి. అక్కడ రెండే విభాగాలు ఉంటాయి. వారు మళ్లీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ స్థాయిలో పరిశీలించి మళ్లీ బడ్జెట్ కార్యదర్శికి పంపుతారు. ఒక కార్యదర్శి పరిశీలించి నిర్ణయం తీసుకున్నాక మళ్లీ ఆ నిర్ణయాన్ని ఏఎస్ఓ, ఎస్ఓ స్థాయిలో పరిశీలించడమేంటన్నది ప్రశ్న. ఒకసారి మూల్యాంకనతో నిర్ణయం తీసుకున్న తర్వాత బడ్జెట్ సెక్షన్ మదింపు చేయడం ఎందుకు అన్నది మరో వివాదం. 20 సెక్షన్లు, ఒక కార్యదర్శి పరిశీలించి నిర్ణయం తీసుకున్న ఫైళ్లన్నీ మళ్లీ రెండు సెక్షన్లు పరిశీలించాలి. మళ్లీ కార్యదర్శి నిర్ణయం తీసుకోవాలి.

ఇమ్మిగ్రేషన్ నిబంధనల ఉల్లంఘన.. 15 మంది భారతీయులను తిప్పి పంపిన ఆస్ట్రేలియా

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియాలో ఇమ్మిగ్రేషన్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పలువురు భారతీయులను అక్కడి ప్రభుత్వం స్వదేశానికి పంపించింది. మొత్తం 15 మంది ప్రత్యేక విమానంలో దిల్లీకి చేరుకున్నారు. వీరిలో ఒక మహిళ ఉన్నట్లు తెలిసింది. బహిష్కరణకు గురైన వారిలో తొమ్మిది మంది పంజాబ్‌కు చెందిన వాళ్లే కావడం గమనార్హం. మిగతావారిలో ఇద్దరు తెలంగాణ వాసులు కాగా హరియాణా, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన వాళ్లు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆందోళన వ్యక్తం చేశారు.

కడపలో డంపింగ్ యార్డుకు 92 ఎకరాలు

- కాకినాడలో పోక్సో కోర్టు, జడ్జిల నివాస భవనాలకు 57 సెంట్ల భూమి
- మంత్రివర్గ ఆమోదం

ఈనాడు, అమరావతి: కడప నగరపాలక సంస్థకు ఆధునిక డంపింగ్‌యార్డు నిర్మించేందుకు వైఎస్సార్ కడప జిల్లా సీకేదిన్నె మండలం కొలుముక్కపల్లిలో 92 ఎకరాల ప్రభుత్వభూమిని ఎకరం రూ.5.25 లక్షల చొప్పున ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం గురువారం నిర్ణయించింది. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఆస్తులు, దుకాణాల లీజు పునరుద్ధరణ, అద్దె నిర్ణయాల సరళీకరణ కోసం ఏపీ మునిసిపాలిటీల నిబంధనలు-1968కి సవరణ చేయాలని నిర్ణయం తీసుకుంది.

◆ కేంద్రం వద్ద మురిగిపోయిన నిధుల్ని తిరిగి రాబట్టేందుకు విలేజ్ లెవల్ ఫార్మ్ మెషినరీ బ్యాంకుల్ని కొనసాగించాలని నిర్ణయం

◆ కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జే అన్నవరంలో ఫిష్‌కేజ్ కల్చర్ స్థాపనకు ఫిషిన్ సంస్థకు పదెకరాల ప్రభుత్వ భూమిని 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయింపునకు అనుమతి

◆ కాకినాడ నగరంలో పోక్సో కోర్టు, న్యాయాధికారుల నివాస భవనాల నిర్మాణానికి 57 సెంట్లు ప్రభుత్వ భూమిని ఉచితంగా న్యాయశాఖకు బదిలీ చేయాలని నిర్ణయం

◆ పుష్కర ఎత్తిపోతల పథకంలో రూ.4.71 కోట్ల విలువైన ఎస్కేప్ ఛానల్ నిర్మాణం, డ్రెయిన్ సైఫన్ నిర్మాణ పనుల్ని నామినేషన్ పద్ధతిలో సూర్య కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చే ప్రతిపాదనలకు ఆమోదం

◆ కొవ్వూరులో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నీటి సరఫరా పనులకు సంబంధించి రూ.75 కోట్లు రుణం పొందేందుకు అనుమతి


◆ శ్రీకాళహస్తిలోని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ శిక్షణ సంస్థలో భాగమైన మూడు ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్లలో 20 రెగ్యులర్ పోస్టుల్ని రద్దు చేసి.. 6 శాశ్వత, 14 పొరుగుసేవల కింద నియామకం

◆ దిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్-ఆన్ రికార్డు కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్ స్థాయికి అప్‌గ్రేడ్, మరో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు రద్దు

◆ నెల్లూరు, కాకినాడ, కర్నూలు, కడప క్లస్టర్లలో రూ.25.08 కోట్లతో ఏర్పాటు చేయనున్న వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లకు సంబంధించి ఇంప్రూవ్‌మెంట్ ఛార్జీలపై 2% స్టాంప్ డ్యూటీ మినహాయింపునకు ఆమోదం

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా వి.హనుమంతరావు

- రెండేళ్ల జీతాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటన



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ సలహాదారు(బీసీ సంక్షేమం, అభివృద్ధి)గా మాజీ ఎంపీ వి.హనుమంతరావు(వీహెచ్) నియమితులయ్యారు. రాష్ట్ర మంత్రి వర్గ హోదా, ప్రాధాన్య క్రమంలో ప్రత్యేక స్థానం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్ల తన పదవీకాలంలో మొదటి ఏడాది జీతాన్ని నెలకు రూ.1 లక్ష చొప్పున 12 లక్షలను హనుమాన్ వ్యాయామశాలలో చదువుతున్న పేద విద్యార్థుల ఫీజులకు ఉపయోగించుకునేందుకు వీలుగా ట్రస్టుకు అందజేయనున్నట్లు ప్రకటించారు. రెండో ఏడాది జీతం మొత్తాన్ని ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం దామోదరం సంజీవయ్య పేరిట ఏపీలో నిర్మించతలపెట్టిన స్మృతి భవనానికి విరాళంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వీహెచ్ గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'సీఎంకు, పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు. జనగణనలో కులగణన చేయకపోవడం దారుణం. మే 10లోపు సర్వేలో ఓబీసీ కాలమ్ చేర్చకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా' అని వీహెచ్ తెలిపారు. బలహీనవర్గాలకు న్యాయం జరగడం కోసం ప్రాణం ఉన్నంత వరకూ పోరాటం చేస్తానంటూ భావోద్వేగానికి గురయ్యారు.

100 రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా గురువారం శుభాకాంక్షలు తెలిపారు. 'గతేడాది 81.1% ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈ ఏడాది అది 85.25%కి పెరిగింది. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత 5.22% ఎక్కువగా ఉండటం సంతోషం. ముఖ్యంగా ప్రభుత్వ బడుల్లో గతేడాది 72.8% ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈసారి అది 78.39%కి పెరగడం స్ఫూర్తిదాయకం. విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించడం ప్రశంసనీయం. ఇందుకు మంత్రి లోకేశ్ సహా ఆ శాఖ అధికారులు, టీచర్లు, సిబ్బందిని అభినందిస్తున్నా. పిల్లల్లో నైతిక విలువల పెంపుతో పాటు సమగ్ర విద్యా వికాసానికి విద్యా శాఖ చేస్తున్న కృషిని మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరుతున్నా' అని పోస్టుచేశారు.

ప్రణాళికాబద్ధంగా కృషి చేశాం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: అంకితభావం, ప్రణాళికాబద్ధంగా అందరూ కలిసి పనిచేయడంతోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించామని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. 'ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంకా సాధించాల్సి ఉంది. ప్రణాళికలు విజయవంతమై.. మంచి మార్కులు వచ్చాయి. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు తక్కువ ప్రతిభ ఉన్నవారు కాదు. ఓటమి విజయానికి తొలి మెట్టు వంటిది. పట్టుదలతో ప్రయత్నించాలి' అని సూచించారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేసిన వంద రోజుల ప్రణాళిక విజయవంతమైంది. డిసెంబరు 6 నుంచి మార్చి 15 వరకు విద్యార్థులకు 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. వీటిలో వచ్చిన మార్కులను విశ్లేషించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించారు' అని వెల్లడించారు.

ప్రభుత్వ సంస్కరణల వల్లే పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: వైకాపాతో పోలిస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక పదోతరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత గణనీయంగా పెరిగిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రెండేళ్లుగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, వినూత్న మార్పులకు ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. '2022లో పదోతరగతి ఉత్తీర్ణత 67.2 శాతంగా ఉంటే ఇప్పుడది 85.25 శాతానికి చేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 78.39 శాతం ఉండడం శుభపరిణామం. రాష్ట్రవ్యాప్తంగా 9,600 ఆదర్శ పాఠశాలల ఏర్పాటు, ఒక తరగతికి ఒక టీచర్ విధానం ఇలా ఎన్నో మార్పులతో విద్యా వ్యవస్థను లోకేశ్ గాడిలో పెట్టారు' అని ఎమ్మెల్యే శ్రీనివాసులు పేర్కొన్నారు.

వైకాపా సానుభూతిపరుడికి కొమ్ముకాస్తున్న అధికారులు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: స్థల వివాదంలో వైకాపా సానుభూతిపరుడికి అధికారులు కొమ్ముకాస్తున్నారని.. కోర్టు ఆదేశాల్ని సైతం అమలు చేయడం లేదని చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం ఒంటిలవారిపల్లెకు చెందిన రామనాథరెడ్డి వాపోయారు. న్యాయం కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదుచేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఏపీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ దేవదత్ వినతులు స్వీకరించారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించిన కౌలుదారుపై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా మంత్రాలయానికి చెందిన రంగస్వామిరావు కోరారు. తన స్థలాన్ని రెవెన్యూ అధికారులు వేరొకరి పేరుతో మార్చారని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలానికి చెందిన విజయ ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర సచివాలయంలోని డిస్పెన్సరీలో మాక్‌డ్రిల్

ఈనాడు, అమరావతి: జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సూచన మేరకు రాష్ట్ర సచివాలయంలోని డిస్పెన్సరీలో వైద్యులు, సిబ్బంది గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదకర ఇంధనాలు, రసాయనాలు, యాసిడ్లు శరీరంపై పడినప్పుడు కాలిన గాయాలతో ఆసుపత్రికి వచ్చినవారికి అత్యవసర చికిత్సలు ఎలా అందించాలి, అంబులెన్స్‌లో కాలిన గాయాలతో వచ్చినవారికి వెంటనే ఎలా చికిత్స అందించాలి, ఆసుపత్రిలో చికిత్స అందించిన తర్వాత జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేసే క్రమంలో ప్రతి దశలో ఎలాంటి చికిత్స అందించాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. మాక్‌డ్రిల్‌లో వైద్యులు హదస్సా, దివ్యసాయిశ్రీ, ఆనంద్, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు రాత్రి విధుల్లో భద్రత కల్పించాలి

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం వినతి

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)ల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల రాత్రి విధుల సమయంలో వాచ్‌మెన్, సహాయ సిబ్బంది లేకుండా ఒంటరిగా అభద్రతాభావంతో విధులు నిర్వహిస్తున్నారని, వీరికి తగిన భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు బొకినాల సౌమ్యరేఖ గురువారం సచివాలయంలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిలను కలిసి వినతులు అందజేశారు. స్టాఫ్‌నర్సులకు అధిక పనిగంటల ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వమిచ్చే సాధారణ సెలవులు 35తో పాటు, ఐదు రోజుల మహిళల ప్రత్యేక సెలవులు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, 15 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి నూరు శాతం గ్రాస్ శాలరీ కల్పించాలని వినతుల్లో కోరినట్లు ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేసేవారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలి: ఈయూ

ఈనాడు, అమరావతి: విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య గురువారం రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి అందజేశారు. 'ఆర్టీసీ బస్సుల్లో మహిళల గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా స్త్రీశక్తి టికెట్లు జారీచేసేలా అవకాశం కల్పించాలి. వెంటనే 3వేల కొత్త బస్సులు ప్రవేశపెట్టాలి. విద్యుత్ బస్సులను ఆర్టీసీయే నిర్వహించేలా చూడాలి. 10 వేల పోస్టుల భర్తీ చేపట్టాలి' అని కోరారు.

పశు సంవర్ధక మార్గదర్శిని ఈ-మ్యాగజైన్ ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: పాడి రైతులకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'పశు సంవర్ధక మార్గదర్శిని' అనే ఈ-మ్యాగజైన్‌ను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల మంత్రి అచ్చెన్నాయుడు గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. ' http://www.apahsmile.in వెబ్‌సైట్‌లో మ్యాగజైన్ అందుబాటులో ఉంటుంది. మ్యాగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి సమగ్ర సమాచారంతో పాటు రైతుల విజయగాథలు, నిపుణుల సూచనలు ఉంటాయి. రైతుల సందేహాలకు సమాధానాలనూ వివరిస్తారు. రాష్ట్రంలో 25 లక్షల మంది పాడి రైతులున్నారు. పశు సంవర్ధక రంగాన్ని వాణిజ్య సరళిలో అభివృద్ధి చేసేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయి' అని పేర్కొన్నారు.

పశు సంవర్ధకశాఖలో 26 మంది డీడీలకు జేడీలుగా పదోన్నతి

పశు సంవర్ధకశాఖలో 26 మంది ఉప సంచాలకులకు(డీడీలు) సంయుక్త సంచాలకులు (జేడీలు)గా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు శాఖ పదోన్నతుల కమిటీ(డీపీసీ) 2025-26 చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించినట్లు పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించారు.

ఈనాడు

గుంటూరు 1-5-2026 శుక్రవారం సిటీ సంపుటి 31 సంచిక 25

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net

Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

AP SSC-2026

ప్రతి ఫలితంలో విజయం
ప్రతి విజయంలో "భాష్యం"

భాష్యం® ఒక గొప్ప ఎంపిక

STATE TOP MARK



598 / 600

G. Dinesh
H.T 2614105264

597 K.Sai Karthik H.T 2604115190	597 N.V Sri Shravya H.T 2604115963	597 T. Lokesh H.T 2604117786
596 B.E Sharvi H.T 2614100091	596 B. Veda Yashasree H.T 2614103387	596 M. Manojna H.T 2614105868
596 G. Lohitha Sree H.T 2619124606	596 J.S. Sai Aditya H.T 2604104593	596 K. Lasya H.T 2610102115

AP SSC-2026 ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన మా "భాష్యం" విద్యార్థులు

595 B. Moksha Sri H.T 2614105652	595 Y. Harika H.T 2614104398	595 T.L. Amrutha H.T 2614104022	595 S. Divya Bhavani H.T 2614105158	595 K. Revanth H.T 2614102753	595 D.T. Chaitanya H.T 2614104144	595 D. Kruthika H.T 2612124912	595 V. Tejaswi H.T 2612124077	595 P.S.S. Manasvini H.T 2615101011	595 K. Moksha H.T 2618105011
595 Y. Poojitha H.T 2621102830	595 M. Ritika H.T 2604116075	595 K. V. Varshini H.T 2604117248	595 P. Dheekshitha H.T 2604118273	595 R. Varshith Kumar H.T 2607103416	595 N. Karthik H.T 2607127137	595 R. Likitha Sri H.T 2613114703	594 P. Harsha Sri H.T 2614103017	594 G.S. Charishma H.T 2614107270	594 T. Vedasri H.T 2613110888
594 R.Md. Irfan H.T 2617111870	594 K. Sahithi H.T 2617112798	594 K. Naga Sri Sindhu H.T 2619121739	594 V. Udaya Hasini H.T 2604117742	594 D. Sahithi H.T 2604108400	594 V. Siri Sanjana H.T 2601100989	594 R. Vamsi H.T 2607103414	594 Ch. Teja Switha H.T 2607121460	594 M.S Vasuki Sri H.T 2608121516	594 G.Sowmya Sree H.T 2609103099
594 D. Sri Chaitra H.T 2610113776	594 I.L. Prasanna H.T 2610105579	593 K.R. Priyanka H.T 2614103401	593 B. P. Meghana H.T 2614107198	593 K. Harish H.T 2614102699	593 P. Hotvika H.T 2614104852	593 V. Hamang H.T 2614101658	593 A.L. Sharmila H.T 2614101662	593 V. Mokshitha H.T 2614105615	593 G. Varsha H.T 2618101244
593 L. Veda Sri H.T 2614104958	593 B. Hrudhay H.T 2614107737	593 R. Dakshatha H.T 2614101693	593 Ch. Sanjay H.T 2614103389	593 M. Harsha H.T 2614110957	593 A. Varshita H.T 2613110526	593 M. Lohitha H.T 2614125472	593 T. Tejaswini H.T 2617112684	593 G. Lohith Sai H.T 2604118409	593 R. Harshika H.T 2604117867
593 S. Hruthi H.T 2604110930	593 K. Kusuma Priya H.T 2606100923	593 P. Varun Teja H.T 2602114436	593 S. Vagdevi H.T 2601100405	593 V.V.D. Akshaya Sri H.T 2607102912	593 M. Chinnu H.T 2607121316	593 T.Yaswanth Chowdary H.T 2607101528	593 G.S. Nihilendra H.T 2607101520	593 D. Jashmitha H.T 2608101805	593 I.Gayathri H.T 2607128362
593 K. Aditya Kumar H.T 2607128157	593 P.D.S. Saranya H.T 2609123634	593 K.P. Ramya H.T 2609104364	593 P. Nitya Sri H.T 2610101135	593 N. Laasya Sai Sri H.T 2609122370	593 N.L. Lakshmi Priya H.T 2610123242	592 A. Chakradhar H.T 2614106800	592 M. Divya Hasini H.T 2614104673	592 M. Jeshna H.T 2614103385	592 M. Mohith Naidu H.T 2614103971
592 B. Ravandh H.T 2614102439	592 G. Riya H.T 2614102438	592 A. Sanjana H.T 2614101930	592 A. Shanmukha Priya H.T 2614101388	592 B. Nayana H.T 2614102414	592 T. Vijitha H.T 2614103254	592 Sk.Tanaz H.T 2614108491	592 A.R. Iswarya H.T 2614110100	592 M. Tulasi H.T 2613112183	592 P. Hemalatha H.T 2613106935
592 P.S. Deekshitha H.T 2614124259	592 P. Jagadishwari H.T 2617124108	592 P. Samantha H.T 2619121705	592 N. Manaswini H.T 2618104769	592 P. Geetika H.T 2604117436	592 G. Roja H.T 2604119037	592 V. Tejasri H.T 2606101561	592 B. Bhavya H.T 2606100413	592 J. Indhu H.T 2606106715	592 K.S.R Kalyan H.T 2602103347
592 M. Deeraj Kumar H.T 2603100630	592 A. Reshma Meenu H.T 2601101021	592 M. Sana Sulthana H.T 2601101871	592 Y. Teja H.T 2607103422	592 S.B Habibunnisa H.T 2607103106	592 D.M Satya Sri H.T 2607117843	592 K. Varshitha H.T 2610111111	ఇంకా మరెన్నో...		

ప్రతి ముగ్గురిలో ఇద్దరికి **500** ఆ పైగా మార్కులు

'భాష్యం' విద్యార్థుల మార్కుల అనాలసిస్

590 ఆ పైగా మార్కులు సాధించినవారు	580 ఆ పైగా మార్కులు సాధించినవారు	570 ఆ పైగా మార్కులు సాధించినవారు	550 ఆ పైగా మార్కులు సాధించినవారు	500 ఆ పైగా మార్కులు సాధించినవారు
214	1108	2293	4253	7515

మ్యాథ్స్ అనాలసిస్	100కు 100 మార్కులు సాధించినవారు	100కు 95 ఆ పైగా మార్కులు సాధించినవారు	100కు 90 ఆ పైగా మార్కులు సాధించినవారు
	1753	4824	6494

సైన్స్ అనాలసిస్	100కు 100 మార్కులు సాధించినవారు	100కు 95 ఆ పైగా మార్కులు సాధించినవారు	100కు 90 ఆ పైగా మార్కులు సాధించినవారు
	464	3673	5966



ఈ ఘన విజయాలు సాధించిన మా విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు.
సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు.

- భాష్యం రామకృష్ణ, ఛైర్మన్

BHASHYAM EDUCATIONAL INSTITUTIONS

BHASHYAM®

మా పూర్తి ఫలితాలు www.bhashyam.in లో చూడగలరు

హాస్టల్ వసతి : గుంటూరు : 98485 36951, 98485 36970 | హైదరాబాద్ : 88866 68985 / 86 | వైజాగ్ : 98488 84697 | తిరుపతి : 99488 55592


BHASHYAM
INTERNATIONAL SCHOOL
CROWNED WITH KNOWLEDGE · SINCE 1993
CAMBRIDGE
UNIVERSITY PRESS & ASSESSMENT
Centre of Excellence
Cambridge & CBSE Integrated Curriculum
Early Years - Grade XII
BHASHYAM INTERNATIONAL SCHOOL
A New Era of World-Class Education
Admissions Open 2026-27
Early Years - Grade 8
CONTACT: 9666 14689
S.No. 147, Near Bhashyam Aditya Campus,
GORANTLA, GUNTUR - 522 034, A.P.


Nurturing Minds, Shaping Futures
Growing & Glowing CBSE stream with 24 branches in South India
WHAT MAKES US DIFFERENT
STATE-OF-THE-ART INFRASTRUCTURE
A modern learning environment with air-conditioned smart classrooms.
ACADEMIC EXCELLENCE
A CBSE curriculum enriched with modern pedagogy & real-world applications.
TECHNOLOGY INTEGRATED
Advanced digital tools, enhancing interactive and future-ready learning skills.
HOLISTIC DEVELOPMENT
Focus on academics, sports, arts, life skills and values.
GLOBAL PERSPECTIVE
Preparing students to be confident, responsible global citizens.
SAFE & NURTURING ENVIRONMENT
A secure, caring and inclusive campus where every child thrives.
Secondary Campus
Kindergarten Campus
Primary Campus
ADMISSIONS OPEN
2026-27
Nursery to Grade X
BHASHYAM
BLOOMS
the global school
ANDHRA PRADESH | TELANGANA | KARNATAKA
Globally Recognized by
TRINITY
CAMBRIDGE
Central Office : Ring Road, GUNTUR : Mobile : 98485 36968
Website : www.bhashyamblooms.com / www.bhashyamblooms.in
E-mail : blooms@bhashyam.in / Instagram : bhashyamblooms.guntur